

‘ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 329

బుధవారం 19-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సై అంటే సై...

నేటి నుంచి చాంపియన్స్ ట్రోఫీ. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో పాక్ ‘ఢీ’ - 14లో



వలసదారులు ఇక కోస్టారికాకు!

అమెరికా కీలక ఒప్పందం.. 200 మందితో నేడు తొలి విమానం - 6లో



మహిళల కోసం ఆరు నెలల్లో కేన్సర్ టీకా

వ్యాక్సిన్‌పై పరిశోధనలు తుది దశకు చేరుకున్నాయి

ఆరోగ్య శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాధవ్ వెల్లడి

ఛత్రపతి శంభాజీనగర్: మహిళల్లో వచ్చే కేన్సర్‌ను అడ్డుకునేందుకు మరో ఆరు నెలల్లో టీకా అందుబాటులోకి రానుందని కేంద్ర ఆరోగ్య కుటుంబసంక్షేమ శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాధవ్ వెల్లడించారు. 9–16 ఏళ్ల గ్రూపు వారు ఈ టీకాకు అర్హులని చెప్పారు. టీకాకు సంబంధించిన పరిశోధనలు తుదిదశకు చేరుకున్నాయని చెప్పారు. ప్రస్తుతం బ్రెస్ట్, నోటి, సెర్వికల్ కేన్సర్‌లపై టీకా ట్రయల్స్ జరుగుతున్నాయన్నారు. మన దేశంలో కేన్సర్ కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో కేంద్రం పలు చర్యలను చేపట్టిందని ఆయన అన్నారు. మహిళల్లో 30 ఏళ్లు పైబడిన వారు ఆస్పత్రుల్లో ముందుగానే స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచించారు.



టెస్లా వచ్చేస్తోంది..

- భారత్‌లో నియామకాలు మొదలుపెట్టిన ఈవీ దిగ్గజం
- కంపెనీ రాక ఇక లాంఛనమే.. మోడల్-3తో ఎంట్రీ
- ముంబై, ఢిల్లీలో 13 రకాల పోస్టులకు ఉద్యోగ ప్రకటన

టెస్లా.. ఎంతో కాలంగా ఊరిస్తూ వస్తున్న అమెరికాకు చెందిన ఈవీ దిగ్గజం ఎట్టకేలకు భారత్‌లో అడుగుపెడుతోంది. ఇందుకోసం నియామకాలను మొదలుపెట్టింది. ఢిల్లీ, ముంబై కేంద్రంగా 13 రకాల పోస్టులకు సిబ్బంది అవసరమంటూ లింక్డ్‌ఇన్ వేదికగా కంపెనీ ఉద్యోగ ప్రకటన ఇచ్చింది. దీంతో కంపెనీ రాక ఇక లాంఛనమే అయింది. ఇటీవలి అమెరికా పర్యటన సందర్భంగా ప్రధాని మోదీతో టెస్లా వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ భేటీ కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్‌లో టెస్లా నియామకాలు మొదలుపెట్టడం ఆసక్తి కలిగిస్తోంది. భారత మార్కెట్లోకి టెస్లా ప్రవేశం గురించి చాలా ఆసక్తిగా ప్రజలు ఎదురుచూస్తున్న విషయం విదితమే. -15లో

సైబర్ భద్రతలో సూపర్

తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా ఉంది

షీల్డ్-2025 సైబర్ సెక్యూరిటీ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

సైబర్ నేరాల దర్యాప్తులో ఆదర్శంగా ఉన్నాం

- రాష్ట్రాలన్నీ కలిసి పనిచేస్తేనే సత్ఫలితాలు
- డీప్ ఫేక్ న్యూస్ వ్యాప్తి, సోషల్ మీడియా తప్పుడు ప్రచారాలనూ అరికట్టాలన్న ముఖ్యమంత్రి
- సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్, సైబర్ ఫ్యూజన్ సెంటర్, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌ల ప్రారంభం
- త్వరలో కొత్త సెక్యూరిటీ పాలసీ: మంత్రి శ్రీధర్‌బాబు



సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్‌లో భారతి అనే అడ్వాన్స్‌డ్ హ్యూమనాయిడ్ రోబో ‘హలో సీఎం సార్’ అంటూ పలకరిస్తుంటే ఆసక్తిగా తిలకిస్తున్న రేవంత్‌రెడ్డి. ప్రశ్నలకు బదులివ్వగలనని రోబో పేర్కొనడంతో సైబర్ నేరాన్ని ఎలా రిపోర్టు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు అడగ్గా 1930 నంబర్‌కు కాల్ చేయాలని రోబో బదులిచ్చింది. చిత్రంలో టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయెల్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: సైబర్ భద్రతలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సైబర్ నేరాల దర్యాప్తులోనూ దేశానికే ఆదర్శంగా ఉన్నామని చెప్పారు. ఈ తరహా నేరాలను నియంత్రించడంలో జాతీయ స్థాయిలో తెలంగాణ ముందు వరుసలో ఉందంటూ కేంద్ర ప్రభుత్వం కితాబిచ్చిందని గుర్తు చేశారు. సైబర్ నేరాలు ఆకాశమే హద్దుగా కొత్త రూపాలు సంతరించుకుంటున్నాయని, వీటిని అరికట్టేందుకు ఒక రాష్ట్రం చేసే ప్రయత్నాలు ఫలితాలను ఇవ్వవని, రాష్ట్రాలన్నీ సమన్వయంతో దేశం ఒక యూనిట్‌గా పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇందుకు షీల్డ్-2025 వంటి మిగతా 2వ పేజీలో ▶

సైబర్ భద్రత అత్యంత క్లిష్టం

2లో

- వ్యక్తిగత జీవితాలు, వ్యవస్థలు, ప్రభుత్వాలకు సైతం ‘సైబర్’ ముప్పు
- పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు సైబర్ హైజీన్‌ను అలవాటు చేయాలి
- ఇప్పటివరకు ఆధార్ హ్యాకింగ్ సమస్యే తలెత్తలేదు
- చిన్నారులపై నేరాల నియంత్రణకు కఠిన శిక్షలే మార్గం
- షీల్డ్-2025 సదస్సులో నిపుణుల ఉపన్యాసాలు



డిగ్రీ కాదు.. నైపుణ్యమే కీలకం..

- సత్తా ఉంటేనే కాలేజీలకు గుర్తింపు
- బిల్డింగులు కాదు.. ఫ్యాకల్టీ ఉండాలి
- మెరుగైన నైపుణ్యమే గీటురాయి
- ఈ దిశగా సాంకేతిక విద్యకు మెరుగులు
- ‘సాక్షి’తో జేఎన్టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి

- వివరాలు 3లో▶

ఫ్యూచర్, ఫోర్త్ సిటీల పేరుతో డ్రామాలు..



- రేవంత్‌రెడ్డికి రియల్ ఎస్టేట్ తప్ప స్టేట్ గురించి పట్టింపు లేదు
- ఆమనగల్లు రైతుదీక్ష సభలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రేవంత్ కుటుంబ సభ్యులు ఇటీవల వెయ్యి ఎకరాలు నొక్కేశారు
- భూముల రేట్లు పెంచేందుకు అత్తగారి ఊరుకు పెద్ద రోడ్డు వేస్తున్నాడు
- నిజాయితీగల మోసగాడు.. అన్నివర్గాల ప్రజలను మోసం చేశాడు



ఆమనగల్లు: ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ డ్రామా ఆడుతున్నారని, ఆయనకు రియల్ ఎస్టేట్ గురించి తప్ప స్టేట్ గురించి పట్టింపు లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ధ్వజమెత్తారు. ‘వెల్దండలో సీఎం రేవంత్‌రెడ్డికి 500 ఎకరాల భూమి ఉంది. ఆయన కుటుంబ సభ్యులు ఇటీవల వెయ్యి ఎకరాలు నొక్కేశారు. మాడ్గుల ప్రాంతంలో భూముల రేట్లు పెంచేందుకు అత్తగారి ఊరుకు పెద్ద రోడ్డు మిగతా 2వ పేజీలో ▶

ఏఐ ‘బ్రెయిన్ డ్రెయిన్’!



- కృత్రిమ మేధ.. మేధో వలసలో మనదే మొదటి స్థానం
- ఏఐ గ్లోబల్ పేటెంట్స్‌లో మనవి 0.23 శాతమే
- 61.13 శాతంతో టాప్‌లో చైనా
- 20.9%తో రెండోస్థానంలో అమెరికా
- వలసలు ఆపేందుకు నిపుణుల సూచనలు

- వివరాలు 16లో

అగ్రరాజ్యాల స్నేహగీతం

- అమెరికా, రష్యా చర్చల బాట
- రియాద్‌లో మంత్రుల స్థాయి మంతనాలు.. ద్వైపాక్షిక బంధాల పునరుద్ధరణకు నిర్ణయం
- ఉక్రెయిన్ యుద్ధంపై కీలక మంతనాలు
- త్వరలో భేటీ కానున్న ట్రంప్, పుతిన్
- జెలెన్‌స్కీతో భేటీకీ పుతిన్ సిద్ధం: రష్యా
- మేం లేకుండా మాపై చర్చలా: జెలెన్‌స్కీ

- వివరాలు 6లో



సార్.. మరో మిత్రదేశం పాకిస్తాన్ నుంచి మీకు ఫోన్ సార్!

ఎలివేటెడ్ బదులు.. కేబుల్ కార్ మార్గం..!



- హైదరాబాద్ – శ్రీశైలం రోడ్డు విస్తరణపై కేంద్రం పునఃపరిశీలన
- ప్రత్యామ్నాయాలపై నివేదిక కోరిన ఉపరితల రవాణాశాఖ కార్యదర్శి
- అధ్యయనం చేస్తున్న అధికారులు.. త్వరలో నివేదిక
- ‘ఎలివేటెడ్’కు రూ.7,690 కోట్ల వ్యయం.. కేబుల్ కార్ మార్గం రూ.2,270 కోట్లతోనే నిర్మాణం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ – శ్రీశైలం పుణ్యక్షేత్రం మధ్య రోడ్డు విస్తరణలో భాగంగా నల్లమల అటవీ ప్రాంతంలో నిర్మించతలపెట్టిన భారీ ఎలివేటెడ్ కారిడార్‌కు ప్రత్యామ్నాయాలపై కేంద్ర ఉపరితల రవాణాశాఖ దృష్టి పెట్టింది. దాదాపు 45.42 కి.మీ. నిడివితో ఈ మార్గంలో భారీ ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రతిపాదించిన విషయం తెలిసిందే. దీని నిర్మాణానికి రూ.7,690 కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇంత భారీ వ్యయంతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించే బదులు రూ.2,270 కోట్లతో పూర్తయ్యే కేబుల్ కార్ కారిడార్ నిర్మాణ సాధ్యాసాధ్యాలపై నివేదిక అందజేయాలని ఆ శాఖ కార్యదర్శి ఉమాశంకర్ తాజాగా అధికారులను ఆదేశించారు. దీనిపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా ఇంత భారీ నిడివితో కేబుల్ కార్ మార్గం లేదు. దాని నిర్మాణం, నిర్వహణ సవాళ్లతో కూడుకున్నది కావటంతో ఆచితూచి పరిశీలించి నివేదిక మిగతా 16వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఆర్థిక అంతరాల తగ్గింపునకు నిపుణుల కమిటీ

భట్టి విక్రమార్క చైర్మన్‌గా పలువురు నిపుణులతో ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజల మధ్య ఆర్థిక, సామాజిక అంతరాలను అధిగమించే విషయంలో సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటుచేసింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చైర్మన్‌గా, ప్రొఫెసర్లు కంచె ఐలయ్య, శాంతా సిన్హా, హిమాన్షూ, భూక్యా, పురుషోత్తం రెడ్డితోపాటు పలు రంగాల నిపుణులు సుఖ్‌దేవ్ థోరట్, నిఖిల్ డే, ప్రవీణ్ చక్రవర్తి సభ్యులుగా ఈ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కమిటీ సెక్రటరీగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళిక సొసైటీ సీఈవో వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సమాజంలో ప్రజల మధ్య అంతరాలను తగ్గించే క్రమంలో విపత్తుల నివారణకు ప్రణాళికలు రూపొందించడం, వాతావరణ మార్పుల ప్రభావంపై అధ్యయనం తదితర అంశాల్లో సలహాలివ్వడం కూడా ఈ కమిటీ బాధ్యత. ఈ కమిటీ మొదటి సమావేశం మంగళవారం సచివాలయంలో భట్టి అధ్యక్షతన జరిగింది.

చిత్తశుద్ధి ఉంటే వారంలోనే బీసీ రిజర్వేషన్ల చట్టం

ఢిల్లీలో మీడియాతో జస్టిస్ ఈశ్వరయ్య



సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి బీజేపీకి ఉంటే వారంలోపే 'బీసీల రిజర్వేషన్ల బిల్లు' చట్టరూపం దాల్చుతుందని రిటైర్డ్ జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. కులగణన సరిగా జరగలేదని, బీసీల్లో ముస్లింలను చేర్చారనే కారణాన్ని చూపి ఈ సర్వేను రాజకీయం చేయొద్దని హితవు పలికారు. విద్య, ఉద్యోగ సర్వీసుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల అమలుపై తమిళనాడులో ఉన్న సమగ్రచట్టం తరహా చట్టాన్ని తెలంగాణలోనూ తీసుకురావాలని సూచించారు. మంగళవారం ఢిల్లీలోని ఏపీ, తెలంగాణ భవన్‌లో జస్టిస్ ఈశ్వరయ్య మీడియాతో మాట్లాడారు. కులగణన సర్వే పూర్తైన తర్వాత స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీల రిజర్వేషన్లపై ఆల్ పార్టీ మీటింగ్ పెట్టి, రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో చేర్చేలా అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రిజర్వేషన్లపై ఎమ్మెల్సీ కవితకు సరైన అవగాహన లేదని జస్టిస్ ఈశ్వరయ్య విమర్శించారు. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ సర్వీసులకు సంబంధించి మూడు చట్టాలు చేయాలని ఆమె మాట్లాడటం సరికాదన్నారు.

వర్సిటీల అభివృద్ధికి 5 వేల కోట్లు కేటాయించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 15 యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యూనివర్సిటీల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ.. సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీఎంకు లేఖరాశారు. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు బోధనేతర సిబ్బంది పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని, కాంట్రాక్ట్ లెక్చరర్లను సుదీర్ఘకాలం కొనసాగిస్తున్నారని సీఎం దృష్టికి తెచ్చారు. ల్యాబ్ పరికరాలు, హాస్టల్స్, మెస్, స్పోర్ట్స్, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలు కూడా ఎదుర్కొంటున్నారని జాన్‌వెస్లీ తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1,000 కోట్లు కేటాయించాలన్నారు. ప్రతి పీహెచ్‌డీ విద్యార్థికి నెలకు రూ.25 వేలు ఫెలోషిప్ అందించాలని కోరారు. అన్ని వర్సిటీలకు రీసెర్చ్ గ్రాంట్స్ అందించాలని, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

5 జిల్లాలకు బీజేపీ అధ్యక్షుల నియామకం



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర నాయకత్వం 5 జిల్లాలకు అధ్యక్షులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల పేర్లను ప్రకటించింది. నారాయణపేట జిల్లాకు కె.సత్యయాదవ్‌ను, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎస్.వెంకటయ్య, కె.,వెంకట్‌రాములు, కె.రాములు.. సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా శ్రీలతారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సీహెచ్ ఉమామహేశ్వర్‌రావు, వై.వెంకటనరసయ్య, ఆర్.ఉమ, వి.రమేశ్ నియమితులయ్యారు. ఇక నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా రితేశ్ రాథోడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఆకుల శ్రీనివాస్, దశరథ్, ఆడెపు లలిత, పి.సతీశ్వర్‌రావు, కె.అశోక్.. సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా బైరి శంకర్‌ముదిరాజ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా తోట స్వరూప, వి.రామచంద్రారెడ్డి, వేణుమాధవ్, ఎస్.సత్తయ్య, ఎస్.యాదగిరి.. రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా ఆర్.గోపీ ముదిరాజ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా కె.కృష్ణస్వామి, జ్ఞానరామస్వామి నియమితులయ్యారు.

సైబర్ భద్రత అత్యంత క్లిష్టం

వ్యక్తిగత జీవితాలు, వ్యవస్థలు, ప్రభుత్వాలకు సైతం 'సైబర్' ముప్పు

- పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు సైబర్ హైజీన్‌ను అలవాటు చేయాలి
- ఇప్పటివరకు ఆధార్ హ్యాకింగ్ సమస్యే తలెత్తలేదు
- చిన్నారులపై నేరాల నియంత్రణకు కఠిన శిక్షలే మార్గం
- షీల్డ్–2025 సదస్సులో నిపుణుల ఉపన్యాసాలు

సాక్షి, హైదరాబాద్: సైబర్ ముప్పును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు, నూతన సాంకేతికతలను రూపొందించే లక్ష్యంతో హెచ్ఐసీసీలో ప్రారంభమైన షీల్డ్–2025 సైబర్ సెక్యూరిటీ సదస్సులో కీలక చర్చలు జరుగుతున్నాయి. తొలిరోజు జాతీయ సైబర్ భద్రతా సమన్వయకర్త లెఫ్టినెంట్ జనరల్ మునైర్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్ రిభు, టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) మాజీ చైర్మన్ డాక్టర్ ఆర్‌ఎస్ శర్మ కీలక ఉపన్యాసాలు చేశారు.

సైబర్ ప్రొఫెషనల్స్‌కు మంచి భవిష్యత్తు



లెఫ్టినెంట్ జనరల్ మునైర్

'సైబర్ భద్రత అనేది అత్యంత క్లిష్టమైన అంశం. ఇది ప్రతి నిత్యం మారుతూనే ఉంటుంది. ఇప్పుడు మన జీవితాలన్నీ డిజిటల్ కనెక్టివిటీతో ముడిపడి ఉన్నాయి. వ్యక్తిగత జీవితాలు మొదలు, వ్యవస్థలు, ప్రభుత్వాలకు సైతం సైబర్ నేరగాళ్లతో ముప్పు పొంచి ఉంది. కాబట్టి సైబర్ భద్రత నిపుణులకు మంచి భవిష్యత్తు ఉంది. సైబర్ భద్రత రంగానికి చెందిన భాగస్వాములందరూ ఒకే వేదికపైకి వచ్చిన పలు అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉంది. అప్పుడే భవిష్యత్తులో సురక్షితమైన వ్యవస్థలు రూపొందించగలుగుతాం. ఈ క్రమంలో నూతన ఆవిష్కరణలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వాడుకోవాలి. పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు సైబర్ హైజీన్‌ను అలవాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం పాఠశాలల బోధనా ప్రణాళికల్లోనూ సైబర్ భద్రతను భాగం చేయాలి..' అని జాతీయ సైబర్ భద్రతా సమన్వయకర్త లెఫ్టినెంట్ జనరల్ మునైర్ చెప్పారు.

అత్యంత సురక్షితంగా ఆధార్ డేటా



ట్రాయ్ మాజీ చైర్మన్ శర్మ

'సాఫ్ట్‌వేర్ డిజైన్ల తయారీలో ప్రైవసీ, సెక్యూరిటీ అన్నవి అత్యంత ప్రధానాంశాలు. నేను ఆధార్ మిషన్ డైరెక్టర్‌గా పనిచేశా. ఆధార్ సాఫ్ట్‌వేర్ డిజైన్ల తయారీ తర్వాత మొదటి ఆధార్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు 15 నెలల సమయం తీసుకున్నాం. ఇప్పుడు దేశంలో 1.4 బిలియన్ ఆధార్‌లు ఉన్నాయి. అయినా ఇప్పటివరకు ఒక్క ఆధార్ కార్డు డేటా కూడా హ్యాక్ కాలేదు. అంత సురక్షితంగా ఆధార్‌ను రూపొందించాం. అదే విధంగా కోవిన్ యాప్‌లోనూ 2.4 బిలియన్ రికార్డులు ఉన్నాయి. ఆ డేటా కూడా ఎంతో సురక్షితంగా ఉంది..' అని ట్రాయ్ మాజీ చైర్మన్ ఆర్‌ఎస్ శర్మ తెలిపారు. 'ప్రైవసీ బై డిజైన్–సెక్యూరిటీ బై డీఫాల్ట్ ' అన్న అంశంపై ఆయన ప్రసంగించారు.

లైంగిక నేరగాళ్ల డేటాబేస్ ఏర్పాటు చేయాలి



భువన్ రిభు

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడి కూడా చిన్నారులపై లైంగిక దాడుల వీడియోలు, ఫొటోలు రూపొందిస్తున్నారు. ఇది అత్యంత క్రూరం. కృత్రిమ మేధస్సును వాడి చేస్తున్న ఈ క్రూర నేరాలకు దేశాల సరిహద్దులతో సంబంధం లేకుండా తక్షణ శిక్షలు విధించడం అవసరం. అంతర్జాతీయ స్థాయిలో చట్టాలను సమన్వయం చేయడానికి, నిఘా భాగస్వామ్యాన్ని మెరుగుపరచడానికి వీలుగా అంతర్జాతీయ లైంగిక నేరస్తుల డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలి. చిన్నారులపై లైంగిక వేధింపులు అరికట్టాలంటే ప్రస్తుతం అందుబాటులో ఉన్న చట్టాలను పక్కాగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఆన్‌లైన్‌లో వేధింపులపైనా పోలీసులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. చిన్నారులపై వేధింపులకు పాల్పడే వారు ధైర్యంగా బయట తిరుగుతుండడం బాధాకరం..' అని జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్ రిభు అన్నారు.

సైబర్ భద్రతలో సూపర్

▶ మొదటి పేజీ తరువాయి

సైబర్ సెక్యూరిటీ సదస్సులు మంచి వేదికలుగా నిలుస్తాయని అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ), సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) సంయుక్త ఆధ్వర్యంలో హెచ్ఐసీసీలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి 'షీల్డ్–2025 సైబర్ సెక్యూరిటీ సదస్సు'ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి సీఎం మంగళవారం ప్రారంభించారు. అలాగే టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు చెందిన సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (సీఓసీ), సైబర్ ఫ్యూజన్ సెంటర్ (సీఎఫ్‌సీ), చిన్నారులపై లైంగిక వేధింపుల కేసులను పరిష్కరించే చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం సదస్సునుద్దేశించి రేవంత్‌రెడ్డి మాట్లాడారు.



సీఎం రేవంత్‌కు జ్ఞాపికను అందిస్తున్న డీజీపీ జితేందర్. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, శిఖాగోయల్



మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ కాన్‌క్లేవ్-2025లో ఏర్పాటు చేసిన స్టాల్

హెల్ప్‌లైన్ నంబర్ 1930 అందరికీ చేరాలి

'సైబర్ నేరగాళ్లు ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు రూ.22 వేల కోట్లు కాజేసినట్టు అంచనాలు ఉన్నాయి. ప్రజల జీవన స్థితిగతులను, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ఇలాంటి ప్రమాదకరమైన పరిణామాలను అరికట్టాల్సిన అవసరం ఉంది. ఫేక్‌న్యూస్, సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచార వ్యాప్తి కూడా సమాజానికి చేటు చేస్తున్నాయి. సమాజంలో కొంతమంది జరగని నేరాలు జరిగినట్టు, జరగని దాడులు జరిగినట్టు లేదా మరో రూపంలో డీప్ ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తున్నారు. ఆర్థిక నేరాలతో పాటు ఇలాంటి వాటన్నింటినీ నియంత్రించాల్సిన అవసరం ఉంది. సైబర్ నేరాలను అరికట్టడానికి ఐటీ సంస్థలు, నిపుణులతో కలిసి తెలంగాణ నిబద్ధతతో పనిచేస్తోంది. ఇందులో భాగంగా సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 నిర్విరామంగా 24 గంటలూ పనిచేస్తోంది. ఈ విషయాన్ని అందరికీ చేరవేయాలి..' అని ముఖ్యమంత్రి చెప్పారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నాల్లో భాగంగా జాతీయ స్థాయిలో ఈ సదస్సు ఏర్పాటుకు చొరవ తీసుకున్నందుకు టీజీసీఎస్‌బీ డీజీ శిఖాగోయల్, ఇతర సిబ్బందిని అభినందించారు.

ఆదిలోనే అడ్డుకట్ట వేయాలి: మంత్రి శ్రీధర్‌బాబు

డేటా భద్రతకు సంబంధించి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరలో తెలంగాణలో కొత్త సెక్యూరిటీ పాలసీని తీసుకురానున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సైబర్ నేరాలను తగ్గించడం కాకుండా ఆదిలోనే అడ్డుకట్ట వేసే వ్యవస్థ రావాలని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు ఏటా 10 ట్రిలియన్ డాలర్ల సొమ్ము కొల్లగొడుతున్నారని చెప్పారు. భారత్‌లో రూ.15 వేల కోట్ల వరకు దోచుకున్నారని తెలిపారు. చాలామంది మోసపోయినా పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదన్నారు. ఒక్కసారి డబ్బులు కోల్పోతే రికవరీ కష్టమని, ప్రజలే సైబర్ మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోడ్రన్ పోలీసింగ్‌లో టెక్నాలజీ అత్యంత కీలకమని డీజీపీ జితేందర్ అన్నారు. సైబర్ సెక్యూరిటీ పరిశోధన, విధాన సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధిలో భవిష్యత్ సహకారాల కోసం షీల్డ్–2025 విద్యారంగ భాగస్వాములైన ఐఐటీ హైదరాబాద్, నల్సార్, ఐఎస్‌బీలతో ఎంఓయూలు కుదుర్చుకుంటున్నట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. కార్యక్రమంలో హోం శాఖ కార్యదర్శి రవిగుప్తా, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మొహంతి, సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ జనరల్ రమేశ్ ఖాజా, 14 రాష్ట్రాలకు చెందిన పలువురు సీనియర్ పోలీస్ అధికారులు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సైబర్ సెక్యూరిటీ నిపుణులు, ఐటీ, టెలికాం, రక్షణ.. ప్రజా విధాన సంస్థలు, స్టార్టప్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సు బుధవారం కూడా కొనసాగనుంది.

4 స్థానాలు.. 40 మంది పోటీ

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ కోసం కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ

- ఢిల్లీకి పరుగులు పెడుతున్న ఆశావహులు
- ఎస్సీ, ఓసీ, బీసీ, మైనార్టీలవారీగా అధిష్టానం కసరత్తు



సాక్షి, హైదరాబాద్: వచ్చే నెలాఖరు నాటికి ఎన్నికలు జరగనున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల కోసం అధికార కాంగ్రెస్ పార్టీలో హడావుడి మొదలైంది. మార్చి 29 నాటికి ఐదుగురు ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. పార్టీల బలాబలాలను బట్టి వీటిలో నాలుగు కాంగ్రెస్ దాని మిత్రపక్షాలకు, ఒకటి బీఆర్‌ఎస్‌కు దక్కే అవకాశముంది. ఎమ్మెల్యే కోటాలోనే తమకు ఎమ్మెల్సీ ఇవ్వాలని ఎంఐఎం అడిగితే మాత్రం కాంగ్రెస్‌కు మూడు మాత్రమే దక్కుతాయి. కానీ, తమకు ఈసారి నాలుగు స్థానాలు వస్తాయని కాంగ్రెస్ నేతలంటున్నారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు ఒక్కో స్థానం దక్కుతుందని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. బీసీ నేతలు తమ వర్గానికి రెండు సీట్లు ఇస్తారనే ఆశతో ఉన్నారు. దీంతో బీసీ వర్గాల్లో ఎమ్మెల్సీ కోసం పోటీ తీవ్రంగా కనిపిస్తోంది. మొత్తంగా నాలుగు సీట్ల కోసం 40 మంది వరకు పోటీ పడుతున్నట్లు సమాచారం. ఆశావహుల్లో కొందరు ఇప్పటికే ఢిల్లీకి వెళ్లిరాగా, మరికొందరు కొత్త ఇన్‌చార్జ్‌ని కలిసి ఢిల్లీ వెళ్లే ఆలోచనలో ఉన్నారు.

సామాజిక వర్గాల వారీగా!

ఈసారి ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరించాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. అయితే ఒక్కో సామాజిక వర్గం నుంచి పెద్ద ఎత్తున పేర్లు వినిపిస్తున్నాయి. ఓసీల నుంచి టి. జీవన్‌రెడ్డి, టి. జగ్గారెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, సామ రామ్మోహన్‌రెడ్డి, పారిజాతా నర్సింహారెడ్డి, హరివర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్‌రావు, అల్లుబెల్లి ప్రవీణ్‌రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డిల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఎస్సీల కోటాలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తోపాటు అద్దంకి దయాకర్, సింగాపురం ఇందిర, కొండ్రు పుష్పలీల, పిడమర్తి రవి, దొమ్మాట సాంబయ్య, రాచమళ్ల సిద్ధేశ్వర్, దర్శన్, జ్ఞానసుందర్, భీంభరత్‌ల పేర్లపై చర్చ జరుగుతోంది. మైనార్టీల నుంచి షబ్బీర్ అలీ, ఫిరోజ్ ఖాన్, మహ్మద్ అజారుద్దీన్, అజ్మతుల్లా హుస్సేనీల పేర్లు వినిపిస్తున్నాయి. బీసీ వర్గాల నుంచి మధుయాష్కీగౌడ్, ఎగ్గె మల్లేశం, ఈరావత్రి అనిల్, చరణ్‌కౌశిక్ యాదవ్, సునీతా ముదిరాజ్, నీలం మధు, వజ్రేశ్‌యాదవ్, చెవిటి వెంకన్న, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, పున్నా కైలాశ్‌నేత, నవీన్ యాదవ్ పేర్లు ప్రధానంగా చర్చలో ఉన్నాయి.

ఫ్యూచర్, ఫోర్త్ సిటీల పేరుతో డ్రామాలు

▶ మొదటి పేజీ తరువాయి

వేస్తున్నాడు..' అని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత 35 సార్లు ఢిల్లీ వెళ్లివచ్చాడని, కనీసం 35 పైసలు కూడా తేలేదని విమర్శించారు. కల్వకుర్తి నుంచి కొడంగల్‌కు వలస వెళ్లిన రేవంత్‌రెడ్డి అక్కడా, ఇక్కడా చేసిందేమీలేదని అన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి పతనం కల్వకుర్తి నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో మంగళవారం నిర్వహించిన రైతు నిరసన దీక్షకు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు.



ఆమనగల్లులో రైతు దీక్షకు హాజరైన మహిళలు

రేపు పుస్తెల తాళ్లు ఎత్తుకెళతారు..

'కొడంగల్‌లో ఏ ఒక్క రైతుకూ రుణమాఫీ కాలేదు. మహిళలకు రూ.2,500 పెన్షన్ ఇవ్వలేదు. కల్యాణలక్ష్మి, తులం బంగారం పత్తాలేదు. ఎన్నికల ముందు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు. కేసీఆర్ పాలనలో ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు ఇక్కడికి వలస వస్తే.. ప్రస్తుతం ఇక్కడి నుంచి వలస పోవాల్సి వస్తోంది. కాంగ్రెస్ పాలనలో మొన్న రైతుల ఇంటి తలుపులు ఎత్తుకెళ్లారు. నిన్న మోటార్లు, స్టార్టర్లు తీసుకెళ్లారు. రేపు మహిళల మెడలో నుంచి పుస్తెల తాళ్లు ఎత్తుకెళ్తారు. కేసీఆర్ పాలనలో రైతులను కడుపులో పెట్టుకుని చూసుకున్నారు. 70 లక్షల మంది రైతులకు రైతుబంధు కింద 12 సీజన్లలో రూ.73 వేల కోట్లు అందాయి. కానీ రేవంత్‌రెడ్డి 420 రోజుల పాలనలో 430 మంది రైతులు, 56 మంది గురుకుల పాఠశాలల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. నాగర్‌కర్నూల్‌లో చందు అనే రైతు బ్యాంకు ఎదుట బైక్‌ను కాల్చి నిరసన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రైతు జాదవరావ్, మేడ్చల్‌లో సురేందర్‌రెడ్డి ఆత్మహత్యలు చేసుకోగా ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారి వేణుగోపాల్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదు..

42 శాతం రిజర్వేషన్ల పేరుతో బీసీలను, రూ.15 వేలు రైతు భరోసా ఇస్తానని రైతులను, రూ.12 వేలు ఇస్తానని రైతు కూలీలను, నెలకు రూ.2,500 ఇస్తానని ఆడబిడ్డలను, స్కూటీలు ఇస్తానని యువతులను, లగ్గం చేసుకుంటే తులం బంగారం ఇస్తానని ఆడబిడ్డలను ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను రేవంత్‌రెడ్డి మోసం చేశారు. రాష్ట్ర ప్రజలు రేవంత్‌రెడ్డిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నారు. ఇంకెవరైనా అయితే ఇప్పటికే పాడుబడిన బావిలో దూకేవారు. కాంగ్రెస్ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదు. రేవంత్‌రెడ్డి నిజాయితీగల మోసగాడు..' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం కోసం ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకుల గల్లాలు పట్టుకుని నిలదీయాలని పిలుపునిచ్చారు. రైతు దీక్షలో మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్‌రెడ్డి, వాణిదేవి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, బాల్క సుమన్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, గోలి శ్రీనివాస్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఐసీసీలో గోయాస్ హబ్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో అవకాశం

ఆ దేశంతో టీ హబ్ కీలక ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి చెందిన స్టార్టప్ సంస్థలు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. బ్రెజిల్‌కు చెందిన గోయాస్ హబ్‌తో టీ హబ్ అవగాహన ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో (హెచ్ఐసీసీ) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం గోయాస్ హబ్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం టీ హబ్ ఫౌండేషన్ సీఈవో సుజిత్, గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రెటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో, అక్కడి స్టార్టప్‌లకు మన రాష్ట్రంలో అవకాశాలు లభిస్తాయి. ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, అగ్రిటెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారానికి వీలు కలుగుతుంది. మార్కెట్ యాక్సెస్‌తోపాటు కెపాసిటీ బిల్డింగ్ ఇంక్యుబేషన్, సాంకేతిక భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాల మెరుగుదల వంటి కీలక అంశాలపై రెండు సంస్థలు కలిసి పని చేస్తాయి.

నేడు తెలంగాణ భవన్‌కు కేసీఆర్

ఆరు నెలల తర్వాత పార్టీ కార్యాలయానికి..


పార్టీ భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం



సాక్షి, హైదరాబాద్: ఆరు నెలల సుదీర్ఘ విరామం తర్వాత బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు రానున్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ సమావేశానికి హాజరు కావాలంటూ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు, జెడ్పీ మాజీ చైర్మన్లు కలుపుకొని సుమారు 400 మందికి ఆహ్వానం పంపారు. ఈ భేటీలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంతోపాటు చేపట్టాల్సిన రాజకీయ కార్యకలాపాలపై కేసీఆర్ దిశా నిర్దేశం చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా టీఆర్‌ఎస్ పేరిట ఆవిర్భవించిన బీఆర్‌ఎస్ వచ్చే ఏప్రిల్ 27 నాటికి 25 ఏళ్లు పూర్తి చేసుకుంటుండటంతో సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కేసీఆర్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే రెండు నెలల పాటు పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపేలా సన్నాహక కార్యక్రమాలు ఉంటాయని పార్టీ నేతలు భావిస్తున్నారు. సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణంలో భాగంగా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీల ఏర్పాటు, శిక్షణ కార్యక్రమాలకు సంబంధించి షెడ్యూలు ప్రకటించే అవకాశముంది.

చట్టాన్ని ధిక్కరించి 'అసైన్డ్' విక్రయం

మోసగాళ్లతో అధికారులు కుమ్మక్కయ్యారని హైకోర్టు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: సొంత లాభం కోసం కొందరు చట్టాన్ని ధిక్కరించి అసైన్డ్ భూములను అమ్ముతున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి మోసగాళ్లతో రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్లు కుమ్మక్కవుతున్నారని మండిపడింది. అసైన్డ్ చట్టం 1977 ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తే.. ఆ భూములను స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని చెప్పింది. దస్తావేజులు లేకున్నా అమ్మకాలు జరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో అసైన్డ్ భూమి అమ్మకాలు జరగడంపై 3 నెలల్లోగా జిల్లా కలెక్టర్ విచారణ పూర్తి చేసి బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. మొయినాబాద్‌లోని సర్వే నంబర్ 178/23లోని భూమిని తమ అనుమతి లేకుండా విక్రయించారంటూ నాగమ్మ, ఆమె ముగ్గురు కొడుకులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. తెలంగాణ ల్యాండ్ రెవెన్యూ యాక్ట్ ప్రకారం అసైన్డ్ భూమిని వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలని, అందుకు విరుద్ధంగా చేస్తే ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చని చెప్పారు. అసైన్డ్ చట్టంలోని సెక్షన్ 7 (2ఏ) ప్రకారం ఏ అధికారి అయినా 5 (1) (2) కింద నిబంధనలను ఉల్లంఘిస్తే 6 నెలలు జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధించేందుకు వీలుందన్నారు. ఈ కేసులో పిటిషనర్లు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించాలని, వినతి పత్రం అందిన 3 నెలల్లోగా కలెక్టర్ విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వైద్యం చేయించలేక.. భర్తకు ఉరేసింది

అల్లుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య



ఆశయ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): భర్త వైద్యానికి అయ్యే ఖర్చును భరించలేక అతడిని..అల్లుడితో కలిసి ఉరేసి హత్య చేసింది ఓ భార్య. పైగా దీనిని సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. తీరా మృతుడి మెడపై కమిలిపోయిన గాయాలు ఉండటంతో పోలీసుల వరకు వెళ్లింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని బాచారం గ్రామానికి చెందిన కర్రెల ఆశయ్య (45), శివ్వమ్మ దంపతులకు కూతురు లావణ్య, కుమారుడు శివకుమార్ ఉన్నారు. ఎకరంన్నర అసైన్డ్ భూమిలో పంటలు పండక, నగరానికి కూలీలుగా వలస వెళ్లారు. రోడ్డు ప్రమాదంలో కొడుకు చనిపోయాడు. దీంతో స్వగ్రామానికి వచ్చారు. కూతురు లావణ్యను జూకల్‌కు చెందిన రమేశ్‌కు ఇచ్చి వివాహం చేసి ఇల్లరికం తెచ్చారు. ఆశయ్య గ్రామంలోనే పశువులు కాస్తున్నాడు. ఇటీవల బోరు వేసి ఆ భూమిని వ్యవసాయ యోగ్యంగా మార్చారు. శనివారం పొలం పనులకు వెళ్లిన ఆశయ్య జారిపడగా, తుంటి ఎముక విరిగింది. ఆశయ్యకు శస్త్ర చికిత్సకు రూ.50 వేలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. ఇంటికెళ్లిన తర్వాత వైద్య ఖర్చులు ఎలా భరించాలి అనుకున్నారో, అవిటితనంతో కుటుంబానికి భారమవుతాడని భావించారో, లేక రైతు బీమా కోసం ఆశ పడ్డారో తెలియదు కానీ ఆదివారం అర్ధరాత్రి అల్లుడు రమేశ్‌తో కలిసి, శివ్వమ్మ నిద్రలో ఉన్న భర్త ఆశయ్య మెడకు తువ్వాలతో ఉరేసి హత్య చేసింది. పొద్దున ఆశయ్యది సహజ మరణంగా చిత్రీకరించారు. సోమవారం సాయంత్రం ఆశయ్య మృతదేహాన్ని దింపుడు కల్లం వద్ద ఆపారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ శవాన్ని స్వాధీనం చేసుకొని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరి గంగమణి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

క్లుప్తంగా...

'పీఎం ఇంటర్న్‌షిప్' దరఖాస్తుకు
మార్చి 10 గడువు

సాక్షి, హైదరాబాద్: భారత కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం కింద మార్చి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పరిశ్రమల శాఖ సంచాలకుడు జి.మల్సూర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద అర్హత సాధించిన విద్యార్థులకు 12 నెలలకు రూ.6 వేలు ఒకేసారి బ్యాంకు ఖాతాలో నేరుగా జమచేయనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వయసు 21 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలని, ఈ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ఆరు నెలల పాటు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. దరఖాస్తు చేసే విద్యార్థులు పదోతరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, డిగ్రీలలో ఏదైనా పూర్తి చేసి ఉండాలని, వారి కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలలోపు ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 'పీఎంఇంటర్న్‌షిప్.ఎంసీఏ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా లాగిన్ అయి దరఖాస్తును పూరించాలని సూచించారు.

జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ గడువు మరో నెల పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించి అధ్యయనం చేసి నివేదిక సమర్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ గడువును మరో నెల రోజులు పొడిగించింది. వాస్తవానికి వన్‌మ్యాన్ కమిషన్ గడువు ఈనెల 11వ తేదీతో ముగియగా, వర్గీకరణపై లోతైన అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు మార్చి 10వ తేదీ వరకు గడువును పొడిగించింది. ఈమేరకు ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం చేసేందుకు గతేడాది నవంబర్ 11న జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. రెండు నెలల్లో నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. అయితే అధ్యయన ప్రక్రియ ఆలస్యం కావడంతో జనవరి 11 నుంచి ఫిబ్రవరి 10వ తేదీవరకు కమిషన్ గడువును పొడిగించింది. తాజాగా ఈ కమిషన్ గడువును మరో నెలరోజులు పొడిగిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఇప్పటికే జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి అధ్యయనం పూర్తిచేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన విషయం తెలిసిందే.



ఏక్ నిరంజన్

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలంటూ ఉన్నతాధికారులు, ప్రభుత్వం పదేపదే ఆదేశిస్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో మాత్రం మార్పు రావడం లేదు. అందుకు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని సాలేవాడ ప్రాథమిక పాఠశాలనే నిదర్శనం. ఈ బడిలో మొత్తం 13 మంది విద్యార్థులు ఉండగా మంగళవారం ఉదయం 10 గంటలకు పాఠశాలను 'సాక్షి' సందర్శించిన సమయంలో కేవలం ఒకే ఒక విద్యార్థి ఉండగా టీచర్ ఆ విద్యార్థికి బోధిస్తుండటం గమనార్హం.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

'విద్యా రంగానికి నిధులు పెంచాలి'

సాక్షి, హైదరాబాద్: విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు నిధులు పెంచాలని తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి కోరారు. వివిధ వర్గాల నుంచి వచ్చిన సలహాలు, సూచనల్లోని ప్రధా న అంశాలను మంగళవారం సెక్రటేరియట్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి వివరించారు. గత ప్రభుత్వం విద్యా రంగాన్ని అస్త వ్యస్తం చేసిందని, ఈ పరిస్థితిని మెరుగు పర్చా ల్సిన అవసరం ఉందని మురళి అభిప్రాయ పడ్డారు. లక్షలాది విద్యార్థుల భవి ష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అవసరమైన ప్రణాళికలు రూ పొందించాలన్నారు. స్కూళ్లు, కాలేజీలు, యూని వర్సిటీల్లో ఉత్తమ ప్రమాణాలకు నిధులే కీలకమని తెలిపారు.

డిగ్రీ కాదు.. నైపుణ్యమే కీలకం

- సత్తా ఉంటేనే కాలేజీలకు గుర్తింపు
- బిల్డింగులు కాదు.. ఫ్యాకల్టీ ఉండాలి
- మెరుగైన నైపుణ్యమే గీటురాయి
- ఈ దిశగా సాంకేతిక విద్యకు మెరుగులు

'సాక్షి'తో జేఎన్టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టి. కిషన్‌కుమార్ రెడ్డి



వీసీగా బాధ్యతలు స్వీకరించిన టీకే రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

సాక్షి, హైదరాబాద్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విసురుతున్న సవాళ్లకు అనుగుణంగా సాంకేతిక విద్యలో కీలక మార్పులు చేయాల్సిన అవసరం ఉందని హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూహెచ్) నూతన వైస్ చాన్స్‌లర్‌గా నియమితులైన ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి అన్నారు. వీసీగా తన లక్ష్యం కూడా అదేనని చెప్పారు. మంగళవారం వర్సిటీ వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆయన 'సాక్షి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. పూర్తిగా సాంకేతిక వర్సిటీ కావడం వల్ల జేఎన్టీయూహెచ్ బాధ్యతలు కత్తిమీద సాములాంటివేనని పేర్కొన్నారు. తమ వర్సిటీ పరిధిలో ఉన్న ప్రైవేటు కాలేజీల్లోనూ నాణ్యత పెంచడంపై దృష్టి పెడతామని చెప్పారు. ఈ విషయంలో ఎలాంటి ఒత్తిడులకు తలొగ్గబోమని స్పష్టంచేశారు. నిబంధనల ప్రకారం కాలేజీల్లో మౌలిక వసతులు, అధ్యాపకులు ఉంటేనే గుర్తింపు ఇస్తామని తెలిపారు. కోర్ గ్రూపుల తగ్గింపు క్షేమకరం కాదని అభిప్రాయపడ్డారు. సీఎస్‌ఈ వైపే విద్యార్థులను పరుగులు పెట్టించడం వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు.

భవనాలు కాదు.. బోధకులు ముఖ్యం

ఇంజనీరింగ్ విద్యలో కొత్త కోర్సులవైపే విద్యార్థులు మొగ్గు చూపుతున్నారని కిషన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అయితే, నాణ్యమైన ఫ్యాకల్టీ కొరత ఉందని చెప్పారు. 'అందమైన భవనాలుంటేనే మంచి విద్య వస్తుందనే భ్రమలు తొలగాలి. బోధకుల ప్రమాణాలేంటో పరిశీలిస్తాం. అనుబంధ గుర్తింపు ఇచ్చేటప్పుడు అన్ని కోణాల్లోనూ పరిశీలన చేస్తాం. విద్యార్థులకు మెరుగైన ప్రమాణాలతో విద్యను అందించే దిశగానే కాలేజీలు ఉండాలి. త్వరలోనే ఈ విషయంపై వర్సిటీ అధికారులతో సమీక్షిస్తా. నాణ్యత పెంపునకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. వర్సిటీలోని అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకుని నైపుణ్యంతో కూడిన విద్యను అందించే ప్రయత్నం చేస్తాం' అని తెలిపారు.

ఉద్యోగానికి నైపుణ్యమే కీలకం

విద్యార్థికి ఉద్యోగం సంపాదించే నైపుణ్యాలు నేర్పటమే కీలకమని కిషన్‌కుమార్‌రెడ్డి అన్నారు. 'ఉద్యోగాల ట్రెండ్ మారింది. ఏఐ వచ్చాక ఉద్యోగం రావడం కష్టంగా మారింది. ఇప్పుడు కంప్యూటర్‌తో పరుగులు పెట్టే నైపుణ్యం అవసరం. ఇంజనీరింగ్‌లో ఎన్ని మార్కులొచ్చాయని కంపెనీలు చూడటం లేదు. ఏమేర నైపుణ్యం ఉందనే విషయాన్ని పరిగణనలోనికి తీసుకుంటున్నాయి. ఇప్పటికే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. జేఎన్టీయూహెచ్ పరిధిలోనూ నైపుణ్యాలు అభివృద్ధి చేస్తాం. పుస్తకాల పరిజ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి అనుభవం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటాం. అన్ని ప్రైవేటు కాలేజీలు ఈ దిశగా అడుగులు వేయడానికి కృషి చేస్తాం' అని వెల్లడించారు.

జేఎన్టీయూ వీసీగా ప్రొఫెసర్ కిషన్‌కుమార్ రెడ్డి

- గవర్నర్ ఉత్తర్వులు.. వెంటనే బాధ్యతల స్వీకరణ
- మెదక్ జిల్లాలో పుట్టి జాతీయ స్థాయి గుర్తింపు సాధించిన టీకే రెడ్డి
- గతంలో దీన్‌దయాళ్ పెట్రోలియం వర్సిటీ వీసీగా సేవలు

సాక్షి, హైదరాబాద్: జవ హర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యా లయం (జేఎన్టీయూ) వైస్ చాన్స్ లర్ (వీసీ)గా ప్రొఫెసర్ టీ కిషన్‌కుమా ర్‌రెడ్డిని నియమిస్తూ మంగళ వారం గవర్నర్ ఉత్తర్వు లు జారీచేశారు. ఆ వెంటనే ఆయన బాధ్యతలు కూడా స్వీకరించారు. గత ఏడాది మే నెలలో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల వీసీల గడువు ముగియటంతో సీనియర్ ఐఏఎస్‌లను ప్రత్యేక పాలనాధికారులుగా ప్రభుత్వం నియమించింది. అనంతరం గత ఏడాది అక్టోబర్‌లో పలు వర్సిటీలకు ప్రభుత్వం వీసీలను నియమించింది. జేఎన్టీయూహెచ్‌కు కూడా సెర్చ్ కమిటీని వేసినప్పటికీ సాంకేతిక సమస్యలతో వీసీ నియామకం ఆపివేశారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. గత నెలలో సెర్చ్ కమిటీ తిరిగి సమావేశమై ముగ్గురి పేర్లను ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. వారిలో నుంచి కిషన్‌కుమార్‌రెడ్డిని వీసీగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఎంపిక చేశారు.

సిద్దిపేట నుంచి జేఎన్టీయూహెచ్ వీసీ దాకా

ప్రొఫెసర్ టీకే రెడ్డి సిద్దిపేట జిల్లా అల్లీపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గురవారెడ్డి కుమారుడు. పాఠశాల చదువు హైదరాబాద్ సెయింట్ పాల్, హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో సాగింది. నారాయణగూడలోని న్యూసైన్స్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో 1973–78లో మెకానికల్ ఇంజనీరింగ్ చేశారు. 1981–87లో అమెరికాలోని డ్రెక్సెల్ యూనివర్సిటీలో థర్మల్ ఫ్లూయిడ్ సైన్స్‌పై పీహెచ్‌డీ చేశారు. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్‌లో ఉద్యోగం చేశారు. పండిట్ దీన్‌దయాళ్ పెట్రోలియం యూనివర్సిటీ వీసీగా పనిచేశారు. అనేక జాతీయ అవార్డులు అందుకున్నారు.



డ్రోన్‌ను ఎగురవేసి సర్వే ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయేందిర

నక్ష సర్వే ప్రారంభం

జడ్చర్లలో సర్వేను ప్రారంభించిన కలెక్టర్

జడ్చర్ల టౌన్/కొడంగల్: రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికై న మున్సిపాలిటీల్లో నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్ష) కార్య క్రమం మంగళవారం ప్రారంభమైంది. మహ బూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీలో కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె డ్రోన్‌ను ఎగురవేసి సర్వేను ప్రారంభించారు. సర్వే ఆఫ్ ఇండియా, రాష్ట్ర రెవెన్యూ, పురపా లక శాఖల ద్వారా సర్వే నిర్వహిస్తున్నారన్నా రు. రాష్ట్రంలో 10 మున్సిపాలిటీలు పైలెట్ ప్రాజెక్టు కింద ఉన్నాయన్నారు.

కొడంగల్‌లో 'నక్ష' ప్రారంభం

కొడంగల్‌లో అడిషనల్ కలెక్టర్ సుధీర్, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, సర్వే ఆఫ్ ఇండియా ఆఫీసర్ సమీ రొద్దీన్, స్థానిక అధికారులు సర్వేను ప్రారంభించారు. కొడంగల్‌లో హెలికాప్టర్ ద్వారా సర్వే చేయనున్నట్లు చెప్పారు. ఈ సర్వేలో భూమిపైన ఉన్న నిర్మాణాలకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్ ద్వారా అందుతాయని చెప్పారు. సర్వే నంబర్, ఇంటి నంబర్, విస్తీర్ణం, యజమాని పేరు తదితర వివరాలతో ఫొటోలు వస్తాయన్నారు.

ఇంటర్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలి

జిల్లా అధికారులకు ఇంటర్ బోర్డ్ కార్యదర్శి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మార్చి 5 నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల ఇంటర్ విద్యాశాఖ అధికారులను ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఆదేశించారు. తన కార్యాలయం నుంచి మంగళవారం ఆయన జిల్లా అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లపై సమగ్ర వివరాలు కోరారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కఠినమైన నిఘా ఉంచడానికి జిల్లా వారీగా కస్టోడియన్, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించాలని సూచించారు. బఫర్, రిజర్వ్ సిబ్బంది గురించి వాకబు చేశారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌ల నిర్వహణ, పర్యవేక్షణ విధానాల గురించి కొన్ని సూచనలిచ్చారు. అన్ని థియరీ పరీక్షా కేంద్రాల్లో ముందుగానే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కృష్ణ ఆదిత్య ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత డీఐఈవోలతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు సాంకేతిక సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించాలన్నారు.

బెయిల్ పిటిషన్లను త్వరగా పరిష్కరించండి

'ఫోన్ ట్యాపింగ్'కేసుపై ట్రయల్ కోర్టుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు (4, 5) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను త్వరగా పరిష్కరించాలని ట్రయల్ కోర్టును హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ల బెయిల్ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోవాలని మెజిస్ట్రేట్‌కు ఆదేశాలు జారీ చేయాలన్న పిటిషనర్ తరఫు న్యాయవాది అభ్యర్థనను తిరస్కరించింది. ట్రయల్ కోర్టులో మెరిట్ ఆధారంగా వాదనలు వినిపించాలని సూచించింది. ఈ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావును ఏ–1గా, రాధాకిషన్‌రావును ఏ–2గా, సంతోష్‌కుమార్‌ను ఏ–4గా, పర్శ రాములును ఏ–5గా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హరీశ్‌రావు, రాధాకిషన్‌రావు హైకోర్టును ఆశ్రయించగా.. అరెస్టు చేయవద్దని ఆదేశించింది. ఈ క్రమంలో తమను అరెస్టు చేశారని, బెయిల్ ఇవ్వాలని కోరుతూ సిద్దిపేటకు చెందిన ఏ–4, ఏ–5 నిందితులు హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. బెయిల్ పిటిషన్లను త్వరగా పరిష్కరించాలని దిగువ కోర్టుకు ఆదేశాలు జారీ చేశారు.



దుఃఖంలో ఉన్న ప్రతి ఒక్కరూ తమ వేదనల నుండి ఉపశమనం పొందేలా అవధులు లేని కరుణ చూపాలి. ఇతరుల వేదనలో సంతోషం పొందే గుణానికి ఇది విరుగుడు.
- బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 19 ఫిబ్రవరి 2025

ఆత్మావలోకనం అవసరం

విశ్వసనీయతను కాపాడుకునే విషయంలో, విలువలు పాటించే అంశంలో పట్టింపు ఉన్నట్టు కనబడకపోతే వ్యక్తులైనా, వ్యవస్థలైనా విమర్శలపాలు కాకతప్పదు. తన రిటైర్మెంట్‌కు ఒక రోజు ముందు సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల సంఘం(ఈసీ) చీఫ్ రాజీవ్ కుమార్ తమపై వస్తున్న విమర్శలకూ, ఆరోపణలకూ ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్నికల్లో ఓడిన వారు ఫలితాలను జీర్ణించుకోలేక ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నది ఆయన అభిప్రాయం. దీనికి మూలం ఎక్కడుందో, తామెంత వరకూ బాధ్యులో ఒక్కసారి ఆత్మావలోకనం చేసుకునివుంటే సమస్య మొత్తం ఆయనకే అర్థమయ్యేది. ఈసీకి ఇప్పటికీ ఏదోమేర విశ్వసనీయత ఉందంటే అది మాజీ సీఈసీ టీఎన్ శేషన్ పెట్టిన భిక్ష. అంతకుముందు ఈసీ ఉనికి పెద్దగా తెలిసేది కాదు. అది రాజ్యాంగ సంస్థ అనీ, దానికి విస్తృతాధికారాలు ఉంటాయనీ ఎవరూ అనుకోలేదు. శేషన్ తీరు నియంతను పోలివుంటుందని, తానే సర్వంసహాధికారినన్నట్టు ప్రవర్తిస్తారని ఆరోపణలొచ్చిన మాట వాస్తవమే అయినా ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించటంలో, అవసరమైతే ఎన్నికలను రద్దు చేయటం వంటి కఠిన చర్యలకు వెనకాడకపోవటంలో ఆయనకెవరూ సాటిరారు. అనంతరం వచ్చిన సీఈసీల్లో అతి కొద్దిమంది మాత్రమే శేషన్ దరిదాపుల్లోకొచ్చే ప్రయత్నం చేశారు. గత కొన్నేళ్లుగా అసలు ఆ ఊసే లేకుండా కాలక్షేపం చేసినవారే అధికం. శేషన్ నెలకొల్పిన ప్రమాణాలను అందుకోకపోతే పోయారు... కనీసం ఆ సంస్థ ఔన్నత్యాన్ని దిగజార్చకపోతే బాగుండునని కోరుకోవటం కూడా అత్యాశేనన్న చందంగా పరిస్థితి మారింది. దాని స్వతంత్రత, తటస్థత, విశ్వసనీయత ప్రశ్నార్థకమయ్యే రోజులొచ్చాయి.

ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించటానికి రాజ్యాంగం సృష్టించిన సంస్థ ఈసీ. అది తనకు ఎదురయ్యే అనుభవాలతో తన అధికారాలను పునర్నిర్వచించుకునే సంప్రదాయాన్ని కొనసాగిస్తే, దానిద్వారా రాజ్యాంగం ఆశించిన ఉద్దేశాలు నెరవేరేవి. ఈసీ ఏక సభ్య సంఘంగా మొదలై త్రిసభ్య సంఘమైంది. కానీ ఉన్న అధికారాలనే సక్రమంగా వినియోగించుకోలేని అశక్తతకు లోబడుతుండటం చేదు వాస్తవం. రాజ్యాంగం ఈసీకి స్వతంత్ర ప్రతిపత్తి ఇచ్చినా దాన్ని వినియోగించుకోవటంలో ఆసక్తి కనబరుస్తున్న దాఖలా లేదు. పార్టీలను నమోదు చేసుకునే అధికారం 1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టం ఈసీకి ఇస్తోంది. ఆ నమోదును రద్దు చేసే లేదా ఆ పార్టీనే రద్దుచేసే అధికారం మాత్రం లేదు. మరింత స్వతంత్రంగా, మరింత దృఢ సంకల్పంతో వ్యవహరించమని వేర్వేరు తీర్పుల్లో సుప్రీంకోర్టు చేసిన సూచనలకు అనుగుణంగా ఈసీ వ్యవహరించివుంటే పరిస్థితి వేరేలా ఉండేదేమో!

గెలిచిన పార్టీలకు ఆరోపణలు చేసే అవసరం తలెత్తదు. అంతటి త్యాగధనులు కూడా ఎవరూ లేరు. కానీ మాజీ సీఈసీ ఎస్‌వై ఖురేషీ చేసిన ఆరోపణల మాటేమిటి? వాటినీ కొట్టిపారేస్తారా? కనీసం ఆయన వ్యాఖ్యలపైన స్పందించలేని అచేతన స్థితికి ఈసీ చేరుకోవటాన్ని రాజీవ్ ఏరకంగా సమర్థించుకోగలరు? రోజులు గడిస్తే తప్పులు సమసిపోతాయా? ఇంత అమాయకత్వాన్ని నటిస్తున్న రాజీవ్ నిరుడు మేలో ఆంధ్ర ప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల తంతుపై వచ్చిన విమర్శలకు ఈ ఎనిమిది నెలల్లో ఒక్కసారైనా జవాబిచ్చారా? పోలింగ్ జరిగినరోజు రాత్రి 8 గంటలకు వోటింగ్ శాతాన్ని 68.12 అని ప్రకటించి, మరో మూడు గంటలు గడిచాక దాన్ని ఏకంగా 76.50 శాతమని చెప్పటం, మరో నాలుగు రోజులకు మళ్లీ గొంతు సవరించుకుని 80.66గా మార్చటంలోని మర్మమేమిటి? ఈ పెంపు ఏకంగా 12.5 శాతం. దాన్ని అంకెల్లోకి మారిస్తే 49 లక్షలు! ఈ మాయాజాలం ఏమిటో, కొత్తగా పుట్టుకొచ్చిన ఈ 49 లక్షలమంది కథాకమామీషు ఏమిటో చెప్పాల్సిన బాధ్యత ఆయనకు ఉండనవసరం లేదా? తమకై తాము ప్రజలను అయోమయంలోకి నెట్టి, తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసి రాజకీయపక్షాలపై బండరాళ్లు వేయటం ఏ రకమైన నీతి? మహారాష్ట్ర ఎన్నికలు సైతం ఈ బాణీలోనే సాగాయి. పోలింగ్ ముగిసిన సాయంత్రం 58.2 శాతం (6,30,85,732) మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారని చెప్పిన ఎన్నికల సంఘమే రాత్రికల్లా 65.02 శాతమని మార్చింది. కౌంటింగ్‌కు ముందు అది కాస్తా 66.05 శాతానికి పెరిగింది. అంటే వోటింగ్‌లో 7.83 శాతం పెరుగుదల. అంకెల్లో చూస్తే స్థూలంగా 76 లక్షలు. ఇలాంటి దుస్థితి అఘోరించినప్పుడు సందేహాలు రావా? ఆరోపణలు వెల్లువెత్తవా?

రాజీవ్ మీడియా సమావేశం రోజునే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీలతో కూడిన కమిటీ కొత్త ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా జ్ఞానేశ్ కుమార్‌ను ఎంపిక చేసింది. ఇది సరికాదంటూ విపక్ష నేత రాహుల్‌గాంధీ అసమ్మతి నోట్ అందజేశారు. ఇలా వివాదాస్పద ఎంపికలోనే సమస్యకు బీజం ఉంటుందని, అటుపై ఈసీ నడతను నిశితంగా పరిశీలించటం మొదలవుతుందని రాజీవ్ గుర్తిస్తే మంచిది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఈసీ విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతున్నదని ఖురేషీ విమర్శిస్తే ఇదే రాజీవ్ నొచ్చుకుని 'ఎంతమంది సీఈసీలు ప్రవర్తనా నియమావళికి సంబంధించిన ఫిర్యాదులు అందుకున్నారో, వాటి ఆధారంగా ఎందరిపై చర్య తీసుకున్నారో మేం ఆరా తీశాం' అని గంభీరంగా ప్రకటించారు. అదేమిటో బయటపెట్టాలని ఖురేషీ సవాలు చేస్తే ఈ ఆరేళ్లుగా మౌనమే సమాధానమైంది. ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించటం లేదని చెప్పటానికి ఇది చాలదా?

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు
మాఘ మాసం, తిథి: బ.సప్తమి పూర్తి (24 గంటలు),
నక్షత్రం: స్వాతి ఉ.8.17 వరకు, తదుపరి విశాఖ,
వర్జ్యం: ప.2.28 నుండి 4.12 వరకు,
దుర్ముహూర్తం: ఉ.11.53 నుండి 12.41 వరకు,
అమృతఘడియలు: రా.12.56 నుండి 2.44 వరకు

సూర్యోదయం : 6.29
సూర్యాస్తమయం: 5.58
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

మారాల్సిన దౌత్యం తీరు

విశ్లేషణ



నిరుపమా రావు

దౌత్య కెమిస్ట్రీ ప్రకారం, ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య స్నేహం భారత్, అమెరికా మధ్య సంబంధాలకు ఒక నిర్మాణాత్మక వాతావరణాన్ని అందిస్తుంది. ఇలాంటి సంబంధం ఉద్రిక్తతలను తగ్గిస్తుంది, విశ్వాసాన్ని పెంచుతుంది. అయితే దౌత్యం అనేది పూర్తిగా నాయకత్వ స్థాయి కెమిస్ట్రీ పైనే ఆధారపడదు. భారత్, అమెరికా మధ్య సంబంధాలు అదృష్టవశాత్తూ పరస్పర ప్రయోజనం, ప్రజా మద్దతుకు చెందిన దృఢమైన చట్రంపై ఆధారపడి ఉన్నాయి. జాతీయ ప్రయోజనాలకు సంబంధించి, బహుళ రంగాలలో అనేక సంవత్సరాల పరిణామ క్రమంపై కూడా ఇవి నిర్మితమై ఉన్నాయి. అయితే మనం జీవిస్తున్నది విచ్ఛిన్నమవుతున్న ప్రపంచం. దీంట్లో ఆత్మసంతృప్తికి కాలం చెల్లిపోయింది.

మారిన సవాళ్లు

నేడు మనం ఎదుర్కొంటున్న వాస్తవాలు ట్రంప్ మొదటి అధ్యక్ష పదవీ కాలానికి భిన్నంగా ఉన్నాయి. ప్రపంచ దౌత్య చలనశీలత మారిపోయింది. యుద్ధం- సంఘర్షణ, కొల్లగొట్టే పోటీ, వాణిజ్య ఉద్రిక్తతలు, ప్రపంచీకరణకు చెందిన క్షీణిస్తున్న ఆకర్షణలు భౌగోళిక రాజకీయాలను నిర్వచిస్తున్నాయి. ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్' ఎజెండాతో అధికారంలోకి వచ్చారు. 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' నినాదానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. అమెరికన్ రాజకీయాల్లో జనరంజక, స్థానికవాదపు ఉప్పెనపై ఆయన స్వారీ చేస్తున్నారు.

మోదీ అమెరికా పర్యటన ఫలితాలను మీడియా మొత్తంగా విశ్లేషించింది. ఇప్పుడు భారతదేశంపై ట్రంప్ ప్రాపంచిక దృక్పథం చూపిన ప్రభావం గురించి మనం ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యానికి ట్రంప్ విలువ ఇవ్వలేదని కాదు. ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో గగనతలం, భూమి, సముద్రం, అంతరిక్షం, సైబర్‌స్పేస్‌తో సహా వివిధ రంగాలను ఉన్నతీకరించడానికి, సైనిక సహకారాన్ని పెంచడానికి ఇరుపక్షాలూ ఆసక్తిగా ఉన్నట్లు స్పష్టమైంది. ఎఫ్‌-35 జెట్‌ల వంటి అధునాతన విమానయాన వ్యవస్థల అమ్మకాలకూ, సహ ఉత్పత్తికీ ప్రణాళికలు ఉన్నాయి. స్వేచ్ఛాయుతమైన, పారదర్శకమైన ఇండో-పసిఫిక్ వాణిజ్యం, వలసల కోసం ఉమ్మడి వ్యూహాత్మక దృష్టి కూడా ఉంది. ఇవి మరింత సంక్లిష్టమైన సవాళ్లను విసురుతున్నాయి.

అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న 'ప్రతీకార' సుంకాలు అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను ప్రాథమికంగా దెబ్బతీస్తాయి, వ్యాపార అనిశ్చితులు పెరుగుతాయి, భౌగోళిక రాజకీయ అంతరాలు తీవ్రమవుతాయి. దేశాలు అమెరికాతో తమ వాణిజ్య సంబంధాలను తిరిగి అంచనా వేయవలసి ఉంటుంది. ఇప్పటికే ఏర్పర్చిన సరఫరా గొలుసులు, అలాగే ప్రపంచ ఆర్థిక స్థిరత్వం కూడా ప్రభావితం కావచ్చు. అమెరికా సుంకాలను విధించడం వల్ల ఉత్పత్తి ఖర్చులు ప్రభావితమవుతాయి. ఇది వినియోగదారులను దెబ్బతీస్తుంది. అధిక ద్రవ్యోల్బణానికి దోహదం చేస్తుంది. వాస్తవానికి, చైనాకు దూరం జరుగుతూ, తన సరఫరా గొలుసులను అమెరికా వైవిధ్యపరిచినందు వలన, మన వస్త్రాలు, ఎలక్ట్రానిక్స్, ఇంజనీరింగ్ వస్తువుల రంగాలకు మంచి అవకాశాలు ఉన్నాయి. అయితే, ప్రపంచంతో ఆర్థిక సంబంధాలపై ట్రంప్ అనుసరిస్తున్న రక్షణాత్మక విధానం భారత్‌కు సవాళ్లను కలిగిస్తుంది. వాటిని తక్కువ అంచనా వేయకూడదు.



ఫిబ్రవరి 13 నాటి భారత ప్రధాని యూఎస్ పర్యటన: మోదీ, ట్రంప్

- డాలర్ ఆధిపత్యాన్ని నిరోధించే ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థలను బ్రిక్స్ దేశాలు అనుసరించకూడదని ట్రంప్ బెదిరిస్తున్నారు.
- అంతర్జాతీయంగా తన పౌరులను (అక్రమ వలసదారుల తరలింపు నేపథ్యంలో) రక్షించుకోగల సామర్థ్యం స్మార్ట్ పవర్‌లో ఒక భాగం.
- ఇప్పుడు స్నేహితులు, శత్రువులు ఎవరూ లేరు. కేవలం లావాదేవీలు జరపాలి, ఒప్పందాలు కుదుర్చుకోవాలి. తదనుగుణంగా భారత్ తన దౌత్యరీతిని మార్చుకోవాలి.

బ్రిక్స్ దేశాలకు బెదిరింపు

అమెరికాతో మన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తూనే మన ఆర్థిక ప్రయోజనాలను సమతుల్యం చేసుకోవడానికి జాగ్రత్తగా చర్చలు జరపాల్సిన అవసరం ఉంది. ప్రతీకార సుంకాల విధానం భారత్ తన సొంత సుంకాలను హేతుబద్ధీకరించుకోవడానికి తోడ్పడుతుంది. ఈ సంవత్సరం చివరిలోపు రెండు దేశాలు కుదుర్చుకోవాలనుకుంటున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలకు ఇది ఉత్ప్రేరకంగా ఉపయోగపడుతుంది. అటువంటి ఒప్పందాన్ని చేరుకోవడం మన చర్చల నైపుణ్యాలకు నిజమైన పరీక్ష అవుతుంది.

వలసల విషయానికి వస్తే, సంకెళ్లలో బంధించి మరీ, భారతీయ అక్రమ వలసదారులను అమెరికా బహిష్కరిస్తున్న విధానం చాలా మందికి రుచించలేదు. ఇంతవరకూ అనుసరించిన బహిష్కరణ విధానాలు తీవ్రమైన వివాదానికి దారితీశాయి. మన జాతీయులతో అమానుషంగా ప్రవర్తించారనే భావన దేశీయుల్లో ఉంది. విదేశాలలోని మన పౌరులను రక్షించడంలో వైఫల్యంగా దీన్ని అర్థం చేసుకునే ప్రమాదం ఉంది. అంతర్జాతీయంగా తన పౌరులను రక్షించుకోగల సామర్థ్యం స్మార్ట్ పవర్‌లో ఒక భాగం. చట్టపరమైన వలసలను, హెచ్‌-1బీ వీసా సమస్యలను రెండు దేశాలు నిస్సందేహంగా దీటుగా ఎదుర్కోగలవు. కానీ మానవ అక్రమ రవాణా పరిశ్రమను మన ఏజెన్సీలు ఎలా సమర్థంగా అణచివేయగలవనేదే మన సమస్య.

బ్రిక్స్ దేశాలకు ట్రంప్ చేసిన హెచ్చరిక మరొక ఆందోళనను రేకెత్తిస్తోంది. అమెరికన్ డాలర్ శక్తి ఆధారంగా ట్రంప్ ప్రపంచ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. డాలర్ ఆధిపత్యాన్ని నిరోధించే ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థలను బ్రిక్స్ దేశాలు అనుసరిస్తే బ్రిక్స్‌కు మరణశాసనం లిఖిస్తానని ట్రంప్ బెదిరిస్తున్నారు. బ్రిక్స్ సభ్యదేశమైన దక్షిణాఫ్రికా, శ్వేత ఆఫ్రికనర్ మైనారిటీని ప్రభావితం చేసే భూ విధానాల కారణంగా చిక్కుల్లో పడింది. దీనిని ఎలాన్ మస్క్ 'జాత్యహంకార యాజమాన్య చట్టాలు'గా ఎత్తి చూపారు. మస్క్ దక్షిణాఫ్రికాలో తన స్టార్‌లింక్ ప్రాజెక్ట్ కోసం సవాళ్లను కూడా ఎదుర్కొన్నారు. ఫలితంగా దక్షిణాఫ్రికాకు తాను అందించే అన్ని ఆర్థిక సహాయాలనూ అమెరికా నిలిపివేసింది. పైగా జొహాన్నెస్‌బర్గ్‌లో జరగనున్న జీ20 శిఖరాగ్ర సమావేశానికి హాజరు కాకూడదని ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. విధాన 'సూత్రాల'కు నష్టం కలుగుతున్నట్లు కనిపిస్తే దౌత్య సంబంధాలను త్యాగం చేయడానికి కూడా ట్రంప్ సిద్ధంగా ఉన్నారని ఇది చెబుతోంది.

బహుళ ధ్రువ ప్రపంచం

బహుళ ధ్రువ ప్రపంచం గురించి నేడు చాలా చర్చ జరుగుతోంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఒక ఇంటర్వ్యూలో 'ప్రపంచానికి ఏక ధ్రువ శక్తి ఉండటం సాధారణం కాదు' అని అంగీకరించారు. ఇది ఓదార్పునిచ్చే మాటగా అనిపించవచ్చు. కానీ 'అమెరికా ఫస్ట్' అనే ప్రాపంచిక దృక్పథం అమెరికా ప్రాధాన్యం గురించిన అంతర్లీన అంచనాలను కలిగి ఉంది. పైగా బ్రిక్స్‌కు హెచ్చరిక బహుళ పక్ష సమూహాలకు కూడా మేల్కొలుపు కానుంది: గట్టిగా కోరుకుంటే ఉనికిలో ఉండండి, కానీ అమెరికన్ నియమాల ప్రకారం ఆడండి. అందుకే కొందరు ట్రంప్ కొత్త అధ్యక్ష పదవిని తనదైన 'సామ్రాజ్యవాదం' అని పిలుస్తున్నారు.

అమెరికా రక్షణ మంత్రి పీట్ హేగ్సెత్ ఇటీవల మాట్లాడిన 'స్పష్టమైన వ్యూహాత్మక వాస్తవాలు' యూరప్ రక్షణ నుండి అమెరికా వైదొలగుతుందనీ, ఈ బాధ్యతను యూరోపియన్లకు వదిలివేస్తుందనీ సూచిస్తున్నాయి. రష్యా-ఉక్రెయిన్ వివాదంలో శాంతి అంటే రష్యా బలమైన పక్షం అని, ఉక్రెయిన్ 'నాటో'లో భాగం కాలేదని లేదా రష్యా ఆక్రమించిన భూభాగాన్ని తిరిగి పొందాలని అది కోరుకోలేదని ఆయన మాటలు సూచిస్తున్నాయి. విజేత అన్నింటినీ ఆక్రమించగలదని భావించే ప్రపంచంలో ఇజ్రాయెల్ ఛాంపియన్ కాబట్టి పాలస్తీనియన్లు సర్వం కోల్పోయారని పీట్ మాటలు చెబుతున్నాయి. చైనా విషయానికొస్తే, వాణిజ్య పోటీ తీవ్రంగా ఉన్నప్పటికీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌కు ఇతర రంగాలలో సహకారాన్ని విస్తరించడానికి లేదా కనీసం ఆయనతో ఒక నిలకడైన పద్ధతిలో వ్యవహరించడానికి ట్రంప్ సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది. కాబట్టి ప్రస్తుత సందర్భంలో స్నేహితులు, శత్రువులు ఎవరూ లేరు. కేవలం లావాదేవీలు జరపాలి, ఒప్పందాలు కుదుర్చుకోవాలి. భారతదేశం తదనుగుణంగా తన దౌత్య దిక్సూచిని నిర్దేశించుకోవాలి.

వ్యాసకర్త విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి

సోషల్ మీడియా

చూసీ చూడంగానే!



నెట్‌ఫ్లిక్స్ ఉద్యోగులు పని చేస్తున్న సమయంలో ఒకరినొకరు 5 సెకన్ల కంటే ఎక్కువసేపు చూసుకోకూడదన్న నిబంధన ఉంది. అప్పుడైతే అమ్మాయిలు తమ హెచ్.ఆర్.కు ఇలా ఫిర్యాదు చేయవచ్చు: "హి ఈజ్ బింజ్-వాచింగ్ మీ" అని! (వెబ్ సీరీస్‌ని ఎపిసోడ్‌లకు ఎపిసోడ్‌లు విరామం లేకుండా చూసేయటాన్ని బింజ్-వాచింగ్ అంటారు).

- కాజోల్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్

వాళ్లేం తక్కువా?



తమిళనాడులో చాలా పెద్ద మాటలు మాట్లాడుతాం. కానీ శివాజీని మహారాష్ట్ర, పృథ్వీరాజ్ చౌహాన్‌ను రాజస్థాన్ గొప్పచేసి చూపుకొన్నట్టుగా రాజరాజ చోళుడినో, రాజేంద్ర చోళుడినో చూపుకోలేక పోయాం.

- కిశోర్ అయ్యర్, వ్యాఖ్యాత

చేజారిన కాలం



నేను స్టాక్‌హోమ్(స్వీడన్)లో పెరిగిన కాలంలో, మేము కనీసం ఇళ్లకు తాళాలు కూడా వేసుకునేవాళ్లం కాదు. అంత నమ్మకం ఉండేది. కానీ ఇప్పుడు ప్రతిరోజూ బాంబుదాడులు, దొంగతనాలు జరుగుతున్నాయి. ఇది నా గుండెను ముక్కలు చేస్తోంది.

- ఎవెలీనా హానే, స్వీడన్ రాజకీయ నాయకురాలు

అసలు ఆధ్యాత్మికత



ఆధ్యాత్మికత అనేది దాని లౌకిక అవగాహనలో, జీవితానికి ఉన్నత అర్థాన్ని కల్పించే సామర్థ్యం. అది మానవీయ విలువలను కల్పించడంలో, వాటిని హెచ్చవేయడం వల్ల జరుగుతుంది.

- జాఫర్ మీర్జో, రచయిత

భోజనమూ ఆలస్యమేనా!



వందేభారత్ 22416, ఢిల్లీ-ప్రయాగ్‌రాజ్ అసలే మూడు గంటలు ఆలస్యంగా నడుస్తోంది. రాత్రి 11 గంటలకు భోజనం అందజేశారు. చాలామంది మధుమేహ వ్యాధిగ్రస్థులు, వృద్ధులు ఆహారం కోసం ఎదురు చూస్తున్నారు. వారిని ఎవరూ పట్టించుకోలేదు. రైల్వే అధికారులకు, వారి కుటుంబ సభ్యులకు సేవ చేస్తూ సిబ్బంది బిజీగా ఉన్నారు!

- డాక్టర్ దినేష్ పహ్వా, గ్యాస్ట్రో-సర్జన్, ట్రావెలర్

అంతా ప్రేమమయం



ప్రేమను గిఫ్ట్ ప్యాక్‌లలో పెట్టి అమ్ముతున్న ఈ రోజుల్లో - ప్రకృతి ప్రతిరోజూ మనకు ఇచ్చే అపరిమితమైన, అనిర్వచనీయమైన ప్రేమను నేను వేడుకగా జరుపుకుంటాను. ఈ ప్రేమ వెలకట్టలేనిది! మనం పీల్చే స్వచ్ఛమైన గాలి, మన దాహాన్ని తీర్చే తియ్యని నీరు, పాడి-పంట, మనకు ఆనందాన్ని కలిగించే జంతు జాలం... ఇవన్నీ మనకు ప్రేమను అందించేవే!

- దియా మీర్జా, నటి, యు.ఎన్.ఇ.పి. గుడ్‌విల్ అంబాసిడర్

మేళా జాగ్రత్తలు



కుంభమేళా నుంచి యాత్రికులు వైరల్ జ్వరాలు, శ్వాస ఇబ్బందులు, డయేరియాతో తిరిగి వస్తున్నారు. దయచేసి 'బాటిల్డ్' నీళ్లే తాగండి. వండని పదార్థాలను తినొద్దు. ముఖ్యంగా స్నానం చేస్తున్నప్పుడు నీటిని మింగొద్దు.

- జోయితా, ఫిజీషియన్

ఇన్ బాక్స్

రెక్కల రామక్క జాతర

ఆదివాసీ సమాజంలో ఇలవేల్పు జాతరలు అత్యంత ప్రధానమైనవి. ప్రతి ఏడాదీ మాఘ పున్నమి తరువాత తమ తమ కులదేవతలకు జాతరలను జరపడం ఆదివాసీల ఆచారం. ప్రతి తెగలో వంశాలు, ఇంటిపేర్లు బట్టి కులదేవతలు ఉంటారు. కోయ తెగవారిలో ఉన్న వంశాలను 'గొట్టు'గా పిలుస్తారు. బేరంబోయిన వంశానికి చెందిన వారిది ఈ గొట్లలో ఒకటి. ఈ వంశానికి చెందిన కొమరం ఇంటి పేరు ఉన్న వారి ఇలవేల్పు 'రెక్కల రామక్క.' వీరు రెండేళ్లకొక మారు ఆమెకు జాతర జరపడం తరతరాలుగా వస్తోంది. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా, ఆళ్లపల్లి మండలం, నడిమి గూడెంలో ఈ జాతర జరుగుతుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 18 నుండి 21 వరకు జాతర జరుగుతోంది.



ప్రచారంలో ఉన్న కథ ప్రకారం-బేరంబోయిన రాజు కోయల్లో గొట్టు - గోత్రాల వ్యవస్థ ఏర్పాటు చేశారని నమ్ముతారు. ఈ రాజునే కార్తీక రాజు అంటారు. ఆయన భార్య మూడవ గట్టుకు చెందిన కాకెర పూజారి గోత్రం ఆడబిడ్డ వరందేవి. ఈమెనే ఆదిశక్తిగా కూడా పిలుస్తారు. రెక్కల రామక్క(పక్షి) రూపంలో బేరంబోయినవారు ఈమెను కొలుస్తున్నారు. జాతర సందర్భంగా ఈమెకు బోనం సమర్పిస్తారు. అలాగే ఈ దేవతకు (వంశానికి) సంబంధించిన 'పడిగ' జాతరలో ప్రత్యేక ఆకర్షణ. పడిగపై చిత్రలిపి ఉంటుంది. పడిగ అంటే కోయ తూర్ సమాజంలో 'ఇంటికి పెద్ద కొడుకు' అని అర్థం. అంటే కుటుంబాన్ని రక్షించేవాడు. మధ్య భారతంలోని కోయతూర్ సమాజం పడిగలను అతి పవిత్రంగా పూజిస్తూ వేల్పుగా కొలుస్తారు. ఈ పడిగ త్రిభుజ ఆకారంలో ఉండే ఎర్రని గుడ్డ. దీనిపై బొమ్మలు ఉంటాయి. జాతరకు వచ్చే వంశస్థులు తమ పడిగను తీసుకు వస్తారు. అక్కడ 'డోలి'వారు వారిని కూర్చోబెట్టి పడిగలోని చిత్రలిపిని చూపి రేల పాటలతో ఆ వంశ చరిత్రను మొత్తం చెబుతారు. జాతర్లలలో పడిగలకు పసుపు, కుంకుమలు రాసి, కొబ్బరికాయలు కొట్టి పూజలు చేస్తారు. జాతర అయిపోయినాక ఈ పడిగలను తీసుకెళ్ళి అతి పవిత్రంగా దాచి... మరలా రెండేళ్ళకు జాతర నాడు మాత్రమే పూజలు చేసి బయటకు తీసి ఆడిస్తారు.

- వూకె రామకృష్ణ దొర, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
(ఫిబ్రవరి 18 నుంచి 21 వరకు రెక్కల రామక్క జాతర)

ఇచ్చిన మాట ప్రకారం నీరివ్వండి!

అభిప్రాయం



నైనాల గోవర్ధన్

ప్రణాళికా సంఘం నివేదిక ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్ దేశంలోనే అత్యంత వెనుకబడ్డ జిల్లా. స్వతంత్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు అవుతున్నా ఈ జిల్లా పరిస్థితి దాదాపు ఏమీ మారలేదనే చెప్పాలి. ఉమ్మడి జిల్లా నలుదిక్కులా అనేక నదులు ఉపనదులూ ప్రవహిస్తున్నా వ్యవసాయం ఇప్పటికీ వర్షాధారంగానో లేదా భూగర్భ జలాలపైనో ఆధారపడి సాగుతోంది.

ఆదిలాబాద్ జిల్లాకు పెద్ద ఎత్తున సాగునీటిని అందించడానికి 'ప్రాణహిత- తుమ్మిడి హెట్టి' ప్రాజెక్టుకు వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 2008లో శంకుస్థాపన చేసింది. దానికి 'బీఆర్ అంబేడ్కర్ ప్రాజెక్టు'గా నామకరణం చేసింది. ప్రాణహిత నుండి ఎల్లంపల్లి వరకు 116 కి.మీ. కాలువ నిర్మాణానికి జిల్లాలో 1700 కోట్లు ఖర్చు చేసింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వం. 38 వేల కోట్లు అయ్యే మొత్తం ప్రాజెక్టుకు, ఆనాడే 9 వేల కోట్లు ఖర్చు చేశారు. 2014లో బీ(టీ)ఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. నీరు లేదనే కుంటి సాకు చూపి, రీ ఇంజనీరింగ్, రీ డిజైనింగ్ పేరిట (కాళేశ్వరం) మేడిగడ్డకు ప్రాజెక్టును మార్చారు. అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు నిర్మించారు. బడ్జెట్‌ను లక్ష యాభైవేల కోట్లకు పెంచారు.

కాళేశ్వరం ప్రాజెక్టును 2019లో ముగ్గురు మంత్రులు ముచ్చటగా ప్రారంభించారు. నాలుగేళ్లలోపే ఏడవ బ్లాకులోని అనేక గేట్లు, ఐదు అడుగుల లోతుకు పైగా కుంగిపోయాయి. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలో పునాది అడుగున కూడా భారీ లీకేజీలు, సీపేజీలు ఏర్పడ్డాయి. ఢిల్లీ నుంచి వచ్చిన 'డ్యామ్ సేఫ్టీ అథారిటీ' అత్యున్నత స్థాయి ఇంజనీర్ల బృందం పరిశీలించింది. నీరు నిలువ ఉంచడం ప్రమాదమని, అత్యవసరంగా అన్ని బ్యారేజీలలోని నీటిని బయటికి పంపాలని నాటి ప్రభుత్వాన్ని కోరింది. డ్యామ్ సేఫ్టీ అథారిటీ మధ్యంతర నివేదికలో కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ఘోరమైన తప్పులు చేసిందని నిర్ధారించింది. ఈ నివేదిక ప్రకారం: పునాదికి సంబంధించిన భూగర్భ పరీక్షలు



ఏమాత్రం చేయలేదు. బలహీనమైన పునాదులపై బ్యారేజీలు నిర్మించింది. బ్యారేజీలలో వచ్చిన నీరు వచ్చినట్టు కాలువకు వెళ్లాలి. ఎక్కువైన నీరు నదిలోకి వెళ్లాలి. కానీ బలహీన పునాదులపై నిర్మించిన బ్యారేజీలలో, ప్రాజెక్టుల వలె భారీ ఎత్తున నీటిని నిలువ చేశారు. బ్యారేజీలను డ్యాముల వలె నిర్వహించారు. ఆ భారీనీటి నిలువ ఒత్తిడి, తాకిడికి పునాదులు భారీగా దెబ్బతిన్నాయి. కేవలం నాలుగు మీటర్ల పునాది క్రింద ఉన్న అడుగు పొరల్లోని ఇసుకంతా భారీ ఎత్తున కొట్టుకుపోయింది. స్పిల్‌వే నిట్టనిలువుగా పునాది నుండి మూడు ఫీట్ల వెడల్పుతో చీలిపోయి, రెండు చెక్కలయ్యింది. భూమిలో కుంగిపోయింది.

మేడిగడ్డ వలెనే సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు ఎప్పుడైనా భూమిలో కుంగిపోవచ్చు. నాడు భూమిలో కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజ్‌ను రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలు నిశితంగా పరిశీలించి దీని నిర్మాణంలో చోటుచేసుకున్న అవినీతిపై విచారణ కమిషన్ వేసి సొమ్ము రికవరీ చేసి శిక్షిస్తామని ప్రకటించారు. ప్రత్యామ్నాయంగా ప్రాణహిత తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును నిర్మించి తెలంగాణ అంతటికీ సాగునీరు ఇస్తామని గత అసెంబ్లీ ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా, ప్రాజెక్టును ప్రస్తావించడం లేదు. యుద్ధప్రాతిపదికన నిధులు కేటాయించి నిర్మాణం ప్రారంభించవలసిందిగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం కాళేశ్వరం(మేడిగడ్డ) ప్రాజెక్టులో సీఎం కేసీఆర్ అవినీతిపై కాంగ్రెస్ వేసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి 'పినాకీ చంద్రఘోష్ కమిషన్' విచారణ జరుపుతోంది.

నేటి రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రి వారివారి నియోజకవర్గాల్లో, కొత్త ప్రాజెక్టులకు భారీ ఎత్తున నిధులు వెచ్చించి శరవేగంతో నిర్మిస్తున్నారు. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న ప్రాణహిత - తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన కడెం ఆయకట్టును సస్యశ్యామలం చేసే 'కుప్టి ప్రాజెక్టు'కు నిధుల కేటాయింపు కానీ, దాని కనీస ప్రస్తావన కానీ లేదు.

కుంటాల జలపాతం ఎగువన ఉన్న, కుప్టి ప్రాజెక్టుతో కడెం ఆయకట్టు చివరి వరకు గూడెం ఎత్తిపోతలు లేకుండానే పూర్తిగా రెండు పంటలకు సాగునీరు ఇవ్వవచ్చు. కడెం ఆయకట్టు సస్యశ్యామలం అవుతుంది. చెన్నూరు- ప్రాణహిత వరకు, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని బీడు భూములకు సంపూర్ణ గ్రావిటీతో సాగునీరు అందుతుంది. 'నెహ్రూ ఉత్తర కాలువ' లేదా 'మందాకిని ఎన్టీఆర్ కాలువ' సాగునీటి కలలు పూర్తిగా నిజం అవుతాయి. ఎల్లంపల్లికి వచ్చే ప్రాణహిత కాలువ, కడెం (నెహ్రూ ఉత్తర లేదా మందాకిని) కాలువ ఎక్స్ (X) ఆకారంలో క్రాస్ అవుతూ వెళ్తాయి. బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల బీడు భూములకు అవసరమయ్యే నీటిని ప్రాణహిత ద్వారా, కడెం కాలువకు అనుసంధానించడానికి ఒక అద్భుతమైన అవకాశం ఉంది. ఈ ఉత్తర కాలువకు... శ్రీరాంసాగర్ నీటినీ, సదర్మాట్ నీటినీ, ఎల్లంపల్లి నీటినీ పూర్తి గ్రావిటీతో అనుసంధానం చేయవచ్చు. కుప్టి ప్రాజెక్టు సముద్రమట్టానికి 1450 అడుగుల ఎత్తులో ఉంటుంది. కడెం ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం ఎత్తు 700 అడుగులు. అంటే కడెం కంటే 750 అడుగుల ఎత్తులో కుప్టి ప్రాజెక్టు బెడ్ లెవెల్ ఉంటుంది. కడెంకు కుప్టికి మధ్య ఉన్న దూరం కేవలం 30 కి. మీ. మాత్రమే. 750 అడుగుల ఈ వ్యత్యాసపు ఎత్తు అనేది, నీటిపారుదల పరిభాషలో భారీ ఎత్తుగానే పరిగణిస్తారు. కాలుష్యం లేని జల విద్యుత్తుకు, ఎత్తి పోతలు అసలే లేని గ్రావిటీ సాగుకు అత్యద్భుతమైన అరుదైన ప్రాకృతిక అనుకూలత! జల విద్యుత్తు భారీ ఎత్తున ఉత్పత్తి అవుతుంది. కుప్టితో కుంటాల జలపాతం సంవత్సరం అంతా నీరు ఎత్తిపోస్తూ, తెలంగాణలోనే అతి పెద్ద పర్యాటక కేంద్రంగా భారీ ఆదాయంతో కళకళలాడుతుంది. నేరేడిగొండ, ఇచ్చోడ ప్రాంతపు బీడు భూములకు ఎత్తిపోతలతో సాగునీరు ఇవ్వవచ్చు.

వ్యాసకర్త తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్
మొబైల్: 97013 81799

క్లుప్తంగా...

నేటి నుంచి శ్రీశైలంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం నుంచి 11రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం 9గంటలకు యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాల క్రతువులు ప్రారంభమవు తాయి. సాయంత్రం సకల దేవతాహ్వాన పూర్వక ధ్వజారోహణ, ధ్వజపట ఆవిష్కరణ నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. రోజూ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు వివిధ వాహనసేవలు నిర్వహిస్తారు. ఉత్సవాల ప్రారంభం రోజు సాయంత్రం శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం వారు స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

పరీక్ష పెడితే ఆత్మగౌరవాన్ని అవమానించడమే

రెవెన్యూ మంత్రికి వీఆర్వో జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో)ను ఎలాంటి షరతుల్లేకుండా రెవెన్యూ వ్యవస్థలోకి విలీనం చేసుకోవాలని తెలంగాణ వీఆర్వోల జేఏసీ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్ ఆధ్వర్యంలో జేఏసీ నేతలు రెవెన్యూ మంత్రిని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 'పరీక్ష పెట్టి మమ్మల్ని రెవెన్యూలోకి తీసుకోవాలన్న ఆలోచన సరైంది కాదు. అలా చేయడం మా ఆత్మగౌరవాన్ని అవమానించడమే. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ రెవెన్యూ వ్యవస్థను మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే పునరుద్ధరించాలి'అని ఈ సందర్భంగా జేఏసీ నేతలు మంత్రిని కోరారు. చట్టాలు తయారు చేసే అధికారాలు తమకు లేవని, కనీసం పాస్‌పుస్తకం ఇచ్చే అధికారం కూడా లేని తాము కేవలం విచారణకు మాత్రమే పరిమితమవుతామని, ఈ నేపథ్యంలో గత అనుభవం దృష్ట్యా యథావిధిగా తమను రెవెన్యూలోకి తీసుకోవాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని సతీశ్ చెప్పారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలి

ఖమ్మం అర్బన్: ఆన్‌లైన్‌లో బెట్టింగ్ గేమ్స్ ఆడి అప్పుల పాలై... వేధింపులు పెరగడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్‌కు చెందిన అజీజుద్దీన్ (29) హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం (వర్క్ ఫ్రం హోమ్) చేస్తున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. గతంలో రూ.5 లక్షలు నష్టపోతే ఆయన తండ్రి మోహినుద్దీన్ మందలించి డబ్బు చెల్లించాడు. ఆరు నెలల కిందట మరోసారి బెట్టింగ్‌కు పాల్పడినట్లు తెలియడంతో తల్లిదండ్రులు రోటరీనగర్‌కు మకాం మార్చారు. ఈక్రమంలోనే అజీజుద్దీన్ మళ్లీ ఆన్‌లైన్‌లో బెట్టింగ్ కాస్తూ రూ.20 లక్షలు నష్టపోయాడు. ఈ అప్పుల విషయమై వేధింపులు పెరగడంతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై మోహినుద్దీన్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కొమరయ్యకు ఎస్సీ, ఎస్టీ సంఘాల మద్దతు

సాక్షి, హైదరాబాద్: టీచర్స్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న మల్క కొమరయ్యకు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిమల్ల చిట్టిబాబు మద్దతు ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ టీచర్లకు ప్రమోషన్లు ఇప్పించడం, ఎస్సీల రిజర్వేషన్లు 18 శాతం పెంచేందుకు కృషి చేయడం, ఎస్సీ, ఎస్టీలకు అన్ని కేడర్లలో ఎస్సీలు 18 శాతం, ఎస్టీలు 10 శాతం ఉండేలా బ్యాక్‌లాగ్ ప్రమోషన్లు ఇప్పించడం, ఎమ్మెల్సీ నిధులను ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి వెచ్చించడం, జీవో నం.342 ప్రకారం ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తానని కొమరయ్య ఇచ్చిన హామీతో ఆయనకు మద్దతిస్తున్నట్టు తెలిపారు. టీటీయూ కూడా మద్దతు ప్రకటించింది.

ముస్లిం బుజ్జగింపులు తారస్థాయికి చేరాయి

'రంజాన్'లో తెలంగాణలో ముస్లింలకు పనివేళల తగ్గింపుపై వీహెచ్‌పీ ఆగ్రహం

సాక్షి, న్యూఢిల్లీ: ముస్లింలను బుజ్జగించే ప్రక్రియ తెలంగాణలో తారస్థాయికి చేరిందని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) మండిపడింది. రంజాన్ మాసంలో ముస్లింల పనివేళను ఒక గంటపాటు మినహాయింపు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు మంగళవారం వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి వినోద్ బన్సల్ మీడియాకు వీడియో సందేశంతోపాటు.. 'ఎక్స్'లో ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను పోస్ట్ చేస్తూ విమర్శించారు. 'మార్చి 2 నుంచి 31వ తేదీ వరకు రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులు ఒక గంట ముందుగానే ఆఫీస్‌ల నుంచి వెళ్లొచ్చని తెలంగాణ ప్రభుత్వం చెప్పింది. ప్రభుత్వ ముస్లిం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు బోర్డులు, కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ ఉద్యోగులకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. హజ్ యాత్రికుల కోసం డబ్బు ఖర్చు చేస్తుంది కానీ.. నవరాత్రి ఉత్సవాలు, దుర్గాపూజ, కర్వా చౌత్, 144 ఏళ్ల తర్వాత వచ్చిన మహాకుంభ మేళాకు రాష్ట్రం నుంచి వెళ్లే భక్తుల కోసం ఎప్పుడైనా సౌకర్యాలతో కూడిన ఒక్క శిబిరాన్నైనా ఏర్పాటు చేశారా? కాంగ్రెస్ ప్రభుత్వం విభజన ఆలోచనలు మానుకోవాలి. రాష్ట్ర పౌరులను మత ప్రాతిపదికన విభజించడం రాజ్యాంగ విరుద్ధం' అని పేర్కొన్నారు.



లింగమంతుల స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పూజారులు

వైభవంగా లింగమంతులస్వామి కల్యాణం

పెద్దగట్టుకు మూడో రోజూ పోటెత్తిన భక్తజనం

సూర్యాపేట: తెలంగాణలో రెండవ అతిపెద్ద జాతర లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరకు మూడోరోజు మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. మూడోరోజు కార్యక్రమంలో భాగంగా చంద్రపట్నం వేసి భక్తిశ్రద్ధలతో లింగమంతుల స్వామి, మాణిక్యమ్మల కల్యాణ తంతును కనులపండువగా నిర్వహించారు. యాదవ పూజారులు కల్యాణాన్ని జరిపించారు. చంద్రపట్నంపై లింగమంతుల స్వామివారు ఉన్న పెట్టెను ఉంచి పూజలు చేశారు. చంద్రపట్నం ముందు బైకానులు బియ్యంతో పోలుపోసి తమలపాకులు, పోకలు, ఖర్జూరాలు ఉంచి స్వామివారి కథలతో కల్యాణం నిర్వహించారు. జాతరకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్, కంచర్ల భూపాల్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు.

ఆధ్యాత్మిక పర్యాటకం.. ఆనందమయం





ప్రపంచ వ్యాప్తంగా పెరగనున్న ఆధ్యాత్మిక పర్యటనలు

- 2025 - 2032 మధ్య ఆధ్యాత్మిక యాత్రలో పర్యాటక మార్కెట్ గణనీయమైన వృద్ధి
- ఆధ్యాత్మిక అభ్యాసాలను శారీరక-మానసిక శ్రేయస్సుతో మిళితం చేసే వెల్‌నెస్ టూరిజంకు డిమాండ్
- భారతదేశం, సౌదీ అరేబియా, యూఏఈ, ఇజ్రాయెల్, ఈజిప్ట్, స్పెయిన్‌లు ఆధ్యాత్మిక పర్యటనకు కేంద్ర బిందువులు
- ట్రావెల్ అండ్ టూరిజం వరల్డ్ నివేదిక వెల్లడి

ప్రపంచం ఆధ్యాత్మికతను స్మరిస్తోంది. మానసిక చింతన, ప్రశాంత జీవనం కోసం వెతుకుతోంది. హాలిడే ట్రిప్పుల్లోని సంతోషాన్ని ఆధ్యాత్మిక పరవశ పర్యటనలుగా మారుస్తోంది. ఈ క్రమంలోనే 2025లో అంచనా వేసిన ఆధ్యాత్మిక మార్కెట్ విలువ 1,378.22 బిలియన్ డాలర్ల నుంచి 2032 నాటికి 2,260.43 బిలియన్ డాలర్లకు చేరుకోనుందని 'ట్రావెల్ టూరిజం వరల్డ్' నివేదిక పేర్కొంది. ఆధ్యాత్మిక పర్యాటకం సగటున 6.5శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేయనుంది. **–సాక్షి, అమరావతి**

విశ్వాసమే నడిపిస్తోంది..

ఆర్థిక వ్యవస్థల్లో మార్పులు వ్యక్తిగత సంపద పెరిగేకొద్దీ, ఎక్కువ మంది ప్రజలు తీర్థయాత్రలు, ఆధ్యాత్మిక పండుగలపై ఆసక్తి చూపిస్తున్నారు. సాంకేతికత సాయంతో ముందుగా వర్చువల్ టూర్లు చేసిన తర్వాత పర్యటనలను ఖరారు చేసుకుంటున్నారు. ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, భారతదేశం, ఇటలీ వంటి దేశాలు చాలా కాలంగా ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. ఈ ప్రాంతాల్లోని లోతైన విశ్వాసం, సంస్కృతితో ముడిపడి ఉన్న అనుభవాలను కోరుకునే సందర్శకుల సంఖ్యను పెంచుతున్నాయి. ఈ ధోరణి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రయాణికుల ఆధ్యాత్మిక అవసరాలు, ప్రాధాన్యతలను తీర్చే ప్రత్యేక పర్యటనలను అందించడానికి ట్రావెల్ ఏజెన్సీలకు అవకాశాన్ని అందిస్తుంది.

ఆధ్యాత్మికతలో ఆనందం..

ఆధ్యాత్మిక పర్యటనలు శారీరక-మానసిక శ్రేయస్సుతో మిళితం చేసే వెల్‌నెస్ టూరిజంగా మారుతోంది. ధ్యానం, యోగాపై దృష్టి సారించే విహార యాత్రలు ఆరోగ్య, ఆధ్యాత్మిక సంతృప్తిని అందిస్తున్నాయి. యూఎస్, కెనడా వంటి దేశాల్లో స్థానిక ఆధ్యాత్మిక పర్యాటకం పెరుగుతోంది. వాషింగ్టన్ డీసీలోని బసిలికా ఆఫ్ ది నేషనల్ ష్రైన్ ఆఫ్ ది ఇమ్మాక్యులేట్ కాన్సెప్షన్ (క్యాథలిక్ చర్చి)కు తాకిడి పెరుగుతోంది. యూరప్‌లోని స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్ వంటి దేశాలు యూరోపియన్ నాగరికతను అన్వేషించడానికి మైలురాళ్లుగా పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఆసియా-పసిఫిక్‌లో అయితే భారతదేశంలో దేవాలయాలు, పీఠాలు, చర్చిలు, మసీదులను దర్శించుకునే వారు పెరుగుతున్నారు. అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయం, చైనా-జపాన్ దేశాల్లో బౌద్ధారామాలు వంటి పవిత్ర స్థలాలను లక్షలాది మంది సందర్శిస్తున్నారు. మధ్యప్రాచ్యం-ఆఫ్రికాలో అయితే సౌదీ అరేబియా, ఈజిప్ట్, ఇజ్రాయెల్ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. ముఖ్యంగా మక్కా, జెరూసలేం తీర్థయాత్రలు ఎక్కువ ఉంటాయి.

కోతుల నుంచి పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్



- పథకాన్ని అమలుచేయాలని అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- హైదరాబాద్‌కు 100 కి.మీ. పరిధిలో కూరగాయల సాగుకు ప్రాధాన్యత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కోతులు, ఇతర అడవి జంతువుల వల్ల ఉద్యాన పంటలకు జరుగుతున్న నష్టాన్ని నివారించేందుకు సోలార్ ఫెన్సింగ్ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఉద్యానశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే సోలార్ ఫెన్సింగ్ స్కీం అమలవుతున్న హిమాచల్ ప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో పర్యటించి, సోలార్ ఫెన్సింగ్‌ను రైతులకు రాయితీతో అందించే పథకానికి విధివిధానాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ కోసం దరఖాస్తులను స్వీకరించి, అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. హైదరాబాద్ నగరానికి 100 కి.మీ. పరిధిలో అవకాశం ఉన్న అన్ని ప్రాంతాల్లో కూరగాయల సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకోసం అర్బన్ క్లస్టర్లను ఏర్పాటుచేసి, ప్రోత్సాహకాలు ఇవ్వాలని చెప్పారు. మార్చి ఆఖరు కల్లా ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోని కంపెనీల అనుమతులు రద్దు చేయాలని అధికారులను తుమ్మల ఆదేశించారు. ఇప్పటికే విశ్వతేజ ఆయిల్‌పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేసి, హిందుస్తాన్ యూనిలీవర్ కంపెనీకి సదరు ప్రాంతాన్ని అప్పగించినట్లు చెప్పారు. ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామంలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ కర్మాగారాన్ని మే నెలాఖరుకల్లా.. బీచుపల్లి, కల్లూరిగూడెంలో కర్మాగారాల నిర్మాణాలను డిసెంబర్ కల్లా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

తరిగొప్పుల/ చింతకాని: వేర్వేరు జిల్లాల్లో అప్పుల బాధ భరించలేక ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.



బుచ్చయ్య (ఫైల్)

- జనగామ జిల్లా తరిగొప్పుల మండలం సోలిపూర్ గ్రామానికి చెందిన పాండ్యాల బుచ్చయ్య(52)కు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఇద్దరు కూతుళ్ల పెళ్లి చేశాడు. పెళ్లిళ్లు, వ్యవసాయానికి రూ.10 లక్షలు అప్పుచేశాడు. పంట దిగుబడి రాక, అప్పులు తీర్చేమార్గం లేక సోమవారం పొలం వద్దకు వెళ్లి గడ్డిమందు తాగాడు. భార్యకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వెంటనే బుచ్చయ్యను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు.
- ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడేనికి చెందిన ఎల్లయ్య(45) మూడెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. ఇవి సాగర్ ఆయకట్టు చివరి భూములు కావడంతో వారబందీ విధానంతో నీరందకపోవడం, భూగర్భ జలాలు తగ్గి బావిలో నీరు లేక పొలం ఎండుతోంది. దీంతో ఎల్లయ్య మనస్తాపానికి గురై మంగళవారం పొలం వద్దే పురుగుల మందు తాగాడు. కొద్దిసేపటి తర్వాత ఆయన భార్య నర్సమ్మ పొలం వద్దకు రాగా విగతజీవిగా పడి ఉన్న భర్తను చూసి 108కు సమాచారం ఇచ్చింది. వారు వచ్చి చూసి చనిపోయాడని చెప్పారు.



ఎల్లయ్య మృతదేహం

రెండు హత్య కేసుల్లో 23 మందికి జీవిత ఖైదు

నల్లగొండ జిల్లా కోర్టు తీర్పు

రామగిరి (నల్లగొండ)/ అడ్డగూడూరు: రెండు వేర్వేరు హత్య కేసుల్లో మంగళవారం 23 మందికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం అజీంపేట గ్రామానికి చెందిన పండుగ రాజమల్లు మృతికి కారకుడైన అదే గ్రామానికి చెందిన భట్టు లింగయ్య జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడు. 2017లో రాజమల్లు కుటుంబ సభ్యులు 18 మంది భట్టు లింగయ్యపై దాడి చేసి హత్య చేశారు. లింగయ్య కుమారుడు వెంకన్న ఫిర్యాదు మేరకు పండుగ రామస్వామి, పండుగ సాయిలు, పండుగ రాములు, పండుగ మల్లేష్, బండగొర్ల వలరాజ్, పండుగ యాదయ్య, జక్కుల రమేష్, పండుగ శ్రీకాంత్, పండుగ సతీష్, పండుగ నర్సయ్య, బండగొర్ల నాగమ్మ, పండుగ శ్రీను, పండుగ మల్లయ్య, పండుగ లింగయ్య, జక్కుల లచ్చయ్య, జక్కుల భిక్షమయ్య, పోలేబోయిన లింగయ్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు మూడో అదనపు జడ్జి రోజారమణి 18మందికి జీవిత ఖైదుతో పాటు రూ.6 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

మరో హత్య కేసులో ఐదుగురికి..

నల్లగొండలో జరిగిన హత్య కేసుకు సంబంధించి ఐదుగురికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ఫ్యామిలీ కోర్టు మూడో అదనపు జడ్జి డి. దుర్గాప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారు. నల్లగొండకు చెందిన సామ స్వాతికి దుబ్బ ప్రదీప్‌తో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. స్వాతి తన భర్త కేశవులును ప్రియుడు ప్రదీప్‌తోపాటు అతడి స్నేహితులు కొడిదేటి శివకుమార్, కుంభం ప్రసాద్, చింతపల్లి నగేష్ సహాయంతో 2019లో హత్య చేసింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి డి.దుర్గాప్రసాద్ స్వాతితోపాటు మిగతా నలుగురికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు.

వెంటపడిన కోతులు.. బావిలో పడి రైతు మృతి



వెంకన్న (ఫైల్)

నెక్కొండ: పంటకు కాపలాగా ఉన్న ఓ రైతును కోతులు వెంబడించాయి. వాటి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఆయన వ్యవసాయబావిలో పడి చనిపోయాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం మడిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ చెప్పిన వివరాల ప్రకారం.. మడిపల్లి శివారు తేజావత్‌తండాకు చెందిన తేజావత్ వెంకన్న (38) వానాకాలం పంటగా రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. పంట దిగుబడి సరిగ్గా రాక పోవడంతో ప్రత్యామ్నాయ పంటగా, అందులో మొక్కజొన్న సాగు చేశాడు. కోతుల బెడదతో పంటనష్టం జరుగుతుందని, మంగళవారం ఉదయం పంటకు కాపలాకు వెళ్లాడు. చేనులోకి కోతుల గుంపు రాగా, వెంకన్న వాటిని తరిమేందుకు ఉపక్రమించాడు. దీంతో కోతుల గుంపు ఒక్కసారిగా దాడికి యత్నించగా, ప్రాణ భయంతో పరుగెత్తసాగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి, నీట మునిగి వెంకన్న మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

140 మంది భారతీయులను విడిపిస్తాం

మయన్మార్ దౌత్య కార్యాలయ కాన్సులర్ ఆర్‌సీ యాదవ్

- కేంద్రమంత్రి బండి సంజయ్ జోక్యంతో మార్గం సుగమం
- ఈ ఘటనపై సాక్షి వరుస కథనాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉపాధి పేరుతో బ్యాంకాక్ వెళ్లి అక్రమంగా మయన్మార్‌లో చిక్కుకుపోయిన 140 మంది భారతీయ యువకుల కుటుంబాలకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఈ విషయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ జోక్యంతో విదేశాంగశాఖ స్పందించింది. బందీలను విడిపించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అక్రమంగా సైబర్ కేఫ్‌ల నిర్వహణ, అక్కడ యువకులను నిర్బంధించడం, హింసించడం వంటి ప్రతికూల చర్యలతో మయన్మార్‌పై అంతర్జాతీయంగా ఒత్తిడి పెరిగింది.

మాయ్ సాట్ ద్వారా ఇండియాకు..

అంతర్జాతీయంగా వస్తున్న ఒత్తిళ్లతో మయన్మార్ అధికారులు భారత దౌత్య కార్యాలయానికి సహకరించే సూచనలు కనిపిస్తున్నాయి. ఈలోపు బాధితులను ఇండియాకు పంపించేందుకు దౌత్య కార్యాలయం కూడా రోడ్‌మ్యాప్ రూపొందించుకునే పనిలో ఉంది. వాస్తవానికి వీరిని బ్యాంకాక్ నుంచి దాదాపు 505 కి.మీ.ల దూరంలో ఉన్న మయన్మార్‌లోని మైవాడీ జిల్లాకు బలవంతంగా తరలించారు. తిరిగి వీరిని బ్యాంకాక్ కాకుండా.. మైవాడీలోని మోయే నది దాటి కేవలం 11 కి.మీ.ల దూరంలో ఉన్న థాయ్‌లాండ్‌లోని మాయ్‌సాట్ ప్రావిన్స్ ద్వారా ఇండియాకు రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం భారత యువకులంతా మైవాడీలోని కేకే2 పార్క్‌లో బందీలుగా ఉన్నారు.



మైవాడీలో భవనంలో సమావేశమైన భారతీయ యువకులు

'సాక్షి'కి మెయిల్

మయన్మార్‌లోని మైవాడీ జిల్లాలో భారతీయ యువకులు చిక్కుకున్న విషయమై 'సాక్షి'దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ విషయమై సాక్షి మయన్మార్ రాజధాని యంగాన్‌లోని దౌత్య కార్యాలయాన్ని సంప్రదించింది. బాధితుల పాస్‌పోర్టులు పంపి వారిని కాపాడాలని కోరింది. దీనిపై సానుకూలంగా స్పందించిన దౌత్య కార్యాలయం కాన్సులర్ ఆర్‌సీ యాదవ్ బందీల విడుదలకు చర్యలు తీసుకుంటున్నామని మంగళవారం 'సాక్షి'కి మెయిల్ ద్వారా విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు స్థానిక అధికారులతో చర్చలు మొదలుపెట్టామని తెలిపారు.

'మహా కుంభాభిషేక సంప్రోక్షణ'కు గుట్ట ముస్తాబు

నేటి నుంచి ఉత్సవాలు



మహాకుంభాభిషేక సంప్రోక్షణ వేడుకకు సిద్ధమవుతున్న స్వర్ణ విమాన గోపురం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ దివ్య విమాన గోపురం స్వర్ణ మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి ముస్తాబైంది. ఇప్పటికే కొండపై ఉన్న ఉత్తర మాఢవీధిలో పంచకుండాత్మక యాగం నిర్వహించేందుకు పర్ణశాలలను అద్భుతంగా తీర్చిదిద్దారు. వానమామలై మఠం 31వ పీఠాధిపతి శ్రీ మధురకవి రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో 108 మంది రుత్వికులచే యాగం జరగనుంది. గర్భాలయంపై 49.5 అడుగుల ఎత్తు, 10,857 చదరపు అడుగుల విస్తీర్ణంలో విమాన గోపురానికి 68 కిలోల బంగారంతో తాపడం పనులు పూర్తి చేశారు. 23వ తేదీన ఉదయం 11.54 గంటలకు గంగ, యమున, సరస్వతి, కృష్ణా, గోదావరి, తుంగభద్ర, నర్మదతో పాటు ఇతర నదులు, సముద్రాల నుంచి తీసుకొచ్చిన జలాలకు పంచకుండాత్మక యాగంలో ప్రత్యేక పూజలు చేసి దివ్య విమాన స్వర్ణ గోపురానికి కుంభాభిషేక సంప్రోక్షణ చేసి శ్రీస్వామి వారికి అంకితం ఇవ్వనున్నట్టు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీకి సమృద్ధిగా నిధులు

- వైద్య, ఆరోగ్య శాఖకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం: డిప్యూటీ సీఎం భట్టి
- ప్రీ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న మంత్రి రాజనర్సింహ





సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌లో వైద్య, ఆరోగ్య శాఖకు నిధుల కేటాయింపులో అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. మంగళవారం సచివాలయంలో జరిగిన వైద్య, ఆరోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. రానున్న బడ్జెట్లో సమృద్ధిగా నిధులు కేటాయించి, పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. గత దశాబ్ద కాలంగా డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ, మెడికల్ ఎడ్యుకేషన్ విభాగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రులు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ మూడు విభాగాలకు ప్రాధాన్యత ఇచ్చి బలోపేతం చేస్తామని తెలిపారు. డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ విభాగాలను ఆధునీకరించనున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది కాలంలో రాష్ట్రంలో వైద్య కళాశాల భవనాలు, ఆసుపత్రుల నిర్మాణం పనులు పూర్తవుతాయన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలను పెద్ద సంఖ్యలో వినియోగించుకునేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్లానిటోరియం నిర్మించే ఆలోచన ఉన్నట్టు తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వైద్య,ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా చోంగ్తూ, సైన్స్ అండ్ టెక్నాలజీ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి హరిత పాల్గొన్నారు.

వాదనలు వినిపిస్తూనే.. ఆగిన గుండె

హైకోర్టు హాల్లో న్యాయవాది వేణుగోపాలరావు మృతి



వేణుగోపాలరావు

సాక్షి, హైదరాబాద్: హైకోర్టులో వాదనలు వినిపిస్తూ న్యాయవాది పసునూరు వేణుగోపాలరావు (66) గుండెపోటుతో మృతిచెందారు. అప్పటివరకు తమతో కలిసి మాట్లాడిన న్యాయవాది మరణించడం ఉన్నత న్యాయస్థానంలోని ఇతర న్యాయవాదులను విషాదంలో నింపింది. మంగళవారం న్యాయవాది వేణుగోపాలరావు ఓ కేసు విషయంలో 21వ కోర్టు హాల్లో న్యాయమూర్తి ముందు వాదనలు వినిపిస్తున్నారు. అంతలోనే ఒక్కసారిగా కుప్పకూలారు. దీంతో హాల్లో ఉన్నవారంతా షాక్‌కు గురయ్యారు. వెంటనే ఇతర న్యాయవాదులు ఆయనను పైకి లేపే ప్రయత్నం చేసినా.. ఎటువంటి చలనం కానరాలేదు. దీంతో వెంటనే ఆయన్ను అంబులెన్స్‌లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే వేణుగోపాలరావు గుండెపోటుతో చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. 21వ కోర్టు హాల్లో న్యాయవాది మృతి చెందడంతో న్యాయమూర్తి పిటిషన్ల విచారణ నిలిపివేశారు. మిగతా కోర్టుల్లోనూ అత్యవసర పిటిషన్లు, పాస్ ఓవర్ పిటిషన్లను విచారించి రెగ్యులర్ పిటిషన్లను వాయిదా వేశారు. ఈయనది సూర్యాపేట సొంత జిల్లా.

బొందలగడ్డ కబ్జాపై గ్రామస్తుల ఆందోళన

- మహమ్మద్‌నగర్ తహసీల్దార్ కార్యాలయ ముట్టడి
- కబ్జా భూమికి రైతుబంధు ఇవ్వడంపై ఆగ్రహం



తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన తెల్గాపూర్ గ్రామస్తులు

నిజాంసాగర్ (జుక్కల్): బొందల గడ్డకు కేటాయించిన అసైన్డ్ భూమిని కబ్జా చేసుకొని రైతుబంధు పొందుతున్న తీరుపై గ్రామస్తులు కన్నెర్ర చేశారు. దీంతో మంగళవారం కామారెడ్డి జిల్లా మహమ్మద్‌నగర్ మండల తహసీల్ కార్యాలయాన్ని తెల్గాపూర్ గ్రామస్తులు ముట్టడించారు. గ్రామ శివారులోని 312, 313, 315, 316, 317, 318 సర్వే నంబర్లు గల అసైన్డ్ భూమిని బొందలగడ్డకు కేటాయించారన్నారు. అయితే ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అప్పటి గ్రామ రెవెన్యూ అధికారితో కుమ్మక్కై కబ్జా చేసుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఆ భూమికి పదేళ్ల నుంచి రైతుబంధు డబ్బులు కూడా పొందుతున్నారని తెలిపారు. సదరు భూముల్లో తాత, ముత్తాతల కాలం నుంచి సమాధులు ఉన్నాయన్నారు. భూముల కబ్జాను అరికట్టాలని, బొందలగడ్డ స్థలాన్ని కాపాడాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు తహసీల్దార్ సవాయిసింగ్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందించారు.

నేను చనిపోతున్నా..

- బంధువులకు వీడియో పెట్టి యువకుడి ఆత్మహత్య
- వచ్చే నెల 6న పెళ్లి పీటలు ఎక్కాల్సిన సాయికుమార్



సాయికుమార్ (ఫైల్)

మొయినాబాద్: త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కాల్సిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నేను చనిపోతున్నా అంటూ వీడియో రికార్డు చేసి బంధువులకు పంపి చెట్టుకు ఉరేసుకున్నాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. చిలుకూరుకు చెందిన వీఎం సాయికుమార్(32)కు వికారాబాద్ జిల్లా కొడంగల్‌కు చెందిన యువతితో పెళ్లి నిశ్చయమైంది. మార్చి 6న పెళ్లి ముహూర్తం పెట్టుకున్నారు. వివాహం కుదిరిన రోజు నుంచి సాయికుమార్ తనకు కాబోయే భార్యతో నిత్యం ఫోన్ మాట్లాడేవాడు. ఉన్నట్టుండి ఏం జరిగిందో తెలియదు కానీ సోమవారం రాత్రి 7 గంటల సమయంలో నేను చనిపోతున్నా అంటూ వీడియో రికార్డ్ చేసి బంధువులకు పంపించాడు. వారు వెంటనే ఈ విషయాన్ని సాయికుమార్ తల్లి లక్ష్మికి తెలియజేశారు. కుటుంబసభ్యులు రాత్రంతా వెతికారు. మంగళవారం ఉదయం 9.50 గంటల సమయంలో గండిపేట సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు చెప్పారు. సాయికుమార్ ఆత్మహత్యకు అమ్మాయి తరపు కుటుంబసభ్యుల వేధింపులే కారణమని తల్లి లక్ష్మి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రన్‌వేపై విమానం బోల్తా



ల్యాండవుతూ తలకిందులు
- మంచు, విపరీతమైన గాలుల వల్లే
- 80 మంది ప్రయాణికులూ సురక్షితం
- 18 మందికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం

టొరంటో: కెనడాలో టొరంటోలోని పియర్సన్ విమానాశ్రయంలో డెల్టా ఎయిర్ లైన్స్ విమానం రన్‌వేపై దిగుతూ ఒక్కసారిగా బోల్తా పడింది! మంచు తుపాను, బలమైన గాలుల ధాటికి ఈ అరుదైన ఘటన చోటుచేసుకుంది. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో విమానంలోని 80 మంది అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డారు. అయితే 18 మంది గాయపడ్డారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. విమానం బోల్తా పడ్డ తీరు, అందులోంచి ప్రయాణికులు సురక్షితంగా బయటకొస్తున్న వీడియోలు, అగ్ని ప్రమాదాన్ని నివారించేందుకు సిబ్బంది నురగ స్ప్రే చేస్తున్న వీడియోలు వైరల్‌గా మారాయి. ప్రమాదంతో విమాన రాకపోకలకు అంతరాయం కలిగింది.

ప్రతికూల వాతావరణం...

వాతావరణ ఇబ్బందులతో పియర్సన్ విమానాశ్రయంలో కొన్ని రోజులుగా విమానాల రాకపోకలు ఆలస్యమవుతున్నాయి. బుధ, ఆదివారాల్లో రెండు తుపాన్లు నగరాన్ని 50 సెంటీమీటర్ల మంచుతో కప్పేశాయి. వారాంతంలోనైతే విమానాశ్రయంలో 22 సెంటీమీటర్లకు పైగా మంచు కురిసింది. ప్రమాద సమయంలోనూ తేలికపాటి మంచు కురిసినట్లు సమాచారం.

ప్రాణాలతో ఎలా బయటపడ్డారంటే?

విమానం పరిమాణం, సీట్ బెల్ట్, ఇంజనీరింగ్ నైపుణ్యం తదితరాలే టొరంటో ప్రమాదంలో ప్రయాణికులను కాపాడినట్టు నిపుణులు చెబుతున్నారు. విమానాలు తలకిందులవడం చాలా అరుదు. అలాంటి పరిస్థితిని కూడా ఎదుర్కొనేలా డెల్టా విమానాన్ని రూపొందించారు. విమానంలోని సీట్లు గురుత్వాకర్షణ శక్తికి పదహారు రెట్లు ఎక్కువ శక్తిని కూడా తట్టుకునేలా ఉంటాయి. విమానం బోల్తా పడ్డా ప్రయాణికులు మాత్రం స్థిరంగా ఉండేలా, వారిని కట్టిపడేసేలా సీట్లను రూపొందిస్తారు. అందుకే టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో విధిగా సీటు బెల్టులు ధరించేలా చూస్తారు. విమానం తలకిందులయితే రెక్కలు, తోకభాగం మాత్రమే విచ్ఛిన్నమయ్యేలా నిర్మాణం ఉంటుంది. ఇలాంటప్పుడు విమాన సిబ్బంది పాత్ర చాలా కీలకం. ప్రయాణికులు సురక్షితంగా ఉండేందుకు వీలుగా తక్షణ నిర్ణయాలు తీసుకునేలా వారికి శిక్షణ ఇస్తారు. సాధారణ సమయాల్లో ఫ్లైట్ అటెండెంట్లు మాత్రమే అయినా ఇలాంటప్పుడు ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తారు. విమానం కూలగానే ప్రయాణికులను సిబ్బంది హుటాహుటిన ఖాళీ చేయిస్తున్న దృశ్యాలు దీనికి నిదర్శనం. అత్యవసర సిబ్బంది కూడా క్షణాలపై స్పందించారు. ఆలస్యం చేయకుండా మంటలను ఆర్పేసి పెను ప్రమాదాన్ని నివారించారు.

సైజూ కలిసొచ్చింది...

ప్రమాదానికి గురైన బొంబార్డియర్ సీఆర్‌జే 900 విమానం చిన్నగా ఉంటుంది. ప్రయాణికులు ప్రాణాలతో బయట పడేందుకు ఇది కూడా కారణమే. కేబిన్ ఎత్తు కేవలం ఆరడుగులే. దాంతో బోల్తా పడ్డా ప్రయాణికులు ఎక్కువ దూరం పడిపోరు.

ఐదేళ్లలో వాణిజ్యం రెట్టింపు


ఖతార్ అమీర్ తమీమ్ బిన్‌తో ప్రధాని మోదీ

- అదే లక్ష్యంతో ముందుకెళ్దాం
- ద్వైపాక్షిక చర్చల్లో భారత్, ఖతార్ సంయుక్త నిర్ణయం
- ప్రధాని మోదీతో భేటీ అయిన ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్

న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్లలో ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని రెట్టింపు స్థాయికి పెంచుకోవాలని భారత్, ఖతార్ నిర్దేశించుకున్నాయి. ప్రస్తుతం 14 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యాన్ని 28 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ మేరకు ద్వైపాక్షిక చర్చల్లో పలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఇరు దేశాల మధ్య సంబంధాన్ని 'వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఈ మేరకు భారత ప్రధాని మోదీ, ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమాద్ అల్–థానీ మధ్య మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిగాయి.

ఐదు ఒడంబడికలపై సంతకాలు

ఆర్థిక భాగస్వామ్యం, సహకారం, యువజన వ్యవహారాలు, క్రీడలు, పురాతన వస్తువుల నిర్వహణ తదితర అంశాల్లో ఐదు ఒడంబడికలపై ఇరు దేశాధినేతలు సంతకాలు చేశారు. ఇరు దేశాల మధ్య ద్వంద్వ పన్నుల విధానం నివారణ ఒప్పందం పొడిగింపుపైనా సంతకాలు జరిగాయి. ''ఖతార్‌తో ద్వైపాక్షిక బంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచాం. వాణిజ్యం, ఇంధన భద్రత, పెట్టుబడులు, సాంకేతికత, ఇరు దేశస్తుల మధ్య సత్సంబంధాలు తదితర అంశాల్లో పరస్పర భాగస్వామ్య ధోరణిని ఇక మీదటా కొనసాగిస్తాం'' అని ఇరు దేశాల మధ్య చర్చల వివరాలను భారత విదేశాంగ శాఖ కార్యదర్శి అరుణ్‌కుమార్ ఛటర్జీ తర్వాత మీడియాకు చెప్పారు. '' వ్యూహాత్మక భాగస్వామ్యం అంటే అన్ని అంశాలు ఇమిడి ఉంటాయి. ముఖ్యంగా భద్రత సంబంధ అంశం తలెత్తినప్పుడు ప్రత్యేకంగా దీనిపై రెండు దేశాలు ఉమ్మడి ఎజెండా రూపొందిస్తాయి'' అని ఛటర్జీ చెప్పారు. విస్తృత స్థాయి ద్వైపాక్షిక చర్చల తర్వాత మోదీ, అమీర్ తమీమ్‌లు సంయుక్త ప్రకటన విడుదలచేశారు. '' సీమాంతర ఉగ్రవాదం సహా అంతర్జాతీయంగా అన్ని రూపాల్లో ఉన్న ఉగ్రవాదాన్ని తుదముట్టిద్దాం. విభేదాలను ద్వైపాక్షిక చర్చలు, బహుముఖ మార్గాల ద్వారా సామరస్యంతో రూపుమాపుదాం'' అని ఆ ప్రకటనలో భారత్, ఖతార్ పేర్కొన్నాయి.

పెరగనున్న పెట్టుబడులు

ఒప్పందంలో భాగంగా భారత్‌లో మౌలిక వసతులు, నౌకాశ్ర యాలు, నౌకల నిర్మాణం, ఇంధనం, పునరుత్పాదక ఇంధన రంగం, స్మార్ట్ సిటీ లు, ఫుడ్ పార్క్‌లు, అంకుర సంస్థలతోపాటు కృత్రిమ మేథ, రోబోటిక్స్, మెషీన్ లెర్నింగ్ వంటి నూతన సాంకేతికత రంగాల్లో ఖతార్ పెట్టుబడుల ప్రాధికార సంస్థ పెట్టుబడులను మరింత పెంచుతుంది. అంతర్జాతీయ వివాదా లకు శాంతియుత పరిష్కారాలను చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే సాధించగలమని ఇరు దేశాలు వ్యాఖ్యానించాయి. గత ఏడాది మోదీ ఖతార్‌లో పర్యటించినప్పుడు ఏకంగా 78 బిలియన్ డాలర్ల ద్రవరూప సహజ వాయువు దిగుమతిపై ఒప్పందం కుదుర్చుకున్నారు. 2048 ఏడాదిదాకా మార్కెట్ ధరల కంటే తక్కువకే భారత్‌కు ఖతార్ నుంచి ఏటా 75 లక్షల మెట్రిక్ టన్నుల ఎల్ఎన్‌జీ దిగుమతి అయ్యేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఫిబ్రవరి 17 నుంచి రెండ్రోజుల పర్యటన కోసం ఖతార్ అమీర్ షేక్ తమీమ్ భారత్‌కు విచ్చేసిన విషయం తెల్సిందే. తమీమ్ భారత్‌లో పర్యటించడం ఇది రెండోసారి. గతంలో 2015లో ఆయన భారత్‌కు వచ్చారు.

అగ్ర రాజ్యాల స్నేహగీతం

అమెరికా, రష్యా చర్చల బాట
- రియాద్‌లో మంత్రుల స్థాయి మంతనాలు
- ద్వైపాక్షిక బంధాల పునరుద్ధరణకు నిర్ణయం
- ఉక్రెయిన్ యుద్ధంపైనా కీలక చర్చలు
- త్వరలో భేటీ కానున్న ట్రంప్, పుతిన్!
- జెలెన్‌స్కీతో భేటీకీ పుతిన్ సిద్ధం: రష్యా
- మేం లేకుండా మాపై చర్చలా: జెలెన్‌స్కీ


చర్చల్లో పాల్గొన్న అమెరికా, రష్యా, సౌదీ మంత్రులు

రియాద్: డొనాల్డ్ ట్రంప్ రెండోసారి పాలనా పగ్గాలు చేపట్టగానే అమెరికా విదేశాంగ విధానంలో కీలక మార్పుచేర్పులు చోటుచేసుకుంటున్నాయి. అందులో భాగంగా అన్నిరకాలుగానూ మూడేళ్లుగా దాదాపుగా వెలి వేసిన రష్యాతో ఏకంగా ఉన్నతస్థాయి చర్చలకు అమెరికా తెర తీసింది. దాని మిత్ర దేశం సౌదీ అరేబియా వేదికగా మంగళవారం జరిగిన ఈ చర్చలకు అమెరికా, రష్యా విదేశాంగ మంత్రులు మార్కో రూబియో, సెర్గీ లవ్రోవ్ స్వయంగా సారథ్యం వహించడం విశేషం. సౌదీ విదేశాంగ మంత్రి యువరాజు ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్, అమెరికా, సౌదీ ఆ దేశ జాతీయ భద్రతా సలహాదార్లు తదితరులు ఇందులో పాల్గొన్నారు. ద్వైపాక్షిక బంధాలను మెరుగు పరుచుకోవడంతో పాటు ఉక్రెయిన్ యుద్ధానికి తెర దించడం ప్రధాన ఎజెండాగా చర్చలు జరిగాయి. కానీ ఈ కీలక చర్చల్లో ఉక్రెయిన్‌కే ప్రాతినిధ్యం కల్పించకపోవడం విశేషం. దీనిపై ఆ దేశం తీవ్ర అసంతృప్తి వెలిగక్కింది. తమ భాగస్వామ్యం లేకుండా తీసుకునే ఎలాంటి నిర్ణయాలనూ అంగీకరించబోయేది లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ కుండబద్దలు కొట్టారు. ఉక్రెయిన్‌పై జరుపుతున్న చర్చల్లో తమను పక్కన పెట్టడం ఏమేరకు సబబంటూ పలు యూరప్ దేశాలు కూడా నొసలు విరుస్తున్నాయి. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు అమెరికా దన్ను పూర్తిగా తగ్గిపోతున్న నేపథ్యంలో భావి కార్యాచరణపై యూరప్ దేశాలన్నీ సోమవారం కీలక సమావేశం జరపడం తెలిసిందే. ఈ పరిణామాలన్నీ అంతర్జాతీయంగా సరికొత్త సమీకరణాలకు, పునరేకీకరణలకు దారితీసేలా కనిపిస్తున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు.

త్వరలో ట్రంప్, పుతిన్ భేటీ

ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో అమెరికాతో పాటు పలు యూరప్ దేశాలు రష్యాపై తీవ్ర ఆంక్షలు విధించడం, ఆ దేశాన్ని అంతర్జాతీయంగా దాదాపుగా ఏకాకిని చేయడం తెలిసిందే. అలా మూడేళ్లుగా అట్టడుగుకు దిగజారిన అమెరికా, రష్యా సంబంధాలను మెరుగుపరుచుకునే దిశగా రూబియో, లవ్రోవ్ భేటీలో పలు నిర్ణయాలు జరిగాయి. వాషింగ్టన్, మాస్కో రాయబార కార్యాలయాల్లో సిబ్బంది సంఖ్యను పెంచాలని నిర్ణయించినట్టు రూబియో మీడియాకు తెలిపారు. ''అలాగే ఇరు దేశాల అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్ వీలైనంత త్వరగా భేటీ కానున్నారు. తేదీ తదితరాలు ఖరారు కావాల్సి ఉంది'' అని వివరించారు. అధినేతలిద్దరూ గత వారం సుదీర్ఘంగా ఫోన్లో సంభాషించుకోవడం తెలిసిందే. ఈ పరిణామం అంతర్జాతీయంగా సంచలనం సృష్టించింది. ఆ వెంటనే రష్యాపై యుద్ధంలో ఇప్పటిదాకా ఉక్రెయిన్‌కు అమెరికా అందిస్తూ వస్తున్న సహాయ సహకారాలకు చాలావరకు తెర దించుతూ ట్రంప్ వరుస నిర్ణయాలు తీసుకున్నారు.

ఈయూలో ఉక్రెయిన్ చేరికకు... అభ్యంతరం లేదు: రష్యా

శాంతి చర్చలకు రష్యా ఎప్పుడూ సిద్ధమేనని అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మీడియా కార్యదర్శి ద్మిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. అందులో భాగంగా అవసరమైతే జెలెన్‌స్కీతో చర్చలకు కూడా పుతిన్ సిద్ధమేనన్నారు. అయితే, ఉక్రెయిన్ అధ్యక్షునిగా జెలెన్‌స్కీ చట్టబద్ధతపైనే తమకు అభ్యంతరాలున్నాయంటూ మెలిక పెట్టారు. ఉక్రెయిన్ యూరోపియన్ యూనియన్‌లో చేరడంపై తమకు అభ్యంతరాలు లేవన్నారు. ''ఇలాంటివి ఒక దేశ సార్వభౌమత్వానికి సంబంధించిన నిర్ణయాలు. వాటిలో వేలు పెట్టే ఉద్దేశం మాకు లేదు'' అని చెప్పుకొచ్చారు. కానీ రష్యా భద్రత తదితరాల దృష్ట్యా ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వానికి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదన్నారు.

ప్రజాస్వామ్య దేవాలయమిది

పదవీ విరమణ సందర్భంగా ఈసీనుద్దేశిస్తూ సీఈసీ రాజీవ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం ప్రజాస్వామ్య దేవాలయంగా పరిఢవిల్లుతోందని మంగళవారం ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ)గా పదవీ విరమణ చేసిన రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. 2022 మే 15వ తేదీన సీఈసీగా బాధ్యతలు చేపట్టి అత్యంత కీలకమైన లోక్‌సభ ఎన్నికలు, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలుసహా పలు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలను సీఈసీ హోదాలో సమర్థవంతంగా నిర్వహించిన రాజీవ్ మంగళవారం సాయంత్రం రిటైర్ అయ్యాక నిర్వాచన్ సదన్ కార్యాలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. '' నా దృష్టిలో కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రజాస్వామ్య దేవాలయం. గత 75 ఏళ్లుగా ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ ప్రజాస్వామ్యాన్ని సమున్నత శిఖరాలపై నిలిపింది. తీరా ఎన్నికలప్పుడే ఎన్నికల ప్రక్రియపై పలు పార్టీలు, నేతలు అనుమానాలు వ్యక్తం చేయడమనేది కేవలం ఈసీ ప్రతిష్టను దెబ్బతీసేందుకు, మొత్తం ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని సన్నగిల్లేలా చేసేందుకు వేసే ఎత్తుగడలు. ఎన్నికలకు సంబంధించి చాన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ కోర్టులో ప్రత్యక్ష ప్రసారాలు కావడం కొన్నిసార్లు అపనమ్మకాలకు దారితీయొచ్చు'' అని వ్యాఖ్యానించారు.

ఆర్థికభారం కావొద్దు

''అనుచిత ఉచిత వాగ్దానాలు, స్థాయికి మించిన వాగ్దానాలు చేస్తున్న రాజకీయ పార్టీల పట్ల ఈసీ ఎప్పటికప్పుడు అప్రమత్త ధోరణితో వ్యవహరించాలి. కేంద్ర, రాష్ట్రాలకు ఆర్థికభారం కాకుండా ఉచిత పథకాలు, హామీలు ఇస్తే మంచిది. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున ఇంతకు మించి మాట్లాడను''అని ఆయన అన్నారు. '' ఎగ్జిట్ పోల్స్ అనేవి అంచనాలను అమాంతం పెంచేసి వాస్తవ పరిస్థితుల నుంచి ఓటర్లను దూరంగా తీసుకెళ్తాయి. ఈ విషయంలో మీడియా మరీముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఎగ్జిట్ పోల్స్‌పై మాకు పూర్తి అజమాయిషీ, నియంత్రణ లేదు. అందుకే ఈ ఎగ్జిట్ పోల్స్ చేపట్టే సంస్థలే స్వీయనియంత్రణ కల్గిఉండాలి. సర్వేకు శాంపిల్ సైజు ఎంత? అసలు ఎంత విస్తృత స్థాయిలో సర్వే చేశారు?. సర్వే ఫలితాలు వాస్తవ ఫలితాలను ఏ మేరకు ప్రతిబింబిస్తాయి?. అనేవి చూసుకోవాలి'' అని రాజీవ్ అన్నారు. '' కొత్త సారథి నాయకత్వంలో ఈసీ మరింతగా సమర్థవంతంగా ఎన్నికలు చేపట్టాలని ఆశిస్తున్నా. భారతీయ ప్రజాస్వామ్యం పటిష్టతకు ఓటర్లు, రాజకీయపార్టీలు తమ వంతు కృషిచేయాలి. ఈ బాధ్యతలను భుజాలకెత్తుకున్న ఓటర్లందరికీ నా శుభాకాంక్షలు'' అని అన్నారు. 2020 ఏప్రిల్–ఆగస్ట్ కాలంలో పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్ చైర్మన్‌గా ఉన్న రాజీవ్ అదే ఏడాది సెప్టెంబర్ ఒకటిన ఎలక్షన్ కమిషనర్‌గా ఈసీలో చేరారు. 2022 మే 15న 25వ సీఈసీగా బాధ్యతలు చేపట్టారు. సీఈసీగా ఆయన అన్ని రకాల ఎన్నికలను నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు, 31 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీ ఎన్నికలు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు, రాజ్యసభ ఎన్నికలు సమర్థవంతంగా చేపట్టారు.


సీఈసీ రాజీవ్ కుమార్ దంపతులతో కాబోయే సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దంపతులు తదితరులు


నేడే సీఈసీగా జ్ఞానేశ్ బాధ్యతల స్వీకరణ

కేంద్ర ఎన్నికల సంఘానికి నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్ నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు. 2024 జనవరిలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా రిటైర్ అయిన జ్ఞానేశ్ ఆ తర్వాత రెండు నెలలకే కేంద్ర ఎన్నికల సంఘంలో ఎలక్షన్ కమిషనర్‌గా కొత్త పాత్రలో కొలువుదీరారు. ఈసీ సభ్యుల నియామకానికి సంబంధించి మోదీ సర్కార్ తీసుకొచ్చిన కొత్త చట్టం అమల్లోకి వచ్చాక సీఈసీగా బాధ్యతలు చేపడుతున్న తొలి వ్యక్తి జ్ఞానేశ్ కావడం విశేషం. కేంద్ర సహకార మంత్రి అమిత్ షాకు అత్యంత ఆప్తునిగా పేరొందారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దుచేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని అమలుచేయడంలో జ్ఞానేశ్ కీలకపాత్ర పోషించారు. సీఈసీగా జ్ఞానేశ్ 2029 జనవరి 27వ తేదీన రిటైర్ అవుతారు.

రణ్‌వీర్‌కు సుప్రీం చీవాట్లు

- యూట్యూబ్ షోలో అసభ్యకర వ్యాఖ్యలపై మండిపాటు
- సమాజానికే అవమానం అంటూ అభ్యంతరం
- ప్రస్తుతానికి అతడిని అరెస్ట్ చేయవద్దంటూ ఆదేశం




రణ్‌వీర్

న్యూఢిల్లీ: యూట్యూబ్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇన్‌ఫ్లూయెన్సర్ రణ్‌వీర్ అలహాబాదియా అలియాస్ బీర్‌బైసెప్స్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అతడి వ్యాఖ్యలు వక్రబుద్ధితో కూడినవంటూ మండిపడింది. 'ఇండియాస్ గాట్ లాటెంట్' పేరుతో యూట్యూబ్‌లో కమెడియన్ సమయ్ రైనా నిర్వహించిన షోలో రణ్‌వీర్ చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం కావడం తెలిసిందే. దీనిపై మహారాష్ట్ర, అసోంల్లో కేసులు నమోదయ్యాయి. ఆయన వ్యాఖ్యలను కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ''మీ మనసులో ఉన్న నీచమైన ఆలోచనలను షోలో వెళ్లగక్కారు. మీరు వాడిన పదజాలం కుమార్తెలు, తోబుట్టువులు, తల్లిదండ్రులే గాక మొత్తంగా ఈ సమాజమే అవమానంగా భావించేలా ఉంది. ఇది అశ్లీలత కాకపోతే మరేమిటి? మీపై నమోదైన కేసులను ఎందుకు కొట్టివేయాలి? దేశవ్యాప్తంగా పలుచోట్ల మీపై నమోదవుతున్న ఎఫ్ఐఆర్‌లను ఎందుకు కలపాలి?'' అని న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం నిలదీసింది. చౌకబారు ప్రచారం కోసం మీరు ఇలాంటివి చేస్తే, ఇలాగే చీప్ పబ్లిసిటీ కావాలనుకునేవారు బెదిరింపులకు పాల్పడతారంటూ ధర్మాసనం తలంటింది. వాక్ స్వాతంత్ర్యం ఉందని సమాజ సహజ విలువలు, సూత్రాలకు విరుద్ధంగా మాట్లాడేందుకు ఎవరికీ లైసెన్సు లేదని స్పష్టం చేసింది. అతడు వాడిన భాషను మీరు సమర్థిస్తున్నారా? అని లాయర్ అభినవ్ చంద్రచూడ్‌ను ప్రశ్నించగా, వ్యక్తిగతంగా తనకూ అసహ్యం కలిగించాయంటూ ఆయన బదులిచ్చారు. ఆస్ట్రేలియా టీవీ ప్రోగ్రామ్‌లో ఓ నటుడి డైలాగ్‌ను కాపీ కొట్టి అలహాబాదియా ఈ వ్యాఖ్యలు చేసిన విషయం తమకూ తెలుసునని ధర్మాసనం పేర్కొంది. 'ఇలాంటి కార్యక్రమాలను ప్రసారం చేసేటప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకుంటారు. పెద్దలకు మాత్రమే అనే హెచ్చరిక కనిపిస్తుంది. ఆస్ట్రేలియా కార్యక్రమాన్ని కాపీ చేసిన 'ఇండియాస్ గాట్ లాటెంట్'నిర్వాహకులు ఈ జాగ్రత్తలేవీ తీసుకోలేదు'అని ధర్మాసనం తెలిపింది.

ఇకపై కేసులొద్దు

అలహాబాదియాకు చంపుతామంటూ బెదిరింపులు వస్తున్నాయని, ఈ ఒక్క అంశంపైనే చాలా చోట్ల కేసులు నమోదయ్యాయంటూ లాయర్ అభినవ్ చంద్రచూడ్ తెలపడంతో అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఆయనను ప్రస్తుతానికి అరెస్టు చేయరాదంటూ పోలీసులను ఆదేశించింది. అదేవిధంగా, ఇదే అంశంపై ఇకపై కేసులు నమోదు చేయవద్దని స్పష్టం చేసింది. ఇకపై ఆ యూట్యూబ్ షోను ప్రసారం చేయరాదని స్పష్టం చేసింది. కొంతకాలంపాటు ఇతర షోల్లో పాల్గొనవద్దని అలహాబాదియాకు స్పష్టం చేసింది. పాస్‌పోర్టును థానే పోలీసులకు ఇవ్వాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, మహారాష్ట్ర, అసోం పోలీసులకు విచారణలో సహకరించాలని అతడిని ఆదేశించింది. తనపై నమోదైన పలు ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని, వాటన్నిటిపై ఒకే చోట విచారణ జరపాలంటూ అలహాబాదియా వేసిన పిటిషన్‌పై కేంద్రం, మహారాష్ట్ర, అసోం రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. మహారాష్ట్ర సైబర్ పోలీసులు ఐటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. వివాదాస్పద కామెడీ షోకు సంబంధించిన మొత్తం 18 ఎపిసోడ్లను తొలగించాలని యూట్యూబ్‌ను కోరారు. ఖర్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరుకావాలంటూ అలహాబాదియాకు ముంబై పోలీసులు సమన్లు ఇచ్చారు. అయితే, అతడు తమతో టచ్‌లో లేడని ముంబై పోలీసులు తెలిపారు. అలహాబాదియాపై ఇండోర్, జైపూర్‌లలోనూ కేసులు నమోదయ్యాయి.

భారత వలసదారులు... ఇక కోస్టారికాకు!

- అమెరికా కీలక ఒప్పందం
- 200 మందితో నేడు తొలి విమానం
- అక్కడినుంచి మాతృదేశాలకు తరలింపు

శాన్‌జోస్: భారత అక్రమ వలసదారులను కోస్టారికాకు తరలించాలని అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అగ్రరాజ్యం తమతో ఒప్పందం చేసుకున్నట్టు కోస్టారికా వెల్లడించింది. అందులో భాగంగా వలసదారుల తొలి విమానం బుధవారం తమ దేశానికి రానున్నట్టు కోస్టారికా అధ్యక్షుడు రొడ్రిగో చావెస్ రోబెల్ కార్యాలయం ప్రకటించింది. ''భారత్‌తో పాటు మధ్య ఆసియా దేశాలకు చెందిన 200 మంది ఆ విమానంలో వస్తున్నారు. అనంతరం వారిని మాతృదేశాలకు పంపేస్తాం. ఈ విషయంలో అమెరికాతో సమన్వయం చేసుకుని పని చేస్తాం. ఇరు దేశాల మధ్య సంధానకర్త పాత్ర పోషిస్తాం'' అని తెలిపింది. అయితే 200 మందిలో భారతీయులు ఎందరన్నది మాత్రం వెల్లడించలేదు. అమెరికా తన సొంత నిధులతో చేపడుతున్న వలసదారుల తరలింపు ప్రక్రియను అంతర్జాతీయ వలసల సంస్థ (ఐఓఎం) పర్యవేక్షిస్తోంది. కోస్టారికాలో ఉన్నంతకాలం వలసదారుల సంరక్షణ తదితర బాధ్యతలను ఆ సంస్థే చూసుకోనుంది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన వెంటనే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే.

అర్ధరాత్రి వేళ కీలక నిర్ణయాలా?

- 48 గంటల్లో కేసు విచారణ ఉండగా నిర్ణయం సరికాదు
- సీఈసీ నియామకంలో ప్రధాని, హోం మంత్రి అమర్యాదగా ప్రవర్తించారు: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ)ను హడావిడిగా అర్ధరాత్రి వేళ ఎంపిక చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. మరో 48 గంటల్లో ఇదే సీఈసీ ఎంపిక ప్రక్రియపై కేసు విచారణ మొదలవుతుండగా హడావుడిగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. కోర్టులో సంబంధిత అంశం ఉందని తెల్సి కూడా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అమర్యాదగా, కోర్టు పట్ల గౌరవం లేనట్లుగా ప్రవర్తించారని రాహుల్ ధ్వజమెత్తారు. సోమవారం రాత్రి జ్ఞానేశ్ కుమార్‌ను నూతన సీఈసీగా ఎంపికచేస్తూ ప్రధాని మోదీ సారథ్యంలోని ఎంపిక కమిటీ నిర్ణయం తీసుకోవడం తెల్సిందే. ఈ మేరకు రాహుల్ 'ఎక్స్' ఖాతాలో పలు పోస్టులు చేశారు. ''2023 కొత్త చట్టం ప్రకారం సీఈసీ, ఈసీల నియామకంపై కేసును ప్రాధాన్యత దృష్ట్యా ఫిబ్రవరి 19న విచారిస్తామని సుప్రీంకోర్టు మంగళవారమే చెప్పింది. అయినాసరే ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంది. కొత్త ఎలక్షన్‌కమిషనర్ ఎంపికకు సంబంధించిన కమిటీ భేటీలో నేనూ పాల్గొన్నా. కార్యనిర్వాహక వ్యవస్థ జోక్యం లేకుండా స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఎలక్షన్ కమిషన్ కోసం ఈసీ, సీఈసీల ఎంపిక ప్రక్రియ జరగాలనేది ప్రాథమిక సూత్రం. ఈ అంశంలో సుప్రీంకోర్టు తీర్పును బేఖాతరు చేస్తూ సెలక్షన్ కమిటీలో సభ్యునిగా ఉండాల్సిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేరును మోదీ ప్రభుత్వం తొలగించింది. దీంతో ఎన్నికల ప్రక్రియ స్వతంత్రతపై కోట్లాది మంది ఓటర్లలో భయాందోళనలు తీవ్రమయ్యాయి. ఈ అంశాన్ని ఎంపిక కమిటీ భేటీలోనే ప్రధానంగా ప్రస్తావించా. అంబేడ్కర్, జాతి నిర్మాతల ఆశయాలను కాపాడుతూ, ప్రభుత్వాన్ని జవాబుదారీగా చేయాల్సిన విద్యుక్త ధర్మం లోక్‌సభలో విపక్ష నేతగా నాపై ఉంది'' అని రాహుల్ అన్నారు. ''కొత్త సీఈసీ, ఈసీల నియామకానికి సంబంధించి సెలక్షన్ కమిటీలో ప్రధాని, లోక్‌సభలో విపక్ష నేత, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఉండాలని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2023 మార్చి రెండో తేదీన తీర్పునిచ్చింది. దానిని కాలదన్నుతూ అదే ఏడాది ఆగస్టులో ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చింది. సీజేఐ పేరు తొలగించి కేంద్ర మంత్రిని చేర్చింది. కమిటీ నుంచి సీజేఐను తొలగించడం సర్వోన్నత న్యాయస్థానం తీర్పును అవహేళన చేయడమే'' అని రాహుల్ అన్నారు.

అది మృత్యు కుంభ్

మమతా బెనర్జీ ధ్వజం

కోల్‌కతా: తొక్కిసలాట ఘటనలతో యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న మహా కుంభ్ మేళా కాస్తా 'మృత్యు కుంభ్'గా మారిందంటూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆమె రాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడారు. తొక్కిసలాటల్లో చనిపోయిన వారి వాస్తవ సంఖ్యను యూపీ ప్రభుత్వం దాచిపెడుతోందని ధ్వజమెత్తారు. గత నెలలో త్రివేణీ సంగమంలో జరిగిన తొక్కిసలాటలో 30 మంది చనిపోగా 60 మంది గాయపడ్డారు. అదేవిధంగా, ప్రయాగ్‌రాజ్ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకున్న తొక్కిసలాటలో మరో 18 మంది మృతి చెందారు. 'ఈ ఘటనల్లో వందలాది మృతదేహాలను దాచిపెట్టిన యూపీలోని బీజేపీ ప్రభుత్వం మృతుల సంఖ్యను తక్కువ చేసి చూపిస్తోంది. కనీసం విచారణ కమిటీని కూడా ఏర్పాటు చేయలేదు'అని ఆమె అన్నారు. కుంభమేళా వంటి భారీ మతపరమైన కార్యక్రమాలు జరిగేటప్పుడు విస్తృత ఏర్పాటు చేపట్టి, భద్రతా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంపై ప్రచారంతో హడావుడి చేసిన ప్రభుత్వం అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. సామాన్యులకు ఇబ్బందులు కలిగించరాదనే తాను మహా కుంభ్‌కు వెళ్లలేదని చెప్పుకొచ్చారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వీఐపీ సంస్కృతిని పాటిస్తున్నారంటూ ధ్వజమెత్తారు.

ఆప్ నేత సత్యేందర్ జైన్‌పై విచారణకు రాష్ట్రపతి అనుమతి

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ నేత, ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్(60)ను విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అనుమతి మంజూరు చేశారు. ఆయనపై ఆరోపణలకు తగు ఆధారాలున్నందున దర్యాప్తునకు అనుమతివ్వాలంటూ హోం శాఖ రాష్ట్రపతిని కోరింది. ఈ మేరకు ఆమె భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 218 ప్రకారం అనుమతించారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు సమాచారంతో ఈడీ కోర్టులో తాజాగా సప్లిమెంటరీ చార్జిషీటు దాఖలు చేయనుంది. హవాలా లావాదేవీల ఆరోపణలపై మంత్రిగా ఉన్న జైన్‌ను ఈడీ 2022 మేలో అరెస్ట్ చేసింది. ప్రస్తుతం ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు.

సాక్షి
హైదరాబాద్

బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



వాట్సాప్‌లో నమూనా..
నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు చెక్‌ చెప్పారు. మంగళవారం మరో ఐదుగురిని పట్టుకున్నారు.
-8లో



టూరి‘జెమ్‌’
ప్రపంచ పర్యాటకులకు నగరం గమ్యస్థానం మారింది. భారీ సినిమాల తయారీ కేంద్రంగా కళలు, ప్రసిద్ధ వంటకాలు కూడా వృద్ధికి ఊతమిస్తున్నాయి.
- సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.0/19.0
నగర పరిధిలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 36, కనిష్టంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్‌ వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.





పూల పాన్పు!

పచ్చని చెట్టూ నీడుంటే.. విరులే పాన్పుగా మారితే.. ఆ ఆనందానికి అవధులుండవు. గాఢ నిద్రకు లోటు అసలే ఉండదు. అలాంటి దృశ్యమే మంగళవారం మధ్యాహ్నం నెక్లెస్‌ రోడ్డులో ఐమ్యాక్స్‌ సమీపంలో కనిపించింది. ఓ వృక్ష ఛాయలో.. రాలిన పుష్పాలపై.. ఎండల ధాటికి అలసి సొలసిన వ్యక్తి ఇలా ఆదమరిచి నిద్రిస్తుండగా.. ‘సాక్షి’ కెమెరా క్లిక్‌మనిపించింది.

లెక్క తేల్చండి.. పక్కాగా ఇస్తాం

మూసీ డీపీఆర్‌పై కన్సల్టెన్సీ మెలిక

- స్థల సమీకరణ చేయాలంటూ కిరికిరి
- ఆక్రమణలను తొలగిస్తేనే నదికి పునరుజ్జీవం
- కూల్చివేతలతో ప్రజలు, ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత ఖాయం
- దిక్కుతోచని స్థితిలో ఎంఆర్‌డీసీఎల్‌ యంత్రాంగం



సాక్షి, సిటీబ్యూరో: ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి కలల ప్రాజెక్ట్‌ ‘మూసీ నదికి పునరుజ్జీవం’పై కొత్త పంచాయతీ మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం మూసీ రివర్‌ ఫ్రంట్‌ డెవలప్‌మెంట్‌ ప్రాజెక్ట్‌ కన్సల్టెన్సీ బాధ్యతలు సింగపూర్‌ కంపెనీ మెయిన్‌ హార్ట్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే. మూసీ పరీవాహక ప్రాంతంలోని ఆక్రమణలను తొలగించి, స్థల సమీకరణ చేస్తేనే డీపీఆర్‌ తయారీ సాధ్యమవుతుందని కన్సల్టెన్సీ సంస్థ మెలిక పెట్టింది. మూసీకి ఇరువైపులా ఎక్కడెక్కడ ఎన్ని భూములు అందుబాటులో ఉన్నాయో తేలితే.. ఎక్కడ ఏ తరహా అభివృద్ధి చేపట్టవచ్చో స్పష్టత వస్తుందని రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చిచెప్పినట్లు సమాచారం. స్థల సమీకరణ పూర్తి కాకుండా మూసీ చుట్టూ వాణిజ్య ప్రాంతాల అభివృద్ధిని నిర్ణయించడం కష్టమని తెలిపింది. దీంతో సీఎం డ్రీమ్‌ ప్రాజెక్ట్‌పై నీలినీడలు అలుముకుంటున్నాయి.

రాజకీయ ప్రకంపనలు..

కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్నట్టుగా మారింది మూసీ రివర్‌ ఫ్రంట్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ (ఎంఆర్‌డీసీఎల్‌) యంత్రాంగం పరిస్థితి. మూసీ ఆక్రమణలు, స్థల లభ్యతపై స్పష్టత ఇస్తేనే ప్రాజెక్ట్‌పై ముందడుగు పడుతుందని కన్సల్టెన్సీ సంస్థ తేల్చి చెప్పడంతో ఈ విషయంపై ఎలా ముందుకెళ్లాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడింది. ముందుగా మూసీ పరీవాహక ప్రాంతంలోని నివాసాలు, షెడ్లు, గోదాముల వంటి అక్రమ నిర్మాణాలను తొలగిస్తే తప్ప.. నది చుట్టూ ఎన్ని భూములు ఉన్నాయో ప్రభుత్వానికి స్పష్టత వస్తుంది. ఆక్రమణలను కూల్చివేస్తే రాజకీయ ప్రకంపనలు ఏర్పడటం ఖాయం. ప్రజల నుంచి ఆక్రమణలు తొలగిస్తే రాజకీయ ప్రకంపనలు ఏర్పడతాయి. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో పాటు ప్రతిపక్షాలు కూడా దీన్నే అస్త్రంగా మలుచుకునే అవకాశాలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం తీవ్ర విమర్శల పాలవుతుంది. స్థానిక ఎన్నికలు సమీపించనున్న తరుణంలో మూసీ ఆక్రమణల జోలికి వెళ్లక పోవడమే మంచిదనే అభిప్రాయానికి వచ్చింది ప్రభుత్వం.

ప్రపంచ బ్యాంకు రుణం..

ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత మూసీకి పునరుజ్జీవం కల్పిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. దీంతో మూసీ శుద్ధి, వ్యర్థాలు, వరదల నియంత్రణ వ్యవస్థ, సుందరీకరణ, బృహత్‌ ప్రణాళిక రూపకల్పనలపై ఎంఆర్‌డీసీఎల్‌ అధికారులు దృష్టిసారించారు. 2024, డిసెంబర్‌ 1 నుంచి 2030 డిసెంబర్‌ 30 నాటికి ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి విడతగా రూ.5,863 కోట్ల వ్యయాన్ని అంచనా వేశారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు రూ.1,763 కోట్లు ఖర్చు పెట్టనుంది. మిగిలిన 70 శాతం నిధులు రూ.4,100 కోట్లు ప్రపంచ బ్యాంక్‌ నుంచి ఆర్థిక సాయంగా పొందాలని నిర్ణయించారు. ఈ మేరకు కేంద్రం అనుమతి రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ప్రాజెక్ట్‌ నివేదిక (పీపీఆర్‌)ను అందజేసింది.

మూసీ మొత్తం కష్టమే..

వికారాబాద్‌ జిల్లాలోని అనంతగిరి కొండల్లో పుట్టి హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల మేర మూసీ నది ప్రవహిస్తోంది. నగరంలో చాలా ప్రాంతాల్లో నది ఆక్రమణకు గురైంది. నివాస, వాణిజ్య సముదాయాలు వెలిశాయి. వీటిని తొలగించడం, నిర్వాసితులకు వేరే చోట పునరావసం కల్పించడం వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. దీంతో ఆక్రమణలు తక్కువగా ఉన్న బాపుఘాట్‌ వద్ద మూసీ సుందరీకరణకు పరిమితం కావాలని అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే ఉస్మాన్‌ సాగర్‌ నుంచి బాపూఘాట్‌ వరకు 11.5 కి.మీ., అలాగే హిమాయత్‌సాగర్‌ నుంచి బాపూఘాట్‌ వరకు ఉన్న 8.5 కి.మీ. మూసీ నదీ సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తాజాగా కన్సల్టెన్సీ మెలికతో 55 కి.మీ. మూసీ సుందరీకరణ కష్టమని అధికారులు భావిస్తున్నారు. బాపూఘాట్‌ వద్ద ప్రపంచంలో అత్యంత ఎత్తయిన గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు ఇక్కడే ఎడ్యుకేషన్‌ హబ్‌, లండన్‌లోని ఐలైక్‌ ఫెసిలిటీ, ఇతర వినోద కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.



అహో.. ‘మహా’

రైజింగ్‌ హైదరాబాద్‌ | అత్యధిక జనసాంద్రత | అక్షరాస్యతలోనూ టాప్‌

సాక్షి, సిటీబ్యూరో:

తెలంగాణ డెవలప్‌మెంట్‌ ప్లానింగ్‌ సొసైటీ (టీజీడీపీఎస్‌) విడుదల చేసిన గణాంకాలలో రాష్ట్ర జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 312 కాగా.. హైదరాబాద్‌ జిల్లా జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 18,161గా ఉంది. రాజధాని నగర కేంద్రమైన హైదరాబాద్‌ జిల్లా జనసాంద్రత దేశ రాజధాని ఢిల్లీ కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఢిల్లీలో చదరపు కిలోమీటరుకు 11,313 మంది మాత్రమే ఉన్నారు. హైదరాబాద్‌ జిల్లా జనాభా 39.43 లక్షలు. భాగ్యనగరంలో గ్రామీణ ప్రాంతమంటూ లేకపోవడం తెలిసిందే. హైదరాబాద్‌ను ఆనుకొని ఉన్న మేడ్చల్‌ జిల్లాలోనూ 91.5 శాతం మంది పట్టణ ప్రాంతంలోనే నివసిస్తున్నారు. సామాజికంగా చూస్తే రాష్ట్రంలో ఉంటున్న ఎస్సీల్లో తక్కువ మంది ఈ రెండు జిల్లాల్లోనే ఉన్నారు. హైదరాబాద్‌ జిల్లాలో 6.9 శాతం ఉండగా, మేడ్చల్‌ జిల్లాలో 9.4 శాతంగా ఉన్నారు. పట్టణాల్లో ఎక్కువ మంది ఉంటున్నందున సహజంగానే అక్షరాస్యతలోనూ ఈ జిల్లాలు ముందంజలో ఉన్నాయి. హైదరాబాద్‌లో 83.2 శాతం, మేడ్చల్‌లో 82.5 శాతం అక్షరాస్యులున్నారు. మహిళల అక్షరాస్యతలోనూ ఇవి ముందంజలో ఉన్నాయి. హైదరాబాద్‌లో 79.3 శాతంతో, మేడ్చల్‌లో 77.3 శాతంతో అగ్రభాగాన నిలిచాయి.

పౌర సదుపాయాలపై ప్రభావం..

ప్రపంచ వ్యాప్తంగా పరిగణనలోకి తీసుకుంటే అత్యధిక జనసాంద్రత కలిగిన నగరంగా ఫిలిప్పీన్స్‌లోని మనీలా సగటున చదరపు కిలోమీటరుకు 43,079గా ఉంది. అదే మన దేశంలోని ముంబై నగరంలో 28,508గా ఉంది. అత్యధిక జనసాంద్రత పౌర సదుపాయాలు, గృహ వసతి, విద్య, వైద్యం, కాలుష్యం, గాలి నాణ్యత, పరిశుభ్రత, ఘనవ్యర్థాల నిర్వహణ, పర్యావరణం తదితరాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని అర్బన్‌ ప్లానర్లు చెబుతున్నారు. ఈ సవాళ్లను ఎదుర్కోవడం ప్రభుత్వాల పని. ముందుచూపు లేకుంటే సమస్యలు తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉంది. ట్రాఫిక్‌ జామ్‌లు, వరద సమస్యలు, లాంగ్‌స్పేస్‌ కొరత, ఆహార కల్తీ, పబ్లిక్‌ టాయ్‌లెట్లు కూడా చాలినన్ని లేకపోవడం వంటివి ఇప్పటికే చూస్తున్నాం.



గ్రేటర్‌ పరిధిలోకొచ్చే మూడు ముఖ్య జిల్లాల్లో ఇలా..

జిల్లా	మొత్తం జనాభా	పట్టణ జనాభా	శాతం
హైదరాబాద్‌	39,43,323	39,43,323	100.0
మేడ్చల్‌	24,60,095	22,50,267	91.5
రంగారెడ్డి	24,26,243	14,00,130	57.7

నగరంలో లభిస్తున్న ఉపాధితో ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కార్మికులూ గ్రేటర్‌ పరిధిలో ఎక్కువే ఉన్నారు.

2021-22 లెక్కల ప్రకారం పని చేస్తున్న ఫ్యాక్టరీలు.. కార్మికులు, సిబ్బంది

జిల్లా	ఫ్యాక్టరీలు	కార్మికులు	ఉద్యోగులు
మేడ్చల్‌	2,436	1,24,469	1,67,406
రంగారెడ్డి	1,163	64,344	87,107

2011 ప్రకారం గణాంకాలు విడుదల చేయడంతో ప్రస్తుత పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. రంగారెడ్డి, మేడ్చల్‌ జిల్లాల పరిధిలోని నగర శివారు ప్రాంతాల్లో ఇటీవల కాలంలో జనాభా విపరీతంగా పెరుగుతుండటం తెలిసిందే.

వివిధ సర్వేల ప్రకారం నగర జనాభా పెరుగుదల తీరు ఇలా..

ఏ సంవత్సరం	ఎంత జనాభా (దాదాపుగా)
1950	10 లక్షలు
1975	20 లక్షలు
1990	40 లక్షలు
2000	54 లక్షలు
2010	80 లక్షలు
2016	92 లక్షలు
2024	108 లక్షలు
2030	127 లక్షలు (అంచనా)

రహదారులిలా..

ఇక రహదారుల అంశానికొస్తే రాష్ట్రంలోని మొత్తం రహదారుల్లో 8.1 శాతం జీహెచ్‌ఎంసీ పరిధిలోకొచ్చే నాలుగు జిల్లాల (హైదరాబాద్‌, రంగారెడ్డి, మేడ్చల్‌, సంగారెడ్డి) పరిధిలో ఉన్నాయి.

మొత్తం రోడ్లు: 9,013 కి.మీ.
వీటిలో బీటీ 2,846 కి.మీ.
సీసీ రోడ్లు 6,167 కి.మీ.

814.68 చ.కి.మీ.
2,01,318 ఎకరాలు!

ఫ్యూచర్‌ సిటీ స్వరూపమిదీ
- 7 మండలాలతో ప్రత్యేక అథారిటీకి ప్రతిపాదన
- ఈ పరిధిలో 56 రెవెన్యూ గ్రామాలు
- ప్రభుత్వం చెంతకు నివేదిక

సాక్షి, సిటీబ్యూరో: ఫ్యూచర్‌ సిటీకి ప్రభుత్వం బాటలు వేస్తోంది. 814.68 చదరపు కిలో మీటర్లు, 2,01,318 ఎకరాల విస్తీర్ణంలో భవిష్యత్‌ నగరి విస్తరించనుంది. ఫోర్త్‌ సిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 7 మండలాలు, 56 రెవెన్యూ గ్రామాలతో ప్రత్యేక ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. ఆమనగల్‌, ఇబ్రహీంపట్నం, కడ్తాల్‌, కందుకూరు, మహేశ్వరం, మంచాల, యాచారం మండలాలను ఈ అథారిటీ పరిధిలోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. నాగార్జునసాగర్‌, బెంగళూరు హైవేలు, ఇటు ఔటర్‌రింగ్‌రోడ్డు, మరోవైపు ప్రతిపాదిత రీజినల్‌ రింగ్‌రోడ్డు లోపలి గ్రామాలను ఈ అథారిటీ పరిధిలోకి రానున్నాయి. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌ పేట కేంద్రంగా ఏర్పాట్లు చేస్తున్న ఈ పట్టణాభివృద్ధి సంస్థ (యూడీఏ) పరిధిలో 1,31,733 జనాభా ఉంటుంది.

ప్రత్యేక మాస్టర్‌ ప్లాన్‌..

ఫోర్త్‌సిటీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సర్కారు ఐటీ, పారిశ్రామిక, ఆతిథ్య, పర్యాటక, క్రీడారంగాలకు పెద్దపీట వేయాలని నిర్ణయించింది. కృత్రిమ మేధ (ఏఐ) సిటీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు అత్యాధునిక వాణిజ్య భవనం సహా ఇంటర్నేషనల్‌ కన్వెన్షన్‌ సెంటర్‌, క్రికెట్‌ స్టేడియం తదితర ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు ఇందులో చోటు కల్పించాలని యోచిస్తోంది. ఈ క్రమంలోనే ఫ్యూచర్‌ సిటీ నిర్మాణానికి ప్రతిబంధకాలు రాకుండా, అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా చకచకా సాగేలా ప్రత్యేకంగా అథారిటీ ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చింది. ప్రత్యేక మాస్టర్‌ప్లాన్‌ను కూడా రూపొందించనుంది.

అథారిటీ పరిధిలోకి వచ్చే గ్రామాలివీ

ఆమనగల్‌ మండలం: కోనాపూర్‌, రాంనూతల
ఇబ్రహీంపట్నం: కప్పపహాడ్‌, పోచారం, రాంరెడ్డిగూడ, తులేకలాన్‌, తుర్కగూడ, ఎలిమినేడు, ఎర్రకుంట, తడ్లకాల్వ
కడ్తాల్‌: చరికొండ పట్టికల్వకుర్తి, చరికొండ పట్టిపడ్కాల్‌, ఎక్రాజ్‌గూడ, కడ్తాల్‌, కర్కల్‌పహాడ్‌, ముద్విన్‌
కందుకూరు: దాసర్లపల్లి, అన్నోజిగూడ, గూడూర్‌, దెబ్బడగూడ, గుమ్మడవెల్లి, కందుకూరు, కొత్తూర్‌, గఫూర్‌నగర్‌, లేమూర్‌, మాదాపూర్‌, మీర్‌ఖాన్‌పేట్‌, మహ్మద్‌నగర్‌, ముచ్చర్ల, పంజగూడ, రాచులూర్‌, సర్వరావులపల్లి, తిమ్మాయిపల్లి, తిమ్మాపూర్‌
మహేశ్వరం: మహబ్బత్‌నగర్‌, తుమ్మలూర్‌
మంచాల: ఆగపల్లి, నోముల, మల్లికార్జునగూడ
యాచారం: చౌదర్‌పల్లి, గుంగల్‌, కొత్తపల్లి, కుర్మిద్ద, మేడిపల్లి, మల్కీజ్‌గూడ, మొగుళ్లవంపు, నక్కర్త, నానక్‌నగర్‌, నందివనపర్తి, నజ్దిక్‌ సింగారం, తక్కళ్లపల్లి, తాటిపర్తి, తులేకుర్ద్‌, యాచారం, చింతపట్ల, నల్లవెల్లి.



దుర్గం చెరువు పరిరక్షణకు జలమండలి చర్యలు



దుర్గం చెరువు వద్ద అశోక్‌రెడ్డి తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: దుర్గం చెరువు పరిరక్షణకు ప్రభుత్వం సిద్ధమైంది. చెరువులో మురుగు నీరు చేరి కలుషితం కాకుండా తగిన చర్యలు చేపట్టనుంది. మంగళవారం చెరువు పరిసరాలను జలమండలి ఎండీ అశోక్‌ రెడ్డి, ఈడీ మయాంక్‌ మిట్టల్‌, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, లేక్స్‌, రెవెన్యూ, పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు, ఇతర విభాగాల అధికారులు పరిశీలించారు. రహేజా మైండ్‌ స్పేస్‌ ప్రాంతాల్లో భవన నిర్మాణ, గార్డెనింగ్‌, ల్యాండ్‌ స్కేపింగ్‌ అవసరాల కోసం ఎస్టీపీలో శుద్ధి చేసిన నీటినే వినియోగించే విధంగా చర్యలకు ఉపక్రమించారు. మాదాపూర్‌, సైలెంట్‌ వ్యాలీ ప్రాంతాలు, క్యాచ్‌మెంట్‌ ఏరియాలో ఉత్పన్నమవుతున్న మురుగు నీటిని దుర్గం చెరువులో నిర్మించిన రెండు ఎస్టీపీల ద్వారా శుద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం దుర్గం చెరువు భూగర్భ నీటి మట్టం పెరిగేందుకు, ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని చెరువులోకి వదిలి వేస్తున్నారు. మరోవైపు ఇతర ప్రాంతాల నుంచి అధికంగా వచ్చే మురుగు నీరు చెరువులో కలవకుండా 1000 ఎంఎం డయా పైపులైన్‌ను మాదాపూర్‌ పెట్రోల్‌ బంక్‌ నుంచి మాదాపూర్‌ ఐ-డి వరకు నిర్మించేందుకు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్‌ దశలో ఉన్నాయి. వర్షాకాలంలో వచ్చే వరద నీరు చెరువులో కలవకుండా వాటర్‌ డ్రెయిన్‌ సైతం నిర్మించనున్నారు. దుర్గం చెరువు పరిసరాల నివాసాల నుంచి వచ్చే సిల్ట్‌ డైవర్షన్‌ మెయిన్‌ లో కలకుండా.. సిల్ట్‌ చాంబర్లు నిర్మించుకోవాలని వారికి నోటీసులు జారీ చేసేందుకు జలమండలి సిద్ధమవుతోంది. రహేజా మైండ్‌ స్పేస్‌ ప్రాంతాల్లో భవన నిర్మాణ, పార్కు, ల్యాండ్‌ స్కేప్‌ నిర్వహణ, ఇతర అవసరాలకు తప్పనిసరిగా వంద శాతం రీసైకిల్‌ వాటర్‌నే వినియోగించాలని ఎండీ అశోక్‌ రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్టు సీజీఎం పద్మజ, ఓఎస్డీ సత్యలింగం, జీహెచ్‌ఎంసీ జడ్సీ ఉపేందర్‌ రెడ్డి పాల్గొన్నారు.

బతుకమ్మ కుంట.. బతికెనంట!

అభివృద్ధి పనులు ప్రారంభించిన హైడ్రా
- అడుగున్నర తవ్వితేనే ఉబికి వచ్చిన నీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు



బతుకమ్మ కుంటలో అడుగున్నర లోతులోనే ఉబికివచ్చిన నీళ్లు

సాక్షి, సిటీబ్యూరో: అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట బతుకుతోంది. కబ్జా చెర వీడటంతో దీని అభివృద్ధిపై హైదరాబాద్‌ డిజాస్టర్‌ రెస్పాన్స్‌ అండ్‌ అసెట్‌ ప్రొటెక్షన్‌ ఏజెన్సీ (హైడ్రా) దృష్టి పెట్టింది. ఇళ్లను కూల్చకుండా, ఉన్న కుంటపైనే దృష్టి పెట్టింది. తొలుత చెత్త, మొక్కల్ని తొలగించిన అధికారులు.. తాజాగా చెరువులో పూడికతీత మొదలెట్టారు. మంగళవారం జేసీబీలు కేవలం అడుగున్నర తవ్వగా.. లోపల నుంచి నీళ్లు ఉబికివచ్చాయి. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కుంట అభివృద్ధిలో తమ వంతు సహకారాన్ని అందించడానికి ముందుకు వచ్చారు. ఇది బతుకమ్మ కుంట కాదు ప్రైవేట్‌ స్థలం అంటూ వాదించిన వాళ్లు ఇప్పుడేమంటారంటూ ప్రశ్నిస్తున్నారు. కబ్జాల చెరలో చిక్కిపోయి, ఆనవాళ్లను కోల్పోయిన బతుకమ్మ కుంటకు ప్రాణం పోయాలని కోరుతూ గతంలో అంబర్‌పేటకు చెందిన స్థానికులు హైడ్రా కమిషనర్‌ ఏవీ రంగనాథ్‌ను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా రంగంలోకి దిగిన ఆయన క్షేత్రస్థాయిలో పర్యటన జరిపి వాస్తవాలు నిర్ధారించారు. బతుకమ్మకుంట స్థలం తనదంటూ స్థానిక నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఎలాంటి ఆదేశాలు జారీ చేయని న్యాయస్థానం కింది కోర్టుకు వెళ్లాలని సూచించింది. దీంతో హైడ్రా తన అభివృద్ధి పనులు కొనసాగిస్తోంది. బతుకమ్మ కుంటలో ఉన్న పైపులైన్‌ పగిలి నీళ్లు వచ్చాయంటూ సోషల్‌ మీడియాలో వదంతులు వెల్లువెత్తాయి. ఆ ప్రాంతంలో ఎలాంటి పైపులైన్లు లేవని జలమండలి అధికారులు స్పష్టం చేసినట్లు హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌ తెలిపారు.

పదహారు నుంచి ఐదెకరాలకు తగ్గిన కుంట..

అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను పునరుద్ధరించి, పూర్వ వైభవం తీసుకురావాలని నిర్ణయించిన హైడ్రా అధికారులు దాని పూర్వాపరాలు అధ్యయనం చేశారు. 1962-63 నాటి రికార్డుల ప్రకారం సర్వే నం.563లో 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంట విస్తరించి ఉండేది. ఫుల్‌ట్యాంక్‌ లెవల్‌, బఫర్‌ జోన్లతో కలిపి దీని వైశాల్యం 16.13 ఎకరాలు ఉండేదని అధికారులు తేల్చారు. తాజా సర్వే ప్రకారం అక్కడ కేవలం 5.15 ఎకరాల భూమి మాత్రమే మిగిలినట్లు తేలింది. దీంతో ఈ మేరకు మాత్రమే కుంటను పునరుద్ధరించాలని హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌ నిర్ణయించారు.

- ప్రస్తుతం అక్కడ నివసిస్తున్న వారిని ఖాళీ చేయించకుండా, ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చెరువు తవ్వకాలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకుని హైడ్రాకు సహకరించారు. ఒకప్పటి ఎర్రకుంటనే బతుకమ్మకుంటగా మారిందని, రెవెన్యూ రికార్డులూ అదే చెబుతున్నాయని స్థానికులు హైడ్రా దృష్టికి తెచ్చారు. ఏళ్లుగా నిర్మాణ వ్యర్థాలు, చెత్తతో నిండిపోయిన బతుకమ్మ కుంటను పునరుద్ధరించే చర్యల్ని హైడ్రా చేపట్టింది. బతుకమ్మ కుంట చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టాలని, అందులో స్వచ్ఛమైన నీళ్లు నిలిచేలా చేయడం ద్వారా పర్యావరణం పరిరక్షణ, భూగర్భ జలాల పెరుగుదలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

మరో ఐదు చెరువుల్లోనూ..

హైడ్రా అధికారులు బతుకమ్మ కుంటతో పాటు మరో ఐదు చెరువుల పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. కూకట్‌పల్లి, ఉప్పల్‌ నల్ల చెరువులు, పాతబస్తీలోని బుమ్రుక్‌ దౌలా చెరువు, మాదాపూర్‌లోని తమ్మిడికుంట, సున్నం చెరువుల్లోనూ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. తొలి దశలో వీటిలోని నీళ్లు తొలగిస్తామని, ఆపై కాలుష్యాన్ని శుద్ధి చేసి, చెరువుకు పునరుజ్జీవం కల్పిస్తామని హైడ్రా కమిషనర్‌ ఏవీ రంగనాథ్‌ పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల్ని హెచ్‌ఎండీఏ అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆయా చెరువుల అభివృద్ధిని వచ్చే జూన్‌ మాసం కల్లా పూర్తి చేయనున్నారు.

స్క్రూటినీలో ఓకే..



సాక్షి, సిటీబ్యూరో: గతంలో లేని విధంగా జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కమిటీ ఎన్నికకు సంబంధించి తీవ్ర ఉత్కంఠ నెలకొన్న తరుణంలో నామినేషన్ల స్క్రూటినీ మంగళవారం జరిగింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఇలంబర్తి నేతృత్వంలో జరిగిన స్క్రూటినీలో సెక్రటరీ కె.సత్యనారాయణ, తదితరులు అందరి నామినేషన్‌ పత్రాలు సవ్యంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. అన్ని పత్రాలు సవ్యంగా ఉన్నట్లు నిర్ధారించుకొని, నామినేషన్లు సమర్పించిన 17 మంది నామినేషన్లు అర్హమైనవిగా ప్రకటించారు. 15 మంది స్టాండింగ్‌ కమిటీ సభ్యుల కోసం ఎంఐఎం-కాంగ్రెస్‌ పరస్పర సహకారంతో ఎంఐఎం నుంచి ఎనిమిది మంది, కాంగ్రెస్‌ నుంచి ఏడుగురు నామినేషన్లు దాఖలు చేయడం తెలిసిందే. బీఆర్‌ఎస్‌ నుంచి నామినేషన్లు వేసిన ఇద్దరు వారి నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశాలున్నాయి. లేని పక్షంలో ఎన్నిక జరగనుంది. నామినేషన్ల ఉపసంహరణకు 21వ తేదీ వరకు గడువు ఉంది.

200 మంది పిల్లలకు 'వినికిడి లోపం' చికిత్సలు



సాక్షి, సిటీబ్యూరో: వినికిడి సమస్యతో బాధపడుతున్న 200 మంది పిల్లలకు ఉచితంగా అత్యాధునిక శస్త్ర చికిత్సలు నిర్వహించామని రావూస్ ఈఎన్‌టీ ఆసుపత్రి డైరెక్టర్ శ్రీ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం దేశంలోనే మొదటి సారి ఆసియా పసిఫిక్ అడ్వాన్స్‌డ్ కాక్లియర్ ఇంప్లాంట్ కాన్ఫరెన్స్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టగానే వినికిడికి సంబంధించిన బెరా పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే శస్త్ర చికిత్సలు నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. కాక్లియర్ ఇంప్లాంట్‌లో రిమోట్ ప్రోగ్రామింగ్ అనే కొత్త టెక్నాలజీని పరిచయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ డా. మిలింద్ కీర్తనే, జపాన్‌కు చెందిన డా.షుజిరో మినామి, ఆస్ట్రేలియాకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ పాయల్ ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతా

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



అభివాదం చేస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్, కోదండరాం

కవాడిగూడ: ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. మంగళవారం ఆర్‌ఎంపీ, పీఎంపీలకు కమ్యూనిటీ, పారామెడిక్ శిక్షణ, సర్టిఫికెట్లు అందజేసి ఇండియన్ మెడికల్ కౌన్సిల్ అధికారుల దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టాలకు లోబడి పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైద్యుల అభిప్రాయం తీసుకొని ఒక కమిటీ వేసి ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చినట్టు గుర్తు చేశారు. వైద్యవ్యవస్థ బలోపేతం కావాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. విజ్ఞానదర్శిని రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చొప్పరి శంకర్ ముదిరాజ్, చొల్లేటి బాలబ్రహ్మాచారి, వెంకట్‌రెడ్డి, గుండ్ల బాలరాజు, హుక్కల అశోక్, మోహన్ తదితరులు హాజరయ్యారు.

విద్యను చాలెంజ్‌గా తీసుకోవాలి

విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి

సాక్షి, సిటీబ్యూరో: విద్యను చాలెంజ్‌గా తీసుకుంటే తప్ప అభివృద్ధి సాధ్యం కాదని రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యా విధానంపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్, ఎన్జీవోలతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించారు. విద్యా విధానంపై వారి సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అభివద్ధిలో ప్రపంచంలో మన దేశం 136వ స్థానంలో ఉందని, విద్యాభివద్ధి చేస్తే తప్ప ముందుకు వెళ్లలేమని ఆయన తెలిపారు. రాష్ట్ర విద్యా కమిషన్ ఏర్పడిన తర్వాత దాదాపు 260 విద్యా సంస్థలను సందర్శించి అందరి సలహాలు అభిప్రాయాలను తీసుకున్నామని చెప్పారు. విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల భాషలపై స్పష్టత అవసరమన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

వాట్సాప్‌లో నమూనా.. కొరియర్‌లో సర్టిఫికెట్!

సిటీ-యూపీల మధ్య నకిలీ సర్టిఫికెట్ల దందా

- ఉత్తరప్రదేశ్‌లో ఉన్న ఇద్దరు దళారులూ కీలకమే
- వ్యవస్థీకృతంగా నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా
- మరో ఐదుగురిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ టీమ్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు



పట్టుబడిన నకిలీ సర్టిఫికెట్లు

సాక్షి, సిటీబ్యూరో: పెళ్లి, ఉద్యోగం, విదేశీయానం, బ్యాక్‌లాగ్స్...ఇలా అవసరం ఏదైనా..! టెన్త్, ఇంటర్, డిప్లొమో, డిగ్రీ, పీజీ...ఇలా ఏ విద్యార్హతైనా..! ఎనీ సబ్జెక్ట్, ఎనీ గ్రూప్, ఎనీ పర్సంటేజ్...ఇలా బీఏ నుంచి బీఈ దాకా, ఏయూ నుంచి టీయూ దాకా..! ఆయా పేర్లతో నకిలీ సర్టిఫికెట్లు రూపొందించి విక్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠాకు పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. సోమవారం ఫిల్మ్‌నగర్‌లో చిక్కిన మహ్మద్ వజాహత్ అలీ విచారణలో వెలుగులోకి వచ్చిన వివరాలతో మంగళవారం మరో ఐదుగురిని పట్టుకున్నట్లు తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వెల్లడించారు.

బీటెక్ చదివి దందాలోకి దిగి...

బజార్‌ఘాట్‌కు చెందిన మహ్మద్ హబీబ్ బీటెక్ పూర్తి చేసి టోలిచౌకిలోని ఓ కన్సల్టెన్సీలో పని చేశాడు. అక్కడ సంపాదించిన అనుభవంతో తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం నకిలీ సర్టిఫికెట్లు సరఫరా చేయాలని నిర్ణయించుకున్నాడు. దీనికోసం 2015లో మలక్‌పేట కేంద్రంగా స్టై అబ్రాడ్ పేరుతో కన్సల్టెన్సీ ఏర్పాటు చేశాడు. స్టడీ వీసా పొందడానికి అవసరమైన అర్హతలు, మార్కులు లేని వారితో పాటు అసలు ఉన్నత విద్య అభ్యసించని వాళ్లనీ ఆకర్షించడం మొదలెట్టారు. వీరికి నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ నాంపల్లి, చాదర్‌ఘాట్, బహదూర్‌పుర, సరూర్‌నగర్ పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. బెయిల్‌పై వచ్చినా తన పంథా మార్చుకోకుండా కొనసాగిస్తున్నాడు.

ఉత్తరప్రదేశ్ మీదుగా ఢిల్లీకి వివరాలు..

టోలిచౌకికి చెందిన రజియుల్లా ఖాన్‌ను ఏజెంట్‌గా, ఆలియాబాద్, ఫలక్‌నుమలకు చెందిన సయ్యద్ ఖలీలుద్దీన్, సఖ్లీన్ అహ్మద్, సయ్యద్ మొయినుద్దీన్, మహ్మద్ వజాహత్ అలీలను సబ్-ఏజెంట్లుగా ఏర్పాటు చేసుకున్నాడు. విద్యార్హత పత్రాలు అవసరమైన వారిని సబ్-ఏజెంట్లు ఆకర్షిస్తూ కొందరికి నకిలీవని చెప్పి, మరికొందరికి అసలువే అని నమ్మించి వల్లో వేసుకుంటున్నారు. సబ్-ఏజెంట్లు వారి వివరాలు ఏజెంట్‌కు, ఇతడి నుంచి హబీబ్‌కు చేరుతున్నాయి. ఈ వివరాలను ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్ తివారీ, సునీల్ కపూర్‌లకు పంపిస్తున్నాడు. ఢిల్లీ నుంచి వెళ్లి యూపీలో స్థిరపడిన సునీల్ కపూర్ ఈ సర్టిఫికెట్ల తయారీలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు.

నమూనా ఓకే అయితే సర్టిఫికెట్...

నకిలీ స్టాంపులు, సీళ్లు వినియోగించే సునీల్ కపూర్ ఒరిజినల్ డిగ్రీతో పాటు మైగ్రేషన్ సర్టిఫికెట్, ప్రొవిజనల్ సర్టిఫికెట్, కన్సాలిడేటెడ్ మార్క్స్ మెమో, సెమిస్టర్ల వారీగా మార్కుల జాబితాలు తయారు చేస్తాడు. వీటిపై ఆయా యూనివర్శిటీలకు చెందిన అధికారుల సంతకాలను ఫోర్జరీ ద్వారా పొందుపరుస్తాడు. ఈ సాఫ్ట్‌కాపీ నమూనాను వాట్సాప్ ద్వారా హబీబ్‌కు పంపిస్తాడు. అతడు అభ్యర్థిని సంప్రదించి, వివరాలు ఖరారు చేసిన తరవాత ఆయా సర్టిఫికెట్లను సునీల్ ముద్రిస్తాడు. వాటిని కొరియర్ ద్వారా హబీబ్‌కు పంపిస్తాడు. ఎదుటి వారి అవసరాన్ని బట్టి ఒక్కో సర్టిఫికెట్ రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయిస్తున్న ఈ గ్యాంగ్... ఆ మొత్తాన్ని పంచుకుంటోంది.

ఏపీలోనూ బ్రాంచ్ ఆఫీస్ ఏర్పాటు..

ఈ దందా జోరుగా సాగుతుండటంతో హబీబ్ ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో 2019లో స్టై అబ్రాడ్ బ్రాంచ్ ఏర్పాటు చేశాడు. ఆ ప్రాంతానికి చెందిన శంకర్‌రెడ్డి, మధులతో పాటు గుంటూరుకు చెందిన సుధీర్, అదిలాబాద్‌కు చెందిన నరేందర్‌లను దళారులుగా మార్చుకున్నాడు. వీరి ద్వారా అక్కడి అభ్యర్థులను ఆకర్షించి వారికీ నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్నాడు. ఈ గ్యాంగ్‌పై సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఇ.జంగయ్య నేతృత్వంలో ఎస్సైలు బి.అర్వింద్ గౌడ్, మహ్మద్ జాహెద్, ఎం.సతీష్ కుమార్ తొలుత వజాహత్‌ను పట్టుకున్నారు. ఈ సమాచారం తెలిసిన హబీబ్, రజియుల్లా, ఖలీలుద్దీన్, అహ్మద్, మోయినుద్దీన్ మంగళవారం సికింద్రాబాద్‌కు చేరుకున్నారు.

సర్టిఫికెట్లు ధ్వంసం చేసే ప్రయత్నం..

పోలీసులు తమ వద్దకు వచ్చే ప్రయాదం ఉందని భావించిన వీళ్లు తమ వద్ద ఉన్న సర్టిఫికెట్లు ధ్వంసం చేయడానికి సిద్ధమయ్యారు. ఆపై రైలులో ఉత్తరప్రదేశ్ పారిపోవడానికి పథకం సిద్ధం చేసుకున్నారు. దీంతో ఈ ఐదుగురిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వీరి నుంచి 11 మంది పేర్లతో ఉన్న 114 సర్టిఫికెట్లు, నాలుగు ల్యాప్‌టాప్స్, ప్రింటర్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.

'కమాండ్' తప్పిందా?

- ఐసీసీసీలోకి గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించడంపై పోలీస్ వర్గాల్లో చర్చ
- ముమ్మాటికీ భద్రతా వైఫల్యమే అని విమర్శలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)కు ఇటీవల కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు సమీక్షా సమావేశాలకు హాజరవుతున్నారు. ఇంతటి కీలకమైన ఐసీసీసీలోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి..టాస్క్‌ఫోర్స్ పోలీసునంటూ తిరగడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశం అయింది. ఐసీసీసీలోకి ఎవరు వెళ్లాలన్నా చెకింగ్ పాయింట్‌లో అన్ని వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డు కూడా చూపించాలి. ఎవరిని కలవాలో చెప్పాలి. నకిలీ టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ ఐసీసీసీలోకి మూడుసార్లు వెళ్లి రావడం పట్ల పోలీసులు ఆరా తీస్తున్నారు. లోపలికి ఎలా వచ్చాడు ఎవరిని కలిశాడు, ఏం చెప్పి వచ్చాడు అన్నదానిపై ఉన్నతాధికారులు, నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. కూకట్‌పల్లికి చెందిన జ్ఞాన సాయి ప్రసాద్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను ఎదురుగా ఉన్న నిలోఫర్ కేఫ్‌లో కలుసుకున్న నకిలీ టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్..తన పేరు హరిజన గోవర్ధన్‌గా పరిచయం చేసుకొని హోటల్ బిజినెస్‌లో లాభాలు వస్తాయంటూ రూ.2.82 లక్షలు వసూలు చేశాడు. మూడు విడతలుగా ఇదే హోటల్‌లో బాధితుడు చెల్లించడం జరిగింది. ఈ మూడుసార్లు నిందితుడు హరిజన గోవర్ధన్ ఐసీసీసీ నుంచి బయటికి వచ్చి బాధితుడిని నమ్మించాడు. బాధితుడు కూడా నేరుగా కమాండ్ కంట్రోల్‌సెంటర్ నుంచి సదరు వ్యక్తి వస్తుండటంతో అందులో పని చేస్తున్న వ్యక్తిగానే భావించాడు. ఇక్కడే బాధితుడు దెబ్బతిన్నాడు. అడిగినంత డబ్బు చెల్లించుకొని తీరా మోసపోయిన తర్వాత బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఐసీసీసీలో సీసీ ఫుటేజీలు పరిశీలించగా నిందితుడు మూడుసార్లు రావడం పోలీసులు గుర్తించారు. ఇంతటి కీలకమైన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోకి అది కూడా సీఎం రోజూ హాజరవుతున్న ప్రాంతంలోకి నకిలీ పోలీసు వెళ్లడం దిగ్భ్రాంతికి గురి చేస్తున్నది ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు లోతుగా విచారిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. బాధితుడి నుంచి మరింత సమాచారం రాబడుతున్నారు. గతంలో నిందితుడు ఇలాంటి మోసాలకు పాల్పడి ఉంటాడా..అనే కోణంలో కూడా పాత నేరస్తుల కదలికలపై దృష్టి పెట్టారు. మొన్నటికి మొన్న సచివాలయంలో నకిలీ అధికారులు సంచలనం సృష్టించగా తాజాగా సీఎం సమీక్షలకు వస్తున్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ ఘటన పోలీసులకు సవాల్‌గా మారింది.

బీఆర్‌ఎస్‌పై అసత్య ప్రచారాన్ని ఆపండి

సైబరాబాద్ పోలీసులకు నేతల ఫిర్యాదు

సాక్షి, సిటీబ్యూరో: తెలుగు వైబ్ అనే ట్విట్టర్ హ్యాండిల్ సృష్టించి..బీఆర్‌ఎస్ పార్టీ పైన, అగ్ర నాయకత్వంపై కాంగ్రెస్ పార్టీ చిల్లర ప్రచారం చేస్తోందని బీఆర్‌ఎస్ నేతలు ధ్వజమెత్తారు. కేసీఆర్ ,హరీష్ రావుల మధ్య విభేదాలున్నట్టుగా తెలుగు వైబ్ అదే పనిగా విషప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఈమేరకు తెలుగు వైబ్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్, ఇతర నేతలతో కలిసి సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరీష్ రావు, కేసీఆర్‌లపై తప్పుడు పోస్టులు పెట్టడం ద్వారా బీఆర్‌ఎస్ పార్టీని బద్నామ్ చేయాలని రేవంత్ రెడ్డి కుట్రకు తెరలేపారని ఆరోపించారు. అబద్దపు కథనాలతో బీఆర్‌ఎస్ కేడర్ మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్న తెలుగు వైబ్ పై ఐటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ కాంగ్రెస్ పార్టీ మా నేతల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతోందని డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

శివాజీ జయంతి వేడుకలకు అనుమతి ఇవ్వండి

హైదరాబాద్ పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 19న హైదరాబాద్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకకు అనుమతి ఇవ్వాలని నగర పోలీస్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. నిర్వాహకులకు పలు షరతులు కూడా విధించింది. శాంతియుతంగా వేడుకలు నిర్వహించుకోవాలని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవాలని స్పష్టం చేసింది. ఏదైనా శాంతిభద్రతల సమస్య తలెత్తితే నిర్వాహకులపై చర్యలు తీసుకునే స్వేచ్ఛ పోలీసులకు ఉంటుందని పేర్కొంది. జయంతి వేడుకకు అనుమతి కోరుతూ ఈ నెల 17న పోలీసులకు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ గోల్కొండలోని వీర్ శివాజీ సేన, బీజేవైఎం అధ్యక్షుడు నితిన్ నంద్కర్ హైకోర్టులో మంగళవారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. 19న సాయంత్రం 4 నుంచి 6 గంటల సమయంలో 150 మందితో వేడుకలు నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. జాంబాగ్ ట్రూప్ బజార్‌లోని హనుమాన్ మందిర్ ఎదురుగా ఉన్న సుందర్ భవన్ నుంచి వేడుకలు ప్రారంభమవుతాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి వేడుకలకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రంజాన్‌కు పటిష్ట ఏర్పాట్లు : మంత్రి పొన్నం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి, సిటీబ్యూరో: పవిత్ర రంజాన్ మాసంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రంజాన్‌మాసం ఏర్పాట్లపై సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. చేపట్టాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. మొదట జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ నగరంలో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక శానిటేషన్ బృందాలు ఏర్పాటు చేస్తున్నామని, వీధి దీపాలు మరమ్మతులు ,తాత్కాలిక లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. మసీదులకు ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. పండుగ షాపింగ్ చేసుకోవడానికి ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ అర్ధరాత్రి వరకు వీధి వ్యాపారాలు కొనసాగించడానికి అనుమతించాలని పోలీస్ అధికారులకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మేయర్ విజయలక్ష్మి, తెలంగాణ మైనారిటీ వెల్ఫేర్ స్పెషల్ సెక్రటరీ తౌసిఫ్ ఇక్బాల్, తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ స్టేషన్‌లో ఈజీ జర్నీ

ట్రావెల్ అడ్వైజరీ విడుదల చేసిన ద.మ.రైల్వే

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి రీ డెవలప్‌మెంట్ పూర్తిచేయాలనే లక్ష్యంతో పనుల్లో వేగం పెంచారు. సుమారు రూ.720 కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం స్టేషన్‌లో సివిల్ పనులు కొనసాగుతున్నాయి. ఉత్తరం వైపున ఉన్న స్టేషన్ భవనాన్ని కూల్చివేశారు. దానిస్థానంలో కొత్త భవనం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక చర్యలు చేపట్టింది.

ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్ వైపు....

ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్‌కు వెళ్లేందుకు గణేష్ టెంపుల్ వైపు ఉన్న 2వ గేట్‌ను వినియోగించుకోవాలి. ప్రస్తుతం ఈ గేట్‌ను ప్రయాణికుల రాకపోకల కోసం తెరిచి ఉంచారు. అలాగే జనరల్ బుకింగ్ కౌంటర్లు, విచారణ కేంద్రాలు, సుమారు 750 మంది ప్రయాణికులు వేచి ఉండేందుకు 500 అదనపు సీటింగ్ సామర్థ్యంతో వెయిటింగ్ హాళ్లను ఏర్పాటు చేశారు.

◆ ప్రస్తుతం 4వ గేట్ మూసివేశారు. స్వాతి హోటల్ ఎదురుగా ఉన్న 3వ, 3బి నెంబర్ గేట్‌లను వినియోగించుకోవచ్చు. ఈ గేట్ల వద్ద వద్ద అదనపు ప్రవేశం కల్పించారు.

పదో నెంబర్ వైపు.....

◆ 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌కు వెళ్లేందుకు బోయిగూడ ప్రవేశద్వారం వైపు 8వ గేట్‌ను తెరిచారు. ప్రయాణికులు ఇక్కడ సాధారణ టిక్కెట్‌లను కూడా బుక్ చేసుకొనేందుకు కౌంటర్‌లు ఉన్నాయి.

◆ నిర్మాణ పనులు కొనసాగుతున్న దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎప్పటికప్పుడు అవసరమైన మరమ్మతులను చేసేందుకు 24 గంటల పాటు విధులు నిర్వహించేవిధంగా ప్రత్యేక సిబ్బందిని నియమించారు.

◆ ఒకటో నెంబర్ నుంచి 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్ వరకు ఏ ట్రెన్ ఏ ప్లాట్‌ఫామ్ పైన ఆగనుందనే సమాచారాన్ని తెలుపుతారు.

హెల్ప్‌లైన్ 139...

పునరాభివృద్ధి పనుల్లో భాగంగా పెద్ద ఎత్తున నిర్మాణ పనులు జరుగుతున్నందున ప్రయాణికులు సహకరించాలని అధికారులు కోరారు.ప్రయాణికుల భద్రత, రక్షణ, తక్షణ సహాయ సహకారాల కోసం ఆర్పీఎఫ్ హెల్ప్‌లైన్ - 139 ను సంప్రదించాలని సూచించారు.

తైవాన్ కేంద్రంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్

ముఠా సభ్యుల్లో ముగ్గురి అరెస్టు



పట్టుపడిన క్రికెట్ బుకీలతో పోలీసులు

అమీర్‌పేట: తైవాన్ కేంద్రంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముఠా సభ్యులను ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి వివరాలను వెల్లడించారు. తైవాన్ దేశానికి చెందిన ప్రధాన బుకీ గ్రెగరీ నగరంలో ఉండే ముగ్గురు వ్యక్తుల ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. కరీంనగర్ జిల్లా రామగుండం మండలం ఎల్కపల్లికి చెందిన లింగాల అర్జున్ రాజ్, మాదాపూర్‌లో ఉండే అర్జున్ సోదరుడు లింగాల సాకేత్, పెద్దపల్లి మండలానికి చెందిన మేకల సంజయ్ ఎస్‌ఆర్‌నగర్ బీకేగూడ జయప్రకాష్‌నగర్‌లో ఉంటూ క్రికెట్ బుకీలుగా వ్యవహరిస్తున్నారు. అర్జున్ రాజ్ ఇన్‌స్టాగామ్‌లో 'క్రికెట్ 360 మీడియా' ఐడీని క్రియేట్ చేసి క్రికెట్ రిలేటెడ్ మాధ్యమాల్లో పోస్టింగ్‌లు పెడతారు. ముగ్గురు కలిసి బెట్టింగ్‌లు కట్టే వారి నుండి హైపర్ టూల్ అనే యాప్ ద్వారా ఖాతాదారుల నుండి డబ్బులు డిపాజిట్ చేయిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు ఆ ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుండి 15 మొబైల్ ఫోన్లు,7 ల్యాప్‌టాప్‌లు,10 వరకు బ్యాంకు అకౌంట్స్‌లో ఉన్న రూ.4 లక్షల 73 వేల 508 రూపాయల డిపాజిట్లు స్వాధీనం చేసుకున్నారు. ఖాతాదారుల అనుమతి లేకుండా పొందిన నకిలీ సిమ్ కార్డులతో టీఎంబీ నెట్ బ్యాంకింగ్ ద్వారా లావాదేవీలు జరిపి అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు తైవాన్‌కు చెందిన గ్రెగరీతో పాటు మరో తొమ్మిది మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఇసుక అక్రమ దందాపై టాస్క్‌ఫోర్స్ కన్ను

- పది ప్రాంతాల్లో దాడి చేసిన అధికారులు
- అక్కడ డంప్ చేసిన 1098 టన్నులు సీజ్



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఇసుక అక్రమ దందాను అడ్డుకోవాలంటూ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో రంగంలోకి దిగిన హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తమ పరిధిలో నిఘా ముమ్మరం చేశారు. వెస్ట్, సెంట్రల్, నార్త్‌జోన్లకు చెందిన బృందాలు మంగళవారం పది ప్రాంతాల్లో వరుస దాడులు చేశాయి. రెవెన్యూ అధికారుల సహకారంతో 1098 టన్నుల ఇసుక సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర మంగళవారం తెలిపారు. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.సైదులు నేతృత్వంలోని బృందం తుకారాంగేట్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, బేగంపేట, సికింద్రాబాద్‌ల్లో 889 టన్నులు, వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఇ.జంగయ్య నేతృత్వంలోని బృందం జానకమ్మతోట, యూసుఫ్‌గూడల్లో 143 టన్నులు, సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఖలీల్ పాషా నేతృత్వంలోని బృందం ముషీరాబాద్, గాంధీనగర్, దోమలగూడల్లో 66 టన్నులు సీజ్ చేసింది. ఈ వ్యాపారులంతా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక నిల్వ చేయడం, విక్రయించడం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వివిధ జిల్లాల్లో డెలివరీ చేయడానికి తయారు చేసిన వే బిల్లుల్ని వినియోగించే నగరానికి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు చెప్తున్నారు. ఈ ఇసుకను స్థానికంగా ఎక్కువ ధరకు విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి దందాలపై సమాచారం ఉంటే '100'కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని డీసీపీ వైవీఎస్ సుధీంద్ర కోరారు.

ప్రజావాణికి 1,704 దరఖాస్తులు



అర్జీలపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1,704 దరఖాస్తులు అందాయి. అందులో ఇందిరమ్మ ఇండ్లు పథకం కోసం 1,304 మంది అర్జీలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ 115, విద్యుత్ శాఖ 92, రెవెన్యూ 35, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 05 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 153 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

‘కోర్టు ఆదేశాలు ధిక్కరిస్తున్న బల్దియా’

వెంగళరావునగర్ : జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 అధికారులు కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్నారని, తమ ప్రాంతంలో ఉన్న వీధి శునకాలను పట్టుకెళ్లడం లేదని మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోజురోజుకు కుక్కల బెడద ఎక్కువవుతుందని ఈ విషయమై జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో తాము కోర్టును ఆశ్రయించగా కోర్టు జీహెచ్‌ఎంసీకి ఇదే విషయంపై స్పందించాలని ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



హిమాయత్‌నగర్ స్ట్రీట్ నం.5లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

కాచిగూడ: హిమాయత్‌నగర్ డివిజన్ స్ట్రీట్ నం.5లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను యూత్ కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనీష్ గంగపుత్ర ఇటీవల ఎమ్మెల్యే దానం నాగేందర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మంగళవారం తాగునీటి సమస్యను స్థానిక కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్, అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా జలమండలి అధికారులు, సిబ్బందితో కలిసి కార్పొరేటర్ స్ట్రీట్ నం.5లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. లో–ప్రెషర్‌తో మంచి నీరు నల్లాల ద్వారా తక్కువగా వస్తోందని స్థానికులు తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు స్థానికులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, బాలకిషన్, విజయ్, నాగరాజు పాల్గొన్నారు.

హెచ్‌ఈఆర్–2 ప్రోటీన్ టెస్ట్‌పై ప్రత్యేక శిక్షణ

బంజారాహిల్స్: మహిళల్లో వచ్చే రొమ్ము కేన్సర్‌తో పాటు కడుపులోని పలు భాగాలకు వచ్చే కేన్సర్లు అత్యంత త్వరితగతిన ఎదగడానికి కారణమయ్యే హెచ్‌ఈఆర్2 ప్రోటీన్‌కు సంబంధించిన టెస్ట్‌పై బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన లెబరేటరీ మెడిసిన్ విభాగం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ శిక్షణ కార్యక్రమంలో అమెరికా హ్యూస్టన్‌లోని యాండీ ఆండర్సన్ కేన్సర్ సెంటర్ ప్రొఫెసర్ ఆఫ్ పాథాలజీ సావిత్రి కృష్ణమూర్తితో పాటు పలువురు సీనియర్ పాథాలజిస్టులు హాజరై తమ అనుభవాలను పంచుకోవడమే కాకుండా మెళుకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో బసవతారకం కేన్సర్ ఆస్పత్రి సీఈఓ కృష్ణయ్య, మెడికల్ డైరెక్టర్ టీఎస్ రావు, మెడికల్ సూపరింటెండెంట్ ఫణి కోటేశ్వరరావు, చీఫ్ పాథాలజిస్ట్ సుశీల కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా ఇండియన్ ఇన్నోవేషన్ ఐకాన్స్...

సాక్షి, సిటీబ్యూరో: దేశ వ్యాప్తంగా ప్రభావవంతమైన, వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్న మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎంఐఎఫ్) ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇన్నోవేషన్ ఐకాన్స్ పదో ఎడిషన్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. గతంలో ఇన్నోవేషన్ ఫర్ ఇండియా అవార్డులుగా పిలిచే ఈ కార్యక్రమం ప్రస్తుత గేమ్ ఛేంజింగ్ ఆవిష్కరణలను గుర్తిస్తుంది. ఇందులో భాగంగా మార్చి 6న వెయ్యి మంది ప్రముఖ నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఇన్వెస్టర్లు, ఛేంజ్ మేకర్లతో ఈ మెగా కార్యక్రమంలో జరగనుందని మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఫౌండర్ హర్ష్ మారివాలా తెలిపారు.

పాఠశాలలకు తనిఖీ బృందాలు

- ఇంటర్నల్ మార్కుల పరిశీలనకు 17 టీమ్‌లు
- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు చేయనున్న టీచర్లు



బంజారాహిల్స్: పదో తరగతి పరీక్షలు మార్చి 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల నమోదు ప్రాధాన్యత సంతరించుకుంది. పది విద్యార్థులకు వారి పరిజ్ఞానాన్ని బట్టి 20 మార్కులు ఇంటర్నల్ మార్కులుగా ఇవ్వనున్నారు. ఈ మార్కులు విద్యార్థుల ఉత్తీర్ణతకు ఎంతో కీలకం కావడంతో తనిఖీ బృందాలు ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని కూలంకషంగా పరిశీలిస్తున్నారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత, 153 ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల తనిఖీలకు 17 బృందాలు ఏర్పాటుచేశారు. ఈ బృందాలు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించనున్నాయి. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా 20 ఇంటర్నల్ మార్కులు వేసే పద్ధతి గత పదేళ్లుగా కొనసాగుతుంది. గత నవంబర్‌లో ఈ పద్ధతికి విద్యాశాఖ స్వస్తి పలుకుతున్నట్లుగా ప్రకటించినప్పటికీ విద్యార్థులను తాము ఇంటర్నల్ మార్కుల విధానంతో సంసిద్ధం చేశామని ఉపాధ్యాయ సంఘాలు సూచించడంతో ఈ ఏడాది మాత్రమే ఆ పద్ధతిని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇంటర్నల్ మార్కుల పరిశీలనకు తనిఖీ బృందాలను ఏర్పాటుచేశారు. ఈ నెల 21 నుంచి ఆన్‌లైన్‌లో ఈ మార్కుల నమోదు ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు అంచనా వేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ పరీక్షల విభాగం ఆదేశించింది. ఇందు కోసం మంగళవారం నుంచి ఆయా పాఠశాలల్లో ఈ బృందాలు పరిశీలిస్తున్నాయి.

వాస్తవాలు తెలుసుకునేందుకు..

అంతర్గత మార్కుల నమోదు విషయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా సామర్థ్యం లేని విద్యార్థికి కూడా తమ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత కోసం 20 మార్కులు వేస్తున్నట్లు గతంలోనే ఫిర్యాదులు అందాయి. ప్రైవేటు పాఠశాలల్లో అంతర్గత మార్కుల నమోదుపై పలు ఫిర్యాదులు ఉన్నాయి. ఫెయిలైన విద్యార్థికి కూడా 20 ఇంటర్నల్ మార్కులు వేసిన సందర్భాలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఫార్మేటివ్ పరీక్షల్లో వాస్తవంగా మార్కులు నమోదు చేశారా? ఇష్టానుసారంగా వేశారా..? అన్నది ఈ బృంద సభ్యులు పరిశీలిస్తారు. లోపాలు ఉంటే వాటిని సరిజేసిన తర్వాతనే ఇంటర్నల్ మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. కాగా ఈ పరిశీలనకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులనే నియమించారు. ఒక్కో బృందంలో హెచ్‌ఎంతో పాటు భాషా పండితుడు, స్కూల్ అసిస్టెంట్ స్థాయి ఉపాధ్యాయుడు ఉంటాడు.

జిల్లా అధికారులు ఒక్కో బృందానికి 10 పాఠశాలల బాధ్యతలు అప్పగించారు. టీచర్లు పరిశీలించి ఆమోదించిన మార్కులను గడువు లోగా ఆన్‌లైన్‌లో మార్కులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాల్సి ఉంటుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో 1218 మంది విద్యార్థులు..

మార్చి 21 నుంచి జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు ఖైరతాబాద్ జోన్ పరిధిలో 17 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 1218 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 615 మంది బాలికలు కాగా 683 మంది బాలురు ఉన్నారు.

27, 28న మాదిగ దండోరా రాష్ట్ర మహాసభలు



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దండోరా జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్‌మాదిగ

పంజగుట్ట: మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో ఈనెల 27, 28వ తేదీల్లో నాగార్జునసాగర్‌లోని హోటల్ హరిత విజయ్ విహార్‌లో దండోరా రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు దండోరా జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ పోస్టర్‌ను రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల శ్యామ్ మాదిగతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. మాదిగల చిరకాల స్వప్నం ఎస్సీ వర్గీకరణ చేసినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. అదే సమయంలో వెనకబాటు, జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. హైదరాబాద్‌లో మాదిగ అమరవీరుల స్మారక భవనానికి స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టాలన్నారు. వర్గీకరణ ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు 250 గజాల స్థలం, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. దండోరా గత 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణతో పాటు మాదిగ, ఉపకులాలు ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉందన్నారు. మహాసభల్లో మాదిగలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సగ్గి ప్రకాష్ మాదిగ, శాంతి కుమార్, ప్రభాకర్, శ్రీనివాస్, మురళి, నరేష్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయం సీజ్ చేశారు... మధ్యాహ్నం చెల్లించారు!



ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో ఇంటిని జప్తు చేస్తున్న సర్కిల్–18 అధికారులు



పన్ను చెల్లిస్తున్న యజమాని

బంజారాహిల్స్: గడువు సమీపిస్తుండటంతో ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టిపెట్టిన జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 అధికారులు మొండిబకాయిదారులపై నజర్ పెట్టారు. ఏళ్ల తరబడి ఆస్తిపన్ను చెల్లించకుండా మొండికేస్తున్న వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే డిమాండ్ నోటీసులు, రెడ్ నోటీసులు జారీ చేసిన అధికారులు తాజాగా కొన్నేళ్లుగా పేరుకుపోయిన బకాయిలు రాబట్టుకునేందుకు వారెంట్లు జారీ చేసి స్పందించకుంటే ఆస్తులు సీజ్ చేస్తున్నారు. మంగళవారం సర్కిల్–18 ట్యాక్స్ విభాగం అధికారులు బంజారాహిల్స్ రోడ్ నం.10లోని నూర్‌నగర్‌లో గత ఆరేళ్లుగా పన్ను చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్న ఇంటికి వెళ్లి ఆ ఇంటి యజమాని అద్దెకిచ్చిన బ్యాంకును, హోటల్‌ను సీజ్ చేశారు.

◆ ఆరేళ్లుగా రూ.78 లక్షలు పన్ను బకాయిలు పేరుకుపోయాయి. వీటిని వసూలు చేసేందుకు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చిని సదరు యజమాని స్పందించలేదు. దీంతో షెట్టర్లను మూసేసి సీజ్ చేయడంతో సదరు యజమాని కదిలి వచ్చాడు. రూ.78 లక్షల్లో రూ.34 లక్షలు అప్పటికప్పుడే చెల్లించి వేసిన సీల్‌ను తొలగించుకున్నాడు. మిగతా మొత్తాన్ని కూడా త్వరలోనే చెల్లిస్తానని హామీ పత్రం రాసిచ్చాడు. ఈ సందర్భంగా డీసీ ప్రశాంతి మాట్లాడుతూ.. మొండిబకాయిదారులు ఆస్తిపన్ను చెల్లించకపోతే జప్తు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. సకాలంలో పన్నులు చెల్లించుకోవాలని సూచించారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన.. ఫిర్యాదుతో కేసు నమోదు

బంజారాహిల్స్: ‘మనం ఊరెళ్లిన సమయంలో నీ స్నేహితుడు మన ఇంటికి వచ్చి కూతురి పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని.. రాత్రంతా ఇంట్లోనే నిద్రించాడని’ భార్య తన భర్తకు చెప్పింది. చేసింది నా స్నేహితుడే కదా పోనీలే అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధిత తల్లి బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

◆ బంజారాహిల్స్ రోడ్ నం.5లోని ఓ బస్తీలో నివసించే భార్యాభర్తలు తమ 14 ఏళ్ల కూతురితో పాటు మిగతా ఇద్దరిని ఇంట్లోనే వదిలేసి ఈనెల 17వ తేదీన మహబూబ్‌నగర్‌కు వెళ్లారు. రాత్రి ఆమె భర్త స్నేహితుడు మోహన్‌సింగ్, సోను బాధితురాలి ఇంటికి వచ్చారు. ఇంట్లోనే మద్యం సేవించారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో నిద్రిస్తున్న బాలిక(14) గదిలోకి వెళ్లిన సోను ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. నోరు నొక్కి అక్కడే పడుకున్నాడు. ఆమె అరవడానికి ప్రయత్నించగా బెదిరించాడు. తెల్లవారుజామున 6గంటల ప్రాంతంలో అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

◆ ఇంటికి వచ్చిన తల్లికి బాలిక జరిగిన విషయాన్ని చెప్పింది. ఇదే విషయాన్ని బాధిత తల్లి తన భర్త దృష్టికి తీసుకొచ్చింది. వచ్చింది నా స్నేహితుడే కదా అంటూ భర్త నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. దీంతో బాధితురాలు తన కూతురి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపట్ల చర్యలు తీసుకోవలంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మోహన్‌సింగ్, సోనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిషేధిత వేళల్లో లారీలు నడుపుతున్న వారిపై కేసు

మూడు లారీలు సీజ్

ఫిలింనగర్: నిషేధిత వేళల్లో తిరుగుతున్న లారీలపై జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్సై నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు వాహనాలను సీజ్ చేసి ముగ్గురు డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. ఫిలింనగర్ కొత్త చెరువు సినార్ వ్యాలీ చౌరస్తాలో సోమవారం సాయంత్రం జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా నిషేధిత వేళల్లో మూడు లారీలు పట్టుబడ్డాయి. చక్రవర్తి, సహదేవ్, మల్లేష్ అనే ముగ్గురు డ్రైవర్లు ఈ లారీలను నడుపుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ముగ్గురు డ్రైవర్లు ఫిలింనగర్‌కు చెందిన వారితో పాటు మూడు లారీలను సీజ్ చేశారు. ఫిలింనగర్ పోలీసులు వీరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

వెంగళరావునగర్ : అకారణంగా ఆటో డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. జీడిమెట్ల ప్రాంతానికి చెందిన ఆర్.సంతోష్ ర్యాపిడో ఆటో నడిపిస్తున్నాడు. ఈ నెల 17న అర్చన అనే కస్టమర్ బుక్ చేసుకోవడంతో ఆటోను వెంగళరావునగర్ రోడ్డు పక్కన నిలిపి ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ క్రమంలో కారు వచ్చిన భరత్ ఓ యువకుడు ఆటోను పక్కకు తీయాలని చెప్పాడు. తాను రోడ్డు పక్కన ఆటో పెట్టానని పక్కన దారి ఉందని చెప్పడంతో ఆగ్రహానికి గురైన కారులోని భరత్ అనే యువకుడు ఆటో డ్రైవర్‌పై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అందుబాటులోకి ‘సీయూఎస్‌ఏ ఇంటెగ్రా అల్ట్రాసోనిక్ డైసెక్టర్’

బంజారాహిల్స్: మెదడు, కాలేయ ట్యూమర్లకు సంబంధించిన శస్త్ర చికిత్సలలో ఖచ్చితత్వాన్ని పెంపొందించే సీయూఎస్‌ఏ ఇంటెగ్రా అల్ట్రాసోనిక్ డైసెక్టర్‌ను బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రిలో మంగళవారం ప్రారంభించారు. సంస్కృతి శిఖర ట్రస్టు వారు అందించిన ఆర్థిక సహాయంతో సుమారు రూ.90 లక్షల విలువ చేసే అత్యాధునిక శస్త్ర చికిత్స వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆస్పత్రిని స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మరింత మెరుగైన సేవలు అందించడానికి అత్యాధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆస్పత్రి ప్రతినిధులు వెల్లడించారు. అందులో భాగంగా ఇప్పటికే నాల్గో జనరేషన్ డావిన్సీ రోబోటిక్ శస్త్రచికిత్స వ్యవస్థతో పాటు పిల్లల కొత్త వార్డు, పీడియాట్రిక్ ఐసీయూను కూడా ఇటీవల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి శిఖర్ ట్రస్టు ప్రతినిధులు తోరల్ దేశాయి, జిన్నీ, నిషా షా, న్యూరో అంకాలజిస్ట్ వెంకటేశ్వరరావు, కాన్సర్ ఆస్పత్రి సీఈఓ కృష్ణయ్య, మెడికల్ డైరెక్టర్ టీఎస్‌రావు, మెడికల్ సూపరింటెండెంట్ ఫణి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సులో బంగారు గొలుసు చోరీ

వెంగళరావునగర్: బస్సులో బంగారు గొలుసు చోరీకి గురైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కార్మికనగర్‌లో నివసించే జి.జనార్థన్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. ఈ నెల 17న అఫ్జల్‌గంజ్ ప్రాంతానికి వెళ్లి తిరిగి బస్సులో వచ్చాడు. కార్మికనగర్ వద్ద బస్సు దిగి ఇంటికి వెళ్లి చూసుకోగా మెడలోని బంగారు గొలుసు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

వెంగళరావునగర్: గాయాలకు గురై స్పృహ తప్పి పడిపోయిన వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం కె.సత్యనారాయణ, భవానీ దంపతులు యాదగిరినగర్‌లో నివాసముంటున్నారు. సత్యనారాయణ మాసబ్‌ట్యాంక్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తుంటాడు. ఈ నెల 5న డ్యూటీకి వెళ్లిన సత్యనారాయణ రాత్రి ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన భార్య పనిచేసే చోటుకు ఫోన్ చేయగా సాయంత్రం డ్యూటీ నుంచి ఇంటికి వెళ్లాడని చెప్పారు. మరోసటి రోజు పోలీసులు ఆమెకు ఫోన్ చేసి సత్యనారాయణ అపస్మారక స్థితిలో, గాయాలతో పడి ఉన్నాడని చెప్పడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి ఇంటికి తీసుకెళ్లింది. నాటి నుంచి సరిగ్గా మాటలు రాకపోవడంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించింది. ఆ తర్వాత గాంధీ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తుండగా 17న మృతిచెందాడు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థికే మా మద్దతు



బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్

కాచిగూడ: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీకి ఆమ్ ఆద్మీ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతోందని పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వందల కోట్లు డబ్బులు వెదజల్లి గెలిచిన తర్వాత కనీసం మీ ఫోన్‌కాల్ కూడా ఎత్తని అభ్యర్థులు కావాలో లేక మీ మధ్యనే ఉండి మీకోసం పని చేసే విద్యావంతుడు కావాలో మీరే నిర్ణయించుకోవాలని పట్టభద్రులకు సూచించారు. ఏ పదవి లేకపోయినా తన సొంత నిధులతో నిస్వార్థంగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మహ్మద్ ముస్తాక్ అలీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీ, నేతలు విజయ్ ముల్లంగి, నర్సింగ్, యమునగౌడ్, జావీద్, షరీఫ్, డాక్టర్ లక్ష్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.

4 గ్రూపులుగా విభజించి వర్గీకరణ అమలు చేయాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

కాచిగూడ: ఎస్సీలను నాలుగు గ్రూపులుగా విభజించి వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. తెలంగాణ రాష్ట్ర మాల దాసరి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెల్ల సోమయ్య అధ్యక్షతన మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎస్సీలలోని మాదిగ ఉపకులాలను గ్రూపు–1లో, మాదిగలను గ్రూపు–2లో, మాల ఉపకులాలలను గ్రూపు–3లో, మాలలను గ్రూపు–4లో వేసి వర్గీకరణ అమలు చేస్తే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వర్గీకరణలో నాల్గో గ్రూప్ ఏర్పడకుండా మాలలే అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. మాల దాసరి కులస్తులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికలో కొన్ని లోపాలు ఉన్నాయన్నారు. వాటిని సవరించాలని తాము చేసిన విజ్ఞప్తికి స్పందించిన కమిషన్ గడువును మార్చి 10వ తేదీకి పొడిగించిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ఫలాలు దళితులకు అందించడమే తమ లక్ష్యమన్నారు. మాలలను గ్రూపు–4లో చేరిస్తేనే మాల ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

మాల జాతిని అణగదొక్కేందుకు కుట్ర జరుగుతోంది

ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరం జాతీయ చైర్మన్ వి.కృష్ణస్వరూప్



లిబర్టీ: రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలకు గుణపాఠం చెప్తామని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరం జాతీయ చైర్మన్ వి.కృష్ణస్వరూప్ అన్నారు. రాజ్యాంగ సూత్రాలను న్యాయ సూత్రాలను పాటించకుండా తెలంగాణ ప్రభుత్వం వర్గీకరణ కోసం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో న్యాయవాదుల మేథోమథన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు పూనుకుంటే ఇతర దళితులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకోకపోతే దళిత జాతికి భవిష్యత్ లేదని స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగ రంగాలలో మాల జాతిని అణగదొక్కేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఆ కుట్రలో భాగంగానే వర్గీకరణకు పూనుకోవడం ఎంత వరకు సమంజసం అని నిలదీశారు. సమగ్ర కుల గణన సర్వేలో మాలల జనాభాను తక్కువ చూపించి మాదిగ జనాభా లెక్క ఎక్కువ చూపించి తొమ్మిది శాతం రిజర్వేషన్లు కల్పించాలని యోచించడం అన్యాయమని పేర్కొన్నారు. సామాజిక సూత్రాలకు విరుద్ధంగా వర్గీకరణ చేసి దళిత జాతికి అన్యాయం చేస్తారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరం అధ్యక్షుడు రామప్ప, ప్రధాన కార్యదర్శి నక్క దేవేందర్, న్యాయవాదులు ఎస్.శ్రీనివాస్, గోలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగల ముఠా అరెస్టు

- నంబర్‌ప్లేట్లు తొలగించి తిరుగుతున్న ముగ్గురు నిందితులు
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు


బంజారాహిల్స్: పార్కింగ్ చేసి ఉన్న బైక్‌లను దొంగిలిస్తున్న ముఠాను జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. యూసుఫ్‌గూడ కృష్ణానగర్‌కు చెందిన పోతులూరు చంద్రశేఖర్ (39), ఇందిరానగర్‌కు చెందిన కలిదిండి సూరిబాబు (35), జూబ్లీహిల్స్‌కు చెందిన దండంగి ప్రసాద్ (32) జల్సాలకు అలవాటుపడి ఈజీ మనీ కోసం దొంగతనాలకు పాల్పడుతున్నారు. పార్కింగ్ చేసి ఉన్న బైక్‌లను తమతో పాటు తెచ్చుకున్న తాళం చెవిలతో తీసి చోరీ చేస్తున్నారు.

◆ ఈ నెల 10వ తేదీన శ్రీకృష్ణానగర్‌లో లీనమల్లు వెంకటసతీష్ పార్కింగ్ చేసిన తన బైక్ చోరీకి గురైందంటూ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు జూబ్లీహిల్స్ క్లబ్ వద్ద ఈనెల 16న వాహనాలు తనిఖీలు చేస్తుండగా నంబర్ ప్లేట్‌లేని హోండా యాక్టీవాపై ముగ్గురు యువకులు పట్టుబడ్డారు. ఈ వెహికల్‌కు సంబంధించి ధ్రువపత్రాలు అడగ్గా తమ వద్ద లేవని చెప్పడమే కాకుండా అనుమానాస్పద కదలికలతో ప్రవర్తించాడు.

◆ దీంతో ఈ ముగ్గురిని మరింత లోతుగా విచారించగా శ్రీకృష్ణానగర్‌లో బైక్ చోరీ చేశామని ఒప్పుకున్నారు. నంబర్ ప్లేట్ తొలగించి తిరుగుతున్నట్లుగా పోలీసులకు తెలిపారు. మధురానగర్, జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మూడు యాక్టీవా బైక్‌లు చోరీ చేసినట్లు పేర్కొన్నారు. చోరీ చేసిన బైక్‌ల నంబర్ ప్లేట్లు తొలగించి వాటిని తక్కువ ధరకు విక్రయిస్తున్నామని తెలిపారు. వచ్చిన సొమ్ముతో మద్యం సేవించడం, విందులకు వెళ్లడం, గంజాయి తాగడం చేస్తుంటారని పోలీసుల దర్యాప్తులో తేలింది. మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిని దొంగతనం కేసులో అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాలకు అలవాటుపడి ఆటో చోరీ

నిందితుడిని రిమాండ్‌కు పంపిన పోలీసులు



సయ్యద్ అబ్దుల్లా

బంజారాహిల్స్: దొంగిలించిన ఆటోలో దర్జాగా తిరుగుతున్న నిందితుడిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిలింనగర్ ద్వారకానగర్ కాలనీలో ఈనెల 16న పార్కు చేసిన ఆటో (టీజీ34 టీ 2871)ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారంటూ బాధితుడు ఫిలింనగర్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి క్రైమ్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తుండగా దొంగిలించిన ఆటోలో తిరుగుతున్న బార్కాస్ కొత్తపేట వెంకటపూర్‌కు చెందిన సయ్యద్ అబ్దుల్లాను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం ఒప్పుకున్నాడు. జల్సాల కోసం ఆటో దొంగిలించినట్లుగా పోలీసుల విచారణలో పేర్కొన్నాడు. ఈ మేరకు ఆటోను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



చార్మినార్, గోల్కొండ కోట, కుతుబ్ షాహీ టూంబ్స్ తదితర ల్యాండ్ మార్కుల ద్వారా అందివచ్చిన గొప్ప సాంస్కృతిక వారసత్వం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి నిలయంగా ప్రపంచ వేడుకలకు చిరునామాగా మారిన ఆధునిక తత్వం వెరసి ప్రపంచ పర్యాటకులకు నగరాన్ని గమ్యస్థానంగా మారుస్తున్నాయి. ఇవే కాకుండా భారీ సినిమాల తయారీ కేంద్రంగా కళలు, ప్రసిద్ధ వంటకాలు కూడా వృద్ధికి ఊతమిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం రూపొందించిన పర్యాటక పాలసీ నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్త పర్యాటకాభివృద్ధికి మరింత దోహదం చేయనుంది. ఈ నేపథ్యంలో నగర పర్యాటక రంగ వృద్ధి విశేషాలపై ఓ విశ్లేషణ. - సాక్షి, సిటీబ్యూరో

ఇతర మెట్రో నగరాలకన్నా వృద్ధి వేగవంతం

చారిత్రక విశేషాలు, ఆధునిక ఆకర్షణల మేలు కలయిక

కోవిడ్ తర్వాత పుంజుకుని దౌడ్ తీస్తున్న పర్యాటకం



టూరిజెమ్

పర్యాటకంలో సత్తా చాటుతున్న భాగ్యనగరం

నగర పర్యాటక అభివృద్ధిలో బిజినెస్ టూరిజమ్ కీలక పాత్ర పోషిస్తోంది. అంతర్జాతీయ కంపెనీలు, పెట్టుబడుల రాకతో ప్రపంచ స్థాయి వాణిజ్య సదస్సులు, సమావేశాలకు వేదికగా, వ్యాపార పర్యాటకానికి నగరాన్ని ప్రధాన గమ్యస్థానంగా మార్చాయి. అదే విధంగా శరవేగంగా వృద్ధి చెందుతున్న ఆరోగ్య వసతులు, కార్పొరేట్ ఆస్పత్రులు విదేశాలతో పోలిస్తే అందుబాటులోనే ఉన్న వైద్య సేవల వ్యయం నగరాన్ని ఆరోగ్య పర్యాటకానికి రాజధానిగా మారుస్తున్నాయి.

మెట్రో టు.. ఎయిర్ ట్రా'వెల్'..

నగర పర్యాటక వృద్ధికి నిదర్శనంగా నిలుస్తోన్న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం 72 దేశీయ, 18 అంతర్జాతీయ ప్రయాణ గమ్యస్థానాలకు ప్రయాణ సౌకర్యాలను అందిస్తోంది. గత 2023–24లో నగరం నుంచి సుమారు 20లక్షల మంది అమెరికా, యుకేలకు ప్రయాణించారు. ఇందులో గణనీయమైన భాగం విద్యార్థులు, నిపుణులు ఉన్నారు. ప్రయాణికుల సంఖ్య 2021లో 8 లక్షల నుంచి 2022లో 12.4 లక్షలకు, 2023లో దాదాపు 21 లక్షలకు, 2024లో దాదాపు 25 లక్షలకు పెరిగింది. ఇది సుమారు 45.6% సమీకృత వార్షిక వృద్ధి రేటుగా సూచిస్తుంది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) డేటా ప్రకారం.. 2023 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2024 వరకూ చూస్తే.. దేశంలోని టాప్ 5 మెట్రో నగరాల్లో ప్రయాణికుల రద్దీ పరంగా సిటీ అత్యధిక వృద్ధి సాధించింది. నగరం 11.7% పెరుగుదలను సాధించగా బెంగళూరు (10.1%) ముంబై (4%), కోల్‌కతా 9.7%, చెన్నై 3.3 శాతంతో వెనుకబడ్డాయి.

నగరం వెలుపల కూడా..

నగరంలోని చారిత్రాత్మక కట్టడాలతో పాటు సాలార్ జంగ్ మ్యూజియం, నిజాం మ్యూజియం, లాడ్ బజార్ వంటివి హిస్టారికల్ టూరిజం వృద్ధికి దోహదం చేసే విశేషాలుగా నిలుస్తున్నాయి. ఇక నగరానికి కాస్త దూరంలోనే ఉన్న యాదాద్రి, బాసర, నల్గొండ, మెదక్, రామప్ప, ఆలంపూర్, వేములవాడ, కాళేశ్వరం.. వంటి చోట్ల స్పిరిట్యువల్ టూరిజం వృద్ధికి కారణంగా నిలుస్తున్నాయి. అలాగే పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట్ వంటివి సంప్రదాయ హస్తకళల పట్ల ఆసక్తి కలిగిన పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.

ఫుల్.. హోటల్స్..

ప్రస్తుతం, రాష్ట్రంలో త్రీ స్టార్, ఫైవ్ స్టార్ హోటల్స్ పరంగా చూస్తే.. 7,500 గదులు అందుబాటులో ఉన్నాయని అంచనా. వీటిలో మన హైదరాబాద్ నగరంలోనే 5,000 వరకూ ఉన్నాయి. రాజధాని నగరంలో అడుగుపెట్టిన వారి సంఖ్య ఏడాదిలో 16 శాతానికి పైగా పెరిగిందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నగరంలోని ఐటీ కారిడార్‌లోని హోటళ్లు దాదాపు 80 శాతం ఆక్యుపెన్సీతో కళకళలాడుతున్నాయని తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట రెడ్డి చెబుతున్నారు.

దేశీయ పర్యాటకులు 2021–22లో 3.2 లక్షల మంది, 2022–23లో 6.07 లక్షల మంది తెలంగాణను సందర్శించారని, 89.84 శాతం పెరుగుదల నమోదు చేసిందని లెక్కలు చెబుతున్నాయి. ఇదే కాలంలో విదేశీ పర్యాటకులు 5,917 నుంచి 68,401 (10–56.01 శాతం)కి పెరిగారని గణాంకాలు చెబుతున్నాయి. ఈ వృద్ధిలో సింహ భాగం నగరానికే దక్కుతుందనేది తెలిసిందే.




రానున్నాయ్ ఆకర్షణలెన్నో..

ముంబయిలో జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌ను నెలకొల్పే ముందు వరకూ కూడా భారీ స్థాయి సమావేశాలకు నగరంలోని హెచ్‌ఐసీసీ ప్రముఖ గమ్యస్థానంగా ఉంది. అయితే ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీలో 10,000 సీట్ల సామర్థ్యం గల కన్వెన్షన్ సెంటర్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇది ఎమ్ఐసీఎఫ్ సెగ్మెంట్‌లో నగరాన్ని తిరిగి అగ్రస్థానంలో ఉంచుతుందని ప్రభుత్వాధినేతలు చెబుతున్నారు. ఇటీవలే హుస్సేన్ సాగర్‌లో వాటర్ స్పోర్ట్స్‌ను ప్రారంభించారు. దుబాయ్ తరహా షాపింగ్ మాల్స్ సహా ఇంకా మరెన్నో ఆకర్షణలు నగర పర్యాటకానికి మరింత ఊపు తేనున్నాయి.

అరుదైన కలెక్షన్స్‌తో.. స్టోరీ లైన్ ఆర్ట్ గ్యాలరీ..





సాక్షి, సిటీబ్యూరో: కళను కళ్లకు కట్టినట్లు చూపించే అద్భుతమైన చిత్రాలు. పల్లె జీవన విధానాన్ని ప్రతిబింబించే కళారూపాలు. పండుగలు, సంస్కృతి, సంప్రదాయాలు, నాగరికతను తెలియజేసే ఎన్నో చిత్రాలకు జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లోని స్టోరీ లైన్ ఆర్ట్ గ్యాలరీ నిలయమైంది. దేశం నలుమూలల ఉన్న ప్రముఖ చిత్ర కారులైన ఎంఎఫ్ హుస్సేన్, దేవేంద్ర తుంబూరు, లక్ష్మి, కుమార స్వామి, ఆనంద్, లక్ష్మణ్, విజయ్, శ్రీకాంత్, వంటి 50 మంది ప్రముఖ కళాకారుల అరుదైన కలెక్షన్స్ ఇక్కడ దర్శనమిస్తున్నాయి. ఉగాది మొదలుకుని సంక్రాంతి వరకూ వచ్చే తెలుగు పండుగలు తెలియజేసే 9 చిత్రాలు, సరస్వతి, లక్ష్మి, దుర్గాదేవి రూపాలు, నల్లరాయితో తయారు చేసిన ఏనుగు, మట్టితో తయారు చేసిన పలు గృహ అలంకరణ వస్తువులు, హ్యాండ్ మేడ్ చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఒక్కో చిత్రానికి రూ.15 వేల నుంచి రూ.3 లక్షలకుపైగా వెచ్చిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు రాధిక మాట్లాడుతూ ఏటా రెండు దఫాలు అరుదైన కలెక్షన్స్‌తో ఆర్ట్ గ్యాలరీ నిర్వహిస్తామని తెలిపారు. మంచి చిత్రాలకు, కళాకారులకు సమాజంలో ఎంతో విలువ, గౌరవం లభిస్తుందని తెలిపారు. ఇంటి అలంకరణపై అవగాహనకు మా ఇంటినే గ్యాలరీగా మార్చానని ఆమె పేర్కొన్నారు.



నేనొక శారీ లవర్‌ని

నటి ప్రియాంక



'నాకు చీరలంటే ఎంతో ఇష్టం.. ఒక్క మాటలో చెప్పాలంటే నేనొక శారీ లవర్‌ని' అని చెప్పారు హీరోయిన్ ప్రియాంక అరుల్ మోహన్. జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లో గ్నితి వీవ్స్‌లో ఏర్పాటు చేసిన నూతన కలెక్షన్లను మంగళవారం ఆవిష్కరించారు. మహిళలకు చీర అందాన్ని ఇవ్వడమే కాకుండా మరింత గౌరవాన్ని ఇస్తుందని ప్రియాంక అన్నారు. తాను నిత్యం రకరకాల కలెక్షన్లు అన్వేషిస్తూ ఉంటానని, నచ్చిన చీరను తెప్పించుకోదం.. కట్టుకొని ముచ్చట తీర్చుకోదం జరుగుతుందన్నారు. మార్కెట్‌లోకి ట్రెండీ డ్రెస్‌లకు ధీటుగా శారీలు కూడా వస్తుండటం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గ్నితి వీవ్స్ ప్రతినిధులు సౌజన్య, బాబీ మాట్లాడుతూ ప్రతి అవసరానికీ ఓ చీర, ప్రతి సీజన్‌కు ఓ చీర అనే కాన్సెప్ట్‌తో దేశంలోని భిన్న రకాల చేతి వృత్తుల చీరలతో పాటు డిజైనరీ చీరలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. – బంజారాహిల్స్

ఫిష్.. నగర వాసుల దిల్ ఖుష్..



ఆరోగ్యవంతమైన తెలంగాణ సాధనలో భాగంగా మత్స్యశాఖ సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. 'మన తెలంగాణ-మన చేపలు' నినాదంతో విభిన్న కార్యక్రమాలు చేపడుతోంది. తెలంగాణ మత్స్య సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో చేపలను నగరంలో విరివిగా విక్రయించడానికి సన్నాహాలు చేస్తోంది. ఇదివరకే నగరంలో పలు చోట్ల చేపల విక్రయ కేంద్రాలు (ఫిష్ స్టాల్స్), సంచార విక్రయ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటికి తోడు విభిన్న రుచులను పరిచయం చేసేందుకు ఫిష్ క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. - నాంపల్లి

ఫిష్ క్యాంటీన్లకు పెరిగిన ఆదరణ

ఆర్డర్ ఇస్తే.. ఇంటికే చేపల వంటకాలు

నోరూరిస్తున్న రెడీ టు కుక్ రెసిపీలు

త్వరలో మరో ఐదు క్యాంటీన్లు ప్రారంభం



ఇప్పటి వరకూ మాసబ్‌ట్యాంక్‌లోని శాంతినగర్‌లో ప్రయోగాత్మకంగా ఫిష్ క్యాంటీన్‌ను నడిపిస్తున్నారు. దీనికి విశేష ఆదరణ లభిస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి చేపల రుచులను ఆస్వాదించడానికి శాంతినగర్ ఫిష్ క్యాంటీన్‌కు వస్తున్నారు. రోజుకు 500 కేజీల చేపలను వినియోగిస్తున్నారు. ఆదివారం వెయ్యి కేజీలు వివిధ రకాల రెసిపీలకు వాడుతున్నారు.

వివిధ రకాలు..

బోన్‌లెస్ చేపల ఫ్రై, రొయ్యల ఫ్రై, చేపల పులుసు, అపోలో ఫిష్, ఫిష్ ఫింగర్స్, క్రిస్పీ రొయ్యలతో వంటకాలను తయారు చేస్తున్నారు. ప్రతి రోజూ (పండుగ రోజు మినహా) మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ క్యాంటీన్ పనిచేస్తుంది. చేప దమ్ బిర్యానీ రూ.250, బోన్‌లెస్ ఫిష్ బిర్యానీ రూ.300 లకు అమ్ముతున్నారు.

రెడీ టు కుక్..

మత్స్య శాఖ రెడీ టు కుక్ పేరుతో ఆర్డర్లు కూడా బుక్ చేసుకుంటోంది. శుభకార్యాలు, వివిధ రకాల ఫంక్షన్లకు చేప వంటకాలను అందిస్తోంది. అలాగే చేపల పులుసు, రొయ్యలు, పీతల పులుసుకు కావాల్సిన చేపలను కూడా శుద్ధి చేసి సప్లయ్ చేస్తోంది. మత్స్య శాఖ డీజీఎం సుజాత 7989196259 ఫోన్ నంబరులో సంప్రదించి ఆర్డర్ చేసుకోవచ్చు.



ఐదు కొత్త క్యాంటీన్లు..

"నగరంలో ఐదు కొత్త ఫిష్ క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నాం. గచ్చిబౌలి, దిల్‌సుఖ్‌నగర్, శంషాబాద్, నాంపల్లి, ఎస్ఆర్ నగర్‌లో త్వరలో ప్రారంభిస్తాం. చేప బిర్యానీ, చేప పులుసు, ఫ్రై వంటకాలకు మంచి ఆదరణ లభిస్తోంది. భవిష్యత్తులో మరిన్ని క్యాంటీన్లను ప్రారంభించే ఆలోచన చేస్తాం." – మెట్టు సాయి కుమార్

నవ్వే.. నా గ్లామర్ రహస్యం..

సాక్షి, సిటీ బ్యూరో: 'ఎల్లప్పుడూ నవ్వుతూ ఉండటమే నా గ్లామర్ రహస్యం' అని ప్రముఖ సినీ తార హెబ్బా పటేల్ అన్నారు. నగరంలోని కోకాపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన అమ్జద్ హబీబ్ హెయిర్, బ్యూటీ ప్రీమియం సెలూన్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్జద్ హబీబ్ సెలూన్స్ వ్యవస్థాపకుడు మాట్లాడుతూ.. 100 ఏళ్ల సుదీర్ఘ చరిత్రతో తమ సెలూన్స్ దేశంలోని వివిధ నగరాలతో పాటు హైదరాబాద్‌లోనే ఏడు ప్రీమియం బ్రాంచ్‌లు ప్రారంభించామని తెలిపారు. సెలూన్స్‌లో ప్రీమియం క్వాలిటీ ఉత్పత్తులు ఉపయోగించి హెయిర్ కేర్ సేవలను అందిస్తామని నిర్వాహకులు మమత అన్నారు.



సెలూన్ ప్రారంభోత్సవంలో సినీ తార హెబ్బా పటేల్



హైలైఫ్ దుస్తుల ప్రదర్శన

మూడు రోజుల పాటు కొనసాగింపు

350 మంది డిజైనర్ల ఉత్పత్తులు

మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను సినీ నటి హెబ్బాపటేల్ నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి మంగళవారం ప్రారంభించారు. యువతను ఆకట్టుకునే విధంగా ప్రత్యేక సంప్రదాయ దుస్తులు అందుబాటులో ఉన్నాయని హెబ్బాపటేల్ అన్నారు. వివాహాది శుభకార్యాలకు ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. ప్రత్యేక డిజైన్‌లతో కూడిన చీరలు, దాదాపు 350 మంది డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. కార్యక్రమంలో పలువురు మోడల్స్ పాల్గొన్నారు.

కజారియా ఎటర్నిటీ సెంటర్ ప్రారంభం



సాక్షి, సిటీ బ్యూరో: నగరంలో ఎప్పటికప్పుడు మారుతున్న అధునాతన జీవన శైలికి అనుగుణంగా ఇంటీరియర్ ఉత్పత్తులు అందుబాటులోకి వస్తున్నాయి. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ వేదికగా అతిపెద్ద కజారియా ఎటర్నిటీ, కెరోవిట్ ఎక్స్పీరియన్స్ సెంటర్ ప్రారంభమైంది. దేశంలోనే అతిపెద్ద సిరామిక్, వెట్రిఫైడ్ టైల్ తయారీదారుగా పేరున్న కజారియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఎక్స్పీరియన్స్ సెంటర్‌ను కజారియా సిరామిక్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రిషి కజారియా మంగళవారం ప్రారంభించారు. తమ ప్రత్యేక ఉత్పత్తులైన టైల్స్, బాత్, శానిటరీవేర్ కలెక్షన్ ప్రతి కుటుంబానికీ అందుబాటులో ఉంచడమే తమ లక్ష్యమని తెలిపారు.

దేశంలోనే నంబర్ వన్..

15,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ ఎక్స్పీరియన్స్ సెంటర్లో దేశంలోనే నంబర్ ఒన్ జీవీటీ బ్రాండ్, ప్రీమియం కెరోవిట్ బాత్‌వేర్ ఉత్పత్తులు ఇక్కడ లభ్యమవుతాయని, వీటితో పాటు అల్టిమా రేంజ్ లార్జ్ ఫార్మాట్ వెట్రిఫైడ్ శ్లాబ్‌లు, యునిటెర్రా ప్రొడక్ట్ రేంజ్, అధునాతన శానిటరీవేర్ సొల్యూషన్స్ వంటివి అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

కార్గో విమానం ల్యాండింగ్ గేర్‌లో సమస్య

పైలట్ అప్రమత్తతతో సురక్షితంగా ల్యాండింగ్

శంషాబాద్ రూరల్: కార్గో విమానానికి ల్యాండింగ్ సమస్య తలెత్తగా పైలట్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి... సోమవారం రాత్రి చెన్నై నుంచి బ్లూడార్ట్ కార్గో విమానం శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి బయలుదేరింది. అయితే ఇక్కడికి చేరుకునే సరికి ల్యాండింగ్ గేర్‌లో సమస్య ఎదురైంది. పైలట్ అప్రమత్తమై అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి కావాలంటూ ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అధికారులు ఆ సమయంలో ఇతర అంతర్జాతీయ విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లను నిలిపివేశారు. దీంతో కార్గో విమానాన్ని పైలట్ చాకచక్యంగా ల్యాండింగ్ చేశారు. విమానం సురక్షితంగా ల్యాండ్ కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

నిమ్స్‌ను సందర్శించిన ఇటలీ వైద్య బృందం



నిమ్స్ డైరెక్టర్ బీరప్పను కలిసిన ఇటలీ సస్ వర్సిటీ వైద్య బృందం

లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్)ను ఇటలీ వైద్య బృందం మంగళవారం సందర్శించింది. ఆస్పత్రిలోని పలు విభాగాల్లో వైద్యసేవలపై ఇటలీలోని సస్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ అల్లెసాండ్రో డెల్లా కోర్టే బృందం ఆరా తీసింది. తొలుత నిమ్స్ కార్డియోథోరాసిక్ విభాగం అధిపతి ప్రొఫెసర్ మాలెంపాటి అమరేష్‌రావుతో కలిసి నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్పతో ప్రత్యేకంగా సమావేశమైంది. ఆ తర్వాత నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో సీవీటీఎస్, అనస్థీషియా విభాగాల ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. కార్యక్రమంలో గాంధీ హాస్పిటల్ సీవీటీఎస్ హెచ్ఓడీ డీఆర్ రవీంద్ర, ఉస్మానియా హాస్పిటల్ సీవీటీఎస్ హెచ్ఓడీ డాక్టర్ అనితా భల్లా, ఇఎస్ఐ హాస్పిటల్ సీవీటీఎస్ హెచ్ఓడీ డాక్టర్ అభిజిత్, నిమ్స్ కార్డియాక్ అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ అర్చన, డా. గోపాల్, డా. రామకృష్ణ, నిమ్స్ సీవీటీఎస్ వైద్యులు డాక్టర్ కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

అరుంధతీనగర్‌లో ఇళ్లను కూల్చివేస్తున్న దృశ్యం



ఓ మహిళను ఈడ్చుకుంటూ తీసుకెళ్తున్న పోలీసులు



మహిళను ఈడ్చేశారు.. ఇంటిని కూల్చేశారు..

అరుంధతీనగర్‌లో రెవెన్యూ అధికారుల ఓవరాక్షన్

జవహర్‌నగర్: కూలీ నాలీ చేసుకుని చిన్నపాటి రేకులు వేసుకొని పేదలు ఏళ్ల తరబడి జీవనం కొనసాగిస్తున్నారు. అధికారులు వచ్చి కూల్చివేశారు. తలదాచుకునేందుకు దాపు లేదంటూ బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. ఇదీ అరుంధతీనగర్‌లో మంగళవారం చోటు చేసుకున్న సంఘటన. ఓ ఇంట్లో ఉన్న మహిళను ఈడ్చుకుంటూ బయటకు తీసుకువచ్చారు. అనంతరం ఆమె ఇంటిని నేలమట్టం చేశారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని హెచ్ఎండీఏ భూములు సర్వే నెంబర్–702,708లో నిర్మించిన ఇళ్లను హెచ్ఎండీఏ తహసీల్దార్ విద్యరెడ్డి, రెవెన్యూ, పోలీసుల సహాయంతో కూల్చివేయించారు. పెద్దోళ్లకు ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయమా అని, పెద్దోళ్ల కోసమే ఈ ప్రభుత్వం పనిచేస్తోందని స్థానికులు దుయ్యబట్టారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ అధికారులు, ఎస్ఐలు రామునాయక్, వేణు, రెవెన్యూ, హెచ్ఎండీఏ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి: పొన్నం



గచ్చిబౌలి స్టేడియంలో హ్యాండ్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

గచ్చిబౌలి: క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో నాలుగు రోజులపాటు జరిగే ఆల్ ఇండియా సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్–2025 పోటీలను మంత్రి మంగళవారం ప్రారంభించారు. మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అంతర్జాతీయస్థాయి టోర్నమెంట్లు నిర్వహించే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయని తెలిపారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొననున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రంగారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ పవన్ కుమార్, హైదరాబాద్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఉదయ్ చందర్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ మహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేనే కొబ్బరికాయ కొడతా

– ఫ్లైఓవర్ జాప్యంపై అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు ఆగ్రహం



అంబర్‌పేట: నిర్మాణం పూర్తయిన అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను ప్రారంభించకుండా జాప్యం చేయడంపై ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అసహనం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో ఫ్లైఓవర్ ప్రారంభించకపోతే ప్రజలతో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తానన్నారు. ఏడేళ్లుగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులతో అంబర్‌పేట ప్రజలు, వరంగల్ జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మించిన 1.5 కిలో మీటర్ల మేర వాహనదారులు నిత్యం నరకయాతన పడుతున్నారని పేర్కొన్నారు. సర్వీస్ రోడ్ పనులు సాగుతున్నప్పటికీ పైనిర్మాణం పూర్తి అయినందు వల్ల వాహనాలను అనుమతించాలని కోరారు. దీనిపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో మాట్లాడానని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అంబర్‌పేట ఫ్లైఓవర్‌పై రాజకీయాలు చేయవద్దని ఎమ్మెల్యే కోరారు.

కీసరలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

వైభవంగా నిర్వహించేందుకు చర్యలు: అదనపు కలెక్టర్



మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కీసర: తెలంగాణలోనే సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి(కెసరగిరి క్షేత్రం) బ్రహ్మోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. కీసరగట్టులో ఈ నెల 24 నుంచి మార్చి 1వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డి, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో మంగళవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. 24 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు 24 గంటలపాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, మెరుగైన పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, క్యూలైన్లలో నిల్చుండే భక్తులకు మంచినీటిని అందుబాటులో ఉంచాలన్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, పోలీస్, విద్య, వైద్య, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ట్రాఫిక్, సమాచార, మత్స్య, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘తీన్మార్ మల్లన్న క్షమాపణ చెప్పాలి’

పంజగుట్ట: కొన్ని రోజులుగా రెడ్డి కులస్థులపై పదేపదే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయనను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలని రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మార్చి 11వ తేదీన ట్యాంక్‌బండ్‌పై ‘రెడ్డి మార్చ్’ నిర్వహిస్తామని, హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని ఆయన హెచ్చరించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రెడ్డి మార్చ్ పోస్టర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ విషయమై మంగళవారం ఉదయం గాంధీభవన్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చామని చెప్పారు. మల్లన్న స్వార్థం కోసం తమ కులంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వెంటనే అతనిపై కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకోకపోతే గ్రామాల్లో నాయకులను తిరగనివ్వబోమని హెచ్చరించారు.

నందనవనం హెచ్ఎంపై సస్పెన్షన్ వేటు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: సరూర్‌నగర్ మండలం నందనవనం మండల ప్రజా పరిషత్ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు రజితపై సస్పెన్షన్ వేటు పడింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా స్కూల్ ఆవరణలో మాజీ కార్పొరేటర్, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటినందుకుగానూ ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీజీసీఎస్ – 1964 ఎడ్యుకేషన్ నిబంధనల ప్రకారం పాఠశాలల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు చేపట్టడానికి వీల్లేదని అన్నారు. ఈ మేరకు ఒక రాజకీయ నాయకుడి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం నిబంధనల ఉల్లంఘన కిందికి వస్తుందని పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ నడిచేదెట్లా ?

పలువురు అడిషనల్ కమిషనర్లకు స్పెషలాఫీసర్ల బాధ్యతలు

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటికే జీహెచ్ఎంసీలోని కొందరు అధికారులను కాలపరిమితి ముగిసిన స్థానిక సంస్థలకు స్పెషలాఫీసర్లుగా నియమించిన ప్రభుత్వం..ఇంకొందరు జీహెచ్ఎంసీ అధికారులను ఆయా స్థానిక సంస్థలకు స్పెషలాఫీసర్లుగా నియమించింది. ఇప్పటికే వివిధ విభాగాల్లో పనులు కుంటుతున్న తరుణంలో కీలకమైన విభాగాల్లోని అడిషనల్ కమిషనర్లను స్పెషలాఫీసర్లుగా నియమించడంతో.. కోటి మందికి పైగా ప్రజలకు వివిధ సేవలందించాల్సిన జీహెచ్ఎంసీ పరిస్థితి ఏమిటన్నది అంతుపట్టడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. తాజాగా దిగువ పేర్కొన్న అడిషనల్ కమిషనర్లను ఆయా కార్పొరేషన్లు /మునిసిపాలిటీలకు స్పెషలాఫీసర్లుగా నియమించింది.

అడిషనల్ కమిషనర్	స్పెషలాఫీసర్
అలివేలు మంగతాయారు	జవహర్‌నగర్ కార్పొరేషన్
డా.ఎస్.యాదగిరిరావు	గుండ్ల పోచంపల్లి
ఎస్.పంకజ	బోడుప్పల్ కార్పొరేషన్
కె.సత్యనారాయణ	పీర్జాదిగూడ కార్పొరేషన్
జి.నళినీపద్మావతి	జల్‌పల్లి
బి.గీతారాధిక	శంషాబాద్
ఎస్.స్నామ్రాట్ అశోక్	శంకర్‌పల్లి
జి.వేణుగోపాల్‌రెడ్డి	బొల్లారం

● జాయింట్ కమిషనర్ వాణిశ్రీని బొల్లారం మునిసిపాలిటీకి స్పెషలాఫీసర్‌గా నియమించారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

జాబ్ పాయింట్

సీఎస్ఐఆర్, న్యూఢిల్లీలో 11 సైంటిస్ట్ పోస్టులు

న్యూఢిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్) సైన్స్–టెక్నాలజీలో సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్(ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్), ఎంఈ/ఎంటెక్(ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఐటీ, కంప్యూటర్ సైన్స్), పీహెచ్‌డీ(సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్), ఎంఎస్సీ(కెమికల్ సైన్స్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 22.03.2025 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు రూ.1,32,660.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.03.2025
- » **వెబ్‌సైట్:** https://www.csir.res.in

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 50 సివిల్ జడ్జి పోస్టులు

అమరావతిలోని హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 50.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(లా)లో ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** 01.02.2025 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
- » **పే స్కేల్:** రూ.77,840 నుంచి రూ.1,36,520.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- » **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష. ముందుగా మొత్తం 100 ప్రశ్నలకు 100 మార్కులతో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులకు మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు. ఆ పరీక్షలో మొత్తం మూడు పేపర్లు (సివిల్ లా, క్రిమినల్ లా, ఇంగ్లిష్ ట్రాన్స్‌లేషన్). ఒక్కో పేపర్ మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ఒక్కో పేపర్‌కు పరీక్ష సమయం మూడు గంటలు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 20.02.2025.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.03.2025
- » **పరీక్ష తేది:** 16.04.2025.
- » **స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, రాజమండ్రి(రాజమహేంద్రవరం), తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- » **వెబ్‌సైట్:** https://aphc.gov.in

ఐఐటీ తిరుపతిలో 26 అప్రెంటిస్‌లు

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ).. గ్రాడ్యుయేట్/డిప్లొమా అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 26.
- » **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు –19, డిప్లొమా అప్రెంటిస్‌లు–07.
- » **అర్హత:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు సంబంధిత విభాగంలో బీఏ/బీఎస్సీ/బీకాం /బీబీఏ /బీసీఏ, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. ఏదైనా డిగ్రీ, బ్యాచిలర్ డిగ్రీ ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ఉత్తీర్ణులవ్వాలి.
- » డిప్లొమా టెక్నీషియన్ పోస్టులకు ఏదైనా విభాగంలో డిప్లొమా, 10+2, యూజీడీపీఈడీ, జీఎన్ఎం 2020, 2021, 2022, 2023, 2024 ఏదైనా సంవత్సరాల్లో విద్యార్హత పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులు ఏడాది నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్(ఎన్ఏటీఎస్) పూర్తిచేసి ఉండాలి.
- » **వయసు:** 28.08.2025నాటికి 18 ఏళ్లు ఉండాలి
- » **స్టైపెండ్:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.20,000, టెక్నీషియన్ డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.18,000.
- » **ఎంపిక విధానం:** మెరిట్/రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేస్తారు
- » **దరఖాస్తు విధానం:** గూగుల్ ఫామ్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 28.02.2025.
- » **వెబ్‌సైట్:** https://www.iittp.ac.in

‘నీట్’గా.. నెగ్గేద్దాం ఇలా

నీట్-యూజీ.. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యుయేట్! ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశానికి ప్రతి ఏటా దేశవ్యాప్తంగా నిర్వహించే పరీక్ష!! ఇందులో ఉత్తమ ర్యాంకుతో రాష్ట్ర స్థాయిలో.. అదే విధంగా జాతీయ స్థాయిలో వైద్య సీట్ల కోసం పోటీ పడే అవకాశం లభిస్తుంది. దీంతో ఈ ఎంట్రన్స్‌లో మంచి మార్కుల కోసం ఇంటర్మీడియెట్ బైపీసీ విద్యార్థులు తీవ్రంగా కృషి చేస్తుంటారు. పరీక్ష నిర్వహణ సంస్థ ఎన్‌టీఏ.. తాజాగా నీట్-యూజీ-2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. నీట్‌తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, సబ్జెక్టుల వారీగా ప్రిపరేషన్ తదితర వివరాలు..

- » నీట్ యూజీ-2025 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
- » నీట్ స్కోర్‌తో ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాలు
- » మే 4న జాతీయ స్థాయిలో ఎంట్రన్స్ టెస్ట్



దేశంలోని అన్ని మెడికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశానికి నీట్–యూజీ స్కోర్‌ను ప్రామాణికంగా పరిగణిస్తుండడంతో ఈ పరీక్షకు ఏటేటా పోటీ పెరుగుతోంది. ఆల్ ఇండియా కోటా పేరిట దేశంలోని అన్ని మెడికల్ కాలేజీల్లో 15 శాతం సీట్లను, రాష్ట్రాల స్థాయిలో హెల్త్ యూనివర్సిటీల పరిధిలోని సీట్లను, డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేట్ వర్సిటీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో నీట్ స్కోర్ ఆధారంగానే ప్రవేశం కల్పిస్తారు. అదే విధంగా ఆయుష్ కోర్సులుగా పిలిచే బీహెచ్ఎంఎస్, బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీఎస్‌వైఎస్ తదితర కోర్సులకు కూడా నీట్ స్కోర్‌నే ప్రామాణికంగా తీసుకుంటారు.

ఛాయిస్ తొలగింపు

నీట్–యూజీ–2025 పరీక్ష మళ్లీ పాత విధానంలోనే నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) స్పష్టం చేసింది. కోవిడ్ కారణంగా 2021 నుంచి గత ఏడాది వరకు పార్ట్–ఎ, పార్ట్–బిలుగా పరీక్ష నిర్వహించారు. తాజాగా పార్ట్–బిలో కల్పించిన ఛాయిస్ విధానాన్ని తొలగించారు. అంటే అభ్యర్థులు అన్ని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. అదే విధంగా పరీక్షను పెన్–పేపర్ విధానంలోనే నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

అర్హత

ఇంటర్మీడియెట్ బైపీసీ ఉత్తీర్ణత ఉండాలి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

720 మార్కులకు పరీక్ష

నీట్ యూజీ పరీక్ష మొత్తం నాలుగు సబ్జెక్ట్‌లలో 180 ప్రశ్నలు–720 మార్కులకు జరుగుతుంది. ఫిజిక్స్‌లో 45 ప్రశ్నలు–180 మార్కులు, కెమిస్ట్రీలో 45 ప్రశ్నలు–180 మార్కులు, బోటనీలో 45 ప్రశ్నలు–180 మార్కులు, జువాలజీలో45 ప్రశ్నలు–180 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. పరీక్షను పెన్–పేపర్ విధానంలో ఓఎంఆర్ షీట్ ఆధారంగా నిర్వహిస్తారు. అదే విధంగా ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంటుంది. పరీక్షకు అందుబాటులో ఉండే సమయం మూడు గంటలు.

సమయం సద్వినియోగం

నీట్ యూజీ–2025 పరీక్ష మే 4న నిర్వహించనున్నారు. అంటే ఇప్పటి నుంచి దాదాపు 75 రోజుల సమయం అందుబాటులో ఉంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుని సబ్జెక్ట్‌ల వారీగా పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే.. మంచి స్కోర్ సాధించే అవకాశం ఉంది. మార్చి చివరి నాటికి ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తవుతాయి. ఆ తర్వాత నీట్ పరీక్ష తేదీకి దాదాపు నెల రోజుల సమయం అందుబాటులో ఉంటుంది. ఈ సమయంలో పూర్తిగా రివిజన్, మాక్ టెస్ట్‌లకు హాజరవడం మేలు చేస్తుంది.

ప్రతి సబ్జెక్ట్‌లో 130 మార్కులు

మెడికల్ సీటు సొంతం చేసుకునే దిశగా అభ్యర్థులు ప్రతి సబ్జెక్ట్‌లోనూ 180 మార్కులకు గాను కనీసం 130 మార్కులు సాధించేలా సిలబస్‌పై పట్టు సాధించాలి. మొత్తంగా 720 మార్కులకు గాను 450 మార్కుల నుంచి 500 మార్కులు సాధించేలా కృషి చేస్తే.. డాక్టర్ కల నెరవేర్చుకోవచ్చు.

సబ్జెక్ట్ వారీగా ప్రిపరేషన్ ఇలా

బయాలజీ

బయాలజీలోని బోటనీ, జువాలజీ సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. హుమన్ ఫిజియాలజీ, మైక్రోబ్స్ ఇన్ హ్యూమన్ ఫిజియాలజీ, హ్యూమన్ ఇన్సులిన్ అండ్ వ్యాక్సీన్ ప్రొడక్షన్, టాక్సానమీ, నెర్వస్ సిస్టమ్, క్లాసిఫికేషన్ ఆఫ్ ప్లాంట్స్, ప్లాంట్ ఫిజియాలజీ, బయో టెక్నాలజీ అప్లికేషన్స్, ఎకలాజికల్ సక్సెషన్, ఎకలాజికల్ /ఎన్విరాన్‌మెంటల్ ఇష్యూస్‌పై పట్టు సాధించాలి. డయాగ్రమ్ ఆధారిత ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. గత రెండేళ్ల నీట్ ప్రశ్న పత్రాలను విశ్లేషిస్తే.. రెండు సబ్జెక్ట్‌లకు సంబంధించి ఇంటర్మీడియెట్‌లోని ప్రథమ, ద్వితీయ సంవత్సరాల టాపిక్స్‌కు సమ ప్రాధాన్యం కల్పిస్తూ ప్రశ్నలు అడిగారు. కాబట్టి అభ్యర్థులు రెండేళ్ల సిలబస్‌పై పూర్తిగా పట్టు సాధించేందుకు కృషి చేయాలి.

ప్రాక్టీస్‌తో ఫిజిక్స్‌లో మంచి మార్కులు

ఫిజిక్స్‌లో స్కోర్ కోసం విద్యార్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆప్టిక్స్, మెకానిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మోడరన్ ఫిజిక్స్ చాప్టర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో అధ్యాయానికి చివర ఇచ్చిన ప్రశ్నలను సాధించాలి. అవకలనం, సమాకలనం అనువర్తనాలపై పట్టు సాధించాలి.

ఇంటర్ రెండేళ్ల పాఠ్యాంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. రొటేషనల్ డైనమిక్స్, సిగ్మా పార్టికల్స్‌పై ఎక్కువగా దృష్టిపెట్టాలి. అదేవిధంగా ఎలక్ట్రోమ్యాగ్నటిజం, ఇండక్షన్, కరెంట్ ఎలక్ట్రిసిటీ వంటి చాప్టర్లను చదవడంతోపాటు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

కెమిస్ట్రీ.. కాన్సెప్ట్స్, రివిజన్

విద్యార్థులు కాన్సెప్ట్‌లపై పూర్తి అవగాహనతో పాటు రివిజన్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, మోల్ కాన్సెప్ట్, కెమికల్ బాండింగ్, ఎలక్ట్రోకెమిస్ట్రీ, కోఆర్డినేషన్ కాంపౌండ్, ఈక్విలిబ్రియమ్, పాలిమర్‌లు, బయో మాలిక్యూల్స్, పరమాణు నిర్మాణం, సాలిడ్ స్టేట్, ద్రావణాలు, సర్ఫేజ్ కెమిస్ట్రీ; ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఐసోమెరిసమ్, సమ్మేళనాల తయారీలకు కొంత వెయిటేజీ ఎక్కువగా ఉంటుంది. కెమిస్ట్రీలో చర్యలు, సమీకరణాలను నిరంతరం పునఃశ్చరణ చేయాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో వివిధ మూలకాలు, వాటి సమ్మేళనాల ధర్మాలను అధ్యయనం చేయాలి. కెమిస్ట్రీలో ఫిజికల్, ఆర్గానిక్, ఇనార్గానిక్ కెమిస్ట్రీలను, వాటి స్వభావాల ఆధారంగా ప్రిపేరవ్వాలి. ఫిజికల్ కెమిస్ట్రీలో ఫార్ములాలతో సొంత నోట్స్ రూపొందించుకోవాలి. పీరియాడిక్ టేబుల్‌పై పట్టు సాధిస్తే.. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో మంచి స్కోర్‌కు ఆస్కారం ఉంటుంది.

రివిజన్‌కు ప్రాధాన్యం

ప్రస్తుతం బోర్డ్ పరీక్షలకు సమయం కేటాయించాలి. ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయిన తర్వాత రివిజన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి సబ్జెక్టుకూ సమానంగా సమయం కేటాయించుకోవాలి. ప్రతి రోజు చదవాల్సిన టాపిక్స్‌ను ముందుగానే విభజించుకుని దానికి అనుగుణంగా అధ్యయనం చేయాలి. ఇందుకోసం అప్పటికే రూపొందించుకున్న షార్ట్ నోట్స్‌ను అనుసరించాలి. ప్రతి రోజు మాక్ టెస్టులకు హాజరవ్వాలి. మోడల్ కొశ్చన్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. డైరెక్ట్ కొశ్చన్స్ కంటే ఇన్ డైరెక్ట్ కొశ్చన్స్‌నే ఎక్కువ అడుగుతున్న విషయాన్ని గుర్తించాలి. దీనికి అనుగుణంగా మోడల్ టెస్ట్‌లను వీలైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. ప్రిపరేషన్ సమయంలోనే షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. ఇది రివిజన్‌కు ఎంతో ఉపయోగపడుతుంది.

ముఖ్య సమాచారం

- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 2025, మార్చి 7
- ✦ **దరఖాస్తు సవరణ అవకాశం:** 2025, మార్చి 9 నుంచి 11 వరకు
- ✦ **పరీక్ష తేదీ:** 2025, మే 4
- ✦ **ఫలితాల వెల్లడి:** 2025, జూన్ 14
- ✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://neet.nta.nic.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- కెమిస్ట్రీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- రీజనింగ్

మామయ్యా.. నీ లాలన కావాలి.. నీ పాలన రావాలి








జగన్ మామ కళ్ళముందు కనిపించిన క్షణాన ఆనందం పట్టలేక ఆ చిన్నారి తల్లి వెక్కి వెక్కి ఏడ్చింది. దేవుడిచ్చిన మేనమామను ఒక్కసారి తాకాలని ఆ పసి గుండె తల్లడిల్లింది. ఆ బంగారు తల్లి మనసును అర్థం చేసుకుని వాహనం పైకి రమ్మన్న జగన్ పిలుపుతో సంబరపడిపోయింది. ఆనంద భాష్పాలు రాల్చింది. మామయ్యకు ముద్దు పెట్టింది.. మామయ్య ముద్దు తీసుకుంది. సెల్ఫీలో ఆ అనుభూతిని దాచుకుంది. కేరింతలు కొట్టి ప్రపంచాన్ని జయించినంత సంబరపడింది. వైఎస్ జగన్ విజయవాడ పర్యటనలో కనిపించిన ఉద్విగ్నభరిత దృశ్యాలివి..

చిన్నారి వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

క్లుప్తంగా...

రాష్ట్రాన్ని దోచుకున్న మామ, అల్లుడు

కేసీఆర్ మళ్లీ సీఎం అయి ఉంటే రాష్ట్రాన్ని అమ్మాల్సి వచ్చేది: జూపల్లి



సాక్షి, హైదరాబాద్: ప్రాజెక్టుల పేరుతో మాజీ సీఎం కేసీఆర్ రూ.వేల కోట్లు కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని.. ఆ సొమ్మును తిరిగి మామ, అల్లుడు పంచుకున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. మంగళవారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పారదర్శకంగా టెండర్లను పిలిచి ఉంటే రూ.50 వేల కోట్లు మిగిలేవని తెలిపారు. మళ్లీ కేసీఆర్ సీఎం అయి ఉంటే తెలంగాణను అమ్మేసే పరిస్థితి వచ్చేదని అన్నారు. కేసీఆర్ మళ్లీ సీఎం ఎందుకు కావాలో బీఆర్ఎస్ నేతలు కారణాలు చెప్పాలని డిమాండ్ చేశారు. 65 ఏళ్లలో 18 మంది సీఎంలు కలిసి రూ.65 వేల కోట్ల అప్పు చేస్తే.. కేసీఆర్ ఒక్కరే పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారని విమర్శించారు. ఈ అప్పుకు నెలకు రూ.6,500 కోట్లు వడ్డీ కట్టాల్సి వస్తోందని తెలిపారు. కేసీఆర్ పదేళ్ల పాలన వల్లనే నేడు కొన్ని పథకాల అమలు ఆలస్యం అవుతోందని చెప్పారు. సర్పంచ్‌లకు ఏళ్ల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టింది, అప్పులు తీర్చడానికి మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి తెచ్చింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు కర్రు కాల్చి వాత పెడుతారని అన్నారు.

సీఎంకు రైతుల గోడు పట్టదా?

నీరు లేక పంటలు ఎండుతున్నాయి: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



చౌడమ్మ తల్లికి బోనం తీసుకువస్తున్న కవిత

సూర్యాపేట టౌన్: ప్రభుత్వం సాగునీరు ఇవ్వకపోవడంతో పంటలు ఎండుతున్నాయని, అయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతుల గోడు పట్టడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరలో పాల్గొని చౌడమ్మతల్లికి బోనం సమర్పించారు. అనంతరం సూర్యాపేటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి రైతుల ఉసురు తలుగుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజకీయకక్షతో మేడిగడ్డను వాడుకోకుండా తెలంగాణను ఎండబెడుతున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 199 టీఎంసీలతో బనకచర్ల ప్రాజెక్టు ప్రారంభిస్తే, మన సీఎం కనీసం నాగార్జునసాగర్‌ను కూడా మన అధీనంలోకి తీసుకురాలేకపోయారన్నారు. కేసీఆర్ హయాంలో కోదాడ నియోజకవర్గానికి కాళేశ్వరం ద్వారా 1.22 లక్షల ఎకరాలకు నీళ్లు అందించారని, ఇప్పుడు నీళ్లు ఎందుకు రావడం లేదని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్‌లో ఏదైనా కల్వకుంట్ల కుటుంబమే మాట్లాడాలా?

మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏ సమస్య ఉన్నా బీఆర్ ఎస్ నుంచి కల్వకుంట్ల కుటుంబ సభ్యులే మాట్లాడతా రా? అని రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మ న్ బండ్రు శోభారాణి ప్రశ్నించారు. రాష్ట్రంలోని బీసీల గురించి మాట్లాడటానికి ఆ పార్టీలో బీసీ నేతలు కూడా లేరా అని ఆమె నిలదీశారు. మంగళవారం గాంధీభవన్ లో శోభారాణి విలేకరులతో మాట్లాడారు. దళితబంధు పేరుతో దళితులను, బీసీబంధు పేరుతో బీసీలను దగా చేసిన బీఆర్ఎస్ పక్షాన ఇప్పుడు కొత్తగా కేసీఆర్ కుమార్తె కవిత నినాదం ఎత్తుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కవిత ఒక బీసీ నేతను ఆ పార్టీకి అధ్యక్షుడినో, అధ్యక్షురాలినో చేయగలదా? అని ప్రశ్నించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యవహారం పిచ్చోడి చేతిలో రాయిలా ఉందని శోభారాణి ఎద్దేవా చేశారు.

తప్పు చేసినోళ్లు.. ఎక్కడున్నా వదలం

టీడీపీకి కొమ్ముకాసే పోలీసు అధికారులు, ఆ పార్టీ నేతలకు వైఎస్ జగన్ హెచ్చరిక

వారు రిటైరైనా వదిలిపెట్టం.. సప్త సముద్రాల ఆవల ఉన్నా రప్పించి చట్టం ముందు నిలబెడతాం

అక్రమ కేసులో అరెస్టై విజయవాడలోని జైలులో ఉన్న వంశీని పరామర్శించిన వైఎస్ జగన్

> "మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అరెస్టు చేసేటప్పుడు తాను ఏడాదిన్నర తర్వాత రిటైర్ అవుతానని సీఐ అన్నాడట..! రిటైర్ అయినా.. సప్త సముద్రాల అవతల ఉన్నా కూడా.. మొత్తం అందరినీ పిలిపిస్తాం.. చట్టం ముందు నిలబెడతాం. న్యాయం జరిగేటట్లు చేస్తాం.."
>
> "చంద్రబాబు పాలనలో ప్రతి కేసూ ఇల్లీగలే... ప్రతి కేసులోనూ వీరే బెదిరిస్తారు.. మళ్లీ తిరిగి తమను బెదిరిస్తున్నారంటూ తప్పుడు కేసులు పెడతారు. అసలు ఎవరు.. ఎవరిని బెదిరిస్తున్నారు? రాజకీయ నేతలతోపాటు పారిశ్రామికవేత్తలనూ వదిలిపెట్టడం లేదు. ప్రతి ఒక్కరినీ వీరే బెదిరిస్తూ అవతలి వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారు. ఇవన్నీ ఊరికే పోవు. వారికి తప్పకుండా చుట్టుకుంటాయి. అప్పుడు వారి పరిస్థితి అతి దారుణంగా తయారవుతుంది.."
>
> \- మీడియాతో వైఎస్ జగన్



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్. చిత్రంలో వంశీ సతీమణి పంకజశ్రీ, మాజీ మంత్రి పేర్ని నాని

సాక్షి, అమరావతి: చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న పోలీసులను వదిలిపెట్టేది లేదని.. వారు ఎక్కడున్నా తీసుకొచ్చి బట్టలు ఊడదీసి చట్టం ముందు నిలబెడతామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. అన్యాయం చేసిన అధికారులు, నాయకులు ఎవరినీ వదిలి పెట్టబోమన్నారు. 'మీ టోపీలపై కనిపించే మూడు సింహాలకు సెల్యూట్ చేయండి..! టీడీపీ నాయకులకు కాదు..! మీ వ్యక్తిత్వాన్ని కాపాడుకోండి..' అని పోలీసులకు హితవు పలికారు. 'టీడీపీ నాయకులు ఆడించినట్లల్లా ఆడుతూ అన్యాయాలు చేస్తే.. ఎల్లకాలం ఆ ప్రభుత్వమే ఉండదని గుర్తుంచుకోండి..! రేపు మేం అధికారంలోకి వస్తాం.. అన్యాయం చేసిన అధికారులు, నాయకులను చట్టం ముందు నిలబెడతా..' అని హెచ్చరించారు. అక్రమ కేసులో అరెస్టై విజయవాడలోని కృష్ణా జిల్లా జైలులో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని వైఎస్ జగన్ మంగళవారం పరామర్శించారు. వంశీ సతీమణి పంకజశ్రీతో కలిసి జైలు లోపలికి వెళ్లారు. పార్టీ సీనియర్ నేతలు, నాయకులెవరినీ జైలు అధికారులు లోపలకు అనుమతించలేదు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలను సైతం బయటే నిలువరించారు. మరోవైపు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు తరలి రావడంతో జైలు పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వారందరినీ పోలీసులు చాలా దూరంలోనే అడ్డుకున్నారు. వల్లభనేని వంశీని పరామర్శించిన అనంతరం జైలు బయట వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు, కూటమి సర్కారు కక్ష సాధింపు చర్యలను సాక్ష్యాధారాలతో ఎండగట్టారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

వంశీ ఏ తప్పూ చేయకున్నా..

వల్లభనేని వంశీని అరెస్ట్ చేసిన తీరు, ఆయన మీద పెట్టిన తప్పుడు కేసు రాష్ట్రంలో దిగజారిపోయిన శాంతి భద్రతలకు అద్దం పడుతోంది. వంశీని అరెస్ట్ చేసిన తీరు ఒకసారి గమనిస్తే.. అత్యంత దారుణంగా లా అండ్ ఆర్డర్ బ్రేక్ డౌన్ కనిపిస్తోంది. ఈ కేసులో గన్నవరం టీడీపీ కార్యాలయంలో దాడి జరిగిందని చెప్పి ఫిర్యాదు చేసిన సత్యవర్ధన్ అనే వ్యక్తి గన్నవరం టీడీపీ ఆఫీస్‌లో పని చేస్తున్నారు. ఆ వ్యక్తి సాక్షాత్తూ తానే న్యాయమూర్తి సమక్షంలో వాంగ్మూలం ఇచ్చారు. వంశీ ఎలాంటి తప్పు చేయలేదని అందులో ఆయన చెప్పినప్పటికీ తప్పుడు కేసు బనాయించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వంశీ రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకే..

"వంశీని ఇంతగా ఎందుకు టార్గెట్ చేస్తున్నారంటే.. చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన ఆయన రాజకీయంగా ఎదుగుతున్నాడు కాబట్టి! చంద్రబాబు, లోకేష్ కంటే ఆయన గ్లామరస్‌గా ఉన్నారనే..! వల్లభనేని వంశీతో పాటు కొడాలి నానిపై వారికి జీర్ణించుకోలేని ఆక్రోశం. ఇక అవినాశ్ కూడా లోకేష్ కన్నా చక్కగా ఉన్నాడు కాబట్టి ఏదో ఒక రోజు టార్గెట్ అవుతారు... ఇదీ చంద్రబాబు మనస్తత్వం! ఆ సామాజిక వర్గంలో చంద్రబాబు, ఆయన కుమారుడు మాత్రమే లీడర్లుగా ఉండాలనుకుంటారు! వారికి అనుకూలంగా లేని వారిని ఆ సామాజికవర్గం నుంచి వెలి వేస్తారు..!" అని మరో ప్రశ్నకు సమాధానంగా వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు.

అదో మాఫియా సామ్రాజ్యం!

"చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 కలిసి చేసేవన్నీ కుట్రలు, కుతంత్రాలే..! అది ఒక మాఫియా సామ్రాజ్యం. చంద్రబాబును సీఎంను చేయడం కోసం.. ఆయనకు ఓట్లు వేయించడం కోసం వారు ఒక మాఫియా సామ్రాజ్యంలా తయారయ్యారు. వారి సామాజిక వర్గంలో ఎవరైనా వ్యతిరేకంగా నిలబడితే వారి పని ఇక అంతే. వారిపై తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులు. బురద చల్లడంతో పాటు దారుణంగా ట్రోలింగ్ చేస్తారు. ఇవన్నీ చంద్రబాబు, లోకేష్ నైజానికి అద్దం పడుతున్నాయి' అని మీడియా ప్రశ్నకు సమాధానంగా వైఎస్ జగన్ పేర్కొన్నారు.

దేశానికి ఆదర్శంగా భూ భారతి చట్టం

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: భూ భారతి చట్టం తర తరాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతుందని, దేశానికి ఆదర్శంగా ఉండేలా ఈ చట్టాన్ని తీసుకువచ్చామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూ భారతి చట్టం విధివిధానాలను రూపొందించడంపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో కలె క్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహిస్తున్న రెండురోజుల వర్క్‌షాప్‌లో తొలిరోజు మంగళవారం మంత్రి పొంగులేటి మాట్లాడారు. అధికారులు, మేధావులు, అనుభవజ్ఞుల సల హాలు, సూచనలు క్రోడీకరించి పకడ్బందీగా భూ భారతి చట్ట విధివిధానాలు తయారు చేస్తున్నామని తెలిపారు. ఈ చట్టం భూ పరి పాలనలో పెను మార్పులను తీసుకురాబో తోందని చెప్పారు. రైతుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చేందుకు భూ భారతి చట్టం ఉపకరిస్తుందని పేర్కొన్నారు.

ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ రగడ

ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లోనూ బీసీలుగా ముస్లింలు: షబ్బీర్‌అలీ



సాక్షి, హైదరాబాద్: సాధారణ పౌరులు లేదంటే చదువులేని వ్యక్తులు మాట్లా డితే పట్టించుకోకున్నా ఫర్వాలేదని, కేంద్ర మంత్రుల స్థాయి నాయకులే అబద్ధాలు మాట్లాడి కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం సరైంది కాదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ వ్యాఖ్యానించారు. బీసీల్లో మైనార్టీలను కలిపారని, బీసీలకు అన్యాయం జరిగిందని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు చెప్పడం తగదన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ నేతలు చరణ్‌కౌశిక్‌యాదవ్, వర్మలతో కలిసి షబ్బీర్‌అలీ మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా ముస్లింలు ఓబీసీ జాబితాలో ఉన్నారని చెప్పారు. ఆ రాష్ట్రంలోని బీసీ జాబితా నుంచి ముస్లింలను తొలగిస్తారా అని ప్రశ్నించారు. ముస్లింలలోనూ పేదరికం ఉందని, వారు చేసే వృత్తుల ఆధారంగా చాలాకాలం నుంచి వారు బీసీల్లో ఉన్నారని గుర్తు చేశారు. 1882లో నియమించిన హంటర్ కమిషన్ నుంచి కాకలేకర్ నివేదిక వరకు అన్ని నివేదికలను ఆ ఇద్దరు మంత్రులకు పోస్టులో పంపిస్తున్నానని, అనుమానాలుంటే నివృత్తి చేసుకోవాలన్నారు.

తాగునీటి స్థిరీకరణకు నిధులివ్వండి

ఉదయ్‌పూర్ సదస్సులో కేంద్రానికి మంత్రి సీతక్క విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో తాగునీటి వ్యవస్థ స్థిరీకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు నీతి ఆయోగ్ గతంలో సిఫార్సు చేసిన విధంగా కనీసం రూ.16 వేల కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఏటా తాగునీటి అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.5 వేల కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. మంగళవారం రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 'ఇండియా: 2047–ఏ వాటర్ సెక్యూర్ నేషన్' పేరిట నిర్వహించిన వివిధ రాష్ట్రాల తాగు, సాగు నీటి పారుదల శాఖ మంత్రుల సదస్సులో ఆమె ప్రసంగించారు. 2016లో రూ.28 వేల కోట్ల రుణంతో ప్రారంభమైన మిషన్ భగీరథ పథకంలోని లోపాలను సరిదిద్ది, మరింత పటిష్ట పరిచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.వేల కోట్లు వెచ్చిస్తున్నా, కేంద్రం నుంచి ప్రశంసలే తప్ప ఇప్పటివరకు నిధులు రాలేదని మంత్రి సీతక్క గుర్తు చేశారు. కేంద్ర జలశక్తి శాఖమంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాల సీఎంలు, మంత్రులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రయోజనాలకే కులగణనపై విమర్శలు: గుత్తా సుఖేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎక్కడా లేని రీతిలో తెలంగాణలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రా జకీయ, కులగణన సర్వే నిర్వహిస్తున్నా.. కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం సర్వేను తప్పు పడుతున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను పార్టీలకు అతీతంగా అభినందించాల్సింది పోయి ఓటరు జాబితా ను చూపుతూ సర్వే లెక్కలను తప్పుల తడక అనడం సరికాదన్నారు. శాసనమండలిలో మంగళవారం మీడియా ప్రతినిధులతో గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇష్టాగోష్టి నిర్వహించారు. రాజకీయాల్లో నైతిక విలువలు పాటించాలని, అధికారంలో ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడటం సరికాదన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారితో పాటు ఎగు వన ఉన్న వారికి కూడా కార్డులివ్వాలని తాను రాసిన లేఖకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని గుత్తా చెప్పారు.

పాత పంపకాలే కొనసాగుతాయి

కృష్ణా జలాల్లో ఏపీకి 66% తెలంగాణకు 34% కేటాయింపులో మార్పు ఉండదు

గత నెలలో తీసుకున్న నిర్ణయానికి ఉభయ రాష్ట్రాల అంగీకారం

తాజాగా సమావేశం మినిట్స్ పంపిన కృష్ణా బోర్డు

సాక్షి, హైదరాబాద్: ఉభయ రాష్ట్రాల్లో అనుమతులున్న ప్రాజెక్టుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని 2015లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య 66:34 నిష్ప త్తిలో జరిపిన కృష్ణా జలాల తాత్కాలిక పంపకాలు కొనసాగుతాయని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) స్పష్టం చేసింది. ఆ తర్వాత కొత్త ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) లేదా అపెక్స్ కౌన్సిల్ ఎలాంటి అనుమతులివ్వనందున ఈ తాత్కాలిక సర్దుబాటులో ఎలాంటి మార్పు ఉండదని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాలు గతంలో అంగీకరించిన 66:34 నిష్పత్తిలోనే ప్రస్తుత సంవత్సరంలో సైతం కృష్ణా జలాల కేటాయింపులు జరపాలని నిర్ణయం తీసుకుంది. అయితే 66:34 నిష్పత్తికి విరుద్ధంగా రాష్ట్రాలకు ఏమైనా అవసరాలు ఏర్పడి నిర్దిష్ట కేటాయింపులు కోరితే ఆ మేరకు నీటి విడుదలకు ఉత్తర్వులు జారీ చేయాలని త్రిసభ్య కమిటీకి సూచించింది. గత నెల 21న జరిగిన కృష్ణా బోర్డు సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయానికి రెండు రాష్ట్రాలు సమ్మతి తెలిపాయి. తాజాగా రెండు రాష్ట్రాలకు పంపిన సమావేశం మినిట్స్‌లో వీటిని బోర్డు పొందుపరిచింది.

మూడో దశ టెలిమెట్రీల ఏర్పాటుకు ఏపీ నో

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నీటి వినియోగాన్ని కచ్చితంగా లెక్కించేందుకు మొత్తం 27 టెలిమెట్రీ స్టేషన్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోగా, తొలి విడత కింద 18 స్టేషన్లను ఏర్పాటు చేశారు. రెండో దశ కింద 9 కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. మూడో దశ కింద మరో 11 టెలిమెట్రీ కేంద్రాలను తెలంగాణ ప్రతిపాదించింది. తెలుగుగంగ, గాలేరీ–నగరి, బనకచర్ల హెడ్‌రెగ్యులేటరీ, క్రాస్ డిస్ట్రిబ్యూటరీ, పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి నుంచి నీళ్లను తరలించుకుంటున్నందున అక్కడ ఏర్పాటు చేయాలని కోరగా ఏపీ అంగీకరించలేదు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాల మోహరింపును ఉపసంహరించాలని రెండు రాష్ట్రాలు కోరగా, శాంతియుత పరిస్థితులు నెలకొనే వరకు కొనసాగించాలని బోర్డు నిర్ణయించింది.

ఏపీ అక్రమ నీటి తరలింపును అడ్డుకోండి

కృష్ణా నీటి వివాదంలో కేంద్రం జోక్యం చేసుకోవాలి

మూసీ పునరుద్ధరణకు రూ.4 వేల కోట్లు ఇవ్వండి

అఖిల భారత నీటిపారుదల శాఖ మంత్రుల సదస్సులో మంత్రి ఉత్తమ్‌కుమార్ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించడానికి ఈ వివాదంలో కేంద్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోవాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర జల్‌శక్తి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగిన 2వ అఖిలభారత నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం జలాశయం, నాగార్జునసాగర్ కుడి కాల్వ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలించటాన్ని ఆపాలని కోరారు. ఏపీ వాడుకుంటున్న నీటిని కచ్చితంగా లెక్కించడానికి టెలిమెట్రీ కేంద్రాలను ఏర్పాటు చేసి కృష్ణా బోర్డు పర్యవేక్షించాలని విన్నవించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు హక్కుగా రావాల్సిన నీటిపై కృష్ణా ట్రిబ్యునల్–2 నిర్ణయం వెంటనే వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. పాలమూరు–రంగారెడ్డి, సమ్మక్క–సారక్క, సీతారామ ప్రాజెక్టులకు సత్వరంగా నీటి కేటాయింపులు జరపాలని కోరారు.

సత్వరంగా ఎన్డీఎస్ఏ నివేదిక ఇవ్వండి

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, ఇతర బరాజ్‌ల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన శాశ్వత చర్యలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సత్వరంగా నివేదిక ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని మంత్రి ఉత్తమ్ కోరారు. ప్రాజెక్టుల్లో పూడిక తీతకు కేంద్రం నిధులు ఇవ్వాలని కోరారు. గంగా, యమున నదుల శుద్ధికి సహకరించిన తరహాలోనే మూసీ నది పునరుద్ధరణ ప్రాజెక్టుకు కేంద్రం ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు కేటాయించాలని కోరారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలకు గోదావరి నీళ్లను తరలించడానికి మరో రూ.6 వేల కోట్లను కేటాయించాలని కోరారు.

తెలంగాణకు 131 టీఎంసీలు.. ఆంధ్రప్రదేశ్‌కు 27 టీఎంసీలు..

వాడుకోగా మిగిలిన కృష్ణా జలాల వాటాలివే.. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం మిగిలి ఉన్న జలాల్లో ఏపీకి 27.03 టీఎంసీలు, తెలంగాణకు 131.75 టీఎంసీల వాటాలు మిగిలి ఉన్నాయని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) తేల్చింది. వచ్చే జూన్, జూలై నాటికి ఏర్పడే తాగు, సాగునీటి అవసరాలను వాటా జలాలతో తీర్చుకోవడంపై ప్రణాళికలు సమర్పించాలని ఇరు రాష్ట్రాలను కోరింది. ఈ మేరకు కృష్ణా బోర్డు సూపరింటెండింగ్ ఇంజనీర్ జి.వరలక్ష్మి ఏపీ, తెలంగాణ నీటిపారుదల శాఖల ఈఎన్‌సీలకు లేఖ రాశారు.

ఏపీ 639.652 టీఎంసీలు వాడుకుంది..

ప్రస్తుత ఏడాది సైతం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య 66:34 నిష్పత్తిలో కృష్ణా జలాల తాత్కాలిక సర్దుబాటు జరపాలని గత జనవరి 21న జరిగిన బోర్డు సమావేశంలో నిర్ణయించిన విషయాన్ని కృష్ణా బోర్డు గుర్తు చేసింది. కృష్ణా బేసిన్‌లో ప్రస్తుత నీటి సంవత్సరంలో 1010.134 టీఎంసీల జలాలు లభ్యతలోకి రాగా.. తాత్కాలిక సర్దుబాటు

మిగులు నీటి వినియోగంపై ప్రణాళికలు సమర్పించాలని రెండు రాష్ట్రాలకు లేఖ



ప్రకారం ఏపీకి 666.68 టీఎంసీలు, తెలంగాణకు 343.44 టీఎంసీల వాటాలుంటాయని పేర్కొంది. ఏపీ ఇప్పటికే 639.652 టీఎంసీలు వాడుకోగా, ఆ రాష్ట్ర కోటాలో 27.03 టీఎంసీలు మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలిపింది. తెలంగాణ 211.691 టీఎంసీలు వాడుకోగా, మరో 131.75 టీఎంసీలు మిగిలి ఉన్నాయని లెక్క గట్టింది.

పోతిరెడ్డిపాడు నుంచి 207 టీఎంసీలు తరలించిన ఏపీ

గతేడాది నవంబర్ 25న 15.86 టీఎంసీలు, గత జనవరి 31న మరో 18 టీఎంసీలు కలిపి మొత్తం

ఫిబ్రవరి -జూలై మధ్య 116 టీఎంసీలు విడుదల చేయాలని కోరిన తెలంగాణ

33.86 టీఎంసీలను నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు విడుదల చేయాలని ఏపీ కోరినట్టు కృష్ణా బోర్డు తెలిపింది. దీనికి తోడు నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, హంద్రీ నీవా, ముచ్చుమర్రి ఎత్తిపోతలు, పోతిరెడ్డిపాడు నుంచి నీళ్లను తరలించిందని పేర్కొంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఈ ఏడాది ఏపీ రికార్డు స్థాయిలో 207.88 టీఎంసీ జలాలను తరలించుకుంది. హంద్రీ నీవా, ముచ్చుమర్రి, తదితర ప్రాజెక్టులు కలిపి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఏపీ మొత్తం 236.63 టీఎంసీలను తరలించుకోగా, తెలంగాణ కల్వకుర్తి ఎత్తిపోతల అవసరాలకు కేవలం 34 టీఎంసీలను మాత్రమే తరలించుకోగలిగింది. నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాల్వలు, కృష్ణా డెల్టా సిస్టమ్‌కు కలిపి మరో 324.2 టీఎంసీలను ఏపీ వాడుకుంది.

116 టీఎంసీల కోసం తెలంగాణ ఇండెంట్


2025 ఫిబ్రవరి –జూలై మధ్యకాలంలో కల్వకుర్తి ఎత్తిపోతల, నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, ఏఎమ్మార్పీలకు 116 టీఎంసీల విడుదల కోసం తెలంగాణ ఇండెంట్ పెట్టిందని కృష్ణా బోర్డు తెలిపింది.

మిగిలింది 97.47 టీఎంసీలే

- నాగార్జునసాగర్ కనీస నీటిమట్టం (ఎండీడీఎల్) 510 అడుగులకి పైన 63.6 టీఎంసీలు, శ్రీశైలం జలాశయం కనీస నీటిమట్టం 834 అడుగులకి పైన 30.811 టీఎంసీల నిల్వలు మాత్రమే ప్రస్తుతం ఉన్నాయని కృష్ణా బోర్డు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే వాడుకున్న జలాలతో పాటు జూన్, జూలై వరకు తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని జలాల వినియోగంపై ప్రణాళికలు సమర్పించాలని కోరింది.

ప్రస్తుత నీటి సంవత్సరంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు వాడుకున్న కృష్ణా జలాల వివరాలను కృష్ణా బోర్డు లేఖలో పొందుపరిచింది.
వివరాలు సాక్షి ప్లస్‌లో (ఈపేపర్)..

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 19-2-2025



మడిపడిగ అన్నపూర్ణ

టెంపుల్‌హార్ట్

గుడి అనగానే గుర్తొచ్చేది దేవుడు, మొక్కులు, టెంకాయలు!
కానీ గుడి అంటే సకల కళా నిలయం! జీవనశైలిని ఈస్తటిక్ లెన్స్‌లో చూపించే కాన్వాస్!
నాడు వాస్తు, శిల్పం, చిత్రం, సంగీతం, నృత్యం అన్నిటికీ గుడే వేదిక.. వాటిని నేర్పే బడి కూడా!
దాని ఆవరణలోని కొలను ఆధారంగా సాగూ సాగేది!
అంటే సంస్కృతిని సంరక్షించే ఆలయంగానే కాదు సంపద పెంచే వనరుగానూ భాసిల్లింది!
మారిన కాలంలో గుడికి ప్రాముఖ్యం తగ్గకపోయినా దాన్ని చూసే మన ఈస్తటిక్ లెన్సే మసకబారాయి!
అయినా టెంపుల్ ఆర్ట్ స్ఫూర్తితో ఆ ఘనమైన సాంస్కృతిక చరిత్రను పరిరక్షిస్తున్న కళాకారులు ఉన్నారు! దేశంలో ఎక్కడెక్కడో ఉన్న అలాంటి 31 మంది కళాకారులు అందరినీ ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి వాళ్ల కళారూపాలతో 'లివింగ్ టెంపుల్' పేరుతో మూడు రోజుల ఉత్సవాన్ని నిర్వహించబోతున్నారు క్యురేటర్ మడిపడిగ అన్నపూర్ణ!
ఎప్పుడు... ఫిబ్రవరి 28 నుంచి మార్చి రెండు వరకు! ఎక్కడ... టీ వర్క్స్, హైదరాబాద్!

అసలీ అన్నపూర్ణ ఎవరు?
హైదరాబాద్‌లోనే పుట్టి, పెరిగిన అన్నపూర్ణ విజువల్ ఆర్ట్స్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశారు. ఆమెకు స్ఫూర్తి.. తొలి గురువు తండ్రి రోహిణీ కుమార్. ఆయన వృత్తిరీత్యా పెయింటరే అయినప్పటికీ సొంతంగా అడ్వర్టయిజింగ్ ఏజెన్సీ ప్రారంభించి దాన్నే వృత్తిగా చేసుకున్నారు. దాంతో ఉగ్గుపాల నాడే అన్నపూర్ణకు టెంపుల్ ఆర్ట్‌ను పరిచయం చేశారు. కూతురు పెరుగుతున్న కొద్దీ ఆ కళ విశిష్టతను వివరిస్తూ వచ్చారు. కళలను, మనిషి జీవితాన్ని బ్యాలెన్స్ చేస్తున్న వేదికగా గుడిని చూపించారు. ప్రతి ఆరునెలలకు ఒక పర్యాటక ప్రదేశానికి తీసుకెళ్లి అక్కడి టెంపుల్ ఆర్ట్, జీవనశైలి మీద ప్రాక్టికల్ జ్ఞానాన్నందించేవారు. ఒక్కమాటలో కూతురికి ఈస్తటిక్ లెన్స్‌లో ప్రపంచాన్ని పరిచయం చేశారని చెప్పొచ్చు. ఆ ఆసక్తితోనే అన్నపూర్ణ ఆర్ట్స్‌లో చేరారు. అయితే అకడమిక్స్‌లో నాన్న చెప్పినంత ఘనమైన స్థానం కనిపించలేదు మన ఆర్ట్, కల్చర్‌కి. పాశ్చాత్య కళానైపుణ్యంతోనే నిండిపోయి ఉంది సిలబస్ అంతా! మన కళల పట్ల నిర్లక్ష్యమో.. పెద్దగా పరిగణించకపోవడమో.. లేదంటే బ్రిటిష్ వాళ్లు నిర్ధారించిన అకడమిక్స్ అయ్యుండటమో.. కారణమేదైనా మన కళా సంస్కృతి గొప్పదనమైతే తెలియకుండా పోయింది. కాలగమనంలో చాలా గుళ్ల స్వరూప స్వభావాలూ మారిపోయాయి. వాస్తు శిల్ప చిత్ర లేఖన సంపద మిగిలి ఉన్న గుళ్లల్లో సంగీతం, నాట్య కళల ఊసు లేదు. భవిష్యత్ తరాలకు అందాల్సిన ఆ సాంస్కృతిక వారసత్వ సంపద చెల్లాచెదురైంది. దాన్ని కాపాడాలి.. పరిరక్షించాలనే తపన పట్టుకుంది అన్నపూర్ణకు. చదువైపోయాక క్యురేటర్‌గా చేరినా.. ఆర్ట్ షోలు నిర్వహిస్తున్నా.. చిత్తమంతా టెంపుల్ ఆర్ట్ మీదే! ఆర్ట్ షోలు చేస్తున్న క్రమంలోనే దేశంలోని పలు ప్రాంతాల్లో.. వాళ్ల వాళ్ల శైలిలో టెంపుల్ ఆర్ట్‌ను సాధన చేస్తున్న కళాకారులున్నారని తెలిసింది అన్నపూర్ణకు. అప్పుడు వచ్చింది ఆమెకు 'లివింగ్ టెంపుల్' ఆలోచన!

రెండేళ్ల శ్రమ
ఆ ఆలోచన వచ్చిన నాటి నుంచి టెంపుల్ ఆర్ట్ మీద పరిశోధన మొదలుపెట్టారు అన్నపూర్ణ. భారతదేశమంతా పర్యటించారు. శిథిలావస్థలోని గుళ్ల వాస్తుశిల్పాన్ని పునర్‌నిర్మిస్తున్న ఆర్కిటెక్ట్స్, విరిగిపోయిన విగ్రహాలను టెక్నాలజీ సహాయంతో తిరిగి చెక్కుతున్న.. రూపాలు చెదిరిన శిల్పాలను సాంకేతిక సహాయంతో తీర్చిదిద్దుతున్న శిల్పకారులు, చెదిరిపోయిన పెయింటింగ్స్‌కు రంగులద్దుతూ పునరుద్ధరిస్తున్న చిత్రకారులు, గుళ్లల్లో పుట్టిన గాన.. నాట్య కళలను ఇంకా పోషిస్తున్న కళాకారుల కళారూపాలను చూశారు. వాళ్లలో విదేశీ కళాకారులూ ఉన్నారు. అందరూ సుప్రసిద్ధులే! అలాంటి 31 మంది కళాకారులను సంప్రదించారామె. వాళ్లకు తన 'లివింగ్ టెంపుల్' కాన్సెప్ట్‌ను వివరించారు. సంతోషంగా ఒప్పుకున్నారు. ఆ ఉత్సవానికి హైదరాబాద్‌నే వేదికగా చేయాలనుకున్నారు. టీ వర్క్స్ ప్రాంగణాన్నివ్వడానికి తెలంగాణ ప్రభుత్వం ఒప్పుకుంది. ఇప్పుడు అన్నపూర్ణ ఆ ఏర్పాట్లలోనే ఉన్నారు. ఏదో అనుకున్నామా.. చేశామా అన్నట్టు కాకుండా ఈ వేడుక ఒక స్ఫూర్తిని, ఫలితాన్ని ఇవ్వాలని ఆశిస్తున్నారు అన్నపూర్ణ. కళాకారులు, ప్రజలు, ప్రభుత్వాలు అందరూ కలిసి టెంపుల్ ఆర్ట్ పరిరక్షణకు అడుగులు వేయాలి, ఆ సాంస్కృతిక వారసత్వ సంపదను మన భావితరాలకు అందించాలి.. ఫైన్ ఆర్ట్స్ సిలబస్‌లో మన కళలకూ సముచిత స్థానం ఉండాలన్నదే దాని ఉద్దేశం. ఆశయం! అందుకే ఈ ఉత్సవాన్ని ప్రతి సంవత్సరం జరపాలనుకుంటున్నారు. ఈ యజ్ఞం గురించి తెలుసుకున్న తమిళనాడు.. వచ్చే ఏడాది తను ఆతిథ్యమివ్వడానికి ఉత్సాహపడింది. 'లివింగ్ టెంపుల్ అనేది మన హెరిటేజ్‌ను సెలబ్రేట్ చేయడమే! టెంపుల్ ఆర్ట్‌కి సంబంధించిన పలు కళాకారులంతా ఒకే వేదిక మీదకు వచ్చి ఒక డైలాగ్‌కు స్పేస్ ఇవ్వబోతున్నారు. ఇదిప్పుడు మనకు చాలా అవసరం. ఇంకో విషయం.. టెంపుల్ అనగానే ఇదొక మతానికి సంబంధించిన సెలబ్రేషన్‌గా అనుకోవద్దు. ఇది మన దేశ సంస్కృతికి సంబంధించినది. మన ఆలయాలు పరిరక్షించిన పర్యావరణానికి సంబంధించినది. దాన్ని మళ్లీ పునరుద్ధరించడమే ఈ సెలబ్రేషన్ ఉద్దేశం' అంటారు అన్నపూర్ణ. ఆమె పనిని ఫుల్ హార్ట్‌తో స్వాగతిద్దామా!

> 'లివింగ్ టెంపుల్' అనేది మన హెరిటేజ్‌ను సెలబ్రేట్ చేయడమే! టెంపుల్ ఆర్ట్‌కి సంబంధించిన పలు కళాకారులంతా ఒకే వేదిక మీదకు వచ్చి ఒక డైలాగ్‌కు స్పేస్ ఇవ్వబోతున్నారు. ఇదిప్పుడు మనకు చాలా అవసరం.

– సరస్వతి రమ



ఆగు.. నువ్వు మా షాప్‌లోకి అడుగు పెట్టద్దు

పాతకాలం సంగతేమిటోగానీ ఈ కాలం దొంగలను కనిపెట్టడం చాలా కష్టం సుమీ. అమెరికా అంటే టెక్నాలజీకి పెట్టింది పేరు. ఆ టెక్నాలజీతో ఒక్క దొంగతనం జరగకుండా చూడవచ్చు. అయినప్పటికీ చిన్నాచితక దొంగతనాల వల్ల పెద్ద పెద్ద షాపులు సైతం బిక్కచచ్చిపోతున్నాయి.

ఏంచేయాలో తోచక దిక్కులు చూస్తున్నాయి. షాప్‌లిఫ్టింగ్ అనేది అమెరికాలో పెద్ద సమస్యగా మారింది,

ఒక నివేదిక ప్రకారం 2019 నుంచి 2023 మధ్య అమెరికా అంతటా షాప్‌లిఫ్టింగ్ 93 శాతం పెరిగింది. గత సంవత్సరం కూడా తక్కువేమీ లేదు.

సౌత్ మెంఫిస్ వాల్ మార్ట్ నుంచి నూడుల్స్, ఇతర పాకెట్లను దొంగిలించినందుకు అష్లే క్రాస్ అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. 37 ఏళ్ల క్రాస్ చిన్నాచితక దొంగతనాల్లో పెద్ద పేరు తెచ్చుకుంది. అష్లే క్రాస్‌ను మల్టీనేషనల్ రిటైల్ స్టోర్ వాల్‌మార్ట్ 'అథరైజేషన్ ఆఫ్ ఏజెన్సీ' జాబితాలో చేర్చింది. అమెరికాలోని ఏ వాల్ మార్ట్‌లోకీ అడుగు పెట్టకుండా ఆమెను నిషేధించారు.

'మేము మా కస్టమర్‌లకు విలువ ఇస్తాం. వారు ఆహ్లాదకరమైన షాపింగ్ అనుభవాన్ని సొంతం చేసుకోవాలని కోరుకుంటాం. అరుదుగా అయినప్పటికీ కొందరిని స్టోర్‌లలోకి స్వాగతించని సందర్భాలు ఉన్నాయి' అని వాల్‌మార్ట్ ఒక ప్రకటనలో తెలిపింది.



నాన్న అమ్మను చంపేశాడు
బొమ్మ గీసి చూపించిన నాలుగేళ్ల పాప

పిల్లలు బొమ్మలు గీయడం అనేది సంచలన విషయమేమీ కాదు... సర్వసాధారణ విషయం. అయితే ఉత్తర ప్రదేశ్‌లోని ఝాన్సీకి చెందిన నాలుగు సంవత్సరాల పాప గీసిన బొమ్మ సంచలనంగా మారింది.

ఝాన్సీలోని కొత్వాలి ప్రాంతంలో 27ఏళ్ల యువతి ఆత్మహత్య చేసుకుంది. అయితే ఆమెది ఆత్మహత్య కాదు అని హత్య అని తన బొమ్మ ద్వారా అసలు నిజాన్ని వెలుగులోకి తెచ్చింది పాప. ఆత్మహత్యగా నమ్మించేందుకు మృతదేహాన్ని ఫ్యాన్‌కు వేలాడదీశాడు భర్త.

'పప్పా మమ్మీని చంపాడు' అని రాసి నాన్న అమ్మను ఉరి తీసినట్లు బొమ్మ గీసింది పాప.

'కట్నం రూపంలో 20 లక్షల నగదు, ఆభరణాలు ఇచ్చాం. అయినా అమ్మాయిని అదనపు కట్నం కోసం వేధించేవారు' అని ఆరోపించాడు అమ్మాయి తండ్రి సంజీవ్ త్రిపాఠి.

'నా కూతురిని వేధిస్తున్నారు' అని ఆయన పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశాడు. అయితే పెద్దల జోక్యంతో ఆయన రాజీ పడాల్సి వచ్చింది.

సంజీవ్ కూతురుకు ఆడబిడ్డ పుట్టడంతో మళ్లీ వేధింపులు మొదలయ్యాయి. అబ్బాయి కావాలనేది అత్తింటి వారి కోరిక.

'అమ్మ నాన్నను కొట్టాడు. ఆ తరువాత తలపై రాయితో కొట్టాడు' అని వాంగ్మూలం ఇవ్వడమే కాదు బొమ్మ గీసి చూపించింది పాప.

కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువతి మృతదేహాన్ని శవపరీక్షకు తరలించారు. పారిపోయిన ఆమె భర్తను వెదికి అరెస్ట్ చేశారు.

● కిచెన్ టిప్స్



- వంట త్వరగా పూర్తవడానికి కూరగాయలను చిన్న ముక్కలుగా తరుగుతుంటాం. ఇలాంటప్పుడు వాటిలోని విటమిన్లు ఆవిరై పోతుంటాయి. అందుకే పెద్ద ముక్కలు తరగాలి.
- సమయాన్ని ఆదా చేయడం కోసం కూరగాయలను వంట మొదలుపెట్టడానికి గంట – రెండు గంటల ముందుగా తరగడం మంచిది కాదు. తరిగిన తర్వాత వీలయినంత త్వరగా వండినట్లయితే పోషకాలు వృథా కాకుండా ఉంటాయి.
- ముక్కలు తరిగిన తర్వాత కడిగే అలవాటుంటే మాత్రం వెంటనే మానుకోవాలి. ఇలా చేయడం వల్ల విటమిన్లను నష్టపోతాం.

లీగల్

చిన్నారుల రక్షణ బాధ్యత అందరిదీ!

నేను ఇటీవల ప్రచార మాధ్యమాలలో, సోషల్ మీడియాలో పోక్సో చట్టం అనే పదాన్ని తరచు వింటున్నాను. దీని గురించి వివరించగలరా?
– సంకా పవన్ కుమార్, తెనాలి

చిన్నారులపై లైంగిక దాడులు జరగడం ఈ మధ్యకాలంలో చాలా ఎక్కువగా వినపడుతోంది. అంతకుముందు చిన్నారులపై లైంగిక దాడులు లేవని కాదు. ఈ మధ్యకాలంలోనే ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయి. చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టడానికి ఉన్న కఠినమైన పోక్సో చట్టం (లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం) కూడా ఈ మధ్యకాలంలో చాలా కేసులను బయటకు తీసుకు వచ్చింది. 2024 ఎన్.సి.ఆర్.బి లెక్కల ప్రకారం 2019 నుంచి 31–మే 2024 వరకు దేశవ్యాప్తంగా 2,99,759 పోక్సో కేసులు నమోదు కాగా తెలంగాణలో 2,731 – ఆంధ్రప్రదేశ్‌లో 11,774 కేసులు నమోదయ్యాయి. గత ఐదు సంవత్సరాలలో దాదాపుగా 20 శాతం చిన్నారులపై లైంగిక దాడుల కేసులు పెరిగినట్లుగా చెబుతున్న అంకెలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక అంచనా ప్రకారం వెలుగులోకి వస్తున్న కేసుల కన్నా నమోదు కాని కేసుల సంఖ్య రెండింతల పైమాటే!

చట్ట ప్రకారం మైనర్ బాలిక/బాలుర పై ఏ విధమైన లైంగిక హింస లేదా దాడి జరుగుతున్న విషయం తెలిసిన వారు కచ్చితంగా ఫిర్యాదు చేయాలి. లైంగిక దాడి జరిగిందన్న ఖచ్చితమైన సమాచారం మాత్రమే కాదు. లైంగిక దాడి జరిగి ఉండవచ్చు లేదా దాడి జరిగి ఉండే ఆస్కారం ఉంది అన్న సందేహం ఉన్న వారు కూడా ఫిర్యాదు చేయాలి. అలా తెలిసినప్పటికీ ఫిర్యాదు చేయకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే 18 సంవత్సరాలు దాటిన వారెవరైనా సరే సెక్షన్ 19 పోక్సో చట్టం కింద ఆరు నెలల నుండి ఏడాది వరకు జైలు శిక్ష పడుతుంది. ఈ అంశంపై ప్రభుత్వాలు, అలాగే మీడియా కూడా తగిన ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉంది. పేరెంటింగ్ అంటే కేవలం తల్లిదండ్రులకు సంబంధించినది మాత్రమే కాదు. సమాజానిది కూడా!

లైంగిక హింస, లైంగిక దాడి, మైనర్ల ఫోటోలు – వీడియోలు అశ్లీల చిత్రాలకి వాడడం, చిన్నపిల్లల అశ్లీల చిత్రాలు/వీడియోలు కలిగి ఉండడం వంటివి కూడా పోక్సో చట్టం కింద నేరాలే. ఆటిజం వంటి మానసిక ఎదుగుదల లేమి, మతిస్థిమితం లేని పిల్లలపై, అలాగే చిన్నపిల్లలపై అధికారం కలిగిన వ్యక్తులు (తల్లిదండ్రులు, టీచర్లు, కొన్ని ప్రత్యేక వృత్తులలో ఉండే అధికారులు మొదలైన వారు) లైంగిక దాడులకు పాల్పడినట్లయితే అవి 'అతి తీవ్రమైన' నేరాలుగా పరిగణించబడతాయి. అందుకుగాను యావజ్జీవ కారాగార శిక్ష, ఉరిశిక్ష అనుభవించాల్సి ఉంటుంది.

కాబట్టి మన చుట్టూ జరుగుతున్న పరిణామాలను గమనిస్తూ, బాలలకు ఎటువంటి లైంగిక ఇబ్బంది కలుగుతుందేమోనన్న సందేహం ఉన్నా తక్షణం పోలీసులకి తెలియజేయడం అందరి బాధ్యత.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.





న్యూస్ మేకర్స్

చాట్ జిపిటి బామ్మ

బెంగళూరుకు చెందిన 88 ఏళ్ల బామ్మ చాట్‌జిపిటితో స్నేహం కట్టింది. అన్ని ప్రశ్నలూ దానినే అడుగుతోంది. 'నా మనవడు పెళ్లి చేసుకోవడం లేదు. కారణం ఏంటంటావ్' అనే ప్రశ్నకు చాట్‌జిపిటి చెప్పిన జవాబుకు నెటిజన్లు బోలెడు ముచ్చటపడుతున్నారు. మనవడు పోస్ట్ చేసిన వీడియో వైరల్ అయ్యింది.

ఊళ్లలో చాలామంది బామ్మలు టీవీతో కాలక్షేపం చేస్తారు. కాని బెంగళూరుకు చెందిన ఈ బామ్మ ఏకంగా 'ఏఐ' చాట్‌బాట్ అయిన 'చాట్‌జిపిటి'తో స్నేహం కట్టింది. వాయిస్ ద్వారా చాట్‌జిపిటితో మాట్లాడవచ్చు కనుక బామ్మ తనకున్న సందేహాలన్నిటినీ దానినే అడుగుతూ కాలక్షేపం చేస్తోంది. ఆమె మనవడు శశాంక్ జాకబ్ ఇదంతా వీడియో తీసి ఇన్‌స్టాలో పెడితే వస్తున్న ప్రశంసలు అన్నీ ఇన్నీ కావు. ఆ వీడియోలో సంభాషణ ఇలా సాగింది.

బామ్మ: హాయ్
చాట్‌జిపిటి: హాయ్
బామ్మ: నా వయసు 88. నా బిపి 165/88 ఉంది. ప్రమాదం అంటావా?
చాట్‌జిపిటి: సిస్టాలిక్ కొంచెం ఎక్కువుంది. డయస్టాలిక్ నార్మల్‌గా ఉంది.
బామ్మ: నా మనవడు పెళ్లి చేసుకోనంటున్నాడు. కారణం ఏంటి?
చాట్ జిపిటి: ఓ ఇది మంచి ప్రశ్న. నీ మనవడు పెళ్లి వద్దనడానికి అనేక కారణాలు ఉంటాయి. కెరీర్ గురించి ఆలోచిస్తుండవచ్చు, ఏవైనా లక్ష్యాలు ఉండవచ్చు లేదా గత అనుభవాల వల్ల కూడా కావచ్చు.
బామ్మ మనవడి వైపు తిరిగి: ఏరా.. ఏవైనా గత అనుభవాలు ఉన్నాయా?
మనవడు: ఉండొచ్చు
బామ్మ: సరే అలా అయితే. నీకు క్లారిటీ రావడానికి కొంత టైమ్ ఇస్తాను...

ఇంతటితో ఆ సంభాషణ ముగిసింది. ఇన్‌స్టాలో ఈ వీడియోను వేల మంది లైక్ చేశారు. బామ్మను చాలా మెచ్చుకుంటున్నారు. బామ్మా.... మనం స్నేహం చేద్దామా అని అడుగుతున్నారు. చాలామంది తమ బామ్మల్ని గుర్తు చేసుకుంటున్నారు.

ఫస్ట్ విమెన్ స్కూబా టీమ్

కేరళ మన దేశంలో మొదటి మహిళా స్కూబా టీమ్‌ను సిద్ధం చేసింది. అగ్నిమాపక దళం నుంచి ఎంపిక చేసిన వారితో ఈ టీమ్‌ను తయారు చేసి ఇక పై వరద ప్రమాదాల్లో వీరి సేవను వినియోగించనుంది.

'గన్నెట్స్'... ఇదీ కేరళ అగ్నిమాపక శాఖ తన ఆల్ విమెన్ స్కూబా డైవింగ్ టీమ్‌కు పెట్టిన పేరు. ఉత్తర అట్లాంటిక్ తీరంలో సముద్రపు లోతుకు దూసుకెళ్లి చేపలను నోట కరుచుకుని ఎగిరే పక్షులే 'గన్నెట్స్'. ఇకపై కేరళలో ఏవైనా జల ప్రమాదాలు సంభవిస్తే ఈ గన్నెట్స్ దూసుకొచ్చి సహాయ సహకారాలు అందిస్తారు. వీరి మొత్తం సంఖ్య 17. ఇరవై ఒక్క రోజుల ట్రైనింగ్ ముగించుకొని ఈ టీమ్ మంగళవారం బాధ్యతల్లోకి వచ్చింది. భారతదేశంలో అందరు మహిళల స్కూబా రక్షణ దళం ఇదే.

100 మంది నుంచి...
కేరళలో వానకాలంలో ఊహించని వరదలు సర్వసాధారణంగా మారాయి. మనుషుల్లో నీళ్లల్లో చిక్కుకున్నప్పుడు వారిని రక్షించే సామర్థ్యం ఉన్న స్కూబా డైవర్స్ ఉండాలని ప్రభుత్వం భావించింది. అయితే వారు ఎందుకు స్త్రీలు కాకూడదు అని ప్రశ్నించుకుంది. అగ్నిమాపక శాఖ నుంచి 100 మంది మహిళలను ఎంపిక చేస్తే వారిలో 17 మంది అన్ని విధాలుగా అర్హులుగా నిలిచి ట్రైనింగ్‌కు ఎంపికయ్యారు.

కఠినమైన ట్రైనింగ్
కేరళ ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీసెస్ అకాడెమీలో ఈ మహిళా సభ్యుల శిక్షణ 21 రోజుల పాటు జరిగింది. స్కూబా డైవింగ్‌తో పాటు నదులు, చెరువులు, సముద్రాల్లో నీటి స్వభావాన్ని బట్టి ఎలా రక్షణ చర్యలు చేపట్టాలో నేర్చారు. అండర్‌వాటర్ కెమెరాలు వాడటం కూడా ఇందులో భాగం. వీరికి 30 మీటర్ల లోతుకు వెళ్లి రక్షించడం నేర్చారు. 'ట్రైనింగ్ మాకు మొదట్లో కష్టమైంది. కాని అన్ని దశలను దాటగలిగాం. ఇప్పుడు మేము ఆత్మవిశ్వాసంతో ఉన్నాం. ప్రజల సేవకు సిద్ధం' అని ఈ టీమ్‌లోని మహిళలు అన్నారు. ఈ కొత్తశక్తికి స్వాగతం.

పట్టాలెక్కిన వైద్యం



ఇటీ పాండే రుద్ర – హాస్పిటల్ ఆన్ వీల్స్

ఒక ఐడియా అనేక జీవితాలను మార్చేసింది. వైద్యానికి నోచుకోని గ్రామాలకు వైద్యం పట్టాల మీద పరుగులు పెడుతోంది. దేశంలో మూలమూలలను కలుపుతోంది రైల్వే. మారుమూల డ్యూటీ చేస్తున్నారు రైల్వే సిబ్బంది. వారిలో చాలామందికి వైద్యం అందుబాటులో లేదు. ఉద్యోగానికి సెలవు పెట్టి సమీప పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాలి. ఈ అంతరాన్ని ఒక్క ఐడియాతో భర్తీ చేసింది ఇటీ పాండే. పేషెంట్‌లు డాక్టర్ దగ్గరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా డాక్టర్లనే పేషెంట్‌ల దగ్గరకు చేరుస్తోంది. 'రుద్ర, హాస్పిటల్ ఆన్ వీల్స్' పేరుతో ఆమె మొదలు పెట్టిన రైలు పెట్టె క్లినిక్‌లు ఊరూరా తిరుగుతూ వైద్యసేవలందిస్తున్నాయి.

డాక్టర్లొస్తున్నారు
మహారాష్ట్ర, భుసావాల్ రైల్వే డివిజనల్ మేనేజర్ ఇటీ పాండే. అలహాబాద్ యూనివర్సిటీ నుంచి సైకాలజీలో గోల్డ్ మెడల్ సాధించింది. రైల్వేలో 26 ఏళ్ల అనుభవంలో ఆమె అనేక సమస్యలను దగ్గరగా చూశారు. చిన్న ఉద్యోగుల కష్టాలను అర్థం చేసుకున్నారు. ఉద్యోగులు పెడుతున్న సెలవుల్లో ఎక్కువభాగం కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాలతోనేనని తెలుసుకున్నారామె. ఇప్పటికీ మనదేశంలో గ్రామాలకు వైద్యం సుదూరంలోనే ఉంది. వైద్యం కోసం పట్టణాలకు వెళ్లక తప్పడం లేదు. ఈ సమస్యకు పరిష్కారంగా వైద్యాన్ని గ్రామాల బాట పట్టించారు. ఇందుకోసం కొత్తగా డబ్బు ఖర్చు చేసిందేమీ లేదన్నారామె. పాతబడిన రైలు బోగీలకు రిపేర్ చేసి క్లినిక్‌లుగా మార్చారు. రైల్వే హాస్పిటల్ వైద్య సిబ్బంది ఆ రైళ్లలో గ్రామాలకు వెళ్తారు. ప్రాథమికంగా అవసరమైన మందులుంటాయి. ఈసీజీ, బ్లడ్ సాంపుల్ కలెక్షన్ వంటి అవసరమైన పరికరాలతో వెళ్తుందీ రైలు. ఒక్కోరోజు ఒక్కో రూట్. ఒక గ్రామానికి పదిహేను రోజులకొకసారి చొప్పున నెలలో రెండుసార్లు వెళ్తుందీ ఆరోగ్యరైలు.

జనవరిలో పట్టాలెక్కింది
భుసావాల్ డివిజన్‌లో పాతిక వేల మంది ఉద్యోగులున్నారు. ఈ ఏడాది జనవరి 18వ తేదీన పట్టాలెక్కిన ఈ రైలు క్లినిక్‌లలో తొలిరోజు 259 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. హాస్పిటల్ చక్రాలు కట్టుకుని మా ఊరికి వస్తుంటే ఇంతకంటే సంతోషం ఏముంటుంది... అంటున్నారు వైద్యసహాయం అందుకుంటున్న మహిళలు.


● బ్యూటిప్స్

మృదుత్వానికి ఆయిల్ ప్యాక్స్



- పూలలోని పుప్పొడి, నల్లనువ్వులు, బార్లీ గింజలు సమపాళ్లలో తీసుకొని, పొడి చేసి, ఒక డబ్బాలో భద్రపరుచుకోవాలి. ఈ పొడిని కావల్సినంత తీసుకొని, తగినన్ని నీళ్లు కలిపి, ముఖానికి, శరీరానికి పట్టించాలి. ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల పొడిబారిన చర్మం మృదువుగా, కాంతిమంతంగా అవుతుంది.
- అర టీ స్పూన్ తేనె, రెండు టేబుల్ స్పూన్ల రోజ్ వాటర్ కలిపి ముఖానికి, మెడకు రాసుకోవాలి. పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. తేనె చర్మానికి మాయిశ్చరైజర్‌లా ఉపయోగపడుతుంది. రోజ్‌వాటర్‌తో పోర్స్ శుభ్రపడి ముఖ చర్మం కాంతిమంతమవుతుంది.
- ఆలివ్ ఆయిల్, అలొవెరా జెల్ సమపాళ్లలో తీసుకొని అందులో కొద్దిగా వెనిలా ఎసెన్స్ కలపాలి. ఈ మిశ్రమాన్ని పొడిబారే చర్మతత్త్వం గలవారు మాయిశ్చరైజర్‌గా ఉపయోగించవచ్చు.
- చర్మం పొడిబారకుండా ఉండాలంటే మృతకణాలను తొలగిస్తూ ఉండాలి. కార్న్‌ఫ్లేక్స్‌ని పొడి చేసి అందులో తేనె, పాలు కలిపి చర్మానికి పట్టించి మర్దన చేయాలి. ఫలితంగా మృత కణాలు తొలగిపోయి, చర్మం మృదువుగా మారుతుంది.





- మూడు టీ స్పూన్ల కొబ్బరి నూనె, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్, టీ స్పూన్ గ్లిజరిన్, రెండు టీ స్పూన్ల నీళ్లు కలిపి మరిగించాలి. ఈ మిశ్రమం చల్లారాక ముఖానికి రాసి, మసాజ్ చేయాలి. అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఈ ఆయిల్ ప్యాక్ చర్మాన్ని మృదువుగా మారుస్తుంది.



భారత హాకీ జట్లకు నిరాశ

భువనేశ్వర్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్ రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో భారత పురుషుల, మహిళల జట్లకు నిరాశ ఎదురైంది. మంగళవారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో భారత పురుషుల జట్టు 1–4 గోల్స్ తేడాతో ప్రపంచ మాజీ చాంపియన్ జర్మనీ జట్టు చేతిలో... భారత మహిళల జట్టు 3–4 గోల్స్ తేడాతో స్పెయిన్ జట్టు చేతిలో ఓడిపోయాయి. జర్మనీతో జరిగిన మ్యాచ్‌లో భారత్ తరఫున గుర్జంత్ సింగ్ (13వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. జర్మనీ తరఫున ఫ్లోరియన్ స్పెర్లింగ్ (7వ నిమిషంలో), థీస్ ప్రింజ్ (14వ నిమిషంలో), మైకేల్ స్ట్రుతోఫ్ (48వ నిమిషంలో), రాఫెల్ హర్ట్‌కోప్ (55వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు తరఫున బల్జీత్ కౌర్ (19వ నిమిషంలో), సాక్షి రాణా (38వ నిమిషంలో), రుతుజా (45వ నిమిషంలో) ఒక్కో గోల్ నమోదు చేశారు. స్పెయిన్ జట్టుకు సోఫియా (21వ నిమిషంలో), లూసియా (52వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా... ఎస్టెల్ (25వ, 49వ నిమిషాల్లో) రెండు గోల్స్ అందించింది.

సై అంటే సై...

నేటి నుంచి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ

బరిలో ఎనిమిది జట్లు

- తొలి పోరులో న్యూజిలాండ్‌తో పాకిస్తాన్ ‘ఢీ’
- మధ్యాహ్నం గం. 2:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ 18 టీవీ చానెల్స్‌లో, జియోహాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం
- రేపు బంగ్లాదేశ్‌తో భారత్ మ్యాచ్

వన్డే క్రికెట్‌లో మరో ‘ప్రపంచ’ పోరుకు సమయం ఆసన్నమైంది. వరల్డ్ కప్ కాని వరల్డ్ కప్‌గా గుర్తింపు తెచ్చుకున్న చాంపియన్స్ ట్రోఫీలో సత్తా చాటేందుకు అన్ని జట్లు సిద్ధమయ్యాయి. ప్రపంచ కప్‌తో పోలిస్తే తక్కువ జట్లతో టాప్–8తో పరిమితమైన ఈ ఐసీసీ టోర్నీలో జరగబోయే హోరాహోరీ సమరాలు ఆసక్తి రేపుతున్నాయి. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత పాకిస్తాన్ ఒక ఐసీసీ టోర్నీకి వేదిక అవుతుండగా... భారత జట్టు పాకిస్తాన్ గడ్డపై ఆడకుండా దుబాయ్‌కే పరిమితమవుతోంది. ఎనిమిదేళ్ల క్రితం చివరిసారిగా నిర్వహించిన ఈ టోర్నీలో విజేతగా నిలిచిన పాక్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతుండగా... రెండుసార్లు టైటిల్ సాధించిన భారత్ వన్డే వరల్డ్ కప్ ఫైనల్ ఓటమిని దాటి ఈ ఫార్మాట్‌లో మళ్లీ ‘చాంపియన్’ హోదా కోసం రెడీ అంటోంది.

కరాచీ: ఐసీసీ 2017లో చాంపియన్స్ ట్రోఫీని ఇంగ్లండ్‌లో నిర్వహించింది. లెక్క ప్రకారం 2021లో తర్వాతి టోర్నీ జరగాల్సి ఉంది. అయితే అనూహ్యంగా కోవిడ్ కారణంగా ఐసీసీ అన్ని షెడ్యూల్‌లలో మార్పులు చేయాల్సి వచ్చింది. 2020లో జరగాల్సిన టి20 ప్రపంచ కప్‌ను తప్పనిసరి పరిస్థితుల్లో 2021కి మార్చారు. ఈ నేపథ్యంలో ఒకే ఏడాది రెండు ఐసీసీ టోర్నీల నిర్వహణ సాధ్యం కాదు కాబట్టి 2021 టోర్నీని పూర్తిగా రద్దు చేసేశారు. మరో నాలుగేళ్లకు ఇప్పుడు చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణకు రంగం సిద్ధమైంది. 2023 వన్డే వరల్డ్ కప్‌లో తొలి 8 స్థానాల్లో నిలిచిన జట్లు దీనికి నేరుగా అర్హత సాధించాయి. దాంతో మాజీ చాంపియన్ శ్రీలంక దూరం కాగా... అసలు వరల్డ్ కప్ ప్రధాన పోటీలకే క్వాలిఫై కాని మరో మాజీ చాంపియన్ వెస్టిండీస్ కూడా ఈ టోర్నీలో కనిపించడం లేదు. అఫ్గానిస్తాన్ తొలిసారి చాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగుతోంది. ఈ టోర్నీలో భాగంగా నాలుగు వేదికల్లో కలిపి మొత్తం 12 లీగ్ మ్యాచ్‌లు, రెండు సెమీఫైనల్స్, ఫైనల్ జరుగుతాయి. భారత్ ఆడే 3 లీగ్ మ్యాచ్‌లు మినహా మిగతా వాటికి పాకిస్తాన్ వేదిక కాగా... భారత్ తమ అన్ని మ్యాచ్‌లను దుబాయ్‌లోనే ఆడుతుంది. టీమిండియా సెమీఫైనల్, ఆపై ఫైనల్ చేరితే ఆ రెండు మ్యాచ్‌లూ దుబాయ్‌లోనే జరుగుతాయి. మరో సెమీఫైనల్‌కు మాత్రం పాక్ ఆతిథ్యమిస్తుంది. భారత్ ఫైనల్ చేరకపోతే మాత్రం టైటిల్ పోరును పాకిస్తాన్ గడ్డపైనే నిర్వహిస్తారు.



ఎనిమిది జట్ల కెప్టెన్‌లతో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ గ్రాఫిక్...

ఏ జట్టు ఎలా ఉందంటే...


బట్లర్

- ఒక్కసారి కూడా టైటిల్ గెలవని ఇంగ్లండ్ జట్టు రెండు సార్లు ఫైనల్స్‌లో ఓడింది. గత కొంత కాలంగా పేలవ ప్రదర్శన కనబరుస్తోంది. తాము నమ్ముకున్న విధ్వంసక ఆట ఇప్పుడు ఏమాత్రం పనికి రాక కుప్పకూలిపోతోంది. బ్యాటింగ్‌లో రూట్, కెప్టెన్ బట్లర్, బ్రూక్ రాణించడం కీలకం. పేసర్లు ప్రభావం చూపలేకపోతుండగా... బలమైన స్పిన్నర్ జట్టులో లేడు. ఫామ్‌పరంగా వరల్డ్ కప్ తర్వాత 14 వన్డేలు ఆడితే 4 మాత్రమే గెలిచింది. వెస్టిండీస్, భారత్‌ల చేతిలో చిత్తయింది.


స్మిత్

- టోర్నీలో రెండుసార్లు విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా గత రెండు సార్లు సెమీస్ కూడా చేరలేకపోయింది. ముగ్గురు ప్రధాన పేసర్లు కమిన్స్, స్టార్క్, హాజల్‌వుడ్ లేకుండా బరిలోకి దిగడం బౌలింగ్‌ను బలహీనపర్చింది. దాంతో బ్యాటింగ్‌పైనే భారం ఉంది. కెప్టెన్ స్మిత్, హెడ్, మ్యాక్స్‌వెల్ కీలకం కానున్నారు. పేసర్లు జాన్సన్, ఎలిస్‌లతో పాటు స్పిన్నర్ జంపా రాణించాల్సి ఉంది. 2023 వరల్డ్ కప్ తర్వాత ఇంగ్లండ్‌పై **సిరీస్ గెలిచిన** ఆసీస్... పాక్, శ్రీలంక **చేతుల్లో** ఓడింది.


సాంట్నర్

- 2000లో తమ ఏకైక ఐసీసీ టోర్నీ నెగ్గిన న్యూజిలాండ్... 2009లో ఫైనల్ చేరింది. వైవిధ్యమైన ఆటగాళ్ల **కూర్పుతో జట్టు ఇతర** అన్ని టీమ్‌ల**కంటే మెరుగ్గా** కనిపిస్తోంది. **కాన్వే,** రచిన్ రవీంద్ర, **కేన్** విలియమ్సన్, లాథమ్‌లతో బ్యాటింగ్ బలంగా ఉండగా, కెప్టెన్ సాంట్నర్‌తో కలిపి ముగ్గురు స్పిన్నర్లు ప్రభావం చూపించగలరు. ఫెర్గూసన్ దూరం కావడం లోటే అయినా హెన్రీ పదునైన పేస్ కీలకం కానుంది. గత మూడు సిరీస్‌లలో రెండు గెలిచిన జట్టు... తాజాగా ముక్కోణపు టోర్నీ ఫైనల్లో పాక్‌ను ఓడించి విజేతగా నిలిచింది.


బవుమా

- తొలిసారి 1998లో జరిగిన టోర్నీలో విజేతగా నిలిచిన దక్షిణాఫ్రికా జట్టు ఆ తర్వాత నాలుగుసార్లు సెమీస్ చేరినా ముందంజ వేయలేకపోయింది. వరల్డ్ కప్ తర్వాత 14 మ్యాచ్‌లలో నాలుగే గెలిచినా... ఎక్కువసార్లు ద్వితీయ శ్రేణి జట్టే బరిలోకి దిగింది. కాబట్టి కీలక ఆటగాళ్లు రాణిస్తే సెమీస్ కచ్చితంగా చేరగలమని ఆశిస్తోంది. క్లాసెన్ అద్భుత ఫామ్‌లో ఉండగా... కెప్టెన్ బవుమా డసెన్, మార్క్‌రమ్ తమ వన్డే ఆటను ప్రదర్శించాల్సి ఉంది. రబడ మినహా బౌలింగ్‌లో పదును లేదు.


నజ్ముల్

- టోర్నీ చరిత్రలో బంగ్లాదేశ్ 12 **మ్యాచ్‌**లు ఆడితే గెలిచింది 2 మాత్రమే. **ఇటీవల** వరుసగా వెస్టిండీస్, అఫ్గానిస్తాన్ **చేతుల్లో** సిరీస్‌లు ఓడింది. చాలా కాలంగా **చెప్పుకోదగ్గ** ప్రదర్శన ఏమీ లేదు. అయితే టెస్టులు, **టి20లతో పోలిస్తే** వన్డేల్లో కాస్త మెరుగ్గా ఆడుతుండటంతో కొన్ని ఆశలు ఉన్నాయి. ముఖ్యంగా కొత్త తరం పేస్ బౌలర్లు తన్‌జీమ్, నాహిద్ చెప్పుకోదగ్గ రీతిలో ఆకట్టుకున్నారు. షకీబ్, తమీమ్ ఇక్బాల్‌ల తరాన్ని దాటి ఐసీసీ ఈవెంట్లో నజ్ముల్ సారథ్యంలోని బంగ్లాదేశ్ ఈసారి కాస్త కొత్తగా కనిపిస్తోంది.


రిజ్వాన్

- డిఫెండింగ్ చాంపియన్‌గా పాకిస్తాన్ బరిలోకి దిగుతోంది. గత టైటిల్ మినహా అంతకు ముందు పేలవ రికార్డు ఉంది. సొంతగడ్డపై జరుగుతుండటం పెద్ద సానుకూలత. ఫామ్‌లో లేకపోయినా ఇప్పటికీ బాబర్ ఆజమే కీలక బ్యాటర్. కెప్టెన్ రిజ్వాన్, ఫఖర్ జమాన్, సల్మాన్ ఆఘా ప్రత్యర్థి స్పిన్‌ను ఎలా ఆడతారనే దానిపైనే జట్టు అవకాశాలు ఉన్నాయి. సయీమ్ అయూబ్ దూరం కావడం ఇబ్బంది పెట్టే అంశం. షాహీన్, నసీమ్, రవూఫ్‌లతో బౌలింగ్ ఇప్పటికీ సమస్యే. అబ్రార్ నాణ్యమైన స్పిన్నర్ కాదు.


హష్మతుల్లా

- అఫ్గానిస్తాన్ జట్టుకు ఇదే తొలి చాంపియన్స్ ట్రోఫీ. వరల్డ్ కప్‌లో టాప్–8లో నిలిచి అర్హత సాధించడంతోనే ఆ జట్టు ఎంత మెరుగైందో చెప్పవచ్చు. వరల్డ్ కప్ తర్వాత ఐదు సిరీస్‌లు ఆడితే నాలుగు గెలిచింది. టి20 వరల్డ్ కప్‌లో కూడా సెమీస్ చేరిన టీమ్ తాము ఎలాంటి జట్టునైనా ఓడించగలమనే నమ్మకాన్ని కలిగిస్తోంది. గుర్బాజ్, కెప్టెన్ హష్మతుల్లా, అజ్మతుల్లా బ్యాటింగ్‌లో ప్రధానం కాగా... బౌలింగ్‌లో రషీద్ పెద్ద బలం. సీనియర్లు నబీ, నైబ్‌లకు గెలిపించగల సామర్థ్యం ఉంది.

చాంపియన్స్ ట్రోఫీ 2025

CHAMPIONS TROPHY 2025 · PAKISTAN

గ్రూప్ ‘ఎ’
- భారత్
- పాకిస్తాన్
- న్యూజిలాండ్
- బంగ్లాదేశ్

గ్రూప్ ‘బి’
- ఆస్ట్రేలియా
- దక్షిణాఫ్రికా
- ఇంగ్లండ్
- అఫ్గానిస్తాన్

షెడ్యూల్

తేదీ	గ్రూప్	ఎవరితో ఎవరు	వేదిక
ఫిబ్రవరి 19	ఎ	పాకిస్తాన్ x న్యూజిలాండ్	కరాచీ
ఫిబ్రవరి 20	ఎ	భారత్ x బంగ్లాదేశ్	దుబాయ్
ఫిబ్రవరి 21	బి	దక్షిణాఫ్రికా x అఫ్గానిస్తాన్	కరాచీ
ఫిబ్రవరి 22	బి	ఆస్ట్రేలియా x ఇంగ్లండ్	లాహోర్
ఫిబ్రవరి 23	ఎ	భారత్ x పాకిస్తాన్	దుబాయ్
ఫిబ్రవరి 24	ఎ	న్యూజిలాండ్ x బంగ్లాదేశ్	రావల్పిండి
ఫిబ్రవరి 25	బి	ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా	రావల్పిండి
ఫిబ్రవరి 26	బి	ఇంగ్లండ్ x అఫ్గానిస్తాన్	లాహోర్
ఫిబ్రవరి27	ఎ	పాకిస్తాన్ x బంగ్లాదేశ్	రావల్పిండి
ఫిబ్రవరి 28	బి	ఆస్ట్రేలియా x అఫ్గానిస్తాన్	లాహోర్
మార్చి 1	బి	ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా	కరాచీ
మార్చి 2	ఎ	భారత్ x న్యూజిలాండ్	దుబాయ్

మార్చి 4 తొలి సెమీఫైనల్ (ఎ1 x బి2) దుబాయ్
మార్చి 5 రెండో సెమీఫైనల్ (బి1 x ఎ2) లాహోర్
మార్చి 9 ఫైనల్ (దుబాయ్ లేదా లాహోర్)

అన్ని మ్యాచ్‌లు మధ్యాహ్నం గం. 2:30 నుంచి



గత విజేతలు

	ఆతిథ్యం	విజేత	రన్నరప్
2017	ఇంగ్లండ్	పాకిస్తాన్	భారత్
2013	ఇంగ్లండ్	భారత్	ఇంగ్లండ్
2009	దక్షిణాఫ్రికా	ఆస్ట్రేలియా	న్యూజిలాండ్
2006	భారత్	ఆస్ట్రేలియా	వెస్టిండీస్
2004	ఇంగ్లండ్	వెస్టిండీస్	ఇంగ్లండ్
2002	శ్రీలంక	భారత్–శ్రీలంక (సంయుక్త విజేతలు)	
2000	కెన్యా	న్యూజిలాండ్	భారత్
1998	బంగ్లాదేశ్	దక్షిణాఫ్రికా	వెస్టిండీస్

2025 చాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్‌మనీ వివరాలు

మొత్తం	69 లక్షల డాలర్లు (రూ. 60 కోట్లు)
విజేత	22 లక్షల 40 వేల డాలర్లు (రూ. 19 కోట్ల 47 లక్షలు)
రన్నరప్	11 లక్షల 20 వేల డాలర్లు (రూ. 9 కోట్ల 73 లక్షలు)
సెమీఫైనలిస్ట్	5 లక్షల 60 వేల డాలర్లు (రూ. 4 కోట్ల 86 లక్షలు)
సెమీఫైనలిస్ట్	5 లక్షల 60 వేల డాలర్లు (రూ. 4 కోట్ల 86 లక్షలు)
5వ స్థానం	3 లక్షల 50 వేల డాలర్లు (రూ. 3 కోట్ల 13 లక్షలు)
6వ స్థానం	3 లక్షల 50 వేల డాలర్లు (రూ. 3 కోట్ల 13 లక్షలు)
7వ స్థానం	1 లక్ష 40 వేల డాలర్లు (రూ. 1 కోటీ 21 లక్షలు)
8వ స్థానం	1 లక్ష 40 వేల డాలర్లు (రూ. 1 కోటీ 21 లక్షలు)

- గ్రూప్ దశలో ప్రతి విజయానికి ఒక్కో జట్టుకు 34 వేల డాలర్లు (రూ. 29 లక్షల 56 వేలు) అందజేస్తారు.
- పార్టిసిపేషన్ ఫీజు కింద 8 జట్లకు 1 లక్ష 25 వేల డాలర్ల (రూ. 1 కోటీ 8 లక్షలు) చొప్పున ఇస్తారు.

రోహిత్ సేన కొడుతుందా!

ఫామ్‌లో టీమిండియా ఆటగాళ్లు • స్పిన్నర్ల ప్రభావం కీలకం

సాక్షి క్రీడా విభాగం

వన్డే వరల్డ్ కప్‌లో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్ వరకు అజేయంగా తమ జైత్రయాత్రను కొనసాగించింది. వరుసగా పది విజయాలతో ఆల్‌టైమ్ గ్రేట్ వన్డే టీమ్‌లలో ఒకటిగా కనిపించింది. దురదృష్టవశాత్తూ ఫైనల్లో ఓడినా... ఇప్పుడు దాదాపు పదిహేను నెలల తర్వాత ఇదే ఫార్మాట్‌లో శిఖరాన నిలిచే అవకాశం మళ్లీ జట్టు ముందుకు వచ్చింది. ముఖ్యంగా వరల్డ్ కప్ టీమ్‌లో ఉన్న ఆటగాళ్లే దాదాపుగా ఈ మెగా టోర్నీలోనూ బరిలోకి దిగుతున్నారు. కాబట్టి చాంపియన్స్ ట్రోఫీ విజయం వారికి ప్రత్యేకంగా మారవచ్చు. ఫామ్‌పరంగా చూసినా ఇతర జట్లతో పోలిస్తే రోహిత్ సేననే బలంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మూడోసారి మన జట్టు టైటిల్ కొడుతుందా అనేది ఆసక్తికరం. 2017లో రన్నరప్‌గా నిలిచిన జట్టులోని ఐదుగురు ప్లేయర్లు ప్రస్తుత టీమ్‌లో భాగంగా ఉన్నారు. యూఏఈలో 2021 టి20 వరల్డ్ కప్‌లో సెమీస్ చేరడంలో విఫలమైన తర్వాత భారత్ ఇప్పుడు మళ్లీ ఇక్కడ ఐసీసీ టోర్నీలో బరిలో నిలిచింది.

బ్యాటింగ్‌లో సత్తా ప్రదర్శిస్తే...

టీమిండియా వన్డే బ్యాటింగ్ కూర్పు చాలా కాలంగా అనూహ్య మార్పులు లేకుండా నిలకడగా ఉంది. అదే జట్టుకు ప్రధాన బలం కూడా. రోహిత్, గిల్, కోహ్లి, అయ్యర్, కేఎల్ రాహుల్‌లతో టాప్–5 విషయంలో ఎలాంటి సమస్య లేదు. 2023 నుంచి చూస్తే వీరంతా కనీసం 1000 పరుగులు సాధించారు. ఇటీవల ఇంగ్లండ్‌తో సిరీస్‌లో రాణించడం కూడా సానుకూలాంశం. గిల్, అయ్యర్ చెలరేగిపోతుండగా ఫామ్‌ను అందుకున్న రోహిత్ సెంచరీతో సత్తా చాటాడు. కోహ్లి, రాహుల్ కూడా ఆకట్టుకున్నారు. ఆరు, ఏడు స్థానాల్లో ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజాల బ్యాటింగ్ మనకు ఎప్పుడూ అదనపు ప్రయోజనాన్ని అందించింది. వీరికి ఇప్పుడు అక్షర్ పటేల్ కూడా జత కలిశాడు. ఇటీవలి కాలంలో బ్యాటింగ్‌లో అక్షర్ అంచనాలకు మించి మెరుగై ఏ స్థానంలోనైనా ఆడి ఆకట్టుకుంటున్నాడు. రాహుల్ విఫలమైతే పంత్ రూపంలో తగిన ప్రత్యామ్నాయం కూడా అందుబాటులో ఉంది కాబట్టి బెంగ లేదు.

పేసర్లు రాణిస్తారా...

జస్‌ప్రీత్ బుమ్రా టోర్నీకి దూరం కావడం నిస్సందేహంగా జట్టుకు పెద్ద దెబ్బ. రవిశాస్త్రి చెప్పినట్లు అతని గైర్హాజరు జట్టు విజయావకాశాలపై తీవ్ర ప్రభావం చూపించవచ్చు. అయితే అందుబాటులో ఉన్నవారిలో షమీ ఆ స్థాయి బౌలర్. కానీ గాయం నుంచి కోలుకొని వచ్చిన అతను ఎంత వరకు తన అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వగలడనేది చూడాలి. పెద్దగా అనుభవం లేని అర్ష్‌దీప్, హర్షిత్ రాణా ఒత్తిడిని తట్టుకొని షమీకి అండగా నిలవడం అవసరం. హార్దిక్ పాండ్యా సత్తా చాటగలడు కాబట్టి మూడో పేసర్ బెంగ లేదు.


రోహిత్
కోహ్లి

ముగ్గురు ఖాయం!

చాంపియన్స్ ట్రోఫీలో భారత్ గెలుపుపై ఆశలు రేపుతున్న కీలక విభాగం స్పిన్ బౌలింగే. మన మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో జరుగుతుండటం కచ్చితంగా సానుకూలాంశం. అందుకే టీమ్ ఐదుగురు స్పిన్నర్లతో సిద్ధమైంది. ఫిబ్రవరి 9 వరకు ఐఎల్‌టి20 మ్యాచ్‌ల నిర్వహణలో పిచ్‌లన్నీ నెమ్మదిగా మారిపోయాయి. 11 రోజుల వ్యవధిలో జీవం ఉన్న పిచ్‌లను తయారు చేయడం దాదాపు అసాధ్యం కాబట్టి ఇవన్నీ స్పిన్‌కు అనుకూలించవచ్చు. బౌలింగ్‌లో వైవిధ్యం ఉన్న మన స్పిన్నర్లు ఫామ్‌లో కూడా ఉన్నారు. వీరిని ఎదుర్కోవడం ప్రత్యర్థి బ్యాటర్లకు కష్టంగా మారిపోనుంది. ఆరేళ్లుగా ఇక్కడ పెద్ద జట్లేవీ వన్డేలు ఆడలేదు. అయితే 2018 నుంచి ఇక్కడ సగటు తొలి ఇన్నింగ్స్ స్కోరు 213 మాత్రమే. తక్కువ స్కోరింగ్‌ల మ్యాచ్‌లలో స్పిన్నర్లు ప్రభావం చూపడం ఖాయం. తుది జట్టులో కనీసం ముగ్గురిని జట్టు ఎంచుకుంటుంది.

2 చాంపియన్స్ ట్రోఫీలో రెండుసార్లు (2002, 2013)లలో విజేతగా నిలిచిన భారత్ మరో రెండుసార్లు (2000, 2017)లో ఫైనల్లో ఓడింది.

9 వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత భారత్ 9 వన్డేలే ఆడింది. ఇందులో 5 గెలిచి 3 ఓడింది. ఒక మ్యాచ్ ‘టై’గా ముగిసింది. వీటిలో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లపై సిరీస్ నెగ్గగా... శ్రీలంక చేతిలో సిరీస్ కోల్పోయింది.

ముంబై ఇండియన్స్ బోణీ

- ఐదు వికెట్లతో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపు
- రాణించిన హేలీ, నాట్‌సివర్

వడోదర: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో తొలి మ్యాచ్‌లో ఓడిన ముంబై ఇండియన్స్ రెండో పోరులో విజయాన్ని అందుకొని పాయింట్ల ఖాతా తెరిచింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 5 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. గుజరాత్‌కు ఈ టోర్నీలో ఇది రెండో పరాజయం. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 120 పరుగులకే ఆలౌటైంది. హర్లీన్ డియోల్ (31 బంతుల్లో 32; 4 ఫోర్లు), కాశ్వీ గౌతమ్ (15 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే కొద్దిగా ప్రభావం చూపగలిగారు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ హేలీ మాథ్యూస్ (3/16) రాణించగా...అమెలియా కెర్, నాట్ సివర్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం ముంబై 16.1 ఓవర్లలో 5 వికెట్లకు 122 పరుగులు చేసింది. నాట్ సివర్ బ్రంట్ (39 బంతుల్లో 57; 11 ఫోర్లు) దూకుడుగా ఆడి జట్టును గెలుపు దిశగా తీసుకెళ్లింది. **నేడు జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో యూపీ వారియర్స్ జట్టు తలపడుతుంది.**


హేలీ మాథ్యూస్

స్కోరు వివరాలు

గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్: మూనీ (సి) సంస్కృతి గుప్తా (బి) నాట్ సివర్ 1; వోల్‌వార్ట్ (సి) సజన (బి) షబ్నిమ్ 4; హేమలత (సి) కెర్ (బి) హేలీ 9; ఆష్లీ గార్డ్‌నర్ (సి) సంజన (బి) నాట్ సివర్ 10; హర్లీన్ (సి) హేలీ (బి) కౌర్ 32; డాటిన్ (స్టంప్డ్) యస్తిక (బి) కెర్ 7; కాశ్వీ (సి) భాటియా (బి) హేలీ 20; సిమ్రన్ (సి) కెర్ (బి) హేలీ 3; తనూజ (సి) సంస్కృతి గుప్తా (బి) కెర్ 13; సయాలీ (నాటౌట్) 13; ప్రియ (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 120. వికెట్ల పతనం:** 1–6, 2–14, 3–16, 4–28, 5–43, 6–67, 7–79, 8–103, 9–103, 10–120. **బౌలింగ్:** షబ్నిమ్ ఇస్మాయిల్ 4–1–17–1, నాట్ సివర్ 4–0–26–2, హేలీ మాథ్యూస్ 4–0–16–3, అమేలియా కెర్ 4–0–22–2, పరుణిక 2–0–20–0, అమన్‌జోత్ కౌర్ 2–0–17–1. **ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్:** హేలీ మాథ్యూస్ (సి) హర్లీన్ (బి) తనూజ కన్వర్ 17; యస్తిక (సి) వోల్‌వార్ట్ (బి) ప్రియ 8; నాట్ సివర్ (బి) ప్రియ 57; హర్మన్‌ప్రీత్ (ఎల్బీ) (బి) కాశ్వీ 4; కెర్ (ఎల్బీ) (బి) కాశ్వీ 19; సజన (నాటౌట్) 10; కమలిని (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (16.1 ఓవర్లలో 5 వికెట్లకు) 122. వికెట్ల పతనం:** 1–22, 2–46, 3–55, 4–100, 5–114. **బౌలింగ్:** ఆష్లీ గార్డ్‌నర్ 3–0–21–0, తనూజ 3–0–25–1, డియాండ్ర డాటిన్ 3.1–0–19–0, ప్రియ మిశ్రా 4–0–40–2, కాశ్వీ గౌతమ్ 3–0–15–2.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి బిజినెస్
బుధవారం
19-2-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	29	75,967
నిఫ్టీ ▽	14	22,945

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11:30 ముగింపు)			
నాస్‌డాక్	20,011	▽	81
డోజోన్స్	44,498	▽	47
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,767	▽	1
డాక్స్	22,844	△	46
షాంఘై	3,324	▽	31
నికాయ్	39,270	△	96

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	85,690	△	436
బంగారం (99.5 స్వచ్ఛత)	85,347	△	434
వెండి (కిలో)	96,023	△	77

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		86.50	87.52
£	బ్రిటన్ పౌండ్		107.01	111.94
€	యూరో		89.78	92.41
¥	జపాన్ ఎన్ (100)		46.00	67.00
AUS	ఆస్ట్రేలియా డాలర్		54.14	56.37
S$	సింగపూర్ డాలర్		62.50	67.15
SAR	సౌదీ రియాల్		22.25	23.81
UAE D	యూఏఈ దిర్హామ్		22.75	24.53
¥	చైనా యువాన్		11.07	12.90

టెస్లా వచ్చేస్తోంది!

భారత్‌లో నియామకాలు షురూ

కంపెనీ రాక ఇక లాంఛనమే • ముందుగా మోడల్–3తో ఎంట్రీ





హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెస్లా.. ఎంతో కాలంగా ఊరిస్తూ వస్తున్న అమెరికాకు చెందిన ఈ ఈవీ దిగ్గజం ఎట్టకేలకు భారత్‌లో అడుగుపెడుతోంది. ఇందుకోసం నియామకాలను మొదలుపెట్టింది. ఢిల్లీ, ముంబై కేంద్రంగా 13 రకాల పోస్టులకు సిబ్బంది అవసరమంటూ లింక్డ్‌ఇన్ వేదికగా కంపెనీ ఉద్యోగ ప్రకటన ఇచ్చింది. దీంతో కంపెనీ రాక ఇక లాంఛనమే అయింది. ఇటీవలి అమెరికా పర్యటన సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీతో టెస్లా వ్యవస్థాపకుడు, అమెరికన్ టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్ సమావేశం అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్‌లో టెస్లా నియామకాలు మొదలుపెట్టడం ఆసక్తి కలిగిస్తోంది. భారత మార్కెట్లోకి టెస్లా ప్రవేశం గురించి చాలా ఆసక్తిగా ప్రజలు ఎదురు చూస్తున్న విషయం విదితమే.

తొలుత మోడల్–3..

పూర్తిగా తయారైన ఎలక్ట్రిక్ వాహనాలను తొలుత భారత్‌కు టెస్లా దిగుమతి చేసుకోనుంది. అన్ని అనుకూలిస్తే తయారీ కేంద్రం కార్యరూపం దాల్చడం ఖాయంగా కనిపిస్తోంది. టెస్లా ఈ ఏడాది భారత్‌లో తక్కువ ధర కలిగిన ఎలక్ట్రిక్ వాహనాన్ని విడుదల చేసే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. యూఎస్‌లో కంపెనీ నుంచి చవక కారు 'మోడల్–3' ధర దాదాపు రూ.26 లక్షలు ఉంది. భారత మార్కెట్లో పోటీగా ఉండేందుకు మోడల్–3లో చవక వెర్షన్ ముందుగా రంగ ప్రవేశం చేసే చాన్స్ ఉంది.

దశాబ్దం తర్వాత క్షీణత..

టెస్లా ప్రపంచవ్యాప్తంగా 2024లో 17.9 లక్షల యూనిట్ల ఎలక్ట్రిక్ కార్లను విక్రయించింది. 2023తో పోలిస్తే అమ్మకాలు 1.1 శాతం క్షీణించాయి. విక్రయాలు 12 ఏళ్ల తర్వాత తగ్గడం గమనార్హం. కొనుగోలుదారులను ఆకర్షించడానికి, ప్రపంచంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో నంబర్–1 ర్యాంక్‌ను నిలబెట్టుకోవడానికి కంపెనీ గత సంవత్సరం ధరలను పదేపదే తగ్గించినప్పటికీ విక్రయాలు క్షీణించాయి. ప్రస్తుతం సగటు కారు విక్రయ ధర 41,000 డాలర్లు నమోదైంది. ప్రధానంగా చైనాకు చెందిన బీవైడీ నుంచి టెస్లా పోటీ ఎదుర్కొంటోంది. బీవైడీ గత ఏడాది 17.6 లక్షల యూనిట్లను విక్రయించింది. ఈ సంస్థ మొత్తం అమ్మకాల్లో చైనా వాటా ఏకంగా 90 శాతం ఉంది. భారత్‌లో 2024లో వివిధ కంపెనీల ఈవీల విక్రయాలు 99,068 యూనిట్లు నమోదయ్యాయి. చైనాలో ఈ సంఖ్య 1.1 కోట్లకుపైమాటే.

షోరూంలు ఎక్కడంటే..

న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని ఏరోసిటీలో, ముంబై విమానాశ్రయం సమీపంలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో టెస్లా షోరూంలు రానున్నాయి. దాదాపు 5,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు కానున్నాయి. ఇవి షోరూంలు మాత్రమే. సర్వీస్ కేంద్రాలు కావు.

ఉద్యోగాలివీ..

బిజినెస్ ఆపరేషన్స్ అనలిస్ట్, సర్వీస్ అడ్వైజర్, పార్ట్స్ అడ్వైజర్, సర్వీస్ టెక్నీషియన్, సర్వీస్ మేనేజర్, సేల్స్ అండ్ కస్టమర్ సపోర్ట్, స్టోర్ మేనేజర్, కస్టమర్ సపోర్ట్ స్పెషలిస్ట్, కస్టమర్ సపోర్ట్ సూపర్‌వైజర్, డెలివరీ ఆపరేషన్స్ స్పెషలిస్ట్, ఆర్డర్ ఆపరేషన్స్ స్పెషలిస్ట్, ఇన్‌సైడ్ సేల్స్ అడ్వైజర్, కన్జూమర్ ఎంగేజ్‌మెంట్ మేనేజర్ కావాలంటూ కంపెనీ ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మరిన్ని వివరాలకు, దరఖాస్తుకు లింక్డ్‌ఇన్‌లో టెస్లా పేజీని చెక్ చేసుకోవచ్చు.

భారత్‌పై ఆసక్తి...


టెస్లా కొన్నేళ్లుగా భారత్‌లో అడుగుపెట్టాలని ఆసక్తిగా ఉంది. ఇక్కడి పన్నులే అడ్డంకిగా నిలిచాయి. దేశంలో దిగుమతి చేసుకున్న వాహనాలతో మొదట విజయం సాధిస్తే టెస్లా భారత్‌లో తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయవచ్చని 2021 ఆగస్టులో మస్క్ ప్రకటించారు. టెస్లా తన వాహనాలను భారత్‌లో విడుదల చేయాలని భావిస్తోందని ఆయన చెప్పారు. అయితే దిగుమతి సుంకాలు ప్రపంచంలో ఏ పెద్ద దేశంలో కూడా లేనంతగా ఇక్కడ అత్యధికంగా ఉన్నాయని అన్నారు. కాగా, 40,000 డాలర్ల కంటే ఎక్కువ ధర కలిగిన ఎలక్ట్రిక్ కార్లపై 110 శాతం దిగుమతి సుంకాన్ని గతంలో భారత్ విధించింది. విదేశీ ఈవీ సంస్థలను భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి ప్రోత్సహించే ప్రయత్నంలో ప్రభుత్వం ఇప్పుడు ఈ సుంకాన్ని 70 శాతానికి తగ్గించింది.

లక్ష కోట్ల మార్కెట్ క్యాప్ క్లబ్ నుంచి..

26 కంపెనీలు ఔట్

కరుగుతున్న కంపెనీల విలువ

స్టాక్ మార్కెట్ పతనంతో దిగ్గజ కంపెనీల మార్కెట్ విలువ కర్పూరంలా కరిగిపోతోంది. స్టాక్ సూచీలు జీవితకాల గరిష్టం వద్ద ట్రేడవుతున్నప్పుడు (2024 సెప్టెంబర్ 26న) రూ.లక్ష కోట్లకు పైగా మార్కెట్ క్యాప్ కలిగి కంపెనీల సంఖ్య 106. ఇప్పుడు ఈ కంపెనీల సంఖ్య 82కి దిగివచ్చింది. అంటే 26 కంపెనీలు రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాప్ క్లబ్ నుంచి వైదొలిగాయి. కాగా గతేడాది సెప్టెంబర్ 26న జీవితకాల గరిష్టం నాటి నుంచి బెంచ్‌మార్క్ సూచీలు 12% పతనమయ్యాయి. చిన్న, మధ్య తరహా సూచీలు 21% క్షీణించాయి.



స్మార్ట్ టీవీలకు జియో ఆపరేటింగ్ సిస్టం

- దేశీయంగా తొలి ఓఎస్ ఆవిష్కరణ
- 21 నుంచి టీవీలు అందుబాటులోకి



న్యూఢిల్లీ: స్మార్ట్ టీవీల కోసం దేశీయంగా తొలి ఆపరేటింగ్ సిస్టం జియోటెలి ఓఎస్‌ను ఆవిష్కరించినట్లు రిలయన్స్ జియో వెల్లడించింది. దీనితో తయారైన థామ్సన్, కొడక్, బీపీఎల్, జేవీసీ వంటి బ్రాండ్స్‌కి చెందిన స్మార్ట్ టీవీలు ఫిబ్రవరి 21 నుంచి అందుబాటులోకి వస్తాయని తెలిపింది. ఈ ఏడాది మరిన్ని బ్రాండ్స్ చేతులు కలిపే అవకాశం ఉందని వివరించింది. భారతీయ వినియోగదారుల అవసరాలను తీరుస్తూ, సరికొత్త వినోద అనుభూతిని అందించే కొత్త తరం ప్లాట్‌ఫాంగా జియోటెలి ఓఎస్‌ను జియో అభివృద్ధిచింది. ఈ విభాగంలో గూగుల్ ఆండ్రాయిడ్ టీవీ, వెబ్‌ఓఎస్, శాంసంగ్ టైజెన్‌లతో జియోటెలి ఓఎస్ పోటీపడనుంది. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ ప్రకారం భారత్‌లో స్మార్ట్ టీవీల మార్కెట్ 1.34 కోట్ల యూనిట్‌గా ఉండగా, ఆదాయాలు సుమారు రూ. 52 వేల కోట్ల స్థాయిలో ఉన్నాయి. ఓపెన్ సెల్స్‌పై కస్టమ్స్ సుంకాలు తగ్గిస్తూ బడ్జెట్లో చేసిన ప్రతిపాదనలతో స్థానికంగా డిస్‌ప్లేల అసెంబ్లింగ్‌కి ఊతం లభించి, అంతిమంగా తయారీ సంస్థలకు ఖర్చులు 5–10% ఆదా కాగలవని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ వీపీ (రీసెర్చ్) నీల్ షా చెప్పారు.

ఎల్‌ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) సింగిల్ ప్రీమియం స్మార్ట్ పెన్షన్ ప్లాన్‌ను ఆవిష్కరించింది. ఇది సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ అనే రెండు రకాల యాన్యుటీ ఆప్షన్లలో లభిస్తుంది. కనీసం రూ. లక్ష ప్రీమియంతో ఇది అందుబాటులో ఉంటుంది. పాక్షిక, పూర్తి విత్‌డ్రాయల్ ఆప్షన్లు ఉంటాయి. దీన్ని కేంద్ర ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం నాగరాజు, ఎల్‌ఐసీ సీఈవో సిద్ధార్థ మొహంతి ఆవిష్కరించారు. మరోవైపు, ఏజెంట్లు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు మొదలైన వారికి రోజువారీ కార్యకలాపాల్లో తోడ్పాటు అందించేందుకు 'వన్ మ్యాన్ ఆఫీస్' ఆన్‌లైన్ సర్వీస్‌ను ఎల్‌ఐసీ ప్రవేశపెట్టింది.

లాభాలు ఒకరోజుకే పరిమితం

స్టాక్ సూచీలకు మళ్లీ నష్టాలు



ముంబై: ఆరంభ నష్టాల నుంచి తేరుకొన్న స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఇంట్రాడేలో 466 పాయింట్ల పతనం నుంచి కోలుకున్న సెన్సెక్స్ చివరికి 29 పాయింట్ల నష్టంతో 75,967 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 14 పాయింట్లు నష్టపోయి 22,945 వద్ద నిలిచింది. దీంతో సూచీల లాభాలు ఒకరోజుకు పరిమితమయ్యాయి. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు రోజంతా కాసేపు లాభాల్లో ట్రేడయ్యాయి. ఇండస్ట్రియల్, కన్జూమర్ డ్యూరబుల్స్, టెలికం, క్యాపిటల్ గూడ్స్, ఆటో, కన్జూమర్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో మిడ్ సెషన్ కల్లా సెన్సెక్స్ 466 పాయింట్లు క్షీణించి 75,531 వద్ద కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ 159 పాయింట్లు కోల్పోయి 22,801 వద్ద కనిష్టాన్ని నమోదు చేశాయి. అయితే మిడ్‌సెషన్ నుంచి ఐటీ, వినిమయ, ఆయిల్‌అండ్‌గ్యాస్, ఇంధన షేర్లు రాణించడంతో స్వల్ప నష్టాలతో ముగిశాయి. డాలర్ ఇండెక్స్, క్రూడాయిల్ ధరలు పుంజుకోవడంతో డాలర్ మారకంలో రూపాయి విలువ 10 పైసలు బలహీనపడి 86.98 వద్ద స్థిరపడింది.

- అధిక వాల్యుయేషన్ల ఆందోళనలతో మిడ్, స్మాల్ క్యాప్ షేర్లలో అమ్మకాలు కొనసాగాయి. బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 2% క్షీణించింది. మిడ్ క్యాప్ సూచీ 0.19 శాతం నష్టపోయింది.

రూ.400 లక్షల కోట్ల దిగువకు సంపద

స్టాక్ మార్కెట్ పతనం నేపథ్యంలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.400 లక్షల కోట్ల దిగువకు చేరుకుంది. మంగళవారం ఒక్కరోజే రూ.2.10 లక్షల కోట్లు హరించుకుపోయాయి. గతేడాది ఏప్రిల్ 8న బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్ తొలిసారి రూ.400 లక్షల కోట్ల మార్కును అందుకుంది. గత సెప్టెంబర్ 27న జీవితకాల గరిష్టం రూ.479 లక్షల కోట్లకు చేరుకుంది. నాటి నుంచి నాటి నుంచి ఏకంగా రూ.81 లక్షల కోట్లు హరించుకుపోయింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మార్కెట్ 'కింగ్' రిలయన్స్
క్యూ3లో 6.4 శాతం వృద్ధి: ఇక్రా

సాక్షి సినిమా

మిరాకిల్ మేన్‌గా మాధవన్



ఆర్. మాధవన్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకు 'జి.డి.ఎన్' అనే టైటిల్ ఖరారైంది. 'ఎడిసన్ ఆఫ్ ఇండియా, మిరాకిల్ మేన్, వెల్త్ క్రియేటర్ ఆఫ్ కోయంబత్తూరు' వంటి పేర్లను గడించిన గోపాల స్వామి దొరైస్వామి నాయుడు (జీడీఎన్) జీవితం ఆధారంగా 'జి.డి.ఎన్' మూవీ తెరకెక్కుతోంది. ఈ బయోపిక్‌కు కృష్ణ కుమార్ రామకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా టైటిల్ లోగో రిలీజ్ చేసి, ప్రియమణి, జయరాం, యోగిబాబు ఇతర ప్రధాన పాత్రల్లో నటించనున్నట్లుగా మేకర్స్ వెల్లడించారు. ఇక పెద్దగా చదువుకోకపోయినా ఆటోమొబైల్, అగ్రికల్చర్, టెక్స్‌టైల్, ఫొటోగ్రఫీ వంటి సెక్టార్స్‌లో కొన్ని పరికరాల ఆవిష్కరణలు చేశారు జీడీఎన్. ఈ మధ్యకాలంలో మాధవన్ నటిస్తున్న రెండో బయోపిక్ ఇది. ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా (2022)లో నటించడంతో పాటు డైరెక్షన్ కూడా చేసి మెప్పించారు మాధవన్. ఈ సినిమాకు జాతీయ అవార్డు వచ్చింది. ఇప్పుడు మళ్లీ మరో బయోపిక్‌లో మాధవన్ నటిస్తుండటం విశేషం. మరి... వెండితెరపై మిరాకిల్ మేన్‌గా మాధవన్ ఏ స్థాయిలో ప్రేక్షకులను మెప్పిస్తారో చూడాలి.


ఈసారి స్టైలిష్‌గా...


• రామ్‌చరణ్


• సుకుమార్

'ఆర్ఆర్ఆర్' సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను అలరించారు హీరో రామ్‌చరణ్. 'పుష్ప 1: ది రైజ్', 'పుష్ప 2: ది రూల్' చిత్రాలతో డైరెక్టర్ సుకుమార్ కూడా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో రెండో సినిమా తెరకెక్కనుందనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. రామ్‌చరణ్ కెరీర్‌లో ఇది 17వ చిత్రంగా రూపొందనుంది. ఈ మూవీలో రామ్‌చరణ్ సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారని టాక్. రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'రంగస్థలం' (2022) బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ మూవీ తర్వాత వారి కాంబినేషన్‌లో మరో సినిమా రానుంది. రామ్‌చరణ్ ప్రస్తుతం 'ఉప్పెన' మూవీ ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో 'ఆర్‌సీ 16' (వర్కింగ్ టైటిల్) సినిమా చేస్తున్నారు. ఈ చిత్రం తర్వాత రామ్‌చరణ్, సుకుమార్ మూవీ పట్టాలెక్కుతుందని టాక్. 'రంగస్థలం'లో చిట్టిబాబుగా పక్కా పల్లెటూరు, ఫుల్ మాస్ పాత్రలో రామ్‌చరణ్‌ని చూపించారు సుకుమార్. తాజా చిత్రంలో అందుకు పూర్తి భిన్నమైన పాత్రలో చరణ్‌ని చూపించనున్నారట. ఈ చిత్రంలో అల్ట్రా స్టైలిష్ అర్బన్ లుక్‌లో కనిపిస్తారట. 'రంగస్థలం'లో చరణ్‌ని, 'పుష్ప' చిత్రాల్లో అల్లు అర్జున్‌ని పక్కా మాస్‌గా చూపించిన సుకుమార్... ఈసారి మాత్రం చరణ్ కోసం పూర్తి అర్బన్ బ్యాక్‌డ్రాప్ కథని సిద్ధం చేస్తున్నారని టాక్. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రష్మికా మందన్నాని తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.

సికందర్ సర్‌ప్రైజ్ సిద్ధం


• సల్మాన్ ఖాన్

సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సికందర్'. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో కాజల్ అగర్వాల్, సత్యరాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది రంజాన్ సందర్భంగా రిలీజ్ కానుంది. కాగా మంగళవారం (ఫిబ్రవరి 18) సాజిద్ బర్త్ డే సందర్భంగా 'సికందర్' సినిమా నుంచి సల్మాన్ ఖాన్ కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ నెల 27న ఈ చిత్రానికి సంబంధించి, ఓ సర్‌ప్రైజ్ కూడా ఉందని పేర్కొన్నారు. ఆ రోజు ఈ సినిమా టీజర్ లేదా రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ ఉండొచ్చని టాక్. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ సౌదీ అరేబియాలో ఉన్నారని సమాచారం. ఓ అమెరికన్ యాక్షన్ థ్రిల్లర్ మూవీలో గెస్ట్ రోల్ చేస్తున్నారని, ఈ మూవీ కోసమే ఆయన సౌదీ వెళ్లారని, అలాగే సల్మాన్ ఖాన్‌తో పాటు సంజయ్ దత్ కూడా ఓ గెస్ట్ రోల్ చేస్తున్నారని బాలీవుడ్ టాక్.

అల్లు అర్జున్‌కి జోడీ?


• జాన్వీ కపూర్

తెలుగు చిత్ర పరిశ్రమలో జాన్వీ కపూర్ హవా స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్టీఆర్ 'దేవర: పార్ట్ 1' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు జాన్వీ. ప్రస్తుతం రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న మూవీలో హీరోయిన్‌గా చేస్తున్నారామె. ఈ యంగ్ బ్యూటీకి మరో సూపర్ చాన్స్ దక్కిందట. అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ మూవీ రూపొందనుందనే టాక్ వినిపిస్తోన్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ సంస్థ ఈ మూవీని నిర్మించనుందట. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్రకు జాన్వీ కపూర్‌ను తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట. మరి... ఈ వార్త నిజమై అల్లు అర్జున్ సరసన జాన్వీ కనిపిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇదిలా ఉంటే... ప్రస్తుతం వెకేషన్‌లో భాగంగా అల్లు అర్జున్ స్పెయిన్‌లో ఉన్నారు. తిరిగొచ్చిన తర్వాత ఈ సినిమాకు చెందిన మరిన్ని వివరాలు వెల్లడి కానున్నాయని తెలిసింది.

పట్టుదలతో విజయం


• రామకృష్ణ గౌడ్

కిరణ్, అలేఖ్య రెడ్డి జంటగా నటించిన చిత్రం 'దీక్ష'. అక్సా ఖాన్, తులసి, అనూష ప్రధాన పాత్రల్లో నటించారు. డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధం అయింది. ఈ సందర్భంగా ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ – ''పట్టుదలతో పని చేస్తే ఎందులో అయినా విజయం సాధించవచ్చనే పాయింట్‌ను తీసుకుని 'దీక్ష'ని తెరకెక్కించాం. లవ్ యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మైథాలజీని జోడించి నిర్మించిన ఈ చిత్రంలో భీముడు పాత్రలో హీరో కిరణ్ అద్భుతమైన నటన కనబరిచాడు. సంగీత దర్శకుడు రాజ్ కిరణ్ ఐదు అద్భుతమైన పాటలు అందించారు'' అని తెలిపారు.

లవ్... ఎమోషన్


• కిరణ్ అబ్బవరం, రుక్సార్ థిల్లాన్

''దిల్ రూబా' టీజర్, ట్రైలర్‌లో ఏ కంటెంట్ చూపించామో సినిమాలోనూ అదే ఉంటుంది. ఎక్కడా అనవసరపు కంటెంట్ ఉండదు. ఈ మూవీ చేసినందుకు చాలా గర్వంగా, సంతోషంగా ఉంది. ఇంటెన్స్ మ్యూజికల్ లవ్ స్టోరీగా రూపొందిన ఈ సినిమా అందర్నీ ఆకట్టుకుంటుంది'' అని కిరణ్ అబ్బవరం చెప్పారు. విశ్వ కరుణ్ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, రుక్సార్ థిల్లాన్ జంటగా నటించిన చిత్రం 'దిల్ రూబా'. రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మించిన ఈ చిత్రం మార్చి 14న విడుదల కానుంది. సామ్ సీఎస్ సంగీతం అందించిన ఈ సినిమాలోని 'హే జింగిలి..' అంటూ సాగే సెకండ్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. భాస్కరభట్ల సాహిత్యం అందించిన ఈ పాటని సామ్ సీఎస్ పాడారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ– ''సారెగమ వాళ్ల ఫస్ట్ టైమ్ ఈ మూవీతో టాలీవుడ్‌లోకి వస్తున్నారు. రవిగారు, విశ్వ కరుణ్ మూడేళ్లుగా ఈ ప్రాజెక్ట్ కోసం కష్టపడ్డారు. వాళ్ల కోసమైనా 'దిల్ రూబా' సక్సెస్ కావాలి'' అన్నారు. ''మా 'దిల్ రూబా' పాన్ ఇండియా మూవీ కాకపోయినా పాన్ ఇండియా ప్రొడక్షన్ సారెగమతో కలిసి సినిమా చేశాం'' అని రవి చెప్పారు. ''హే జింగిలి... పాటకి మంచి పేరొస్తుంది'' అన్నారు విశ్వ కరుణ్. ''దిల్ రూబా' ప్యూర్ లవ్ ఎమోషన్‌తో అద్భుతంగా ఉంటుంది'' అని రుక్సార్ థిల్లాన్ పేర్కొన్నారు. లిరిక్ రైటర్ భాస్కరభట్ల, కొరియోగ్రాఫర్ ఈశ్వర్ పెంటి మాట్లాడారు.

పరదాలమ్మా పరదాలు


• అనుపమ పరమేశ్వరన్

అనుపమా పరమేశ్వరన్, దర్శనా రాజేంద్రన్, సంగీత కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'పరదా'. 'సినిమా బండి' మూవీ ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మించిన ఈ మూవీ త్వరలో విడుదల కానుంది. మంగళవారం (ఫిబ్రవరి 18) అనుపమా పరమేశ్వరన్ పుట్టినరోజు సందర్భంగా 'పరదా' చిత్ర యూనిట్ ప్రత్యేకమైన ప్రోమోను రిలీజ్ చేసింది. 'పరదాలమ్మా పరదాలు... రంగురంగుల పరదాలు... డిజైనర్ పరదాలు.... తీసుకోవాలమ్మా తీసుకోవాలి' అంటూ అనుపమ చెప్పే డైలాగులు ప్రోమోలో ఉన్నాయి. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ ఈ చిత్రంలో సుబ్బు పాత్రలో నటించారు అనుపమ. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రోహిత్ కొప్పు, సంగీతం: గోపీ సుందర్, కెమేరా: మృదుల్ సుజిత్ సేన్.

వినోదం... భయం


• అభి

అదిరే అభి, స్వాతి మండల్ జంటగా గంగ సప్తశిఖర దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ది డెవిల్స్ చైర్'. కేకే చైతన్య, వెంకట్ దుగ్గిరెడ్డి, చంద్ర సుబ్బా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ– ''ఈ సినిమా పాయింట్ చెప్పినప్పుడు ఎగ్జైటింగ్‌గా అనిపించింది. అభి అద్భుతంగా నటిస్తాడు. ఈ చిత్రం పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''మనిషికి ఉండే దురాశ మీదే ఈ చిత్రాన్ని తీశాం. మంచి కాన్సెప్ట్‌తో పాటు సందేశం కూడా ఈ మూవీలో ఉంది. అలాగే భయపెట్టేలానూ ఉంటుంది'' అని అన్నారు అభి. ''ఆడియన్స్‌కు కావాల్సినంత డ్రామా, వినోదం ఈ సినిమాలో ఉన్నాయి'' అన్నారు గంగ సప్తశిఖర.



మహా కుంభమేళాలో భాగంగా మంగళవారం యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానం ఆచరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఎత్తైన కొండలు.. చుట్టూరా పచ్చదనంతో ప్రకృతి ప్రేమికులను కనువిందు చేసే ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల అటవీ ప్రాంతం.. పెరిగిన ఎండలతో ప్రస్తుతం పచ్చదనాన్ని కోల్పోయింది. దీంతో నాడు ప్రకృతి రమణీయతతో ఆకట్టుకున్న ఈ ప్రాంతం కళావిహీనంగా మారి కాలానుగుణంగా వచ్చే మార్పులకు నిదర్శనంగా నిలుస్తోంది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



క్లుప్తంగా...

సిక్కింలో రోడ్లపై చెత్త వేస్తే రూ. 5 వేల జరిమానా

మాజీ ఎంపీ వినోద్‌తో సిక్కిం కేబినెట్ సెక్రటరీ భూషణ్ పాఠక్

సాక్షి, హైదరాబాద్: తమ రాష్ట్రంలో రోడ్లపై చెత్త వేసేవారికి రూ.5 వేల జరిమానా విధిస్తామని సిక్కిం రాష్ట్ర కేబినెట్ సెక్రటరీ భూషణ్ పాఠక్ తెలిపారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సిక్కింలో పర్యటించి, భూషణ్ పాఠక్‌తో భేటీ అయ్యారు. ఆ రాష్ట్రంలోని అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పారిశుధ్య సిబ్బంది పనితీరు గురించి పాఠక్ వివరించారు. రోడ్ల మీద చెత్త వేస్తే తమ ప్రభుత్వం రూ.5 వేల జరిమానా వేస్తుందని తెలిపారు. తెలంగాణలో గత పదేళ్లలో జరిగిన అభివృద్ధిని పాఠక్‌కు వినోద్‌కుమార్ వివరించారు.

రేపట్నుంచి 'నేషనల్ బయోడైవర్సిటీ యూత్ కాన్ఫరెన్స్'

- రాష్ట్ర జీవవైవిధ్య మండలి కార్యదర్శి కాళీచరణ్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఈనెల 20వ తేదీ నుంచి 22 వరకు కన్హా శాంతివనంలో నేషనల్ బయోడైవర్సిటీ యూత్ కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తున్నట్టు తెలంగాణ జీవవైవిధ్య మండలి కార్యదర్శి కాళీచరణ్ ఎస్.ఖర్తాడే తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో పర్యావరణానికి సంబంధించి ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై నిపుణులు, విధాన నిర్ణేతలు, పరిశోధకులు, విద్యార్థులు చర్చించనున్నట్లుఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ యూత్ కాన్ఫరెన్స్ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ హైదరాబాద్ డిక్లరేషన్‌ను విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా జీవవైవిధ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. సదస్సుకు నేషనల్ బయోడైవర్సిటీ బోర్డు అథారిటీ చైర్‌పర్సన్ అచలేందర్‌రెడ్డి, పంజాబ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి మాజీ సభ్యకార్యదర్శి నీలిమా జేరత్, పద్మశ్రీ రాహిబాయి సోమ పాపేరే, స్టేట్ డైరెక్టర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా) ఫరీదా తంపాల్, కేంద్ర పీఆర్ మాజీ స్పెషల్ సెక్రటరీ ఏకే గోయల్ ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు.

పెద్దపులి జాడకు ట్రాకింగ్ కెమెరాల ఏర్పాటు



గారెకుంట వాగు వద్ద పెద్దపులి పాదముద్రలు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ కాటారం మండలంలో పది రోజులుగా పెద్దపులి జాడ తెలుసుకునేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు ఆయా ప్రాంతాల్లో ట్రాకింగ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. తాజాగా మంగళవారం మహదేవపూర్ మండలం పలుగుల ఎస్సీ కాలనీ పక్కన నీలగిరి వనంలో పులి సంచరించినట్లు గుర్తించారు. అదేగ్రామానికి చెందిన నిట్టూరి బాపు అనే రైతు ఎడ్లబండితో పత్తిచేనుకు వెళ్తుండగా ముందు పెద్దపులి నడుచుకుంటూ వెళ్తుండటం గుర్తించాడు. వెంటనే ఎడ్లబండిని వెనుకకు తిప్పి ఇంటికి చేరుకున్నాడు. గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారులకు తెలిపారు. అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పులికోసం అన్వేషించారు. గారెకుంట పోచమ్మ కుంట వద్ద పులి నీరు తాగి వెళ్లినట్లు పాదముద్రలను అధికారులు సేకరించారు. 2020, 2022లో కే–8 పెద్దపులి ఇదే ప్రాంతంలో ఆడతోడు (మేటింగ్) కోసం సంచరించినట్లు అప్పట్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పుడు మళ్లీ అదే పులి వచ్చిందా? లేదా మరేదైనా పులి సంచరిస్తుందా? అనేది తెలియాల్సి ఉంది. కానీ, అటవీశాఖ అధికారులు మాత్రం ట్రాకింగ్ కెమెరాల్లో ఎక్కడా చిక్కడం లేదని పేర్కొంటున్నారు.

ఏఐ బ్రెయిన్ డ్రెయిన్

కృత్రిమ మేధ.. మేధో వలసలో మనదే మొదటి స్థానం	ఏఐ గ్లోబల్ పేటెంట్స్‌లో మనవి 0.23 శాతమే	వలసలు ఆపేందుకు నిపుణుల సూచనలు
	61.13 శాతంతో టాప్‌లో చైనా	
	20.9 శాతంతో రెండోస్థానంలో అమెరికా	

సాక్షి, హైదరాబాద్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో మేధో వలస (బ్రెయిన్ డ్రెయిన్) భారత్‌కు పెద్ద సవాల్‌గా మారబోతోంది. యువతలో ఏఐ నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో మంచి పురోగతి ఉన్నా, వారు దేశంలోనే స్థిరపడేలా చేయడంలో విఫలమవుతున్నట్టు పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. భారతీయ ఏఐ నిపుణులు అమెరికా వంటి దేశాలకు వలస వెళ్తున్నారు. భారీ వేతనాలతోపాటు అత్యాధునిక పరిశోధనలకు మంచి వాతావరణం ఉండడంతో అటువైపు ఆకర్షితులవుతున్నారు. 'ఏఐ టాలెంట్ కాన్సన్‌ట్రేషన్'లో ప్రపంచంలో భారత్ 13వ స్థానంలో నిలిచినట్టు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ 'ఏఐ ఇండెక్స్ రిపోర్ట్–2024' ప్రకటించింది. ప్రపంచంలో ఏఐ మేధో వలసలో మాత్రం మొదటి స్థానంలో నిలిచినట్లు వెల్లడించింది. ఏఐ నైపుణ్యాలున్న ప్రతి 10 వేల మంది లింక్డ్‌ఇన్ ఖాతాదారుల్లో 0.76 శాతం (నెట్ మైగ్రేషన్ రేటు) మేధో వలస ఉన్నట్టు తెలిపింది. అంటే ప్రతి పది వేల మంది భారతీయ ఏఐ నిపుణుల్లో దాదాపు ఒకశాతం విదేశాలకు వలస పోతున్నారు.



ఏఐ పేటెంట్స్‌లోనూ అథమ స్థానమే

ఏఐ పేటెంట్స్ విషయంలోనూ భారత్ వెనుకబడే ఉంది. 2022లో ప్రపంచస్థాయి ఏఐ పేటెంట్స్‌లో మనదేశం 0.23 శాతానికే పరిమితమైంది. ఈ విషయంలో చైనా ఆధిపత్యం కొనసాగుతోంది. గ్లోబల్ ఏఐ పేటెంట్స్‌లో 61.13 శాతంతో చైనా మొదటిస్థానంలో నిలువగా, 20.9 శాతంతో అమెరికా రెండో స్థానంలో ఉంది. ఏఐ మౌలికసదుపాయాల పటిష్టానికి 'కంప్యూటింగ్ కెపాసిటీ'లో పెట్టుబడులు పెడుతున్నా పెద్దగా ప్రభావం చూపడం లేదు. ఏఐ టూల్స్ ఫౌండేషన్ టెక్నాలజీలో 'లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్' అందుబాటులోకి రావడంతో చైనాకు చెందిన డీప్‌సీక్–వీ2, అమెరికాకు చెందిన చాట్ జీపీటీ వంటివి గ్లోబల్ బెంచ్‌మార్క్‌గా నిలిచాయి. దీంతో భారత్‌కు సవాళ్లు ఎదురవుతున్నట్టు నిపుణులు చెప్తున్నారు. 2023 నాటికి భారత్ 60 జెనరేటివ్ ఏఐ స్టార్టప్‌లు కలిగి ఉన్నట్టు ప్రకటించుకున్నా (2021తో పోల్చితే రెండింతలు పెరుగుదల), ఈ రంగంలో గ్లోబల్ లీడర్‌గా ఎదిగేందుకు మరిన్ని కీలకమార్పులు చేయాల్సిన అవసరముందని అంటున్నారు.

భారత్‌లో ఏఐ రంగం అభివృద్ధి, మేధో వలసల నిరోధానికి నిపుణుల సూచనలు

- డేటా సెంటర్లు, కంప్యూటింగ్ వనరులు పెంచుకునేందుకు భారీగా పెట్టుబడులు పెట్టాలి. ఏఐ, డీప్‌టెక్ వంటి వాటిలో ప్రపంచస్థాయి రిసెర్చ్ సెంటర్లు, ల్యాబ్‌లు, ఇన్నోవేషన్ హబ్స్ ఏర్పాటుకు పెద్దమొత్తంలో నిధులు కేటాయించాలి.
- అత్యుత్తమ ప్రతిభ, నైపుణ్యాలున్నవారు దేశం వదిలి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి.
- ఏఐని సమాజాభివృద్ధికి, వైద్య, ఆరోగ్య, వ్యవసాయం, పర్యావరణ పరి రక్షణ తదితర రంగాల్లో విస్తారంగా వినియోగించాలి.
- ప్రస్తుతం అమెరికాలోని సిలికాన్‌వ్యాలీలో అత్యుత్తమ ఏఐ నిపుణుల్లో భారత సంతతివారే అధికంగా ఉన్నారు. వారిలో కొందరినైనా తిరిగి భారత్‌కు రప్పించి అవసరమైన పరిశోధన పర్యావరణ వ్యవస్థను, సౌకర్యాలను కల్పిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

ఏఐ ఇండెక్స్ రిపోర్ట్–24లో వివిధ దేశాల స్థానం

ఇజ్రాయెల్	1
సింగపూర్	2
ద.కొరియా	3
లక్సెంబర్గ్	4
ఫిన్‌లాండ్	5
భారత్	13

అవకాశాలు పెంచాలి

బ్రెయిన్ డ్రెయిన్‌ను బ్రెయిన్ గెయిన్‌గా మార్చుకునేందుకు దేశంలో మంచి ఏఐ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. దేశం నుంచి ఏఐ మేధో వలస ప్రమాదకర స్థాయిలో ఏమీ లేదు. నిపుణులు నైపుణ్యాలు పెంచుకునేందుకు సరైన అవకాశాలు కల్పించే బాధ్యత ప్రభుత్వ సంస్థలపై ఉంది. ఎంతగా పోటీతత్వాన్ని ప్రోత్సహిస్తే అంతగా నైపుణ్యాలు, నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉంటుంది. పాఠశాల స్థాయి నుంచే సిలబస్‌లో ఏఐ, మెషీన్ లెర్నింగ్ వంటివి చేర్చాలి. నాణ్యమైన శిక్షణ, ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్ సెంటర్లను అందుబాటులోకి తెస్తే దేశంలోని అద్భుతమైన నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయి.

-వెంకారెడ్డి, వైస్‌ప్రెసిడెంట్, సీనియర్ హెచ్ఆర్ లీడర్, కో ఫోర్జ్.

ఎలివేటెడ్ బదులు.. కేబుల్ కార్ మార్గం!

▶ మొదటి పేజీ తరువాయి

అందించాలని అధికారులు నిర్ణయించారు.

జంతువులకు ఇబ్బంది లేకుండా..

హైదరాబాద్ – శ్రీశైలం రహదారిని గతంలోనే నాలుగు వరసలకు విస్తరించారు. కానీ, శ్రీశైలం మార్గంలోని మన్ననూరు వరకే ఆ విస్తరణ కొనసాగింది. మన్ననూరు నుంచి దట్టమైన నల్లమల అటవీ ప్రాంతం మొదలవుతుంది. మధ్యలో అమ్రాబాద్ పులుల అభయారణ్యం ఉంటుంది. ఇక్కడ పెద్ద పులులతోపాటు చాలా రకాల వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి. వాటికి అంతరాయం కలగకూడదన్న ఉద్దేశంతో మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు రోడ్డును విస్తరించలేదు. అక్కడి నుంచి సాధారణ డబుల్ రోడ్డు మాత్రమే ఉంది. ఆ రోడ్డుమీద కూడా ఆంక్షలు కొనసాగుతున్నాయి. మన్ననూరు, శ్రీశైలం మధ్య రాత్రి 9 గంటల నుంచి తిరిగి ఉదయం 6 గంటల వరకు వాహనాలను అనుమతించరు. పగటిపూట మాత్రమే వాహనాలను అనుమతిస్తారు. శ్రీశైలం పుణ్య క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ పెరిగి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో కొంతకాలంగా రోడ్డును విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ, వన్యప్రాణులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండటంతో అటవీ శాఖ అందుకు అనుమతించటం లేదు. ఈ నేపథ్యంలో ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. మన్ననూరు నుంచి తెలంగాణ పరిధి ఉన్న పాతాళగంగ వరకు 62.40 కి.మీ. మేర రోడ్డును విస్తరించాలని.. ఇందులో జంతువుల సంచారం ఉండే 45.42 కి.మీ. మేర ఎలివేటెడ్ (వంతెన తరహా) పద్ధతిలో రోడ్డు నిర్మించాలన్నది ప్రతిపాదన. దీనిని గతేడాది నవంబర్‌లో కేంద్ర ఉపరితల రవాణా శాఖ అధికారికంగా ప్రతిపాదించింది. ఇది పూర్తయితే దేశంలో అతి పొడవైన ఎలివేటెడ్ కారిడార్లలో ఒకటిగా నిలవనుంది.

ఖర్చు తగ్గించేందుకు..

ఎలివేటెడ్ కారిడార్ భారీ వ్యయంతో కూడిన ప్రాజెక్టు కావటంతో దానికి ప్రత్యామ్నాయం ఆలోచించాలని తాజాగా కేంద్ర ఉపరితల రవాణాశాఖ కార్యదర్శి ఉమాశంకర్ భావించారు. దీనిపై అధ్యయనం చేయాలని జాతీయ రహదారుల విభాగాన్ని ఆదేశించారు. ఎలివేటెడ్ పద్ధతిలోనే నిర్మించాల్సి వస్తే, తక్కువ నిడివి ఉండే ప్రత్యామ్నాయ అలైన్‌మెంటును సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కుదరని పక్షంలో ఎలివేటెడ్‌కు బదులు కేబుల్ కార్ మార్గాన్ని నిర్మించే సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కిలోమీటర్‌కు రూ.170 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. కేబుల్ కార్ మార్గానికి కిలోమీటర్‌కు రూ.50 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు.



సాగునీరు కరువై.. పశువులకు మేతై..

గంగాధర: చేతికి అందివచ్చిన పంట సాగునీరు లేక ఎండిపోతోంది. రూ.వేలల్లో పెట్టిన పెట్టుబడి పశువుల మేతగా మారుతోంది. సాగునీరు అందక ఎండిపోవడంతో మొక్కజొన్న చేనును పశువుల మేతకు వదిలేశాడో రైతు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం రంగరావుపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ పదెకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఎకరంలో మొక్కజొన్న, నాలుగు ఎకరాల్లో వరి పంట వేశాడు. మరో ఐదెకరాలు నీరందక బీడుగా వదిలేశాడు. ఎండలు ముదురుతుండటంతో తన వ్యవసాయ బావి ఎండిపోతోంది. జల్లుదశకు వచ్చిన మొక్కజొన్న సాగునీరు అందక ఎండిపోతుండటంతో పశువులకు వదిలేశాడు. మంగళవారం చేల్లో గొర్రెలను మేపాడు. వరిపంటకు కూడా వారంరోజుల్లో సరిపడా నీరందకుంటే ఎండిపోయే పరిస్థితి ఉందని శ్రీనివాస్ వాపోయాడు.

తెలంగాణకు 'స్వదేశీ దర్శన్' కింద 363.2 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: 'స్వదేశీ దర్శన్' పథకంలో తెలంగాణకు రూ.363.2 కోట్లు కేటాయించినట్లు కేంద్ర పర్యాటక శాఖ ప్రకటించింది. దేశంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో 2014–15 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. పథకం కింద 2015–16లో మహబూబ్‌నగర్ జిల్లాకు రూ.91.62 కోట్లు కేటాయించారు. 2016–17లో ములుగు–లక్నవరం, మేడారం–తాడ్వాయి, మల్లూరు, బొగత వాటర్ ఫాల్స్‌కు రూ.79.87 కోట్లు, కుతుబ్‌షాహీ హెరిటేజ్ పార్క్, పైగా టూంబ్స్, హయత్ భక్షి మసీదు, రేమండ్స్ టూంబ్స్‌కు రూ.96.90 కోట్లు విడుదల చేసినట్లు కేంద్రం తెలిపింది. 'స్వదేశీ దర్శన్–2.0లో భాగంగా భువనగిరి ఫోర్ట్ ఎక్స్‌పీరియన్షియల్ జోన్ అభివృద్ధి కోసం రూ.56.81 కోట్లు, అనంతగిరి ఎకో టూరిజం ఫారెస్ట్ అభివృద్ధికి రూ.38 కోట్లు కేటాయించినట్లు వెల్లడించింది.

కేసులు పెట్టడం.. లోపలేయడం.. కొట్టడం.. ఇవి తప్ప మీరేం చేస్తున్నారు?

- దర్యాప్తు ఎక్కడ చేస్తున్నారు?.. కోర్టు ఆదేశాలను తేలిగ్గా తీసుకుంటున్నారు
- ఇలాంటి తీరును సహించేదే లేదు
- పోలీసులపై మండిపడ్డ ఏపీ హైకోర్టు



సాక్షి, అమరావతి: పోలీసుల తీరుపై హైకోర్టు మరోసారి నిప్పులు చెరిగింది. వ్యక్తులపై కేసులు పెట్టడం, వారిని కొట్టడం, లోపలేయడం తప్ప మీరేం చేస్తున్నారు... అంటూ నిలదీసింది. కేసులు పెట్టి లోపలేస్తున్నారే తప్ప, ఏ కేసులోనూ దర్యాప్తు చేయడం లేదని తీవ్రంగా ఆక్షేపించింది. కోర్టు ఆదేశాలను పోలీసులు చాలా తేలిగ్గా తీసుకుంటున్నారంటూ మండిపడింది. ఇలాంటి తీరును సహించబోమని పోలీసులను హెచ్చరించింది. బొసా రమణ అనే వ్యక్తి అరెస్ట్ విషయంలో దర్యాప్తు చేసి ఉంటే, ఆ వివరాలను తమ ముందుంచేవారని, దర్యాప్తు చేయలేదు కాబట్టే, ఏ వివరాలను సమర్పించలేదని పేర్కొంది. రమణపై 27 కేసులున్నాయని చెబుతున్నారని, అలాంటప్పుడు ఈ కేసుల్లో దర్యాప్తు వివరాలను ఎందుకు తమ ముందుంచలేదని పోలీసులను ప్రశ్నించింది. రమణ అరెస్ట్ వ్యవహారాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్లాలని గత విచారణ సమయంలో తాము ఆదేశాలు జారీ చేశామని గుర్తు చేసింది. తమ ఆదేశాల మేరకు ఈ విషయంలో డీజీపీ ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించింది. రమణ అరెస్ట్ విషయంలో నివేదికలివ్వడానికి ప్రకాశం జిల్లా ఎస్పీ, విశాఖపట్నం కమిషనర్‌లకు మరింత గడువునిచ్చింది. విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

తన భర్తను అక్రమంగా నిర్బంధించారంటూ బొసా లక్ష్మి పిటిషన్

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తదితరులను విమర్శిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారంటూ విశాఖపట్నం మద్దిపాలెంలోని చైతన్యనగర్‌కి చెందిన బొసా రమణను కొద్దికాలం కిందట పోలీసులు అరెస్ట్ చేశారు. తన భర్తను ప్రకాశం జిల్లా పొదిలి, దర్శి పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, ఆయనని కోర్టులో హాజరుపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ రమణ భార్య బొసా లక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. రమణ అరెస్ట్ విషయంలో పొదిలి, దర్శి స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)ల వివరణ కోరింది. రమణను తాము అరెస్ట్ చేయలేదని వారు కోర్టుకు చెప్పారు. ఇచ్ఛాపురం పోలీసులు మరో కేసులో రమణను అరెస్ట్ చేశారని తెలిపారు. దీంతో హైకోర్టు ఇచ్ఛాపురం ఎస్‌హెచ్‌వోను ప్రతివాదిగా చేర్చింది. అనంతరం ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిన్నం నాయుడు, పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.వెంకటేశ్వర్లు వ్యక్తిగత హాజరుకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

కోర్టుకు ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు...

లక్ష్మి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్ మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. ధర్మాసనం ఆదేశాల మేరకు సీఐలు చిన్నం నాయుడు, వెంకటేశ్వర్లు కోర్టు ముందు హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ కోర్టు ఆదేశాలను పోలీసులు చాలా తేలిగ్గా తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. రమణను తమ ముందు హాజరుపరచాలన్న ఆదేశాలను అమలు చేయకపోవడమే ఇందుకు నిదర్శనమని చెప్పింది. ఇలాంటి నిర్లక్ష్యపు తీరును తాము మాత్రం సహించేది లేదని తేల్చి చెప్పింది. ఈ సమయంలో పొదిలి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తరఫు న్యాయవాది స్పందిస్తూ, బొసా రమణపై 27 కేసులున్నాయని తెలిపారు. రమణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆ కేసులో దర్యాప్తు ఎంత వరకు వచ్చిందని ధర్మాసనం ప్రశ్నించింది. కేసులు పెట్టడం, లోపలేయడం, కొట్టడం మినహా దర్యాప్తు చేయడం లేదని పేర్కొంది.

రైతుల ఆగ్రహం.. రోడ్డుపై కందకం

మానకొండూర్ రూరల్: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూరు గ్రామం నుంచి నిత్యం వందలాది లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. లారీలు వెళ్లేందుకు పొలాల్లో నుంచి మానేరువాగులోకి దారిని ఏర్పాటు చేశారు. అయితే ఇసుక రీచ్ కాంట్రాక్టర్ ఆ దారికి చేసుకున్న ఒప్పందం ప్రకారం రైతులకు డబ్బులు చెల్లించకపోవడంతో రోడ్డుపై రైతులు అడ్డంగా కందకం తవ్వారు. దీంతో ఇసుక కోసం వచ్చిన వందలాది లారీలు దారివెంట కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. లారీల కారణంగా గ్రామానికి వచ్చి వెళ్లే వాహనదారులు, ఆర్టీసీ బస్సు రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇసుక రీచ్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రైతులు కందకం తవ్వడంతో గ్రామానికి వెళ్లే దారిలో నిలిచిన లారీలు

నిధుల కోసమే పూజారులను టార్గెట్ చేశా

- విచారణలో వెల్లడించిన వీరరాఘవరెడ్డి



మొయినాబాద్: హిందూ ధర్మరక్షణ కోసమే రామరాజ్యం సైన్యం ఏర్పాటు చేశామని, ఇందుకు అవసరమైన నిధుల కోసమే పూజారులను టార్గెట్ చేశామని వీర రాఘవరెడ్డి పోలీసుల విచారణలో వెల్లడించినట్టు తెలిసింది. చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడైన వీర రాఘవరెడ్డిని పోలీసులు మూడు రోజులు కస్టడీకి తీసుకున్నారు. ఇందులో భాగంగా మంగళవారం చర్లపల్లి జైలు నుంచి మొయినాబాద్ పీఎస్‌కు తీసుకొచ్చారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ పోలీసులు వీర రాఘవరెడ్డిని విచారించారు. కొసలేంద ట్రస్టును భార్య పేరుతో ఎందుకు స్థాపించావు..రామరాజ్యం సైన్యాన్ని ఎందుకు ఏర్పాటు చేయాలనుకున్నావు.. దీని వెనుక ఇంకెవరైనా ఉన్నారా అని ప్రశ్నించినట్లు తెలిసింది. ఇందుకు సమాధానంగా హిందూ ధర్మం ప్రమాదంలో పడిందని, రక్షించుకోవాలంటే రామదండు అవసరమని భావించి.. రామరాజ్యం సైన్యాన్ని ఏర్పాటు చేసేందుకు సోషల్ మీడియాలో ప్రచారం చేశానని నిందితుడు చెప్పినట్టు సమాచారం. మరో రెండు రోజుల విచారణలో పోలీసులు కీలక విషయాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు.

తాతతో గొడవలు అందుకే చంపేశా...

జనార్దన్‌రావు హత్య కేసు విచారణలో నిందితుడు కీర్తితేజ



నిందితుడు కీర్తితేజ

పంజగుట్ట(హైదరాబాద్): ''ఆస్తి పంపకాలు, కార్యాలయ పదవుల కేటాయింపులో వివక్ష చూపాడు..అందుకే తాతను చంపాను'' అని నిందితుడు కీర్తితేజ పోలీసులకు వెల్లడించాడని సమాచారం. ఇటీవల సంచలనం సృష్టించిన పారిశ్రామికవేత్త చంద్రశేఖర జనార్దనరావు హత్యకేసులో నిందితుడు కీర్తితేజ ఐదురోజుల పోలీస్ కస్టడీలో భాగంగా మొదటిరోజు మౌనంగా ఉన్నా, తర్వాతి రోజు నుంచి పలు విషయాలు వెల్లడించాడని పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. తాతకు సంబంధించిన కంపెనీకి వెళితే అక్కడకూడా అవమానించేవారని, తాత అలా తిట్టడం వల్ల ఆఫీస్ స్టాఫ్ కూడా తనను చిన్నచూపు చూసేవారని విచారణలో చెప్పినట్టు సమాచారం. తాతతో గొడవలు పెద్దవి కావడంతో అప్పుడే చంపేద్దామని నిర్ణయించుకున్నట్టు పోలీసులతో చెప్పినట్టు తెలిసింది. ఇంటికి వెళ్లాక తాతకు తనకు మధ్య పెద్ద గొడవ జరిగిందని, దీంతో విచక్షణారహితంగా తాతను పొడిచానని అడ్డొచ్చిన అమ్మకు కూడా గాయాలయ్యాయని నిందితుడు చెప్పినట్టు సమాచారం. హత్య చేసిన తర్వాత బీఎస్ మక్తాలోని ఓ ఖాళీ ప్రదేశంలో రక్తంతో ఉన్న తన దుస్తులు, హత్యకు వాడిన కత్తిని పెట్రోల్ పోసి తగలబెట్టానని నిందితుడు పేర్కొనడంతో.. మంటల్లో సగం కాలిపోయిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కీర్తితేజ ఒక్కడే నివాసం ఉండే ల్యాంకోహిల్స్‌లోని ఇంటితో పాటు, హత్యచేసిన ప్రాంతానికి నిందితున్ని తీసుకెళ్లి హత్య ఘటనపై సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. అనంతరం నిందితున్ని తిరిగి జైలుకు పంపారు.

పిల్లల అనుమతిపై నిషేధం ఎత్తివేయండి

థియేటర్లపై ఉత్తర్వుల సవరణ కోరుతూ 'మల్టీప్లెక్స్' ఇంప్లీడ్

సాక్షి, హైదరాబాద్: పదహారేళ్లలోపు పిల్లలను ఉదయం 11 గంటల్లోపు, రాత్రి 11 గంటల తర్వాత థియేటర్లలో సినిమా ప్రత్యేక ప్రదర్శనకు అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఆదేశాలను ఎత్తివేయాలని హైకోర్టును మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కోరింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి వద్ద ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసింది. టికెట్ల ధరలను సవాల్ చేస్తూనే పిటిషన్లు దాఖలయ్యాయని, పిల్‌గా విచారణ చేపట్టడం సరికాదని విన్నవించింది. ఈ ఆదేశాల కారణంగా మల్టీప్లెక్స్‌లు తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొంది. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. యూరప్‌లో రాత్రి 11 గంటల తర్వాత సినిమా చూసేందుకు పిల్లలకు అనుమతి ఉండదని చెప్పారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. విచారణ ఈ నెల 24కు వాయిదా వేశారు. జనవరి 10న వేకువజామున 4 గంటల నుంచి 6 షోలకు అనుమతివ్వడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కూరగాయల వ్యాపారి గొర్ల భరత్ రాజ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
బుధవారం । 19-2-2025



వేములవాడ శివరాత్రి ఉత్సవాలకు సీఎంకు ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: వేములవాడలో మహాశివరాత్రి జాతర మహోత్సవాలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆహ్వానించారు. దేవస్థానం అర్చకులు, ఆలయ అధికారులతో కలిసి ముఖ్యమంత్రిని మంగళవారం ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు ఆహ్వాన లేఖను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆలయ అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ, అభివృద్ధి పనులకు వెంటనే నిధులు విడుదల చేయాలని ఆదేశించారు.



యాదగిరి క్షేత్రంలో ఫ్రాన్స్ దేశస్తుల పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఫ్రాన్స్ దేశస్తులు సందర్శించారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని, పూజలు చేశారు. యాదగిరి క్షేత్రంలో జరుగుతున్న పూజాకార్యక్రమాలను అధికారులు, అర్చకుల ద్వారా తెలుసుకున్నారు. ఆలయ నిర్మాణ శైలి, కుంభాభిషేక సంప్రోక్షణ ఉత్సవానికి సంబంధించిన అంశాలను అర్చకులు వారికి వివరించారు.

రాష్ట్రానికి నిధులు తెమ్మంటే ప్రభుత్వాన్ని కూల్చుతామంటారా?

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: కేంద్రం నుంచి తెలంగాణకు నిధులు తెమ్మంటే ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ కులం ఏంటని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతాం అంటారా అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. దమ్మూధైర్యం ఉంటే కేంద్రమంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ నిధులు తీసుకురావాలని సవాల్ విసిరారు. మంగళవారం శ్రీనివాస్ సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీని తిట్టడమే కేంద్రమంత్రుల పనిగా మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌తో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నారా? అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజ్యాంగ బద్ధంగా కావాల్సిన సీట్లు ఉన్నాయని, ఐదేళ్ల పాటు ఇందిరమ్మ రాజ్యం ఉంటుందని, మరోసారి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయని శ్రీనివాస్ ఆరోపించారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలవబోతున్నారని చెప్పారు.

చెవులు చిల్లుమనే.. శబ్ద కాలుష్యం

రోజురోజుకు పరిమితికి మించి పెరగడంతో చిక్కులు

సాక్షి, హైదరాబాద్ : హైదరాబాద్ చుట్టుపక్కల వివిధ రూపాల్లో కాలుష్యాల వ్యాప్తి పెరుగుతోంది. వాయు, ధ్వని, నీరు, ఇతర రూపాల్లోని కాలుష్యాలు మనుషుల ఆరోగ్యాలపై దుష్ప్రభావం చూపుతున్నాయి. తమకు తెలియకుండానే ఈ కాలుష్యాల బారినపడిన వారిలో శ్వాస, వినికిడి, మానసిక ఇతర సమస్యలు పెరుగుతున్నాయి. హైదరాబాద్‌తోపాటు జిల్లాల్లోనూ వాయు, ధ్వని, ఇతర కాలుష్యాల స్థాయిలు గణనీయంగా విస్తరిస్తున్నాయి. కొంతకాలంగా హైదరాబాద్, ఇతర ముఖ్య నగరాలు, పట్టణాల్లో వాయునాణ్యత క్షీణిస్తోంది. అంతేస్థాయిలో శబ్దకాలుష్యాలు కూడా క్రమంగా ఎక్కువగా రికార్డవుతున్నాయి. చాలా ప్రాంతాల్లో వాయునాణ్యత స్థాయి తగ్గడానికి పట్టణీకరణ పెరగడమే ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. భవన నిర్మాణాలతోపాటు వ్యక్తిగత వాహనాల వినియోగం విపరీతంగా పెరగడం.. గాలిలో కాలుష్యం పెరుగుదలతోపాటు శబ్దకాలుష్యం కూడా పెరుగుతున్నట్టుగా అంచనా వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా లారీలు, బస్సులు, పలురకాల రవాణా, వ్యక్తిగత వాహనాల వినియోగం కూడా బాగా పెరగడంతో రణగొణ ధ్వనులు మోతాదులకు మించి వెలువడుతున్నాయి. నగరం, చుట్టుపక్కల జనాభా సాంద్రత పెరుగుదల, దానికి తగ్గట్టుగా అన్నిరకాల వాహనాల మితిమీరిన వినియోగం వాయు, శబ్ద కాలుష్యాలు పెరగడానికి కారణమవుతోంది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీపీసీబీ) ద్వారా ఈ నెల 1-9 తేదీల మధ్య నగరంలోని వివిధ ప్రాంతాల్లో నమోదైన గణాంకాలను బట్టి చూస్తే పరిమితులకు మించి శబ్దాలు వెలువడుతున్నట్టు స్పష్టమవుతోంది.



ఆయా ప్రాంతాల వారీగా గణాంకాలు ఇవీ...

	తార్నాక రెసిడెన్షియల్	జెఎన్‌టీయూ-కమర్షియల్	జూపార్క్-సెన్సిటివ్	హెచ్‌సీయూ-సెన్సిటివ్
	పగలు- రాత్రి	పగలు- రాత్రి	పగలు- రాత్రి	పగలు- రాత్రి
ఫిబ్రవరి 1	67.62- 62.40	71.10- 69.20	67.25- 64.63	72.90-70.10
ఫిబ్రవరి 2	66.44-62.75	70.49- 68.87	65.06- 62.48	72.49- 70.63
ఫిబ్రవరి 3	67.14- 62.32	71.82- 69.00	65.44- 62.79	73.53- 69.30
ఫిబ్రవరి 4	66.82- 62.33	71.59- 69.73	65.46- 65.26	72.52- 69.35
ఫిబ్రవరి 5	67.74- 62.25	70.97- 69.14	67.49- 67.95	72.23- 69.51
ఫిబ్రవరి 6	68.16- 62.34	71.21- 69.21	67.92- 67.15	72.50- 69.53
ఫిబ్రవరి 7	67.49- 62.42	70.83- 69.66	67.02-66.01	72.05- 71.17
ఫిబ్రవరి 8	67.53- 62.48	71.43- 69.69	66.74- 66.93	71.52- 69.64
ఫిబ్రవరి 9	66.88- 62.32	71.32- 68.95	67.81-69.64	71.91-69.66

కేంద్ర కాలుష్యనియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రమాణాల ప్రకారం ఉండాల్సిన ధ్వని పరిమితులు (శబ్దాలు డెసిబుల్స్‌లో)

కేటగిరి	పగలు	రాత్రి ఉదయం 6 నుంచి రాత్రి 10 దాకా రాత్రి 10 నుంచి ఉదయం 6 దాకా
పారిశ్రామిక ప్రాంతం	75 డెసిబుల్స్	70 డెసిబుల్స్
వాణిజ్య ప్రాంతం	65	55
నివాస ప్రాంతం	55	45
ఆస్పత్రులు, స్కూళ్లు వంటి సైలెన్స్ జోన్‌లో	50	40

పెద్ద ధ్వనులను నియంత్రించాలి



వివిధ రూపాల్లో కాలుష్యాల వ్యాప్తి ప్రజల ఆరోగ్యాలపై, వివిధ శరీర భాగాలపై ప్రభావం చూపుతోంది. వాయు కాలుష్యంతో శ్వాసకోశ సంబంధిత సమస్యలు. శబ్ద కాలుష్యంతో వినికిడి మానసిక రుగ్మతలతోపాటు ఇతర సమస్యలకు కారణమవుతోంది. ప్రతిరోజు 8 గంటలకు మించి 75 డెసిబుల్స్ వరకు శబ్దాలకు గురైతే వినికిడి, ఇతర సమస్యలు తలెత్తుతాయి. ఈ శబ్దాల స్థాయి కంటే 5 డెసిబుల్స్ సౌండ్ పెరిగినా రోజూ 4 గంటలే భరించగలరు. అంతకు మించి వెలువడే శబ్దాలతో చెవులు దెబ్బ తింటాయి. 100కు పైగా డెసిబుల్స్ సౌండ్‌కు అరగంటలోనే కర్ణభేరి దెబ్బతిని వినికిడి శక్తి కోల్పోతారు. ముఖ్యంగా డీజే సౌండ్స్, పెద్దశబ్దాలు చేసే వాహనాల హారన్లు, ఇతర ధ్వనులను నియంత్రించాల్సిన అవసరముంది. వీటి వల్ల శాశ్వతంగా చెవుల్లో గుయ్యిమనే మోత మోగే సమస్యలు ఎదురుకావొచ్చు. చిన్నపిల్లల్లో మానసిక సమస్యలు ఉత్పన్నం కావొచ్చు. ఐటీ నిపుణులు తరచూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండటం, ఇయర్ ఫోన్ల వినియోగంతో రేడియేషన్ పెరిగి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వినికిడి, ఇతర సమస్యలతో మా దగ్గరకు వస్తున్న పేషెంట్ల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది.

- డాక్టర్ మోహన్‌రెడ్డి, చీఫ్ ఈఎన్‌టీ స్పెషలిస్ట్, నోవా ఆస్పత్రి

టార్గెట్ మావోయిస్టు రాష్ట్ర కమిటీ

- తెలంగాణ కమిటీలో ఛత్తీస్‌గఢ్ వారే ఎక్కువ..
- 100 మందిలో మనవారు 25 మందిలోపే...
- తెలంగాణ కమిటీలో పూర్తిగా తగ్గిన రిక్రూట్‌మెంట్
- అదును కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ పోలీసులు
- భారీ మొత్తంలో దెబ్బతీసే వ్యూహాలతో ముందుకు..



సాక్షి, హైదరాబాద్ : మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీని కూడా తుడిచిపెట్టేందుకు కేంద్ర సాయుధ బలగాలతోపాటు గ్రేహౌండ్స్, తెలంగాణ పోలీసులు బహుముఖ వ్యూహాలతో ముందుకుసాగుతున్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీలో మావోయిస్టుల సంఖ్య ప్రస్తుతం 100 లోపే ఉంటుందని తెలిసింది. ఇందులోనూ ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన వారే ఎక్కువమంది ఉన్నారు. వీరంతా స్థానికులు కావడంతో ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కమిటీ సైతం ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి పరిమితమైంది. దీంతో భద్రత బలగాలు వారి కోసం మాటు వేసి ఉన్నాయి. తెలంగాణ సరిహద్దు వైపు ఏ చిన్న కదలిక ఉన్నా...భారీదెబ్బ తీసేందుకు సిద్ధమయ్యాయి. అయితే తెలంగాణకమిటీలో ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్ స్థానికులు కావడంతో అక్కడి అటవీ ప్రాంతాలపై పూర్తి పట్టు ఉండడంతో చాలా సందర్భాల్లో తెలంగాణ కమిటీ చిక్కినట్టే చిక్కి మిస్సవుతోందని పోలీసు అధికారులు చెబుతున్నారు.

- తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని పూజారీ కాంకేర్ అడవుల్లో ఈ ఏడాది జనవరి 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి దామోదర్ అలియాస్ బడే చొక్కారావు మృతి చెందినట్టు తొలుత ప్రచారం జరిగింది. కానీ దామోదర్ సురక్షితంగా ఉన్నారని మావోయిస్టు పార్టీ ప్రకటించింది.
- ఈనెల 9న ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి నేషనల్ పార్క్‌లో భారీ ఎన్‌కౌంటర్ సైతం మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ లక్ష్యంగానే జరిగినట్టు ప్రచారం జరిగింది. అయితే ఈ భారీ ఎన్‌కౌంటర్‌లో 31 మంది మృతి చెందగా ఇందులో తెలంగాణ కమిటీకి చెందినవారు ఉన్నట్టు ఇప్పటి వరకు నిర్ధారణ కాలేదు.

60 మందికిపైగా వారే...

మావోయిస్టు కీలక నేతల్లో తెలంగాణవారు ఉన్నా, రాష్ట్ర కమిటీలో మాత్రం ఛత్తీస్‌గఢ్ వారే అధికంగా ఉన్నారు. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం తెలంగాణ రాష్ట్ర కమిటీలో మొత్తం 90 నుంచి 100 మంది ఉండగా..ఇందులో 60 మందికిపైగా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారే అని తెలిసింది. తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు కేవలం 25 మంది లోపే ఉంటారని సమాచారం. ఇందులోనూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందినవారు అత్యధికంగా ఉన్నట్టు సమాచారం. ఇక ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుక్మా, బస్తర్ ప్రాంతాల వారే ఎక్కువమంది పనిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీలోనూ భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు (బీకే-ఏఎస్ఆర్)డివిజన్ కమిటీ బలంగా ఉంది. రాష్ట్ర కమిటీలోని దాదాపు సగం మంది వరకు సభ్యులు ఇందులోనే ఉన్నట్టు తెలిసింది. అయితే, గతానికి భిన్నంగా మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ బక్కచిక్కి పోవడానికి ప్రధాన కారణం..కొంతకాలంగా మావోయిస్టు రిక్రూట్‌మెంట్ దాదాపుగా లేకపోవడమే. తెలంగాణ నుంచి మావోయిస్టుల్లోకి చేరేందుకు యువత పెద్దగా ఆసక్తి చూపకపోవడమేనని విశ్లేషకులు చెబుతున్నారు.

సరిహద్దుల్లో రెడీ

మావోయిస్టుల ఏరివేతలో దేశంలో అత్యుత్తమ దళంగా పేరు పొందిన గ్రేహౌండ్స్ సిబ్బంది, తెలంగాణ పోలీస్ ప్రత్యేక బలగాల వేట మాత్రం కొనసాగుతూనే ఉంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో ఇటీవల నిర్వహించిన సమావేశంలోనూ మావోయిస్టుల ఏరివేతలో గ్రేహౌండ్స్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడంతోపాటు తెలంగాణ ప్రాంతంలో మావోయిస్టుల అంతానికి ప్రత్యేక ఆదేశాలు వచ్చాయి.



మహాకుంభాభిషేక సంప్రోక్షణ సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ప్రధాన ఆలయంతోపాటు పరిసర ప్రాంతాలన్నీ విద్యుత్ దీప కాంతులతో తలుకులీనుతున్నాయి. మంగళవారం రాత్రి ఆలయం ఇలా మెరిసిపోతూ కనువిందు చేసింది.

చివరి ఆయకట్టుకు సాగునీరు

యాసంగిలో 42.48 లక్షల ఎకరాలకు నీళ్లు

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఎన్సీ అనిల్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పుష్కలంగా ఉండటంతో ప్రస్తుత యాసంగి సీజన్‌లో 42,48,780 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని సరఫరా చేయాలని నీటిపారుదల శాఖలోని రాష్ట్ర స్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (స్కివం) తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాలని నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. తొలుత ప్రాజెక్టుల కింద చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా చూడాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి యాసంగిలో సాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అనిల్‌కుమార్ మాట్లాడుతూ యాసంగిలో గత డిసెంబర్ 25 నుంచి వచ్చే ఏప్రిల్ 8 వరకు నీళ్లను విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. నీటి విడుదలలో ఆన్, ఆఫ్ సిస్టం (వారం నీళ్లు ఇచ్చి.. వారం నిలుపుదల చేయడం)ను అనుసరించాలన్నారు. కాల్వలపై ఇప్పటి వరకు లస్కర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మాత్రమే రాత్రి గస్తీకి తిరిగేవారని, ఇకపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కూడా తిరగాలని ఆయన స్పష్టం చేశారు. వచ్చే మూడు వారాలు అత్యంత కీలకమని, ఆ తర్వాత నీటి డిమాండ్ తగ్గుతుందని చెప్పారు. కాల్వలపై పోలీసులతో నిఘా పెట్టాలన్నారు. నీళ్లు కిందికి వెళ్లకుండా ఎస్కేప్ రెగ్యులేటర్లు తెరవడం, కాల్వలకు గండ్లు వేయడం చేస్తున్నారని, పోలీసుల సహాయంతో వీటిని కట్టడి చేయాలని పేర్కొన్నారు. ప్రతి కెనాల్‌కు నీటి విడుదలను సంబంధిత చీఫ్ ఇంజనీర్ పర్యవేక్షించాలన్నారు.

ప్రస్తుత యాసంగి సీజన్‌లో వివిధ ప్రాజెక్టుల కింద సాగునీటి సరఫరా జరగనున్న పొడి, తడి, మొత్తం ఆయకట్టు వివరాలు

ప్రాజెక్టు	పొడి	తడి	మొత్తం
ఎస్సారెస్పీ-1	3,58,569	4,40,903	7,99,472
నాగార్జునసాగర్	1,62,495	4,75,890	6,38,385
ఎస్సారెస్పీ-2	77,400	2,59,230	3,36,630
కల్వకుర్తి	2,60,177	20,204	2,80,381
నిజాంసాగర్	3180	1,21,012	1,24,192
కాళేశ్వరం	22,970	70,100	93,070
మిడ్‌మానేరు	20,104	34,120	54,224
కడెం	1500	32,800	34,300
అలీసాగర్ లిఫ్టు	3331	44,331	47,662
గుత్ప లిఫ్టు	3025	29,673	32,698
జూరాల	22,346	12,000	34,346
ఆర్డీఎస్	30,000	7000	37,000
మూసీ	30,000	-	30,000
ఎల్లంపల్లి-2	11,600	17,400	29,000
సింగూరు	-	-	-
దేవాదుల	1,28,280	70,350	1,98,630
కోయిల్‌సాగర్	8000	-	8000
భీమా	24,350	4650	29,000
నెట్టెంపాడు	21,300	3500	24,800
ఎస్ఎల్‌బీసీ	1,15,150	1,24,270	2,39,420

ప్రస్తుత నీటి సంవత్సరంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు వాడుకున్న కృష్ణా జలాల వివరాలను కృష్ణా బోర్డు లేఖలో పొందుపరిచింది. వివరాలు టీఎంసీల్లో..

	ఏపీ	తెలంగాణ
శ్రీశైలం ప్రాజెక్టు		
కల్వకుర్తి	34.107	
పోతిరెడ్డిపాడు	207.881	-----
హంద్రీ నీవా	26.01	-----
ముచ్చుమర్రి	1.062	-----
చెన్నైకి నీటి సరఫరా	1.683	0.842
మొత్తం	236.636	34.949
నాగార్జునసాగర్		
హైదరాబాద్‌కు నీటి సరఫరా	------	11.594
ఏఎమ్మార్పీ, ఫ్లడ్ ఫ్లో కెనాల్	------	33.361
నాగార్జునసాగర్ ఎడమ కాల్వ	21.279	84.49
నాగార్జునసాగర్ కుడికాల్వ	153.403	-------
మొత్తం	174.682	129.452
కృష్ణా డెల్టా సిస్టమ్	148.388	------
గుంటూరు చానల్	1.13	------
మొత్తం	149.518	------

	ఏపీ	తెలంగాణ
తుంగభద్ర ప్రాజెక్టు		
హెచ్ఎల్‌సీ	30.377	-------
ఎల్ఎల్‌సీ	15.434	-------
కేసీ కాల్వ	29.842	--------
ఆర్డీఎస్	-------	5.263
మొత్తం	75.653	
5.263		
జూరాల	--------	18.128
నెట్టెంపాడు	-------	6.482
భీమా	-------	7.144
కోయిల్‌సాగర్	-------	1.734
మొత్తం	------	33.488
మీడియం ప్రాజెక్టులు	3.163	8.539
తుది మొత్తం	639.65	211.691

క్లుప్తంగా...

'ఉపాధి' చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్‌గా గోపీచంద్

సాక్షి, అమరావతి: రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని ఉపాధి హామీ పథకం అమలు విభాగంలో చీఫ్ క్వాలిటీ కంట్రోలు ఆఫీసర్‌గా రిటైర్డు ఎస్‌ఈ గోపీచంద్‌ను ప్రభుత్వం నియమించింది. ఏడాది పాటు కాంట్రాక్ట్ పద్ధతిన ఈ నియామకం అమల్లో ఉంటుందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

స్వదేశీ దర్శన్ కింద రాష్ట్రానికి రూ.182.49 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: 'స్వదేశీ దర్శన్' పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు రూ.182.49కోట్లు కేటాయించినట్లు కేంద్ర పర్యాటక శాఖ తెలిపింది. దేశంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో 2014–15లో ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించినట్లు పేర్కొంది. ప్రారంభ ఏడాదిలో రూ.5,287.90 కోట్లతో దేశవ్యాప్తంగా 76 ప్రాజెక్టులు, 'స్వదేశీ దర్శన్-2.0'గా పునరుద్ధరించిన తర్వాత రూ.791.25 కోట్లతో 34 ప్రాజెక్టులు మంజూరైనట్లు వివరించింది.

విలేకరిపై దౌర్జన్యం చేసిన టీడీపీ నేతపై చర్య తీసుకోవాలి

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం

సాక్షి, అమరావతి: నిన్ను చంపడం ఖాయం అంటూ మన్యంలో విలేకరిపై చేయి చేసుకుని దౌర్జన్యం చేసిన టీడీపీ నేత వేణుగోపాల్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

గిరిజన ప్రాంతాల్లో స్కూళ్ల లభ్యతపై ఆరా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లోని పిల్లల కోసం అనువైన పాఠశాలలు ఎన్ని ఉన్నాయో చెప్పాలని సమగ్ర శిక్ష ఏఎస్పీడీ కె.రవీంద్రనాథ్‌రెడ్డి డీఈవోలు, జిల్లా సమగ్ర శిక్ష అధికారులను ఆదేశించారు. మొత్తం 18 జిల్లాల్లోని 107 మండలాల్లో పిల్లల అభ్యసన కోసం కేంద్ర ప్రభుత్వం ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ (డీఏ-జుగా) పథకం కింద గతి శక్తి పోర్టల్ ప్రకారం పాఠశాలల లభ్యతను తనిఖీ చేసి వివరాలు పంపించాలన్నారు. మొత్తం 878 గ్రామాల పరిధిలో స్కూళ్లు, హాస్టళ్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను సమర్పించాలని ఆదేశించారు.

కిడ్నాపర్‌ను జగన్ పరామర్శిస్తారా?

మంత్రి కొల్లు రవీంద్ర

సాక్షి, అమరావతి: గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన వ్యక్తులకు వత్తాసు పలకడానికి జగన్‌కు సిగ్గు లేదా అని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. ఒక రాజకీయ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన ఘటనలు ఎక్కడా లేవన్నారు. మంగళవారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ నేత పట్టాభి తదితరులతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వంశీ పోలవరం గట్ల మీద మట్టి కొట్టేశారని, ఇనుప రాడ్లు పట్టుకుని రోడ్లపైన తిరుగుతూ మహిళలపై దాడులు చేశారని విమర్శించారు.

రాష్ట్రానికి రూ.128.19 కోట్ల ఎన్‌ఆర్‌ఎల్‌ఎం నిధులు

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల కోసం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) కార్యక్రమం కింద రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.128.19 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ నిధులను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖకు విడుదల చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ వాకాటి కరుణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికకు రిటర్నింగ్ ఆఫీసర్ నియామకం

సాక్షి, అమరావతి: ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా ఆయుష్ కమిషనర్ (ఎఫ్ఏసీ) డాక్టర్ మంజులను నియమిస్తూ వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. వీలైనంత త్వరగా ఎన్నికల ప్రక్రియను ముగించేలా రిటర్నింగ్ ఆఫీసర్ చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ ఫార్మసీ కౌన్సిల్ చట్టం 1955 ప్రకారం ఎన్నికల నిర్వహణకు ఇన్‌చార్జ్, రిజిస్ట్రార్, రిట్నరింగ్ ఆఫీసర్లు సమన్వయంతో ముందుకెళ్లాలని పేర్కొన్నారు. గతంలో ఆయుష్ కమిషనర్‌గా చేసిన రాజేంద్రప్రసాద్‌ను రిటర్నింగ్ ఆఫీసర్‌గా నియమించారు. ఆయన బదిలీ అవ్వడంతో ఆ బాధ్యతలను మంజులకు అప్పగించారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను ఓడించాలి'

సాక్షి, అమరావతి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని బీసీ ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఈ మేరకు బీసీ ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ ఎర్రాకుల తులసిరామ్ యాదవ్, రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ జంగాల సింగరయ్య యాదవ్, రాష్ట్ర కన్వీనర్ దానా గౌడ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీల పార్టీగా చెప్పుకొనే టీడీపీ ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాల్లో ఒక్కటి కూడా బీసీలకు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. అధికార, ధన బలంతో అభ్యర్థులను గెలిపించుకోవాలని టీడీపీ అడ్డదారులు తొక్కుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వచ్చే ఐదేళ్లలో విద్యుత్ వినియోగం డబుల్

దేశంలో ప్రస్తుతం నెలవారీ విద్యుత్ వినియోగం 130.40 బిలియన్ యూనిట్లు

2030 నాటికి ఇది రెట్టింపు అవుతుందని అంచనా

రాష్ట్రంలో ఏటా 70,361 మిలియన్ యూనిట్ల డిమాండ్

2030 నాటికి 1,04,596 మిలియన్ యూనిట్లకు రాష్ట్ర వినియోగం

రాష్ట్రంలో ప్రస్తుతం 23,805 మెగావాట్ల స్థాపిత విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు

2030 నాటికి ఈ సామర్థ్యం 87,238 మెగావాట్లకు పెరుగుతుందని అంచనా

55 శాతం నుంచి 60 శాతంగా పునరుత్పాదక ఇంధన వనరుల వాటా

పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు తగ్గట్టు భవిష్యత్ డిమాండ్‌ను అంచనా వేయకపోతే పరిస్థితులు అంధకారంలో ముంచేస్తాయి. ఈ నేపథ్యంలోనే భవిష్యత్‌లో విద్యుత్ డిమాండ్, ఉత్పత్తి సామర్థ్యం పెరుగుదలపై కేంద్ర, రాష్ట్ర విద్యుత్ సంస్థలు ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నాయి. దేశంలో ప్రస్తుతం నెలవారీ విద్యుత్ వినియోగం దాదాపు 130.40 బిలియన్ యూనిట్లుగా ఉంది. ఇది 2030–32 నాటికి రెట్టింపు అవుతుందని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది.

ఇదీ అంచనా

ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ నివేదిక ప్రకారం.. పునరుత్పాదక ఇంధన సామర్థ్యం ఇటీవల 200 గిగావాట్ల మైలురాయిని దాటింది. 2030 నాటికి 500 గిగావాట్ల సామర్థ్యాన్ని, 2047 నాటికి 1,800 గిగావాట్ల సామర్థ్యాన్ని సాధించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపింది. దేశంలో మొత్తం స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 457 గిగావాట్లకు చేరుకుంది. ఇందులో పునరుత్పాదక ఇంధన వాటా 205 గిగావాట్లు (45 శాతం). ఇది ఈ ఏడాది 25–28 గిగావాట్లు పెరుగుతుందని అంచనా. 2030 నాటికి అది 55 శాతం నుంచి 60 శాతానికి చేరుకుంటుందని అధ్యయనంలో వెల్లడైంది. ఇక రాష్ట్ర విషయానికి వస్తే ప్రస్తుతం ఏటా 70,361 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. 2030 నాటికి ఇది 1,04,596 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుందని ఇంధన శాఖ అంచనా వేసింది. అదే 2047 నాటికి 4,22,402 మిలియన్ యూనిట్లకు పెరిగే అవకాశం ఉంది. అంటే రానున్న 23 ఏళ్లలో ఇప్పుడున్న దానికి ఆరు రెట్లకు విద్యుత్ డిమాండ్ పెరిగిపోనుంది.

– సాక్షి, అమరావతి

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరుగుదల అంచనా ఇలా (మిలియన్ యూనిట్లలో)

కేటగిరీ	2023-24	2029-30
గృహ విద్యుత్	18,329	25,453
వాణిజ్య విద్యుత్	5,283	7,756
వీధి దీపాలు	315	405
పబ్లిక్ వాటర్ వర్క్స్	1,262	2,191
ఇరిగేషన్	15,011	24,340
చిన్న పరిశ్రమలు	1,531	1,986
భారీ పరిశ్రమలు	20,173	34,731
రైల్వే	2,011	3,727
ఎలక్ట్రిసిటీ రీసెల్లర్స్	1,165	1,531
ఇతర అవసరాలు	1,149	2,476

రాష్ట్రంలో ప్రస్తుతం రోజువారీ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఇలా (మెగావాట్లలో)

థర్మల్	10,519
జల	1,803
గ్యాస్	908
పవన	3,639
సౌర	5,466
చెరుకుపిప్పి(బగాసె)	61
బయోమాస్	64
మున్సిపల్ వ్యర్థాలు	36
పారిశ్రామిక వ్యర్థాలు	22
సోలార్ రూఫ్‌టాప్	1,289

2030 నాటికి విభాగాల వారీగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరుగుదల అంచనా (మెగావాట్లలో)

థర్మల్	10,519
జల	1,803
గ్యాస్	908
పవన	20,000
సౌర	40,000
చెరుకుపిప్పి (బగాసె)	61
బయోమాస్	600
మునిసిపల్ వ్యర్థాలు	36
పారిశ్రామిక వ్యర్థాలు	22
సోలార్ రూఫ్‌టాప్	1,289
పంప్డ్ స్టోరేజ్ (పీఎస్పీ)	12,000



ఇంటర్ చదువుకే సీఈవో చేసేశారు

కూటమి స్కూలే సెప'రేటు'

- కీలక నేతలతో కుదిరిన డీల్‌తో.. నిబంధనలకు విరుద్ధంగా నియామకం
- వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్ ఆధిపత్య పోరుతో సీఈవో ఖాదీర్ తొలగింపు
- ఉద్యోగుల్లో 13 మందిపైగా అలీ సకుటుంబ సపరివారమే
- అలీపై వక్ఫ్ ఫైల్స్ ఫోర్జరీ ఆరోపణలు సహా, అనేక విచారణలు పెండింగ్!

సాక్షి, అమరావతి: విద్యార్హతలు, సమర్థతతో పనిలేదు.. తాము చెప్పినట్టు వినే వాడైతే చాలు.. డీల్ కుదుర్చుకుని కీలక పోస్టుల్లో కూర్చోబెడతాం అని టీడీపీ కూటమి సర్కారు మరోసారి రుజువు చేసింది. దీనిలోభాగంగానే వేలాది ఎకరాలు.. రూ.వేల కోట్ల విలువైన ఆస్తులున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు ముఖ్య కార్య నిర్వహణాధికారి (సీఈవో) పోస్టును ఇంటర్ చదివిన ఉద్యోగికి కట్టబెట్టేశారు. బోర్డు చైర్మన్‌గా అజీజ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆధిపత్య పోరు మొదలైంది. ఇప్పటికే హజ్ కమిటీ, ఉర్దూ అకాడమీ వంటి కీలక బాధ్యతల నుంచి ఎల్.అబ్దుల్ ఖాదీర్‌ను తప్పించగా, తాజాగా వక్ఫ్ బోర్డు సీఈవో పోస్టు నుంచి కూడా తొలగించారు. ఈ నేపథ్యంలో తెరచాటు లాబీయింగ్‌తో మహమ్మద్ అలీ సీఈవో పదవి రేసులోకి వచ్చారు.



వక్ఫ్ బోర్డుకు అత్యంత కీలకమైన సీఈవో పోస్టును 12వ తరగతి (ఇంటర్) మాత్రమే చదివిన అలీకి కట్టబెట్టే సాహసం చేయడం వెనుక డీల్ కుదిరినట్టు ప్రచారం జరుగుతోంది. వక్ఫ్ బోర్డులో స్టెనోగా చేరిన అలీ ప్రస్తుతం డిప్యూటీ సెక్రటరీ హోదాకు వచ్చినప్పటికీ గెజిటెడ్ ఆఫీసర్ ర్యాంకు కూడా లేదు. ఆయనపై వక్ఫ్ సంస్థలకు చెందిన ఫైల్స్ తారుమారు (ఫోర్జరీ) చేశారనే ఆరోపణలు, అనేక అక్రమాలకు సంబంధించిన విచారణలు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం.

అలీ సకుటుంబ సపరివారం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పటి నుంచి వక్ఫ్ బోర్డులో కనీస నియమ నిబంధనలు పాటించకపోవడంతో నచ్చినవారిని నచ్చిన పోస్టుకు ఇష్టానుసారం నియామకాలు జరిగిపోయాయి. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం వేములపాడు గ్రామం ఒకే కుటుంబానికి చెందినవారే ఏకంగా 13 మంది పైగా వక్ఫ్ బోర్డులో అనేక హోదాల్లో తిష్టవేశారు. 1983లో షేక్ మహమ్మద్ అనీఫ్ (రిటైర్డ్) వక్ఫ్ బోర్డులోకి రావడంతోనే ఆయన సకుటుంబ సపరివారమంతా క్రమంగా చేరిపోయారు. ప్రస్తుతం ఉన్న షేక్ మహమ్మద్ అలీ, షేక్ జానీ బాషా, షేక్ హుస్సేన్, మమహ్మద్ ఇమ్రాన్, షేక్ కరీముల్లా, పఠాన్ మజూద్, షేక్ ఖాజామస్తాన్, షేక్ షాజహాన్, షేక్ ఖుదవస్, షేక్ ఇమ్రాన్, మస్తాన్, రియాజుద్దీన్ తదితరులు ఒకే కుటుంబానికి చెందిన బంధువర్గం కావడం గమనార్హం. ఇలా వక్ఫ్‌బోర్డులోని 12 సెక్షన్లలో దాదాపు 73 మంది ఉద్యోగులు పనిచేస్తుంటే వారిలో అడ్డదారిలో నియామకాలు పొందినవారే అధికంగా కావడం గమనార్హం.

వక్ఫ్ బోర్డును చక్కదిద్దే ప్రయత్నం చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం


వక్ఫ్‌బోర్డును చక్కదిద్దేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసింది. ప్రధానంగా రూ.వేల కోట్ల విలువైన ఆస్తులున్న వక్ఫ్ బోర్డు అజమాయిషీని ఐఏఎస్, ఐపీఎస్‌లకు అప్పగిస్తే వ్యవస్థను గాడిలో పెట్టవచ్చని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పలు చర్యలు చేపట్టారు. ప్రధానంగా వక్ఫ్ ఆస్తులను పరిరక్షించేందుకు, రెండో సర్వేను పటిష్టంగా చేపట్టేందుకు వక్ఫ్ సర్వే కమిషనర్‌గా షిరీన్‌బేగం (ఐపీఎస్)ను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించింది. ఆమెకు అప్పట్లో వక్ఫ్ బోర్డు ప్రత్యేకాధికారి బాధ్యతలు కూడా అప్పగించారు. బోర్డు సీఈవో పోస్టును కూడా ఐఏఎస్‌కు కేటాయించేలా అప్పట్లో ప్రతిపాదన చేశారు. బోర్డులో లోపాలను చక్కదిద్దడంతో పాటు ఉద్యోగాల భర్తీని యూపీఎస్సీ ద్వారా చేపట్టాలని, అందుకు అవసరమైన నియమావళిని రూపొందించేలా అలీమ్ బాషాను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నివేదిక కోరింది. ఇలా వక్ఫ్ బోర్డును ప్రక్షాళన చేసి చక్కదిద్దేందుకు వైఎస్సార్‌సీపీ గట్టి ప్రయత్నాలు చేస్తే కూటమి సర్కారు మాత్రం ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేస్తుండటం గమనార్హం.

పాస్టర్లకు గౌరవ వేతనం ఎప్పుడిస్తారు బాబూ?

ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఆర్థిక సంస్థ మాజీ చైర్మన్ జాన్‌వెస్లీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాస్టర్లకు గౌరవ వేతనం ఎప్పుడిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబును ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఆర్థిక సంస్థ మాజీ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇమామ్, మౌజన్ల గౌరవవేతనం రూ.45కోట్లు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం.. పాస్టర్లకు విడుదల చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ జాన్‌వెస్లీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం క్రైస్తవులపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని, కూటమి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా క్రైస్తవుల సంక్షేమం కోసం క్రిస్టియన్ మైనార్టీ ఆర్థిక సంస్థకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. 2024–25 బడ్జెట్‌లో క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి రూ.151కోట్లు కేటాయించినట్లు గొప్పలు చెప్పిన ప్రభుత్వం.. నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు. పాస్టర్లకు ప్రతినెలా ఇచ్చే రూ.5వేల గౌరవ వేతనం కూడా తొమ్మిది నెలలుగా ఇవ్వడం లేదని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 -24 మధ్య కాలంలో క్రైస్తవులు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని వైఎస్ జగన్ తోడ్పాటు అందించారని వివరించారు. 1,82,270 మంది లబ్ధిదారులకు రూ.416 కోట్లను వైఎస్ జగన్ అందించారని గుర్తు చేశారు. చంద్రబాబు, పవన్ నిజస్వరూపాలను గుర్తించి క్రిస్టియన్ మైనార్టీలు రానున్న కాలంలో తగిన బుద్ధి చెప్పాలని జాన్‌వెస్లీ కోరారు.

32 లక్షల టన్నుల ధాన్యం సేకరణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 5.21లక్షల మంది రైతులనుంచి రూ.7,522 కోట్ల విలువైన 32లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళవారం పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో వివిధ వర్గాలు, అధికారులతో సమావేశం అనంతరం మంగళవారం ప్రకటన విడుదల చేశారు. తొలిసారిగా వాట్సాప్ ద్వారా ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. పీడీఎస్ బియ్యం దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ, రవాణా, భద్రతను సమర్థవంతంగా చేయడమే లక్ష్యంగా ప్రైవేటు గోడౌన్ల వద్ద ఏఐ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి గోడౌన్ పైభాగంలో సోలార్ ద్వారా గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సాహించాలని ప్రైవేటు గోడౌన్ నిర్వాహకులతో సమావేశంలో వివరించారు. దీపం-2 పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్లలో 93లక్షల గ్యాస్ బుకింగ్‌లకు గానూ రూ.714.57 కోట్లు చెల్లింపులు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి ఆయిల్ మార్కెటింగ్ ప్రతినిధులు, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లతో సమావేశం నిర్వహించామని, ఉచిత గ్యాస్ పథకంలో భాగంగా తొలి విడత పెట్రోలియం సంస్థలకు కంపెనీలకు రూ.894 కోట్లు అందజేశామని వివరించారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల మధ్య భూవివాదాల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా

సాక్షి, అమరావతి: న్యాయపరమైన వివాదాలకు తావు లేకుండా ప్రభుత్వ శాఖల మధ్య నెలకొన్న భూసమస్యలకు ముగింపు పలికేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తెలిపారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య నెలకొన్న భూవివాదాల పరిష్కారం కోసం మంగళవారం తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో రెవెన్యూ, సర్వే సెటిల్‌మెంట్, అటవీ, మారిటైమ్ బోర్డు, ఏపీఐఐసీ ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. సిసోడియా మాట్లాడుతూ.. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసినప్పుడే సరిహద్దు వివాదాలకు ముగింపు లభిస్తుందన్నారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం రాజాపురం గ్రామం మూలపేటలో 408.67 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏపీ మారీటైమ్ బోర్డుకు బదలాయించే అంశంపై చర్చించారు. ఈ భూమికి సంబంధించి అటవీ, రెవెన్యూ శాఖ మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించే దిశగా సీసీఎల్ఏ వ్యవహరించాలని సూచించారు.

'అమరావతి శిల్ప సంపదను వెనక్కు తీసుకురండి'

సాక్షి, అమరావతి: లండన్‌లోని ప్రాచీన అమరావతికి చెందిన శిల్ప సంపదను వెనక్కు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సీఎం కార్యదర్శి కార్తికేయ మిశ్రాను కలిసి వినతిపత్రం అందజేశారు. అమరావతి శిల్ప సంపదకు ప్రపంచవ్యాప్తంగా ఎనలేని ఖ్యాతి ఉందన్నారు. సాక్షాత్తు గౌతమ బుద్ధుడు కాలచక్ర ప్రవచనం చేసిన పుణ్యస్థలంగా అమరావతి విరాజిల్లుతోందని తెలిపారు. చెన్నై ఎగ్మోర్ మ్యూజియంలో 500 శిల్పాలున్నాయన్నారు. 1885లో బ్రిటిష్ ప్రభుత్వం అమరావతి నుంచి మద్రాస్‌కు అతి పురాతన, విశిష్టత కలిగిన శిల్పాలను తరలించిందని తెలిపారు. కలకత్తా ఇండియన్ మ్యూజియం, ఢిల్లీ నేషనల్ మ్యూజియం, హైదరాబాద్ మ్యూజియం, జర్మనీ, అమెరికాలో కూడా అమరావతి శిల్ప సంపద ఉందన్నారు. దానిని నవ్యాంధ్ర రాజధాని అమరావతికి తీసుకొచ్చి భావితరాలు చూసే అవకాశం కల్పించాలని కోరారు.

విద్యుత్ ఆదాకు మహిళల సాయం

ఏపీఈఆర్సీ ఇన్‌చార్జి చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్



సాక్షి, అమరావతి: భవిష్యత్ తరాలకు విద్యుత్ వెలుగులను అందించాలంటే ప్రస్తుత తరం విద్యుత్‌ను ఆదా చేయాలని, ఇందుకోసం మహిళల సాయం తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఇన్‌చార్జ్ చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ సూచించారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) రూపొందించిన ఎనర్జీ ఎఫిషియెన్సీ నివేదికను కర్నూలులోని ఏపీఈఆర్సీ భవన్‌లో ఆయన మంగళవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు తక్కువ ధరకే విద్యుత్‌ను అందించడానికి, వాతావరణంలో కర్బన ఉద్గారాలను (గ్రీన్ హౌస్ గ్యాస్) తగ్గించడానికి అన్ని వర్గాల క్రియాశీల భాగస్వామ్యం అవసరమన్నారు. అందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఈ నెల 20,21 తేదీల్లో బీఈఈ ఆధ్వర్యంలో విజయవాడలో జాతీయ ఇంధన సదస్సు జరుగనుందని ఆయన వెల్లడించారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు సమర్పించిన ఆదాయ అవసరాలు, టారిఫ్ ప్రతిపాదనలపై ఈ నెల 20న ఏపీఈఆర్సీ నిర్ణయాన్ని ప్రకటించనుందని తెలిపారు. తిరుపతిలోని ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయంలో టారిఫ్‌ను విడుదల చేయనున్నట్లు వివరించారు.

జంతువుల జనన నియంత్రణకు కమిటీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో జంతువుల(శునకాలు) జనన నియంత్రణకు చేపట్టే చర్యలపై పర్యవేక్షణ కమిటీలను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ ఉత్తర్వులిచ్చారు. హైకోర్టు ఆదేశానుసారం... జంతు జనన నియంత్రణ పర్యవేక్షణకు కమిటీలకు మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ఐదుగురు, పంచాయతీల్లో నలుగురు సభ్యులు ఉండాలన్నారు. మునిసిపాలిటీల్లో కమిషనర్ లేదా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చైర్మన్‌గా, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ జిల్లా ప్రతినిధి, పశుసంవర్ధకశాఖ ప్రతినిధి, పశు వైద్యుడు, జంతు హింస నివారణ సంఘం సభ్యుడు సభ్యులుగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే, గ్రామ పంచాయతీల్లో గ్రామ కార్యదర్శి లేదా ఈవో మెంబర్ కన్వీనర్‌గా స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, జంతు హింస నివారణ సంఘం లేదా జంతు సంరక్షణ ఎన్జీవో ప్రతినిధి సభ్యులుగా ఉండాలని సూచించారు.

రేషనలైజేషన్‌లో వీఆర్‌ఓలకు తీవ్ర అన్యాయం

వీఆర్‌ఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్‌లో వీఆర్వోలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు అన్నారు. ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయ రేషనలైజేషన్ గురించి పునరాలోచించాలని మంగళవారం కోరారు. కొంతమంది అధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇస్తుండడం వల్ల రెవెన్యూ శాఖలో ఖాళీలు భర్తీ అవ్వక.. ఉద్యోగులు తీవ్ర పనిఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అందువల్లే రెవెన్యూ సేవలు పూర్తిగా పరిష్కారం కావడం లేదన్నారు. గ్రామ సచివాలయాల పునర్వ్యవస్థీకరణలో రెండు సచివాలయాలకు ఒక వీఆర్‌ఓను కేటాయిస్తామనడం సరికాదన్నారు.

విజయ్‌కుమార్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

హైకోర్టులో ముగిసిన వాదనలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ప్రకటనల జారీ, బిల్లుల చెల్లింపులపై ఏసీబీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ అప్పటి సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు మంగళవారం ముగిశాయి. వాదనలు విన్న న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందు విజయ్‌కుమార్ రెడ్డి తరఫు న్యాయవాది వేలూరి మహేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు. ప్రకటన టారిఫ్ విషయంలో పిటిషనర్ నిబంధనల మేరకే వ్యవహరించారన్నారు. టారిఫ్ పెంచుతూ కమిటీ తీసుకున్న నిర్ణయాన్నే అమలు చేశారన్నారు. కమిటీ నిర్ణయాన్ని కేబినెట్ సైతం ఆమోదించిందని వివరించారు. ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులకు దురుద్దేశాలను ఆపాదించడానికి వీల్లేదని చెప్పారు. అనంతరం ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. విజయ్‌కుమార్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని అన్నారు.

సాగుబడి
శతభిష కార్తె ఫిబ్రవరి 19 నుండి

మునగాకు తోట... రెండు నెలలకో కోత!





మునగ సకల పోషకాల గని అని మనకు తెలుసు. సాంబారులో మునక్కాడలు వేసుకోవటం కూడా అందరికీ తెలుసు. అయితే, కాయల్లో కన్నా ఆకుల్లో ఎక్కువ పోషకాలు దాగి ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. తమిళనాడులో, సరిహద్దు చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో మునగ ఆకును ఆకుకూరగా వాడుకోవటం ఎక్కువగా కనిపిస్తుంది. ఇప్పుడు కొందరు రైతులు మునగాకు పొడిని అమ్ముతున్నారు. ఈ పొడితో బిస్కట్లు తదితర ఆహారోత్పత్తులను సైతం తయారు చేసి స్థానికంగానే కాదు, విదేశాలకూ అమ్ముతున్నారు. పొలాల్లోనే కాదు, పెరట్లో కూడా మునగ ఆకుని పండించుకునే ఓ పద్ధతి గురించి ఇప్పుడు తెలుసుకుందాం...

తక్కువ స్థలంలో ఎక్కువ మునగ ఆకులు పండించే సాంద్ర వ్యవసాయ పద్ధతి (ఇంటెన్సివ్ ఫార్మింగ్ సిస్టం) ఇది. పోషకాహార లోపాలకు మునగాకు సరైన మందు. పోషకాహార లోపం నివారణకు వివిధ పద్ధతుల్లో మునగ ఆకు ఉత్పత్తుల వాడకం పెరిగింది. మరి ఇంటి పెరట్లోనే ఇంటెన్సివ్‌గా మునగాకు తోటలను సాగు చేయటం ఎలా? ఇంటి పెరటిలో కొద్దిపాటి స్థలంలో మునగ తోట పెంపకాన్ని చేపడితే ఏడాదంతా తాజా మునగాకును పొందవచ్చు. ఉన్న కొద్దిపాటి స్థలంలోనే మంచి పంట వస్తుంది. ఇంటి పెరట్లోనే కాదు.. పార్కుల్లోని ఖాళీ స్థలాలు, తోటలు, పాఠశాల ఆవరణల్లోనూ ఈ విధానంలో మునగతోటలను సాగు చేసుకుంటే మంచి ఆరోగ్యకరమైన ఆహారం మన సొంతమవుతుంది. దీనికి అనుసరించాల్సిన పద్ధతులు వరుస క్రమంలో...

1. ముందుగా 13 చదరపు అడుగుల స్థలాన్ని ఇంటిపెరటిలో ఎంపిక చేసుకోవాలి. ఇందులో రెండడుగులు లోతు తవ్వాలి.
2. తవ్విన మట్టికి సమాన నిష్పత్తిలో కోళ్ల ఎరువు లేదా వానపాముల ఎరువును కలుపుకోవాలి.
3. తవ్విన గుంతను తిరిగి సేంద్రియ ఎరువుల మిశ్రమంతో నింపాలి. మడిని నీటితో తడుపుతుండాలి. ఆరు వారాల్లో మంచి ఎరువు తయారవుతుంది.
4. మడిని నాలుగు సమాన భాగాలుగా విభజించి గుర్తు పెట్టుకోవాలి.
5. మునగ విత్తనాలను నాటుకోవాలి.
6. విత్తనాలపై గడ్డిని పరిచి ఆచ్ఛాదన కల్పించాలి. నీటి తడులివ్వాలి.
7. పెంపుడు జంతువులు, పశువుల నుంచి రక్షణ కల్పించాలి.
8. నెల రోజుల వయసున్న మునగ మొక్కలు
9. 5 వారాల వయసున్న మునగ మొక్కలు
10. 6 వారాల వయసున్న మునగ మొక్కలు
11. మూడోసారి కోతకు సిద్ధం
12. భూమి మట్టం నుంచి అడుగున్నర ఎత్తులో కత్తిరించాలి.
13. ఒక పక్క నుంచి కత్తిరించుకుంటూ వెళ్లాలి.
14. పూర్తిగా కోసిన మునగ మడి
15. కొమ్మలను పరదాపై నీడకింద ఆరబెట్టాలి.
16. మూడో కోతలో దాదాపు 90 కిలోల తాజా ఆకుల దిగుబడి వస్తుంది.
17. కొమ్మలను పరదాపై నీడ కింద ఆరబెట్టాలి. 20 కిలోల ఆకును నీడలో ఆరబెడితే కిలో మునగాకు పొడిని తయారు చేసుకోవచ్చు.
18. ప్రతి 50-60 రోజులకు ఒకసారి మునగ ఆకు కోతకు సిద్ధమవుతుంది.

తాజా ఆకును వాడుకోవచ్చు లేదా నీడలో ఆరబెట్టిన ఆకుతో పొడిని తయారు చేసుకోవచ్చు. కత్తిరించిన తరువాత మునగ మొక్కల మోళ్లు మళ్లీ చివురిస్తాయి.

మరో 50 రోజుల్లో కోతకొస్తాయి. తోట ద్రవ జీవామృతం, ఘనజీవామృతం వంటివి తగుమాత్రంగా వాడుతూ పోషకాల లోపం రాకుండా చూసుకుంటే.. ఈ సాంద్ర మునగ ఇలా ఏళ్ల తరబడి పోషకాల గని వంటి మునగాకును ఇస్తూనే ఉంటుంది.

మునగ.. పోషక విలువల గని!

Vitamin C విటమిన్ 'సి'	సాధారణ నారింజలో కన్నా 7 పాళ్ళు ఎక్కువగా విటమిన్ 'సి' ఉంటుంది.
Vitamin A విటమిన్ 'ఎ'	క్యారెట్ కన్నా 4 పాళ్ళు ఎక్కువగా విటమిన్ 'ఎ' ఉంటుంది.
Calcium కాల్షియం	పాలల్లో కన్నా 4 పాళ్ళు ఎక్కువగా కాల్షియం ఉంటుంది.
Potassium పొటాషియం	అరటి పండులో కన్నా 3 పాళ్ళు ఎక్కువగా పొటాషియం ఉంటుంది.
Proteins ప్రొటీన్స్	గుడ్లలో కన్నా 4 పాళ్ళు ఎక్కువగా ప్రోటీన్స్ ఉంటాయి.
Vitamin E విటమిన్ 'ఇ'	బాదం పప్పులో కన్నా 3 పాళ్ళు ఎక్కువగా విటమిన్ 'ఇ' ఉంటుంది.

ఆరు నెలలు పోషకాలు సేఫ్!


భారత ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సమాచారం ప్రకారం.. మునగాకు పొడి - ఒక అద్భుతమైన ఆహార పదార్థం. దీనిలో విటమిన్లు, ఖనిజ లవణాలు, మాంసకృత్తులు విశేషంగా ఉన్నాయి. పోషకాహార లోపం గల పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే స్త్రీలకు ఉపయోగపడే పోషకాలను ఇస్తుంది. ఏ ఆహారంతోనైనా దీన్ని కలిపి తీసుకోవచ్చు.

విత్తనం, మొక్క నాటుకోవాలనేమీ లేదు. కొమ్మను విరిచి నాటితే వేరు పోసుకొని చెట్టుగా ఎదుగుతుంది. చెట్లు నాటుకున్న తరువాత ఎప్పుడైనా మునగాకులు కోసుకోవచ్చు.

- మునగ తోటల్లో సంవత్సరానికి 6-9 సార్లు కొమ్మలను భూమి నుండి 15-50 సెం.మీ. ఎత్తు వరకు కత్తిరించుకోవచ్చు
- కొమ్మల నుంచి కోసుకున్న తాజా మునగాకును నీటిలో బాగా కడిగి శుభ్రపరచాలి
- ఆకులను సూర్యరశ్మి తగలని ప్రదేశంలో సహజంగా ఎండబెడితే, ఆకుల్లో ఉన్న విటమిన్లు అలాగే నిక్షిప్తమై ఉంటాయి. పొడి చేయటానికి సులువుగా ఉంటుంది
- ఇలా ఎండిన ఆకులను దంచటం ద్వారా లేదా పిండిమర ద్వారా పొడి చేసుకోవచ్చు
- పొడిని గాలిచొరబడని, తేమలేని సీసాలో పోసుకొని సూర్యరశ్మి తగలకుండా భద్రపరచుకోవాలి
- మునగాకు పొడిని 24 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువ శీతోష్ణస్థితిలో ఉంచితే, 6 నెలల వరకు తాజాగా పోషక విలువలేవీ కోల్పోకుండా ఉంటుంది
- మునగాకు పొడిని ఆహార పదార్థాల్లో గాని, పానీయాల్లో గాని కలుపుకోవచ్చు. మునగాకు పొడిని ఆహార పదార్థాలు పూర్తిగా వండిన తర్వాత కలుపుకుంటే పోషక విలువలు మనకు పూర్తిగా లభ్యమవుతాయి.

దున్నకుండా.. కలుపు తీయకుండా.. రసాయనాల్లేకుండా...

సంపూర్ణ ప్రకృతి సేద్యం!


Potato in Raju's farm
Goats in Raju's farm

- పొలాన్ని దున్నకుండా, రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకుండా, కలుపు తీయకుండా వ్యవసాయం
- మధ్యప్రదేశ్‌కు చెందిన రైతు శాస్త్రవేత్త దివంగత రాజు టైటస్ కృషి ఆదర్శప్రాయం

రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా వ్యవసాయం చేస్తున్నారంటే ఇప్పుడెవరూ ఆశ్చర్యపోవడం లేదు. కానీ.. ఎద్దులతోనో, ట్రాక్టరుతోనో దున్నే పనే లేకుండా ప్రకృతి వ్యవసాయం చేయొచ్చంటే.. నమ్మలేం. అయితే, మధ్యప్రదేశ్‌కు చెందిన దివంగత రైతు శాస్త్రవేత్త రాజు టైటస్ మాత్రం 30 ఏళ్ల పాటు ఇలాగే వ్యవసాయం చేసి సత్ఫలితాలు సాధించారు. 'ప్రకృతి వ్యవసాయం వెనుకబడినదో లేదా ప్రాచీనమైనదో కాదు. ఆధునికమైనది, వినూత్నమైనది అని రాజు టైటస్ రుజువు చేశారు' అని ఐసిఎఆర్ ప్రశంసించింది. ఆరేళ్ల క్రితం కన్నుమూసినా.. ఆయన కృషి రైతులకు ఎప్పటికీ స్ఫూర్తినిస్తూనే ఉంటుంది.

మధ్యప్రదేశ్‌లోని హోషంగాబాద్‌కు చెందిన 'రాజు టైటస్' ప్రభుత్వోద్యోగి. అయినా కుటుంబ వారసత్వంగా వచ్చిన 13 ఎకరాల పొలాన్ని సాగు చేయటం మానలేదు. 70వ దశకంలో అందరిలానే ఆయనా 'హరిత విప్లవం' ఒరవడిలో రసాయన ఎరువులు, కీటకనాశనులు వాడటం మొదలుపెట్టారు. మొదట్లో దిగుబడులు పెరిగి ఆదాయం వచ్చినా పదిహేనేళ్లు తిరిగేసరికి పంట భూమి నిస్సారమయింది. దిగుబడులు తగ్గి నష్టాల పాలై పొలం అమ్మేయాలని నిశ్చయించుకున్నాడు. ఇది జరిగింది 1984లో. రాజు నిర్ణయంతో తల్లి హతాశురాలయింది. గాంధేయవాదులు నడిపే స్వచ్ఛంద సంస్థ 'ఫ్రెండ్స్ రూరల్ సెంటర్' కార్యకర్తలతో ఆమె తన గోడు వెళ్లబోసుకుంది. వారు ఆమె చెప్పినదంతా విని జపాన్ దేశానికి చెందిన ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త మసనోబు ఫుకుఒకా రాసిన 'గడ్డిపరకతో విప్లవం' (వన్ స్ట్రా రివల్యూషన్) పుస్తకాన్నిచ్చి మీ సమస్యకు ఈ పుస్తకం పరిష్కారాన్ని చూపుతుందని చెప్పారు. కలుపు తీయకుండా.. దుక్కిదున్నకుండా.. ఎరువులు వేయకుండా.. పురుగు మందులు పిచికారీ వంటి పద్ధతులు అనుసరించకుండానే పంటలను సాగు చేసే పద్ధతుల గురించి ఫుకుఒకా ఆ పుస్తకంలో వివరించారు. ఈ పుస్తకాన్ని చదివిన రాజు తను సాగులో తను అనుసరిస్తున్న పద్ధతులు అనర్థ హేతువులని అర్థం చేసుకున్నారు.





అడ్డంకులను అధిగమించి..

15 ఏళ్లుగా రసాయన ఎరువులు వేస్తూ పంట భూమిని ధ్వంసం చేస్తున్నానని అర్థం చేసుకున్న రాజు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టారు. 1985 నుంచి ఫుకుఒకా చెప్పిన పద్ధతులను అనుసరించి వ్యవసాయం చేయటం మొదలుపెట్టారు. అప్పటి నుంచి నేలను దున్నటం, ఎరువులు, పురుగుమందుల వాడకం ఆపేశారు. రకరకాల గడ్డి, చెట్ల విత్తనాలను పొలంలో వెదజల్లి అవి పెరిగాక కత్తిరించి ఆచ్ఛాదనగా వాడేవారు. దీనివల్ల వర్షపు నీరు బయటకు వెళ్లకుండా పొలంలోనే ఇంకి.. నేల గుల్లబారటంతో పాటు తేమను పట్టి ఉంచింది. తొలుత గ్రామస్తులు అవహేళన చేసినా అడ్డంకులను అధిగమించి రాజు ప్రకృతిసేద్యం దిశగా వడివడిగా అడుగులు వేశారు.



సోయా విత్తన బంతులు!

అంకితభావంతో రాజు టైటస్ చేసిన కృషి ఫలితాన్నిచ్చింది. 1988లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొనటానికి ఇండియా వచ్చిన ఫుకుఒకా ప్రకృతిసేద్యం చేస్తున్న రాజు గురించి తెలుసుకొని ఆయన పొలాన్ని సందర్శించారు. ఫుకుఒకా సలహాలు సూచనలను అనుసరించి రెట్టించిన ఉత్సాహంతో రాజు పనిచేశారు. ఫుకుఒకా సూచన మేరకు పంటను విత్తుకోవటానికి బదులు.. ఒక పాలు సోయా విత్తనం, ఏడు పాళ్లు మట్టి కలిపి క్రికెట్ బాల్ పరిమాణంలో ఉండే 'విత్తన బంతుల' ను తయారు చేశారు. భార్య శాలిని సహకారంతో.. అడుగుకో బంతి చొప్పున.. పొలంలో వేశారు. దీనివల్ల మొలకెత్తినప్పటి నుంచే మొక్కలు పోషకాలను, సూర్యరశ్మిని ఎక్కువగా గ్రహించి ఏపుగా ఎదిగాయి. ఆ ఏడాది దిగుబడి బావుండటంతో పాటు నాణ్యమైన పంట వచ్చింది.

సోయా మొక్కల మధ్య ఎత్తుగా పెరిగిన గడ్డిని కత్తిరించి భూమిపైన ఆచ్ఛాదనగా వేశారు. దీనివల్ల పంటలకు మేలు చేసే వానపాములు, మిత్రపురుగులు, సూక్ష్మజీవులకు ఆశ్రయం లభిస్తుంది. పంటలకు హానిచేసే శత్రు పురుగులను ఇవి నిర్మూలిస్తాయి. దీనివల్ల రసాయనిక ఎరువులు, కీటకనాశనుల అవసరం తప్పుతుంది. ఇవి నేలలో చేసే బొరియల వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది. వేర్లు లోతుకంటా చొచ్చుకుపోయి తేమను పోషకాలను గ్రహిస్తాయి. నేల గుల్లబారి భూ సారం పెరిగి మంచి పంట దిగుబడులు వస్తాయి. నేలను దున్నాల్సిన అవసరం లేకపోవటం వల్ల ట్రాక్టరు.. ఎద్దుల కోసం అప్పు చేయాల్సిన అగత్యం తప్పింది.

రాజు తన పొలంలో నత్రజనిని స్థిరీకరించేందుకు సుబాబుల్ చెట్లను సాగు చేశారు. దీనివల్ల యూరియా రూపంలో రసాయన ఎరవును అందించాల్సిన అవసరం ఉండదంటారాయన. సుబాబుల్ ఆకులు మేకలకు మంచి మేతగా ఉపయోగపడ్డాయి. ఈ చెట్ల కలపతో పాటు మేకల విక్రయం ద్వారా ఆదాయం లభిస్తోంది. ఆ విధంగా 30 ఏళ్లకు పైగా పొలాన్ని దున్నకుండానే సమృద్ధిగా పంటలు పండిస్తూ పేరుపొందారు.

వినియోగదారులు అడిగితేనే రైతులు పండిస్తారు!

'వినియోగదారులు కూడా ఆరోగ్యకరమైన ఆహారం కోసం డిమాండ్ చేసినప్పుడే రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడటం మానేస్తారు. ఆరోగ్యకరమైన నేల ద్వారానే ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తి సాధ్యమనే విషయాన్ని గుర్తిస్తారు' అనేవారు రాజు టైటస్. మన దేశంలో ప్రజలకు సోకుతున్న పలు జబ్బులకు మూలకారణం ఆహార పంటల సాగులో వాడుతున్న రసాయనాలు. వీటి వల్ల తొలుత మధుమేహం సోకి పలు దీర్ఘకాలిక అనారోగ్యాలకు దారితీస్తుంది. నాకు పక్షవాతం వచ్చింది. నా భార్య గుండెజబ్బు వ్యాధిగ్రస్తురాలు. అయినా మేం కోలుకోవటానికి ప్రకృతి సేద్య పంట ఉత్పత్తులే కారణం అన్నారాయన. 'మా కుటుంబ అవసరాల కోసం ప్రస్తుతం ఎకరా పొలంలో ధాన్యం, పండ్లు, పాలు, కూరగాయలను సాగు చేస్తున్నాం. ఖరీఫ్‌లో గోధుమ, వరి, మొక్కజొన్న, రబీలో పెసరను సాగు చేస్తున్నాం. రోజురోజుకు వ్యవసాయంలో పెరుగుతున్న ఖర్చులే రైతు ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి. ఫుకుఒకా విధానంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అప్పులు చేయాల్సిన అవసరం ఉండదు. ఈ సేద్యం మూలసూత్రాలను ఒంటబట్టించుకుంటే ఏ రైతైనా పొలాన్ని దున్నకుండానే సేద్యం చేయవచ్చు అంటారు రాజు టైటస్!

బిజినెస్ రీల్

జియోథింగ్స్‌తో ప్యూర్ ఈవీ జట్టు



ముంబై: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ప్యూర్ ఈవీ తాజాగా జియో ప్లాట్‌ఫామ్స్‌లో భాగమైన జియోథింగ్స్‌తో జట్టు కట్టింది. తమ ఎలక్ట్రిక్ వాహనాల్లో స్మార్ట్ డిజిటల్ క్లస్టర్లు, టెలీమ్యాటిక్స్‌ను జోడించేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని సంస్థ తెలిపింది. 4జీ కనెక్టివిటీ ఆధారిత టెలీమ్యాటిక్స్ వల్ల కస్టమర్లు తమ వాహనాల పనితీరును రియల్ టైమ్‌లో తెలుసుకునేందుకు వీలవుతుందని సంస్థ ఎండీ నిశాంత్ దొంగారి తెలిపారు. ఇక మరో సొల్యూషన్ అయిన జియో ఆటోమోటివ్ యాప్ సూట్‌తో జియోస్టోర్, మ్యూజిక్ స్ట్రీమింగ్, వెబ్ బ్రౌజింగ్ మొదలైనవి కస్టమర్లకు అందుబాటులో ఉంటాయని వివరించారు.

టీవీఎస్ రోనిన్ 2025 ఎడిషన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టీవీఎస్ మోటార్ కంపెనీ రోనిన్ మోటార్‌సైకిల్ 2025 ఎడిషన్‌ను ప్రవేశ పెట్టింది. సేఫ్టీ ఫీచర్లతో అప్‌గ్రేడ్ చేసి రెండు కొత్త రంగులను జోడించింది. ధర ఎక్స్–షోరూంలో రూ.1.35 లక్షల నుంచి ప్రారంభం. 5 స్పీడ్ ట్రాన్స్‌మిషన్, 20.1 హెచ్‌పీ పవర్‌తో 225.9 సీసీ సింగిల్ సిలిండర్ ఆయిల్ కూల్డ్ ఇంజన్ పొందుపరిచారు. 19.93 ఎన్ఎం పీక్ టార్క్ అందిస్తుంది. మిడ్ స్పెక్ డీఎస్ వేరియంట్ సైతం డ్యూయల్ చానెల్ ఏబీఎస్ ఏర్పాటు ఉంది. ఫుల్లీ డిజిటల్ కనెక్టెడ్ స్పీడోమీటర్, 14 లీటర్ల ఫ్యూయల్ ట్యాంక్, 7 స్టెప్ అడ్జస్టేబుల్ ప్రీలోడ్‌తో మోనో షాక్, 9 స్పోక్ అలాయ్ వీల్స్, అడ్జస్టేబుల్ లీవర్, స్లిప్పర్ క్లచ్, టీ–షేప్ పైలట్ ల్యాంప్, పవర్‌ఫుల్ ఆల్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, బ్లూటూత్ కనెక్టివిటీ, కాల్/ఎస్ఎంఎస్ నోటిఫికేషన్ అలర్ట్ వంటి హంగులు అదనం.

ఎన్‌టీపీసీ మధ్యంతర డివిడెండ్ రూ.2,424 కోట్లు

న్యూఢిల్లీ: తమ వాటాదారులకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మరో రూ.2,424 కోట్లను మధ్యంతర డివిడెండ్ కింద ఫిబ్రవరి 18న చెల్లించినట్టు ఎన్‌టీపీసీ ప్రకటించింది. మొదటి మధ్యంతర డివిడెండ్ రూ.2,424 కోట్లకు ఇది అదనమని తెలిపింది. దీంతో మొత్తం మీద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాటాదారులకు చెల్లించిన అన్ని రకాల డివిడెండ్‌లు కలిపి రూ.8,000 కోట్లకు చేరినట్టు వెల్లడించింది. ఇందులో రూ.3,152 కోట్ల తుది డివిడెండ్ (2023–24) కూడా ఉన్నట్టు పేర్కొంది. దీంతో వరుసగా 32వ సంవత్సరంలోనూ ఎన్‌టీపీసీ వాటాదారులకు డివిడెండ్ అందించినట్టయింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-2-2025

విశాఖ	435-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	410-00
విజయవాడ	410-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
NTPC	312	3.19
TECHM	1,701.00	2.17
WIPRO	311.5	2.01
ONGC	236	1.01
APOLLOHOSP	6,358.00	0.92

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	1,022.10	-2.49
TRENT	4,986.00	-2.17
BEL	243.8	-1.89
ULTRACEMCO	11,283.05	-1.8
M&M	2,780.95	-1.8

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,910
ఎన్ఎస్ఈ	84,876
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,37,067
ఎఫ్ఐఐ	+ 4,787
డీఐఐ	+ 3,702

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.55 (రాత్రి 11.30కు)	$ 70.71 (క్రితం ముగింపు)
బ్రెంట్	75.58 (రాత్రి 11.30కు)	$ 75.22 (క్రితం ముగింపు)

మార్కెట్ 'కింగ్' రిలయన్స్

మార్కెట్ విలువలో టాప్
- రూ. 17.5 లక్షల కోట్లతో అగ్రస్థానం
- అన్‌లిస్టెడ్ సంస్థల్లో నంబర్ వన్‌గా ఎన్ఎస్ఈ
- బర్గండీ ప్రైవేట్ హురున్ ఇండియా టాప్ 500 జాబితాలో వెల్లడి



ముంబై: దేశీయంగా అత్యధిక మార్కెట్ వేల్యుయేషన్‌తో పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ వరుసగా నాలుగో ఏడాదీ అగ్రస్థానంలో కొనసాగింది. రూ. 17.5 లక్షల కోట్ల విలువతో బర్గండీ ప్రైవేట్ హురున్ ఇండియా టాప్ 500 కంపెనీల లిస్టులో నంబర్ వన్ ర్యాంకు దక్కించుకుంది. అటు ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రూ. 16.1 లక్షల కోట్ల మార్కెట్ వేల్యుయేషన్‌తో రెండో స్థానంలో, రూ. 14.22 లక్షల కోట్లతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మూడో స్థానంలో నిల్చాయి. మరోవైపు, ఐపీవోకి సన్నాహాలు చేసుకుంటున్న స్టాక్ ఎక్స్ఛేంజీ ఎన్ఎస్ఈ సంస్థ రూ. 4.7 లక్షల కోట్ల వేల్యుయేషన్‌తో.. అన్‌లిస్టెడ్ కంపెనీల విభాగంలో అగ్రస్థానంలో ఉంది. 2024 ఆర్థిక సంవత్సరంలో సంస్థ ఆదాయాలు 28 శాతం పెరిగి రూ. 16,352 కోట్లకు, లాభాలు 51 శాతం ఎగిసి రూ. 8,306 కోట్లకు చేరాయి. ఈ విభాగంలో రూ. 77,860 కోట్ల వేల్యుయేషన్‌తో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా అయిదో స్థానంలో ఉంది. బైటి నుంచి నిధులు సమీకరించకుండా సొంతంగా ఎదిగిన బూట్‌స్ట్రాప్డ్ సంస్థల లిస్టులో నాలుగో ర్యాంకు దక్కించుకుంది.

గ్రూప్‌లవారీగా చూస్తే టాటా సన్స్ వేల్యుయేషన్ 2024లో 37 శాతం ఎగిసి రూ. 32.27 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో రిలయన్స్ గ్రూప్ మొత్తం వేల్యుయేషన్ రూ. 19.71 లక్షల కోట్లుగా, అదానీ గ్రూప్ విలువ రూ. 13.40 లక్షల కోట్లుగా ఉంది. తొలిసారిగా లిస్టులోని కంపెనీలన్నీ 1 బిలియన్ డాలర్ల పైగా వేల్యుయేషన్ ఉన్నవేనని హురున్ చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు. దేశవ్యాప్తంగా పరిశ్రమ నిపుణులు, జర్నలిస్టులు, బ్యాంకర్ల నుంచి సేకరించిన అభిప్రాయాలు, బహిరంగంగా అందుబాటులో ఉన్న గణాంకాల ఆధారంగా ఈ జాబితాను సిద్ధం చేసినట్లు వివరించారు. దీనికి డిసెంబర్ 13 కటాఫ్ తేదీగా నిర్ణయించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఇందులో పరిగణనలోకి తీసుకోలేదు.

మరిన్ని వివరాలు ..

- టాప్ 500లోకి చోటు దక్కించుకునేందుకు ఈసారి కనిష్ట వేల్యుయేషన్ పరిమితిని 43% అధికంగా రూ. 9,580 కోట్లకు పెంచారు. 2023లో ఇది రూ. 6,700 కోట్లుగా ఉంది.
- లిస్టులోని మొత్తం కంపెనీల విలువ 40 శాతం ఎగిసి 3.8 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ. 324 లక్షల కోట్లు) చేరింది. ఇది దాదాపు 3.5 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న దేశ జీడీపీ కన్నా అధికం కావడం గమనార్హం. మోతీలాల్ ఓస్వాల్, ఐనాక్స్ విండ్, జెప్టో, డిక్సన్ వంటి సంస్థల వేల్యుయేషన్ అత్యధికంగా పెరిగింది.
- మొత్తం సుమారు రూ. 86 లక్షల కోట్ల పైగా ఆదాయం ఉన్న ఈ 500 కంపెనీలు దాదాపు రూ. 8 లక్షల కోట్ల లాభాలు ఆర్జించగా, రూ. 2.2 లక్షల కోట్ల మొత్తాన్ని పన్నుల కింద చెల్లించాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాలపై రూ. 11,000 కోట్లు వెచ్చించాయి. సుమారు 85 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాయి.
- టాప్ కంపెనీల సంఖ్యాపరంగా చూస్తే రూ. 10.11 లక్షల కోట్ల విలువ చేసే 35 సంస్థలతో హైదరాబాద్ అయిదో స్థానంలో నిల్చింది. రాష్ట్రాలవారీగా చూస్తే తెలంగాణ ఏడో ర్యాంకులో ఉంది.

రూ.300 పెరిగిన పసిడి

ఢిల్లీలో ధర రూ.88,500



న్యూఢిల్లీ: రోజు వ్యవధిలో బంగారం ధరలు మళ్లీ అప్‌ట్రెండ్ దిశగా నడిచాయి. మంగళవారం ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత బంగారం ధర రూ.300 పెరగడంతో 10 గ్రాములకు రూ.88,500కు చేరింది. 99.5% స్వచ్ఛత బంగారం కూడా రూ.300 పెరిగి రూ.88,100కు చేరుకుంది. గత శుక్రవారం బంగారం రూ.1,300 పెరిగి ఆల్‌టైమ్ గరిష్ట స్థాయి రూ.89,400 నమోదు చేయగా, సోమవారం అమ్మకాల ఒత్తిడికి రూ.1,200 నష్టంతో రూ.88,200కు దిగొచ్చింది. అంతర్జాతీయ ధోరణికి అనుగుణంగా బంగారం లాభపడినట్టు ఆల్ ఇండియా సఫారా అసోసియేషన్ తెలిపింది. వెండి ధర సైతం కిలోకి రూ.800 లాభపడి రూ.99,000కు చేరుకుంది. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్ మార్కెట్లోనూ బంగారం, వెండి లాభపడ్డాయి. ఏప్రిల్ నెల గోల్డ్ కాంట్రాక్ట్ రూ.435 పెరిగి రూ.84,490కు.. వెండి ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ రూ.439 పెరిగి రూ.96,019కు చేరాయి. అంతర్జాతీయంగా స్పాట్ గోల్డ్ ధర ఔన్స్‌కు 16 డాలర్లు ఎగసి 2,912.50 డాలర్లను తాకింది. సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లను ఎలాంటి మార్పులు చేయాలనుకోవడం లేదంటూ ఫెడ్ సభ్యుడు ప్యాట్రిక్ హార్కర్ చేసిన హాకిష్ వ్యాఖ్యలు బంగారం మరింత ర్యాలీ చేయకుండా అడ్డుపడినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ వెల్లడించారు.

యూఎస్‌తో డీల్‌పై ఆందోళన అక్కర్లేదు

- భారత కంపెనీలకు గొప్ప అవకాశాలు
- పరస్పర ప్రయోజనాలు, రాయితీలకు చోటు
- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ: అమెరికాతో భారత్ నిర్వహించే వాణిజ్య సంప్రదింపుల పట్ల దేశీ పరిశ్రమ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ భరోసా ఇచ్చారు. ఈ విషయంలో భారత్ బలమైన స్థానంలో ఉందన్నారు. వివిధ భాగస్వాములతో సంప్రదింపుల ద్వారా చర్చలకు సన్నద్ధం అవుతున్నామని, త్వరలోనే ఇవి మొదలవుతాయని చెప్పారు. ఇరు దేశాలూ పరస్పర రాయితీలతో పాటు, సుంకాల తగ్గింపును ఆఫర్ చేయనున్నట్టు స్పష్టం చేశారు. దీంతో రెండు దేశాల మధ్య ఎగుమతులు, దిగుమతులు సులభతరంగా మారతాయన్నారు. ప్రధాని మోదీ ఇటీవలి అమెరికా పర్యటన సందర్భంగా.. రెండు దేశాలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి రెట్టింపు చేసుకోవాలని (500 బిలియన్ డాలర్లు), పరస్పర ప్రయోజనాలతో మొదటి దశ వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత ముందుగా ఈ ఏడాది కుదుర్చుకోవాలని నిర్ణయించడం తెలిసిందే. ప్రస్తుతం రెండు దేశాల మధ్య వాణిజ్యం 200 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ ఒప్పందం దేశీ పరిశ్రమలకు వ్యాపార అవకాశాలను విస్తృతం చేస్తుందని మంత్రి గోయల్ ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చెప్పారు. ''భారత్‌ను మరింత పోటీతత్వంతో తీర్చిదిద్దడానికి దీన్నొక గొప్ప అవకాశంగా చూస్తున్నాం. నాణ్యమైన ఉత్పత్తులతో ముందుకు రండి. భారత్, అమెరికాకు పరస్పర ప్రయోజనం కల్పించే, ఆకర్షణీయమైన వాణిజ్య షరతులను గమనించండి''అని గోయల్ పేర్కొన్నారు.

టారిఫ్‌లు మనం కూడా వేస్తాం..

ప్రతీకార సుంకాలపై మంత్రి గోయల్ మాట్లాడుతూ.. దిగుమతుల నుంచి దేశీ పరిశ్రమను కాపాడుకునేందుకు మన దగ్గరా సుంకాలు ఉన్నట్టు గుర్తు చేశారు. ''ఈ అంశాలను పరిష్కరించుకునేందుకు, పరస్పర ప్రయోజనాలపై చర్చల్లో భాగంగా దృష్టి పెడతాం. ఈ విషయంలో దేశీ సంస్థలకు ఆందోళన అక్కర్లేదు. ఇదొక సువర్ణావకాశం. కొత్త వ్యాపార అవకాశాలకు తలుపులు తెరుచుకుంటాయి. ఈ రోజు ఆందోళన చెందుతున్న వారు రేపు పశ్చాత్తాపం చెందాల్సి వస్తుంది''అని మంత్రి వ్యాఖ్యానించారు.

వివో వీ50 స్మార్ట్‌ఫోన్

ధర రూ. 34,999 నుంచి ప్రారంభం



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ వివో తాజాగా వీ సిరీస్‌లో వీ50 హ్యాండ్‌సెట్‌ను ఆవిష్కరించింది. దీని ధర రూ. రూ. 34,999 నుంచి ప్రారంభమవుతుంది. 6,000 ఎంఏహెచ్ బ్యాటరీ విభాగంలో ఇది అత్యంత పల్చని (0.739 సెం.మీ.) ఫోన్ అని సంస్థ తెలిపింది. వివో–జీయస్ ఇమేజింగ్ సిస్టం, వెడ్డింగ్ పోర్ట్రెయిట్ స్టూడియో ఫీచర్, అల్ట్రా–స్లిమ్ కర్వ్డ్ డిస్‌ప్లే మొదలైన ప్రత్యేకతలు ఇందులో టాయి. ఫిబ్రవరి 25 నుంచి బుకింగ్స్ ప్రారంభమవుతాయి. కొనుగోలు మాధ్యమాన్ని బట్టి నిర్దిష్ట కార్డులపై 10 శాతం వరకు డిస్కౌంట్లు, క్యాష్ బ్యాక్‌లు, ఏడాది పాటు ఉచిత ఎక్స్‌టెండెడ్ వారంటీ మొదలైన ఆఫర్లు ఉంటాయని సంస్థ తెలిపింది.

ఏఎంసీలు సకాలంలో పెట్టుబడి పెట్టాల్సిందే

- నిబంధనలను సవరించిన సెబీ
- ఏప్రిల్ 1 నుంచి అమలు



న్యూఢిల్లీ: నూతన ఫండ్ పథకం (ఎన్ఎఫ్‌వో) ద్వారా మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు (ఏఎంసీలు) ఇన్వెస్టర్ల నుంచి సమీకరించిన నిధులను నిర్దేశిత సమయంలోపు తప్పనిసరిగా ఇన్వెస్ట్ చేయాలంటూ నిబంధనలను సెబీ సవరించింది. అలాగే, పారదర్శకత పెంపుకోసం మ్యూచువల్ ఫండ్ పథకాలకు సంబంధించి స్ట్రెస్ టెస్ట్ ఫలితాలను సైతం ఇన్వెస్టర్లకు తెలియజేయడాన్ని కూడా తప్పనిసరి చేసింది. ఏప్రిల్ 1 నుంచి ఈ నిబంధనలను అమలు చేయనుంది. మరింత జవాబుదారీతనం, ఇన్వెస్టర్లలో విశ్వాసం, మ్యూచువల్ ఫండ్స్‌కు నిర్వహణ సౌలభ్యం తీసుకొచ్చే దిశగా సెబీ ఈ చర్యలు తీసుకుంది. ఎన్ఎఫ్‌వో ముగిసిన అనంతరం, పథకం పెట్టుబడుల విధానానికి అనుగుణంగా నిర్దేశిత సమయంలోపు ఇన్వెస్ట్ చేయాలన్న ప్రతిపాదనకు సెబీ బోర్డు గత డిసెంబర్‌లో ఆమోదం తెలపడం గమనార్హం. సాధారణంగా ఈ గడువు 30 రోజులుగా ఉంటుంది. ఎన్ఎఫ్‌వో ముగిసిన అనంతరం 30 రోజుల్లో ఇన్వెస్ట్ చేయకపోతే.. ఇన్వెస్టర్లు ఎలాంటి ఎగ్జిట్ లోడ్ (చార్జీ) చెల్లించాల్సిన అవసరం లేకుండా తమ పెట్టుబడులు వెనక్కి తీసుకునేందుకు ఏఎంసీలు అనుమతించాల్సి ఉంటుంది. ప్రతికూల పరిస్థితుల్లో ఇన్వెస్టర్ల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడుల ఉపసంహరణ ఒత్తిళ్లు వచ్చినప్పుడు, మ్యూచువల్ ఫండ్ పథకాలు ఎలా ఎదుర్కొంటాయో స్ట్రెస్ టెస్ట్ ఫలితాలు తెలియజేస్తాయి.

ఏబీబీ పటిష్ట పనితీరు

54 % జంప్ చేసిన లాభం



న్యూఢిల్లీ: ఎలక్ట్రిఫికేషన్, ఆటోమేషన్ సేవల్లోని ఏబీబీ ఇండియా డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికి పటిష్ట పనితీరు ప్రదర్శించింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో పోల్చి చూస్తే 54 శాతం పెరిగి రూ.532 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.345 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం ఇదే కాలంలో రూ.2,757 కోట్ల నుంచి రూ.3,365 కోట్లకు వృద్ధి చెందింది. మొత్తం ఆర్డర్లు రూ.2,695 కోట్లకు తగ్గాయి. క్రితం ఏడాది ఇదే కాలానికి ఇవి రూ.3,147 కోట్లుగా ఉన్నాయి. ఏబీబీ ఇండియా జనవరి–డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా అమలు చేస్తోంది. 2024 పూర్తి సంవత్సరానికి రూ.1,875 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. 2023లో ఇది రూ.1,248 కోట్లుగానే ఉంది. రూ.12,188 కోట్ల ఆదాయాన్ని, రూ.13,079 కోట్ల ఆర్డర్లను దక్కించుకుంది. ఒక ఏడాదిలో గరిష్ట ఆర్డర్ల పరంగా కొత్త రికార్డు నమోదైంది. ప్రతి షేరుకు రూ.33.50 చొప్పున డివిడెండ్‌ను కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఏబీబీ ఇండియా షేరు ధర రూ.5,241 వద్ద ముగిసింది. భారత్‌లో ఏబీబీ ఇండియా తయారీ, ఆవిష్కరణలు ప్రారంభించి 75 ఏళ్లు అయినట్టు కంపెనీ ఎండీ సంజీవ్ శర్మ ప్రకటించారు.

రేట్ల కోత కాదు.. లిక్విడిటీ పెంచాలి

- అప్పుడే వృద్ధికి మద్దతు
- యాక్సిస్ బ్యాంక్ ఆర్థికవేత్త మిశ్రా



ముంబై: వృద్ధికి ఊతమివ్వాలని భావిస్తే ఆర్‌బీఐ రేట్ల కోతకు బదులు ద్రవ్య లభ్యత పరిస్థితులను సులభతరం (లిక్విడిటీ) చేయడంపై దృష్టి పెట్టాలని యాక్సిస్ బ్యాంక్ ముఖ్య ఆర్థికవేత్త నీల్‌కాంత్ మిశ్రా సూచించారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలిలో మిశ్రా పార్ట్ టైమ్ సభ్యుడిగా ఉన్నారు. ఈ నెల మొదట్లో పావు శాతం మేర రెపో రేటును ఆర్‌బీఐ తగ్గించడం తెలిసిందే. అలాగే, తదుపరి పాలసీ సమీక్షల్లోనూ మరింత రేట్ల కోతతో రుణ వితరణ పెరగదని, ద్రవ్య కొరత రేట్ల కోత బదిలీకి అడ్డుపడుతుందని చెప్పారు. ''రేట్ల కోత ఉద్దేశ్యం మరిన్ని రుణాల జారీ అయితే.. కొత్త రుణాలు తక్కువ రేట్లపై జారీ చేయడం అసాధ్యం. ఎందుకంటే ద్రవ్య నియంత్రణ కట్టడి చర్యల ఫలితంగా మార్జినల్ కాస్ట్ ఆఫ్ మనీ 18 నెలలుగా అధిక స్థాయిలో కొనసాగుతోంది. రేపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన తర్వాత కూడా ఏడాది కాల సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్ల రేటు 7.8 శాతం వద్దే కొనసాగుతోంది'' అని మిశ్రా వివరించారు. ఆర్‌బీఐ రెగ్యులర్ ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్‌ను చేపట్టడం ద్వారా తగినంత లిక్విడిటీ ఉండేలా చూడొచ్చన్నారు. లేదంటే నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ను తగ్గించడం మరింత ఫలితాన్నిస్తుందన్నారు. లిక్విడిటీ సాధారణ స్థాయికి చేరి, ప్రభుత్వం ద్రవ్య స్థిరీకరణకు కట్టుబడితే 2025–26 ద్వితీయ త్రైమాసికం నుంచి జీడీపీ వృద్ధి 7 శాతం రేటును చేరుకోవచ్చని అంచనా వేశారు.

ట్రేడింగ్–డీమ్యాట్ ఖాతా లాగిన్ మరింత భద్రం!

టెక్ ఆధారిత చర్యలను ప్రకటించిన సెబీ



న్యూఢిల్లీ: ట్రేడింగ్, డీమ్యాట్ ఖాతాల లాగిన్‌ను మరింత భద్రంగా మార్చే దిశగా కీలక చర్యలను సెబీ ప్రతిపాదించింది. వీటి ప్రకారం ఇకమీదట అ.. ధీకృత యూజర్లే వారి ట్రేడింగ్ ఖాతాలోకి లాగిన్ అవ్వగలరు. యూనిక్ క్లయింట్ కోడ్ (యూసీసీ)–డివైజ్–సిమ్ ఈ మూడింటితో కూడిన సిమ్ బైండింగ్ విధానాన్ని తీసుకురావాలన్నది సెబీ ప్రతిపాదన. యూపీఐ యాప్ అన్నది ఒక మొబైల్‌లో ఒకే యూజర్‌తో ఎలా అనుసంధానం అయి ఉంటుందో.. ట్రేడింగ్/డీమ్యాట్ ఖాతా సైతం యూజర్ మొబైల్‌తో అనుసంధానమై ఉంటుంది. యూపీఐ లావాదేవీల సమయంలో యూపీఐ అప్లికేషన్ క్లయింట్ సిమ్, మొబైల్ డివైజ్, వారి బ్యాంక్ ఖాతాలను గుర్తించిన తర్వాతే ప్రాసెస్ చేస్తుంది. అదే మాదిరిగా ట్రేడింగ్ అప్లికేషన్ సైతం యూజర్ యూసీసీ, సిమ్, మొబైల్ డివైజ్ నిజమైనవని ధ్రువీకరించుకున్న తర్వాతే లాగిన్‌కు వీలు కల్పిస్తుంది. యూనిక్ క్లయింట్ కోడ్‌కు క్లయింట్ మొబైల్ నంబర్, డివైజ్ ఐఎంఈఐ నంబర్‌ను లింక్ చేయడాన్ని సెబీ ప్రతిపాదించింది. డెస్క్‌టాప్‌లు, ల్యాప్‌టాప్‌ల ద్వారా లాగిన్ అవ్వాలంటే.. సోషల్ మీడియా యాప్‌ల మాదిరే టైమ్ సెన్సిటివ్ అండ్ ప్రాక్సిమిటీ సెన్సిటివ్ క్యూఆర్ కోడ్ ఆథెంటికేషన్ ద్వారే చేయాల్సి వస్తుంది. అలాగే, ట్రేడింగ్ యాప్‌లోకి బయోమెట్రిక్ ధ్రువీకరణతోనే లాగిన్ కావాల్సి ఉంటుంది. ఈ ప్రతిపాదనలపై సలహా, సూచనలను మార్చి 11 లోపు తెలియజేయాలని సెబీ కోరింది.

క్యూ3లో 6.4 శాతం వృద్ధి: ఇక్రా

- పెరిగిన ప్రభుత్వ మూలధన వ్యయాలు
- పుంజుకున్న వస్తు, సేవల ఎగుమతులు
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో జీడీపీ 6.4 శాతం వృద్ధిని నమోదు చేయొచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. ప్రభుత్వ వ్యయాలు పెరగడం ఇందుకు సాయపడుతుందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో జీడీపీ 6.7 శాతం వృద్ధిని నమోదు చేయగా, జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో 5.4 శాతానికి పడిపోవడం గమనార్హం. గతేడాది సాధారణ ఎన్నికల ముందు ప్రభుత్వం అంచనాల మేరకు మూలధన వ్యయాలు చేయలేకపోవడం, డిమాండ్ బలహీనత ఇందుకు దారితీశాయి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు మూలధన, రెవెన్యూ వ్యయాలు పెంచడం, సేవల ఎగుమతుల్లో అధిక వృద్ధి, వస్తు ఎగుమతులు పుంజుకోవడం, ప్రధాన ఖరీఫ్ పంటల దిగుబడి మెరుగ్గా ఉండడం డిసెంబర్ త్రైమాసికంలో భారత ఆర్థిక పనితీరు బలపడేందుకు దోహదం చేస్తాయని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ వివరించారు. మొత్తం మీద క్యూ3లో జీడీపీ, జీవీఏ విస్తరణ కొనసాగుతుందన్నారు. పెట్టుబడులకు సంబంధించి సంకేతాల్లో వృద్ధి కనిపిస్తున్నట్టు ఇక్రా తన నివేదికలో పేర్కొంది. ప్రభుత్వాల మూలధన వ్యయాలు ఆరు త్రైమాసికాల గరిష్ట స్థాయి 47.7 శాతానికి క్యూ3లో పెరిగినట్టు, అంతకుముందు త్రైమాసికంలో ఇది 10.3 శాతంగా ఉన్నట్టు వెల్లడించింది. క్యూ3 జీడీపీ వృద్ధి అంచనాలు ఈ నెల 28న విడుదల కానున్నాయి. అలాగే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో ముందస్తు జీడీపీ అంచనాలను సైతం ఎన్ఎస్‌వో ప్రకటించనుంది. జనవరిలో విడుదల చేసిన తొలి అంచనాల ప్రకారం 2024–25లో వృద్ధి నాలుగేళ్ల కనిష్టం 6.4 శాతానికి తగ్గనుంది. కానీ, ఆర్‌బీఐ మాత్రం 6.6 శాతం వృద్ధిని అంచనా వేస్తోంది.

పీఎన్‌బీలో రూ. 271 కోట్ల ఫ్రాడ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంకులో (పీఎన్‌బీ) మరో మోసం వెలుగు చూసింది. ఒరిస్సాకు చెందిన గుప్తా పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ రు. 271 కోట్ల మేర రుణం తీసుకుని, ఫ్రాడ్‌కి పాల్పడినట్లు బ్యాంకు తెలిపింది. ఈ ఖాతాను మొండిపద్దుగా (ఎన్‌పీఏ) వర్గీకరించి రిజర్వ్ బ్యాంక్ దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించింది. ఇప్పటికే ఈ మొత్తానికి ప్రొవిజనింగ్ చేసినట్లు బ్యాంకు పేర్కొంది. డిసెంబర్ త్రైమాసికంలో పీఎన్‌బీ నికర లాభం రూ. 2,223 కోట్ల నుంచి రూ. 4,508 కోట్లకు చేరింది. ఆదాయం రూ. 29,962 కోట్ల నుంచి రూ. 34,752 కోట్లకు ఎగిసింది.

ఎయిర్‌టెల్ షేర్లు విక్రయించిన సునీల్ మిట్టల్ ఫ్యామిలీ ఆఫీస్

విలువ రూ. 8,485 కోట్లు



న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం సునీల్ మిట్టల్‌కి చెందిన ఫ్యామిలీ ఆఫీస్ ఇండియన్ కాంటినెంట్ ఇన్వెస్ట్‌మెంట్ (ఐసీఐఎల్) బ్లాక్ డీల్ కింద భారతి ఎయిర్‌టెల్‌లో 5.11 కోట్ల షేర్లను విక్రయించింది. వీటి విలువ సుమారు రూ. 8,485 కోట్లు. ఇందులో 1.2 కోట్ల షేర్లను భారతి ఎయిర్‌టెల్ ప్రమోటర్ సంస్థ భారతి టెలికం కొనుగోలు చేసింది. దీంతో కంపెనీలో భారతి టెలికం వాటా 40.33 శాతం నుంచి 40.47 శాతానికి పెరిగింది. మరోవైపు, ఎస్ఈఏ–ఎంఈ–డబ్ల్యూఈ–6 కేబుల్‌ను చెన్నైలో విజయవంతంగా ల్యాండ్ చేసినట్లు భారతి ఎయిర్‌టెల్ తెలిపింది. దాదాపు 21,700 ఆర్‌కేఎం పొడవున వేసిన ఈ సబ్‌మెరైన్ కేబుల్.. భారత్‌ను సింగపూర్, ఫ్రాన్స్‌కి అనుసంధానిస్తుందని పేర్కొంది.

అజహరుద్దీన్ అదరహో


అజహరుద్దీన్

అజేయ సెంచరీ చేసిన కేరళ బ్యాటర్

మరోసారి మెరిసిన సల్మాన్ నిజర్ | తొలి ఇన్నింగ్స్‌లో కేరళ 418/7 | తేలిపోయిన గుజరాత్ బౌలర్లు

అహ్మదాబాద్: పసలేని గుజరాత్ బౌలింగ్‌పై కేరళ బ్యాటర్లు ఆధిపత్యం కనబరుస్తున్నారు. రెండో రోజు ఆటలో ఓవర్‌నైట్ బ్యాటర్ మొహమ్మద్ అజహరుద్దీన్ (303 బంతుల్లో 149 బ్యాటింగ్; 17 ఫోర్లు) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. సల్మాన్ నిజర్ (202 బంతుల్లో 52; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. రెండు రోజుల్లో గుజరాత్ బౌలర్లలో ఏ ఒక్కరు కూడా ప్రభావం చూపలేకపోయారు. 177 ఓవర్లు వేసిన గుజరాత్ 7 వికెట్లనే పడగొట్టింది. మంగళవారం అజహరుద్దీన్, సల్మాన్‌ల జోడీ క్రీజులో పాతుకుపోవడంతో రోజంతా కష్టపడిన గుజరాత్ బౌలర్లకు మూడే వికెట్లు దక్కాయి. ఓవర్‌నైట్ స్కోరు 206/4తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కేరళ అదే స్కోరు వద్ద కెప్టెన్ సచిన్ బేబీ (69; 8 ఫోర్లు) వికెట్‌ను కోల్పోయింది. కీలకమైన వికెట్‌ను తీశామన్న ఆనందం లేకుండా సల్మాన్... ఓవర్‌నైట్ బ్యాటర్ అజహరుద్దీన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఇద్దరు కూడా ఏమాత్రం అనవసర షాట్‌ల జోలికి వెళ్లకుండా నింపాదిగా పరుగులు జత చేశారు. దీంతో మొదటి సెషన్‌లో మరో వికెట్ పడకుండా కేరళ 293/5 స్కోరు వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. తర్వాత జట్టు స్కోరు 300 పరుగులు దాటింది. ఇద్దరు జిడ్డుగా ఆడటంతో గుజరాత్ బౌలర్లకు ఆలసటే తప్ప వికెట్ల ఓదార్పు దక్కనే లేదు. ఈ క్రమంలో అజహరుద్దీన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో రెండో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. డ్రింక్స్ విరామం తర్వాత సల్మాన్ అర్ధశతకం సాధించాడు. ఈ రెండో సెషన్‌లోనూ వీళ్లిద్దరి ఆటే కొనసాగడంతో గుజరాత్ శిబిరానికి వికెట్ సంబరమే లేకుండాపోయింది. ఎట్టకేలకు ఆఖరి సెషన్ ఊరటనిచ్చింది. ఇందులో రెండు వికెట్లు పడగొట్టగలిగింది. సల్మాన్‌ను విశాల్ జైస్వాల్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో ఆరో వికెట్‌కు 149 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ తర్వాత వచ్చిన అహమ్మద్ ఇమ్రాన్ (66 బంతుల్లో 24; 3 ఫోర్లు) కూడా గుజరాత్ బౌలర్లను ఇబ్బంది పెట్టాకే నిష్క్రమించాడు. ఆదిత్య సర్వతే (10 బ్యాటింగ్; 1 ఫోర్)తో వచ్చాక అజహరుద్దీన్ జట్టు స్కోరును 400 దాటించాడు. ఆటనిలిచే సమయానికి ఇద్దరు అజేయంగా నిలిచారు. అర్జాన్‌కు 3 వికెట్లు దక్కాయి.

స్కోరు వివరాలు

కేరళ తొలి ఇన్నింగ్స్: అక్షయ్ (రనౌట్) 30; రోహన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రవి బిష్ణోయ్ 30; వరుణ్ (సి) ఉర్విల్ (బి) ప్రియజీత్‌సింగ్ 10; సచిన్ (సి) ఆర్య దేశాయ్ (బి) అర్జాన్ 69; జలజ్ సక్సేనా (బి) అర్జాన్ 30; అజహరుద్దీన్ (బ్యాటింగ్) 149; సల్మాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) విశాల్ 52; ఇమ్రాన్ (సి) ఉర్విల్ (బి) అర్జాన్ 24; ఆదిత్య (బ్యాటింగ్) 10; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (177 ఓవర్లలో 7 వికెట్లకు) 418. వికెట్ల పతనం:** 1-60, 2-63, 3-86, 4-157, 5-206, 6-355, 7-395. **బౌలింగ్:** చింతన్ గజా 28-8-57-0, అర్జాన్ 29-8-64-3, ప్రియజీత్ సింగ్ 21-2-58-1, జైమీత్ 13-1-46-0, రవి బిష్ణోయ్ 30-7-74-1, సిద్ధార్థ్ దేశాయ్ 33-13-49-0, విశాల్ జైస్వాల్ 22-5-57-1, ఆర్య దేశాయ్ 1-0-3-0.

'నమ్మకం కోల్పోయాం'

- 'వాడా' 'ఐటీఐఏ'లపై అసంతృప్తి వెలిబుచ్చిన జొకోవిచ్
- సినెర్ కేసులో సహేతుకంగా వ్యవహరించలేదన్న సెర్బియా స్టార్



దోహా: ప్రపంచ టెన్నిస్ నంబర్‌వన్ యానిక్ సినెర్ డోపింగ్ ఉదంతం... ఇటీవలే అతనికి విధించిన శిక్షపై సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశాడు. అంతర్జాతీయ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ (ఐటీఐఏ), ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా)లు రెండూ పక్షపాత ధోరణితో వ్యవహరించాయని 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల చాంపియన్ బాహాటంగా తన అసంతృప్తిని వెలిబుచ్చాడు. 'తాజా ఘటనతో టెన్నిస్ ప్లేయర్లంతా నమ్మకం కోల్పోయారు. ఎందుకంటే ఇటు ఐటీఐఏ కానీ, అటు 'వాడా' కానీ సహేతుకంగా వ్యవహరించలేదు. నిష్పక్షపాత వైఖరి కనబరచలేదు. ఈ రెండు సంస్థల తీరు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కానేకాదు. కచ్చితంగా ఒక విషయాన్ని చెప్పాలనుకుంటున్నా... టెన్నిస్ క్రీడ ఇమేజ్‌ను దిగజార్చేలా వ్యవహరించాయి. సుదీర్ఘకాలంగా నానుతున్న సినెర్ డోపింగ్ ఉదంతానికి కంటితుడుపు శిక్షతో పలికిన ముగింపు అసమంజసంగా ఉంది. ఎందుకంటే నేను ఈ విషయమై చాలా మంది ప్లేయర్లతో మాట్లాడాను. వారి అభిప్రాయలను నాతో పంచుకున్నారు. వాళ్లందరు కూడా రెండుసార్లు పట్టుబడిన సినెర్‌కు విధించిన మూడు నెలల శిక్షపై అసంతృప్తిగా ఉన్నారు' అని జొకోవిచ్ అన్నాడు. 'సినెర్-ఐటీఐఏ-వాడా'ల మధ్య కుదిరిన ఒప్పందం జరిగిన తప్పిదానికి తగిన శిక్షను ఖరారు చేయలేకపోయిందని పెదవి విరిచాడు. సినెర్‌లాగే రెండు నమూనాల్లో పాజిటివ్‌గా తేలిన స్పానిష్ మహిళా ఫిగర్ స్కేటర్ లౌరా బార్కెలోపై 'వాడా' ఏకంగా ఆరేళ్ల నిషేధం తాజాగా తెరపైకి వచ్చింది. క్రీడాలోకంలో చర్చనీయాంశమైంది.

'వాడా' వివరణ ఇది...

మాడ్రిడ్: డోపింగ్‌లో దొరికిన టెన్నిస్ స్టార్ సినెర్‌కు, స్పెయిన్ స్కేటర్ లౌరా బార్కెరోలకు వేర్వేరు శిక్షలు విధించడంపై 'వాడా' వివరణ ఇచ్చింది. 'ఇద్దరి నమూనాల్లో పాజిటివ్‌గా తేలినప్పటికీ లౌరా తన శరీరంలోకి నిషిద్ధ ఉత్ప్రేరకాలు ఎలా ప్రవేశించాయో సరైన కారణాన్ని చెప్పలేకపోయింది. ఈ కారణాన్ని బలపరిచే రుజువు (సాక్ష్యం)ను చూపించలేదు. కానీ సినెర్ కావాలని తీసుకోలేదని, బహుశా తాను తీసుకున్న మెడిసిన్ లేదంటే మసాజ్‌కు వాడిన తైలం రూపంలో తన శరీరంలోకి ప్రవేశించి ఉండొచ్చని తను వాడిన మెడిసిన్‌లతో సహా సంజాయిషీ ఇచ్చాడు' అని 'వాడా' తెలిపింది.



బెన్ కరన్ అజేయ శతకం

చివరి వన్డేలో ఐర్లాండ్‌పై జింబాబ్వే ఘనవిజయం ● సిరీస్ 2-1తో సొంతం

హరారే: ఐర్లాండ్‌తో జరిగిన చివరిదైన మూడో వన్డేలో జింబాబ్వే ఓపెనర్ బెన్ కరన్ (130 బంతుల్లో 118 నాటౌట్; 14 ఫోర్లు) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. దీంతో 9 వికెట్ల తేడాతో జయభేరి మోగించిన జింబాబ్వే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన జింబాబ్వే ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఓపెనర్ ఆండీ బాల్బిర్నీ (99 బంతుల్లో 64; 4 ఫోర్లు, 1 సిక్స్), మిడిలార్డర్‌లో లోర్కన్ టక్కర్ (54 బంతుల్లో 61; 7 ఫోర్లు), హ్యారి టెక్టర్ (84 బంతుల్లో 51; 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు సాధించారు. ప్రత్యర్థి బౌలర్లలో రిచర్డ్ ఎన్‌గరవ, ట్రెవర్ వాండు చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన జింబాబ్వే 39.3 ఓవర్లలోనే వికెట్ మాత్రమే కోల్పోయి 246 పరుగులు చేసి గెలిచింది. బ్రియాన్ బెన్నెట్ (48 బంతుల్లో 48; 6 ఫోర్లు) ఇన్నింగ్స్ ప్రారంభించిన బెన్ కరన్ తొలి వికెట్‌కు 124 పరుగులు జోడించి చక్కని శుభారంభం ఇచ్చాడు. తర్వాత కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (59 బంతుల్లో 69 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కలిసి అబేధ్యమైన రెండో వికెట్‌కు 122 పరుగులు జోడించాడు. ఈ క్రమంలో 120 బంతుల్లో కరన్ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. ఈ నెల 22, 23, 25 తేదీల్లో ఇరుజట్ల మధ్య హరారే వేదికగా మూడు టి20ల సిరీస్ జరుగుతుంది.


నేను రాజీనామా చేయలేదు


ఐఓఏ అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్ మేరీకోమ్ వివరణ




న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్, దిగ్గజ మహిళా బాక్సర్ మేరీకోమ్ తన పదవికి రాజీనామా చేయలేదని స్పష్టం చేసింది. పదవీకాలం ముగిసేవరకు బాధ్యతలు కొనసాగిస్తానని చెప్పింది. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఆమె 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం కూడా గెలుచుకుంది. 42 ఏళ్ల ఈ మణిపురి స్టార్ బాక్సర్ ఇటీవల డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ క్రీడల ముగింపు కార్యక్రమంలో పాల్గొంది. ఆ సమయంలో ఆమె అథ్లెట్స్ కమిషన్ పదవిపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు నెట్టింట ప్రచారం జరిగింది. కానీ మేరీ మాత్రం తన వాట్సాప్ గ్రూప్ సంభాషణను తప్పుగా అన్వయిస్తూ మీడియాకు లీక్ చేశారని, రాజీనామా చేసినట్లు కూడా ప్రచారం చేశారని పేర్కొంది. 'నేను అథ్లెట్స్ కమిషన్‌కు రాజీనామా చేయనేలేదు. 2026లో పూర్తయ్యే పదవీకాలం వరకు చైర్‌పర్సన్‌గా కొనసాగుతాను. ఆ రోజు నేను కమిషన్ సభ్యులతో అన్నది వేరు... నెట్టింట ప్రచారమైంది వేరు. అథ్లెట్స్ కమిషన్ సభ్యులు తమ పద్ధతి మార్చుకోవాలని సూచించాను. తనతో ప్రవర్తించే తీరు ఇలాగే కొనసాగితే రాజీనామాకు సైతం వెనుకాడనని చెప్పాను. కానీ రాజీనామా చేశానని చెప్పనే లేదు. నేను రాజీనామా చేశానంటున్నారు కదా! మరి రాజీనామా లేఖ ఏది? ఎవరైనా చూశారా? అని ప్రశ్నించింది. ఐఓఏ తన కుటుంబమని... దీంతో ఎప్పుడు విబేధించనని... ఇంతటితో వాట్సాప్ సంభాషణ వివాదానికి ముగింపు పలుకుతున్నానని చెప్పారు. 2022లో ఐఓఏ అథ్లెట్స్ కమిషన్‌కు మేరీకోమ్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైంది. టేబుల్ టెన్నిస్ స్టార్ అచంట శరత్ కమల్ వైస్ చైర్మన్‌గా ఉన్నారు. ఇంకా ఈ కమిషన్‌లో రెండు ఒలింపిక్ పతకాల విజేత పీవీ సింధు, మాజీ షాట్‌పుటర్ ఓం ప్రకాశ్ కర్హాన, ఒలింపియన్ శివ కేశవన్, లండన్ ఒలింపిక్స్ కాంస్య విజేత, షూటర్ గగన్ నారంగ్ (షూటర్), రోయర్ బజరంగ్ లాల్, ఫెన్సింగ్ ప్లేయర్ భవానీ దేవి, భారత మహిళల హాకీ మాజీ కెప్టెన్ రాణి రాంపాల్, టోక్యో ఒలింపిక్స్ రజత విజేత మీరాబాయి చాను సభ్యులుగా ఉన్నారు.

ముంబై ఎదురీత


శివమ్ దూబే


సూర్యకుమార్


రహానే


విదర్భ జట్టు సభ్యులు

తొలి ఇన్నింగ్స్‌లో ప్రస్తుతం 188/7

- 5 పరుగుల తేడాలో 4 వికెట్లు కోల్పోయిన డిఫెండింగ్ చాంపియన్
- రెండో రోజూ విదర్భదే ఆధిపత్యం
- తొలి ఇన్నింగ్స్‌లో 383 ఆలౌట్

నాగ్‌పూర్: రంజీ ట్రోఫీలో ముంబై మేటి చాంపియన్ జట్టు. దేశవాళీ టోర్నీలో ఏకంగా 48 సార్లు ఫైనల్ చేరి 42 సార్లు విజేతగా నిలిచిన ఈ జట్టుకు ఈసారి సెమీఫైనల్లో విదర్భ నుంచి కఠిన సవాళ్లు ఎదురవుతున్నాయి. తొలి రోజు బ్యాటింగ్‌లో సత్తా చాటుకున్న విదర్భ... రెండో రోజు బౌలింగ్‌తో ముంబైని ముప్పుతిప్పలు పెట్టింది. ఫలితంగా డిఫెండింగ్ చాంపియన్ ఎదురీదుతోంది. ముందుగా ఓవర్‌నైట్ స్కోరు 308/5తో రెండోరోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విదర్భ 107.5 ఓవర్లలో 383 పరుగుల వద్ద ఆలౌటైంది. క్రితం రోజు బ్యాటర్లలో యశ్ రాథోడ్ (54; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ పూర్తిచేసుకొని వెనుదిరిగాడు. కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (34; 4 ఫోర్లు) కాసేపు కుదురుగా ఆడాడు. హర్ష్ దూబే (18; 3 ఫోర్లు), నచికేత్ (11; 2 ఫోర్లు), దర్శన్ నల్కండే (12; 2 ఫోర్లు) రెండంకెల స్కోర్లు చేశారు. రెండో రోజు 3 వికెట్లు పడగొట్టిన శివమ్ దూబేకు మొత్తం 5 వికెట్లు దక్కాయి. తర్వాత తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ముంబై ఆట ముగిసే సమయానికి 59 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 188 పరుగులు సాధించింది. ఓపెనర్ ఆకాశ్ ఆనంద్ (171 బంతుల్లో 67 బ్యాటింగ్; 6 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీతో రాణించాడు. శార్దుల్ ఠాకూర్ (37; 4 ఫోర్లు, 1 సిక్స్), సిద్ధేశ్ లాడ్ (35; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. ఫాలోఆన్ గండాన్ని తప్పించుకున్న ముంబై జట్టు విదర్భ స్కోరుకు ఇంకా 195 పరుగులు వెనుకబడి ఉంది. ముంబై ఒక దశలో 113/2 స్కోరు వద్ద పటిష్టంగా ఉంది. కేవలం రెండో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడుతున్న పార్థ్ రెఖాడే తన స్పిన్ మాయాజాలంతో ముంబైని కష్టాల్లోకి నెట్టాడు. అనుభవజ్ఞుడైన భారత మాజీ కెప్టెన్, ప్రస్తుత ముంబై సారథి అజింక్య రహానే (18; 4 ఫోర్లు) సహా టీమిండియా హార్డ్‌హిట్టర్లు సూర్యకుమార్ యాదవ్ (0), శివమ్ దూబే (0)లను అసలు ఖాతానే తెరువనీయలేదు. ఒకే ఒక్క ఓవర్లో ఈ ముగ్గురినీ పార్థ్ అవుట్ చేశాడు. ఇన్నింగ్స్ 41వ ఓవర్ వేసిన పార్థ్ తొలి బంతికి రహానేను, మూడు, ఐదో బంతులకు సూర్య, దూబేలను బోల్తా కొట్టించాడు. ఇది చాలదన్నట్లు మరుసటి ఓవర్లోనే (42వ) హర్ష్ దూబే... షమ్స్ ములానీ (4) అవుట్ కావడంతో ముంబై 113/2 నుంచి 10 బంతుల వ్యవధిలోనే 118/6 స్కోరుతో కుదేలైంది. ఆనంద్, శార్దుల్ మెరుగ్గా ఆడటంతో ముంబై కోలుకుంది. ప్రస్తుతం ఆనంద్‌తో పాటు తనుశ్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

స్కోరు వివరాలు

విదర్భ తొలి ఇన్నింగ్స్: అథర్వ (సి) ఆనంద్ (బి) రాయ్‌స్టన్ 4; ధ్రువ్ షోరే (సి) రహానే (బి) ములానీ 74; పార్థ్ రెఖాడే (సి) సూర్యకుమార్ (బి) దూబే 23; దానిశ్ (సి) ఆనంద్ (బి) ములానీ 79; కరుణ్ నాయర్ (సి) ఆనంద్ (బి) దూబే 45; యశ్ రాథోడ్ (సి అండ్ బి) శార్దుల్ 54; అక్షయ్ (సి) ఆనంద్ (బి) రాయ్‌స్టన్ 34; హర్ష్ దూబే (సి) ఆనంద్ (బి) శివమ్ దూబే 18; నచికేత్ (సి) ములానీ (బి) శివమ్ దూబే 11; దర్శన్ (నాటౌట్) 12; యశ్ ఠాకూర్ (సి)అవస్థి (బి) శివమ్ దూబే 3; ఎక్స్‌ట్రాలు 26; **మొత్తం (107.5 ఓవర్లలో ఆలౌట్) 383. వికెట్ల పతనం:** 1-39, 2-93, 3-144, 4-222, 5-261, 6-324, 7-346, 8-364, 9-369, 10-383. **బౌలింగ్:** శార్దుల్ 19-0-78-1, మోహిత్ 14-2-61-0, రాయ్‌స్టన్ డయస్ 18-5-48-2, తనుశ్ 22-0-78-0, శివమ్ దూబే 11.5-1-49-5, షమ్స్ ములానీ 23-4-62-2.

ముంబై తొలి ఇన్నింగ్స్: ఆయుశ్ (సి) దానిశ్ (బి) దర్శన్ 9; ఆకాశ్ ఆనంద్ (బ్యాటింగ్) 67; సిద్ధేశ్ (బి) యశ్ ఠాకూర్ 35; రహానే (బి) పార్థ్ 18; సూర్యకుమార్ (సి) దానిశ్ (బి) పార్థ్ 0; శివమ్ దూబే (సి) అథర్వ (బి) పార్థ్ 0; షమ్స్ ములానీ (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్ష్ దూబే 4; శార్దుల్ (సి) దర్శన్ (బి) యశ్ ఠాకూర్ 37; తనుశ్ (బ్యాటింగ్) 5; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (59 బంతుల్లో 7 వికెట్లకు) 188. వికెట్ల పతనం:** 1-18, 2-85, 3-113, 4-113, 5-113, 6-118, 7-178. **బౌలింగ్:** దర్శన్ నల్కండే 10-1-40-1, యశ్ ఠాకూర్ 11-0-56-2, హర్ష్ దూబే 15-1-51-1, నచికేత్ 7-1-22-0, పార్థ్ రెఖాడే 16-6-16-3.

మానస్ ఓటమి

పుణే: మహా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారులకు నిరాశ ఎదురైంది. మంగళవారం జరిగిన మెయిన్ 'డ్రా' తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో భారత యువతారలు మానస్ ధామ్నె, ఆర్యన్ షా ఓటమి చవిచూశారు. 19 ఏళ్ల ఆర్యన్ 2-6, 2-6తో బ్రాండన్ హోల్ట్ (అమెరికా) చేతిలో... మానస్ 4-6, 4-6తో బిల్లీ హ్యారిస్ (బ్రిటన్) చేతిలో పరాజయం పాలయ్యారు.



చమరి ముందుగానే...

డబ్ల్యూపీఎల్ చివరి దశ మ్యాచ్‌లకు శ్రీలంక స్టార్ దూరం

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో యూపీ వారియర్స్ జట్టుకు ఆడుతున్న శ్రీలంక స్టార్ ఆల్‌రౌండర్ చమరి ఆటపట్టు చివరి దశ మ్యాచ్‌లకు దూరం కానుంది. మార్చి 4 నుంచి 18 వరకు న్యూజిలాండ్‌తో న్యూజిలాండ్‌లో జరిగే మూడు వన్డేలు, మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొనే శ్రీలంక జట్టుకు చమరి కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఈ నేపథ్యంలో ఈనెల 26న ముంబై ఇండియన్స్‌తో జరిగే మ్యాచ్ తర్వాత చమరి యూపీ వారియర్స్ జట్టును వీడి న్యూజిలాండ్‌కు బయలుదేరుతుంది. డబ్ల్యూపీఎల్ చరిత్రలో నాలుగు మ్యాచ్‌లు ఆడిన చమరి 28 పరుగులు చేయడంతోపాటు మూడు వికెట్లు తీసుకుంది. మరోవైపు ముంబై ఇండియన్స్ జట్టుకు ఆడుతున్న న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్ అమెలియా కెర్ మాత్రం డబ్ల్యూపీఎల్ పూర్తి సీజన్ ఆడుతుంది. శ్రీలంకతో జరిగే సిరీస్‌లో అమెలియా కెర్ పోటీపడటం లేదు.



ఫెర్గూసన్ స్థానంలో జేమీసన్



కరాచీ: చాంపియన్స్ ట్రోఫీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే న్యూజిలాండ్ జట్టులో ఒక మార్పు చోటు చేసుకుంది. గాయం కారణంగా ఈ టోర్నీకి దూరమైన పేసర్ లాకీ ఫెర్గూసన్ స్థానంలో మరో పేస్ బౌలర్ కైల్ జేమీసన్ జట్టులోకి వచ్చాడు. ఈ మార్పునకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెక్నికల్ కమిటీ ఆమోదం తెలిపింది. 30 ఏళ్ల జేమీసన్ న్యూజిలాండ్ తరఫున 13 వన్డేలు ఆడి 14 వికెట్లు పడగొట్టాడు. జేమీసన్ చివరి వన్డే 2023లో బంగ్లాదేశ్‌పై ఆడాడు.

గాజాకు గూడు సాయం



మొబైల్ గృహాలను గాజాకు చేరవేసేందుకు మంగళవారం రఫా క్రాసింగ్ వద్ద వేచిచూస్తున్న ఈజిప్టు వాహనాలు. ఇజ్రాయెల్ యుద్ధంతో సర్వం కోల్పోయిన గాజాను పునర్నిర్మించే ప్రాజెక్టులో భాగంగా ఈజిప్టు ఈ గృహాలను సరఫరా చేస్తోంది.

సాగరతీరం.. సంగీత త్రయం



మంగళవారం ముంబైలోని మెరైన్ డ్రైవ్ తీరంలో ప్రఖ్యాత కీబోర్డు నిపుణుడు సంగీత్ హల్దీపూర్, పర్కషనిస్ట్ త్రిలోక్ గుర్తు, డ్రమ్మర్ గినో బాంక్స్ మధ్య సరదా సన్నివేశం. ముంబై డ్రమ్ డే కార్యక్రమం కోసం వారిలా చాలాసేపటిదాకా రిహార్సల్స్‌లో మునిగితేలారు.

బుల్లెట్టు బండెక్కి...



మంగళవారం వారణాసిలోని దశాశ్వమేధ్ ఘాట్ సమీపంలో బుల్లెట్‌పై వెళ్తున్న శ్రీ పంచదశనామ్ ఆవాహన్ అఖాడాకు చెందిన సాధువు. అక్కడివారంతా ఆయనను ఆసక్తిగా చూడటమే గాక ఉత్సాహంగా కెమెరాల్లో బంధించారు.

హారిస్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

వాషింగ్టన్: అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు ప్రతిష్టాత్మక ఎన్‌ఏఏసీపీ చైర్మన్ అవార్డు దక్కింది. అమెరికాకు ఉపాధ్యక్షురాలిగా, ఆ ఘనత సాధించిన తొలి ఆసియా మూలాలున్న వ్యక్తిగా, తొలి నల్లజాతీయురాలిగా ఆమె పలు రికార్డులు సృష్టించడం తెలిసిందే. అంతకుముందు కాలిఫోర్నియా అటార్నీ జనరల్‌గా, అక్కడినుంచి సెనేటర్‌గా కూడా ఆమె పనిచేశారు. ''హారిస్ నాయకురాలు మాత్రమే కాదు. అందరికీ ఉజ్వలమైన, సమానత్వంతో కూడిన భవిష్యత్తును అందించడానికి, మార్పుకోసం న్యాయం, సమానత్వం, సమాజ శ్రేయస్సు కోసం ఎనలేని కృషి చేశారు. ఆమె అంకితభావానికి గుర్తుగా, చైర్మన్ అవార్డును ప్రదానం చేయడం గౌరవంగా భావిస్తున్నాం''అని ఎన్‌ఏఏసీపీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తదితరులు గతంలో ఈ అవార్డు అందుకున్నారు.

సుకేశ్‌కు సుప్రీంలో ఎదురుదెబ్బ

మరో జైలుకు మార్చాలన్న పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: ఢిల్లీలోని మండోలి జైలు నుంచి మరో చోటుకు మార్చాలంటూ మోసగాడు సుకేశ్ చంద్రశేఖర్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఉన్న పంజాబ్, ఢిల్లీ మినహా మిగతా ప్రాంతాల్లోని ఏదైనా జైలుకు తరలించాలన్న పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ బేలా ఎం త్రివేదీ, జస్టిస్ పీబీ వరాలేల ధర్మాసనం విచారణ చేపట్టింది. గతంలోనూ ఇలాంటి పిటిషన్లనే తాము తిరస్కరించినట్లు ధర్మాసనం ఈ సందర్భంగా గుర్తు చేసింది. కారణాంశాలు మార్చినంత మాత్రాన ఈ పిటిషన్‌ను పరిశీలించబోమని స్పష్టం చేసింది. మండోలి జైలులో భద్రత లేదంటూ ఢిల్లీ ప్రభుత్వంపై ఆరోపణలు చేసినందున ఆ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తున్నామంది. 'ఖర్చు చేసేందుకు చాలినంత డబ్బు మీ వద్ద ఉండొచ్చు. పదేపదే ఒకే అంశంపై పిటిషన్లు వేయడమంటే చట్ట ప్రక్రియను మీరు దుర్వినియోగం చేయడమే అవుతుంది'అని వ్యాఖ్యానించింది. సుకేశ్ చంద్రశేఖర్ తరఫు సీనియర్ లాయర్ షోయబ్ ఆలం వాదనలు వినిపిస్తూ..రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం పిటిషనర్‌ను కుటుంబానికి దూరంగా ఎలా ఉంచుతారని ప్రశ్నించారు. కనీసం కర్ణాటక జైలుకైనా ఆయన్ను బదిలీ చేయాలని కోరారు. 'మీరు సుకేశ్ భద్రతను ఆలోచిస్తుంటే, మేం సమాజం గురించి, సమాజ శ్రేయస్సు గురించీ ఆలోచిస్తున్నాం. మీ ప్రాథమిక హక్కుల కోసం ఇతరుల హక్కులకు భంగం కలిగించలేం. మండోలి జైలు అధికారులపై అతడు ఎలాంటి ఆరోపణలు చేశాడో చూడండి'అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌కు లంచమిచ్చినట్లు, ఆప్‌కు రూ.50 కోట్లు విరాళమిచ్చినట్లు అతడు ఆరోపించడం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తన బ్యారెక్ వద్ద రెండు నిఘా కెమెరాలను పెట్టారని, ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని బెదిరింపులు వస్తున్నాయని సుకేశ్ తన పిటిషన్‌లో తెలిపాడు. మనీలాండరింగ్‌తో పాటు పలువురిని మోసం చేసినట్లు ఆరోపణలను ఎదుర్కొంటున్న సుకేశ్, అతడి భార్య ప్రస్తుతం మండోలి జైలులో ఉన్నారు. తిహార్ జైలులో ఉండగా సుకేశ్ భద్రత లేదని ఆరోపించడంతో అధికారులు మండోలి జైలుకు తీసుకువచ్చారు.

చొరబాట్లకు మమత ఊతం

ప్రతిపక్ష నేత సువేందు అధికారి ఆరోపణ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీపై అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి తీవ్ర ఆరోపణలు చేశారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా సరిహద్దులు దాటి వచ్చే చొరబాటుదార్లను ఆమె ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. పొరుగుదేశం నుంచి వచ్చిన ఉగ్రవాదులు బెంగాల్‌లో స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. సీఎం తీరుతో రాష్ట్ర జనాభా తీరుతెన్నులు మారనున్నాయని ఆరోపించారు. ఆధ్యాత్మికంగా ఎంతో ముఖ్యమైన మహా కుంభ్‌ను ఆమె మృత్యు కుంభ్ అంటూ వర్ణించడం ద్వారా కోట్లాదిమంది హిందువుల మనోభావాలను దెబ్బతీశారని మండిపడ్డారు. మంగళవారం అసెంబ్లీ నుంచి సస్పెండైన అనంతరం అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'అక్రమ చొరబాటుదార్లను అస్సాం ఎస్టీఎఫ్ పట్టుకుంటే మీరు నిద్రపోతున్నారు. కోల్‌కతాలోని కొన్ని ప్రాంతాలు బంగ్లాదేశ్‌లా ఉన్నాయని స్వయంగా మీరే అన్నారు. ఒక మతం జనాభా విపరీతంగా పెరిగిపోతున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. రాష్ట్ర జనాభా తీరుతెన్నులు మారితే మీకు సంతోషమా? మీరు అలా చేయడాన్ని మేం ఒప్పుకోం. హిందువుల బలమేంటో చూపిస్తాం'అని అధికారి హెచ్చరించారు.

రుజువు చేస్తే రాజీనామా చేస్తా: మమత

బంగ్లాదేశ్‌లోని అతివాదులు, ఉగ్రవాదులతో తనకు సంబంధాలున్నాయంటూ బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపించడంపై సీఎం మమత మండిపడ్డారు. చేతనైతే రుజువు చేయాలని వారికి సవాల్ విసిరారు. ఆధారాలు చూపిస్తే పదవికి రాజీనామా చేస్తానన్నారు. తప్పుడు ఆరోపణలు చేయడం కంటే చావడం మేలని వ్యాఖ్యానించారు. బీజేపీ ఎమ్మెల్యేల నిరాధార ఆరోపణల విషయమై ప్రధాని మోదీకి లేఖ రాస్తానన్నారు.

బంగ్లా సరిహద్దులోని చచార్‌లో రాత్రి కర్ఫ్యూ

సిల్చార్: తీవ్రవాద శక్తులు, స్మగ్లర్ల కదలికలను నివారించే లక్ష్యంతో భారత్‌–బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని అస్సాం రాష్ట్రం చచార్ జిల్లాలో రాత్రి కర్ఫ్యూ అమల్లోకి వచ్చింది. శాంతిభద్రతలను కాపాడేందుకు కఠిన నిబంధనలను అమల్లోకి తెస్తూ చచార్ జిల్లా మేజిస్ట్రేట్ మృదుల్ యాదవ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సరిహద్దులకు కిలోమీటర్ పరిధిలో సూర్యాస్తమయం నుంచి సూర్యోదయం వరకు రెండు నెలలపాటు ఇవి అమల్లో ఉంటాయని తెలిపారు. ఈ సమయంలో భారత భూభాగంలోని సుర్మా నది ఒడ్డున ఎవరూ సంచరించరాదని, అనుమతులున్న స్థానిక మత్స్యకారులు మాత్రమే చేపలు పట్టుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఉండే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నిబంధనలు వర్తించవని మేజిస్ట్రేట్ స్పష్టం చేశారు.

నేపాలీ విద్యార్థిని ఆత్మహత్య కేసులో ఐదుగురి అరెస్ట్

భువనేశ్వర్: ఒడిశాలోని భువనేశ్వర్ పట్టణంలోని ప్రైవేట్ డీమ్డ్ యూనివర్సిటీ అయిన కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ(కేఐఐటీ)లో 20 ఏళ్ల నేపాలీ బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్ట్‌చేశారు. అరెస్ట్ అయిన వారిలో కాలేజీ హెచ్‌ఆర్ విభాగ డైరెక్టర్ జనరల్, పరిపాలనా విభాగ డైరెక్టర్, హాస్టల్స్ డైరెక్టర్, ఇద్దరు సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. విద్యార్థి వేధింపుల కారణంగా కేఐఐటీ హాస్టల్‌లో ప్రకృతి లాంసాల్ అనే బీటెక్ మూడో ఏడాది విద్యార్థిని ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. దీంతో అదే కాలేజీలో విద్యనభ్యసిస్తున్న 900 మంది నేపాలీ విద్యార్థులు నిరసన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనకు అణచివేసేందుకు వర్సిటీలోని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు విచక్షణారహితంగా కొట్టడం, తర్వాత 800 మంది విద్యార్థులను హాస్టల్ ఖాళీ చేయించి పంపేయడం చర్చనీయాంశమైంది.

ఘటనలో వాస్తవాలను వెలికితీసేందుకు రాష్ట్ర హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సారథ్యంలో ముగ్గురితో నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటుచేసింది. ఉన్నత విద్యాశాఖ, మహిళా శిశు అభివృద్ధి శాఖల కార్యదర్శులు ఈ కమిటీలో ఉన్నారు. తోటి నేపాలీ అమ్మాయి చనిపోతే నిరసన తెలుపుతున్న విద్యార్థులకు సస్పెన్షన్ లేఖలు జారీచేయాల్సినంతగా కాలేజీలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయో ఈ కమిటీ ఆరాతీసి ప్రభుత్వానికి నివేదించనుంది. ఘటనపై నేపాల్ ప్రభుత్వం స్పందించింది. తమ దేశ విద్యార్థులను కలిసి విషయం తెల్సుకుని తదుపరి కార్యాచరణ కోసం ఢిల్లీలోని తమ రాయబార కార్యాలయం నుంచి ఇద్దరు అధికారులను ఒడిశాకు పంపింది. విద్యార్థుల నిర్ణయం మేరకు కుదిరితే మళ్లీ హాస్టల్‌లో చేర్పించడం లేదంటే స్వదేశానికి తీసుకెళ్లడంపై విద్యార్థులకు ఆ అధికారులు సలహాలు, సూచనలు చేస్తారు. విద్యార్థి మరణం వార్త తెల్సి నేపాల్ ప్రధాన మంత్రి కేపీ శర్మ ఓలి సైతం విచారం వ్యక్తంచేశారు.

ఎఫ్‌ఏఏ సిబ్బందికి ట్రంప్ మంగళం

వాషింగ్టన్: అమెరికా వందల మంది ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌ఏఏ) ఉద్యోగులను తొలగిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ఎఫ్‌ఏఏలో రాడార్, ల్యాండింగ్, నావిగేషన్ ఎయిడ్ మెయింటెనెన్స్ ప్రొబేషనరీ సిబ్బంది వీరిలో ఉన్నారు. శుక్రవారం నుంచి ఈ మేరకు తమకు మెయిల్స్ వచ్చినట్టు ప్రొఫెషనల్ ఏవియేషన్ సేఫ్టీ స్పెషలిస్టుల యూనియన్ అధ్యక్షుడు డేవిడ్ స్పెరో ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులను కారణం లేకుండా తొలగించారంటూ మండిపడ్డారు. అయితే ఆ 'ఎగ్జిక్యూటివ్ ఆర్డర్'మెయిల్స్ ప్రభుత్వపరంగా కాకుండా మైక్రోసాఫ్ట్ చిరునామా నుంచి వచ్చాయని చెబుతున్నారు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లను మాత్రం తొలగింపుల నుంచి మినహాయించారు. కీలకమైన భద్రతా విధులు నిర్వహించే ఉద్యోగులను కొనసాగించినట్లు రవాణా శాఖ అధికారి ఒకరు తెలిపారు.

కీలక సమయంలో తొలగింపులు...

అమెరికాలో హై ప్రొఫైల్ విమాన ప్రమాదాలు జరుగుతున్న కీలక సమయంలో తొలగింపులు జరగడం గమనార్హం. రాజధాని వాషింగ్టన్ డీసీలో ఇటీవలే అమెరికన్ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానం మిలటరీ హెలికాప్టర్‌ను ఢీకొని వాటిలో ప్రయాణిస్తున్న వారంతా చనిపోవడం తెలిసిందే. అంతకు కొద్దిరోజుల ముందే విమానయాన, విమానాశ్రయ భద్రతను పర్యవేక్షించే ఏవియేషన్ సెక్యూరిటీ అడ్వైజరీ కమిటీ సభ్యులందరినీ ట్రంప్ తొలగించారు. ఎఫ్‌ఏఏలో ఇప్పటికే కంట్రోలర్ల కొరత ఉంది. సరైన వేతనం లేకపోవడం, సుదీర్ఘ షిఫ్టులు, ఇంటెన్సివ్ ట్రైనింగ్, తప్పనిసరి రిటైర్మెంట్ల వల్ల ఈ ఉద్యోగాలకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. దాంతో కీలకమైన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో ఉద్యోగుల కొరతపై అధికారులు కొన్నేళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాపా కిల్డ్ మమ్మీ.. హ్యాంగ్‌డ్ బాడీ

- తల్లి మరణంపై బాలిక బొమ్మ
- అత్తింటివారి 'ఆత్మహత్య' కథనంపై అనుమానం

ఝాన్సీ: 'పాపా కిల్డ్ మమ్మీ, హ్యాంగ్‌డ్ బాడీ''అంటూ నాలుగేళ్ల బాలిక వేసిన బొమ్మతో ఆమె తల్లి మరణోదంతం కొత్త మలుపు తిరిగింది. తల్లిని చంపేస్తానని తండ్రి గతంలోనూ బెదిరించాడని బాలిక చెప్పింది. అంతేగాక తననూ చంపేస్తానన్నాడంది. దాంతో అత్తింటివారి 'ఆత్మహత్య'కథనాన్ని పోలీసులు అనుమానించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్‌లోని తికంగఢ్ జిల్లాకు చెందిన సోనాలికి ఝాన్సీలోని కొత్వాలీకి చెందిన సందీప్ బుధోలియాతో 2019లో వివాహమైంది. రూ.20 లక్షల కట్నమిచ్చారు. కారు అడగ్గా తమ శక్తికి మించినదని తల్లిదండ్రులు చెప్పారు. అప్పట్నుంచీ సోనాలిపై వేధింపులు మొదలయ్యాయి. నాలుగేళ్ల పాప పుట్టడంతో భర్త, అత్తామామలు సోనాలిని ఆసుపత్రిలో ఒంటరిగా వదిలేసి వెళ్లిపోయారు. సోనాలి తండ్రే ఆస్పత్రి బిల్లు చెల్లించి కూతురిని ఇంటికి తీసుకొచ్చాడు. కొంతకాలానికి అత్తింటివారు వచ్చి తల్లీకూతుళ్లను ఇంటికి తీసుకెళ్లారు. సోనాలి ఆరోగ్యం బాగాలేదంటూ భర్త ఇటీవల ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. కాదు, ఉరేసుకుందంటూ ఆ వెంటనే సమాచారమిచ్చాడు. వెళ్లి చూసేసరికి సోనాలి చనిపోయి ఉంది. దాంతో కూతురిని అత్తింటివారే హత్య చేశారని తల్లిదండ్రులు ఆరోపించారు. అయితే తండ్రే తన తల్లిని చంపాడని నాలుగేళ్ల దర్శిత చెప్పింది. ''మమ్మీపై డాడీ దాడి చేసి చంపేశాడు. తర్వాత 'కావాలంటే నువ్వు చచ్చిపో'అని నన్ను అన్నాడు. అమ్మకు ఉరేసి రాయితో తలపై కొట్టాడు. తర్వాత కిందకు దించి సంచిలో పడేశాడు''అంటూ బొమ్మగీసి మరి చూపించింది. ''నువ్వు మా అమ్మను తాకితే నీ చెయ్యి విరగ్గొడతానని గతంలో నాన్నను తిట్టా. దాంతో 'మీ అమ్మను చంపేస్తా, నిన్నూ చంపేస్తా'అన్నాడు''అని కడూఆ చెప్పింది. కూతురి వాంగ్మూలం, మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణల నేపథ్యంలో హత్య కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహా యుతిలో లుకలుకలు షురూ!

20 మంది షిండే శివసేన ఎమ్మెల్యేల భద్రతను కుదించిన ఫడ్నవిస్ సర్కార్

ఇన్‌చార్జ్ మంత్రుల నియామకంతో మొదలైన విబేధాలు

మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని శివసేను చీల్చి బీజేపీ దన్నుతో అధికార పీఠాన్ని కైవసం చేసుకుని ముఖ్యమంత్రిగా వెలిగిపోయిన ఏక్‌నాథ్ షిండేకు ప్రస్తుత సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌కు నెమ్మదిగా బేదాభిప్రాయాలు మొదలువుతున్నాయని వార్తలు గుప్పుమన్నాయి. దీనికి బలమైన కారణాలను సైతం కొందరు రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. 20 మంది షిండే శివసేన వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు భద్రతను ఫడ్నవిస్ ప్రభుత్వం తగ్గించడమే ఇందుకు అసలు కారణమని తాజాగా విశ్లేషణలు వినవస్తున్నాయి. 2022 ఏడాదిలో మహా అఘాడీ కూటమి నుంచి వైదొలగి బీజేపీ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు గతంలో అదనంగా వై–కేటగిరీ భద్రత కల్పించారు. ఆ అదనపు వై–కేటగిరీ భద్రతకే ఇప్పుడు ఫడ్నవిస్ సర్కార్ కోత పెట్టింది. తన వర్గం ఎమ్మెల్యేలకు భద్రతను తగ్గించడంపై ప్రస్తుత డెప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారని వినికిడి. అధికార పార్టీ బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలకూ భద్రతను తగ్గించారు. వీరితోపాటు పూర్వ ఎన్సీపీ చీలికవర్గం నేత అజిత్ పవార్ పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలకూ భద్రతను కుదించారు. అయితే ఏక్‌నాథ్ షిండేకు చెందిన ఎమ్మెల్యేల సంఖ్యతో పోలిస్తే వీళ్ల సంఖ్య చాలా తక్కువగా ఉందని సమాచారం. ప్రభుత్వ వనరుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసే చర్యల్లో భాగంగానే షిండే, బీజేపీ, అజిత్ పవార్ పార్టీల ఎమ్మెల్యేలకు భద్రతను తగ్గించామని ఫడ్నవిస్ ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అయితే డెప్యూటీ సీఎంగా ఏక్‌నాథ్, సీఎంగా ఫడ్నవిస్ కొనసాగుతున్న మహా యుతి ప్రభుత్వంలో తన ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు, అధికారంపై మరింత పట్టుబిగించేందుకు ఫడ్నవిస్ ఈ చర్యలు చేపట్టారని అధికార వర్గాల్లో గుసగుసలు పెరిగాయి. అధికార మహా యుతి కూటమిలో పొరపొచ్చాలు పెరుగుతున్నాయని శివసేన(యూబీటీ) మహిళా ఎంపీ ప్రియాంక చతుర్వేది వ్యాఖ్యానించారు. ''మహాయుతి ప్రభుత్వం ఇప్పుడు వాలంటైన్ నెలను జరుపుకుంటోంది''అని వ్యంగ్య ట్వీట్‌చేశారు.

రాయ్‌గఢ్, నాసిక్‌తో మొదలు..

రెండు జిల్లాలకు ఇన్‌ఛార్జ్ మంత్రుల విషయంతో మహాయుతిలోని రెండు ప్రధాన పార్టీల మధ్య విబేధాలు బయటపడ్డాయి. బీజేపీకి చెందిన గిరీశ్ మహాజన్‌ను నాసిక్ జిల్లాకు ఇన్‌చార్జ్ మంత్రిగా ప్రకటించారు. ఎన్సీపీకి చెందిన అదితీ తత్కారేను రాయ్‌గఢ్ ఇన్‌చార్జ్‌గా ప్రకటించారు. గత నెలలో దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లడానికి ముందు సీఎం ఫడ్నవిస్ ఈ పేర్లను ప్రకటించారు. అయితే తమ పార్టీ నేతలు, రాష్ట్ర మంత్రులు అయిన భరత్ గొగావాలే, దాదాజీ భూసేలను ఇలా ఇన్‌ఛార్జ్ మంత్రులుగా ఎందుకు ఎంపిక చేయలేదని ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన ఆగ్రహం వ్యక్తంచేసింది. దీంతో గిరీశ్, తత్కారేల నియామకం అర్ధంతరంగా నిలిచిపోయింది. ముఖ్యమంత్రి పదవిలో ఉండి మహాయుతి కూటమిని అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించిన తనకు మళ్లీ సీఎం పదవి కట్టబెట్టకపోవడంపై ఏక్‌నాథ్ ఇంకా కోపంగా ఉన్నారని తాజా ఘటనలు పరోక్షంగా వెల్లడిస్తున్నాయి. ఇటీవల మహారాష్ట్ర రాష్ట్ర అధికారిక కార్యక్రమాల్లో వేదికపై సీఎం ఫడ్నవిస్‌తో కలిసి కూర్చోడానికి కూడా ఏక్‌నాథ్ విముఖత చూపిస్తున్నారని తెలుస్తోంది. జనవరిలో ఫడ్నవిస్ పాల్గొన్న నాసిక్ మెట్రోపాలిటన్ రీజనల్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యక్రమానికి షిండే కూడా రావాల్సి ఉంది. కానీ ఎలాంటి కారణం లేకుండానే ఆయన గైర్హాజరయ్యారని ఆనాడు వార్తలొచ్చాయి. పింప్రీ–చించ్‌వాడ్ పోలీస్ కమీషనరేట్ ప్రారంభోత్సవానికీ ఫడ్నవిస్ వస్తున్నారని తెలిశాక ఉద్దేశపూర్వకంగా ఏక్‌నాథ్ అక్కడికి రాలేదని తెలుస్తోంది. **- సాక్షి, నేషనల్ డెస్క్**

ఏడు నెలల చిన్నారిపై దారుణం..

దోషికి ఉరి శిక్ష

కోల్‌కతా: ఏడు నెలల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడటంతో హత్యకు యత్నించిన ఓ దుర్మార్గుడికి కోల్‌కతాలోని ప్రత్యేక పోక్సో కోర్టు ఉరి శిక్ష విధించింది. కోల్‌కతాలోని బుర్తొల్లా ప్రాంతంలో ఈ దారుణం చోటుచేసుకోగా, నిందితుడిని అరెస్ట్ చేసిన 75 రోజుల్లోనే ప్రత్యేక కోర్టు ఈ మేరకు మంగళవారం తీర్పు వెలువరించింది. ఝర్‌గ్రామ్ జిల్లా గోపిబల్లావర్‌పూర్ గ్రామానికి చెందిన దోషి రాజీబ్ ఘోష్ గతేడాది నవంబర్ 30న రోడ్డు పక్కన గుడిసెలో ఉన్న చిన్నారిపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఆ వెంటనే అరెస్ట్ చేసిన పోలీసులు డిసెంబర్ 30న మొదటి చార్జిషీట్, మరికొద్ది రోజులకే రెండో చార్జిషీట్ దాఖలు చేశారు. ఇది అత్యంత అరుదైన కేసుగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ పేర్కొన్నారు. బాధిత చిన్నారి కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో ఇప్పటికీ చికిత్స పొందుతోందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెప్పారు. విచారణకు కేవలం 40 రోజుల సమయం పట్టిందన్నారు. కాగా, ఆరు నెలల వ్యవధిలో పశ్చిమబెంగాల్‌లోని కోర్టులు విధించిన ఏడో మరణ శిక్ష ఇది. పోక్సో చట్టం కింద మరణ శిక్ష పడిన ఆరో కేసిది.

ఆన్‌లైన్ కంటెంట్ నియంత్రణలో శూన్యత

నిబంధనలు రూపొందించాలని కేంద్రానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: ఆన్‌లైన్‌లో యూట్యూబ్ వంటి వేదికలపై అన్ని రకాలైన కంటెంట్ యథేచ్ఛగా వచ్చేస్తోందని సుప్రీంకోర్టు పేర్కొంది. వీటి కట్టడికి ఉద్దేశించిన నిబంధనల్లో శూన్యత ఉందంటూ వ్యాఖ్యానించింది. తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కొందరు యూట్యూబర్లు కేంద్రంపై వేసిన పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'అన్ని రకాలైన అంశాలూ యూట్యూబ్‌లో ప్రసారమవుతున్నాయి. యూట్యూబర్లు, వీళ్ల షోల కట్టడికి తగు చర్యలు అవసరం. మేం చేపడతాం. దీనిని ఇలాగే వదిలేయలేం. సున్నితమైన, ముఖ్యమైన ఈ అంశాన్ని విస్మరించలేం'అని పేర్కొంది. 'కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటే సంతోషిస్తాం. కొందరు యూట్యూబర్లు ఈ శూన్యతను దుర్వినియోగం చేస్తున్నారు. దీన్ని ఇలాగే వదిలేయలేం'అని స్పష్టం చేసింది.



మంగళవారం తన కుటుంబీకులతో కలిసి ప్రధాని మోదీతో భేటీ అయిన ఇంగ్లండ్ మాజీ ప్రధాని రిషి సునాక్

మహా కుంభ్‌కు 55 కోట్ల మంది

మహాకుంభ్ నగర్: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభ్ మేళా సందర్భంగా త్రివేణీ సంగమంలో ఇప్పటి వరకు 55 కోట్ల మంది పుణ్య స్నానాలు ఆచరించారని యూపీ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. దేశంలోని 143 కోట్ల జనాభాలో 110 కోట్ల మంది సనాతన ధర్మ పరాయణులు కాగా వీరిలో దాదాపు సగం మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లయిందని తెలిపింది. మొత్తం జనాభాలో ఇది 38 శాతంతో సమానమని తెలిపింది. 26వ తేదీకల్లా ఈ సంఖ్య 60 కోట్లకు మించిపోనుందని అంచనా వేసింది. జనవరి 13న ప్రారంభమైన కుంభ మేళా ఈ నెల 26వ తేదీన మహా శివరాత్రి పర్వదినంతో ముగియనుండటం తెలిసిందే. ఈ కుంభమేళా ప్రపంచంలోనే అతిపెద్ద మత, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమంగా నిలిచిపోనుందని యూపీ ప్రభుత్వం తెలిపింది.

హోటల్ పరిశ్రమకు పెద్ద ఊతం

మహాకుంభ మేళాకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ప్రయాగ్‌రాజ్‌లోని అన్ని రకాల హోటళ్లు, రెస్టారెంట్ల పరిశ్రమ 20 నుంచి 30 వృద్ధి నమోదు చేసుకుందని ప్రభుత్వం తెలిపింది. ఆదాయ మార్జిన్లు కూడా 5 నుంచి 10 శాతం పెరిగాయంది. సందర్శకుల రాకతో టూర్, ట్రావెల్ పరిశ్రమ కూడా బాగా లబ్ధి పొందిందని వివరించింది. ఈ నెల 26వ తేదీ వరకు ప్రయాగ్‌రాజ్‌లోని మూడు, నాలుగు నక్షత్రాల హోటళ్లు, లాడ్జీలు, లగ్జరీ టెంట్ హౌస్‌లు పెద్ద సంఖ్యలో ముందుగానే బుక్కయ్యాయన్నారు.

కుంభ మేళా పొడిగింపు అబద్ధం

భక్తుల రద్దీ కొనసాగుతున్న దృష్ట్యా మహా కుంభ్ మేళాను మరికొద్ది రోజులు పొడిగించనున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై ప్రయాగ్‌రాజ్ జిల్లా మేజిస్ట్రేట్ రవీంద్ర మందర్ స్పష్టతనిచ్చారు. పవిత్ర దినాలను పరిగణనలోకి తీసుకుంటూ ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం కుంభ మేళా 26వ తేదీ వరకు మాత్రమే కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ తేదీల్లో ఎలాంటి మార్పులూ ఉండవని కుండబద్దలు కొట్టారు. పొడిగింపు అంటూ వస్తున్న వార్తలను పట్టించుకోవద్దని ఆయన ప్రజలను కోరారు. కుంభమేళా కారణంగా ప్రయాగ్‌రాజ్‌లో విద్యార్థులెవరూ పరీక్షలను నష్టపోలేదని కూడా ఆయన పేర్కొన్నారు. అనివార్య కారణాలతో ఎవరైనా సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ పరీక్షలను మిస్సయినా వారి కోసం ప్రత్యేకంగా నిర్వహించాలని కోరామన్నారు.

కాశీకి 17 రోజుల్లో కోటి మంది

ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభ మేళా జరుగుతున్న వేళ ఫిబ్రవరి 1 నుంచి 17వ తేదీ వరకు కాశీ విశ్వనాథుని ఆలయాన్ని కోటి మంది భక్తులు దర్శించుకున్నారని మంగళవారం అధికారులు తెలిపారు. అత్యంత రద్దీ ఉండే శివరాత్రినాడు కూడా ఇంత రద్దీ లేదన్నారు. ఈ నేపథ్యంలో వారణాసిలోని స్కూళ్లలో 8వ తరగతి వరకు తరగతులను ఈ నెల 27వ తేదీ వరకు రద్దు చేశామన్నారు. వారణాసిలోని రైల్వే స్టేషన్లు, బస్టాండ్లతోపాటు మైదాగిన్, గొడౌలియా, దశాశ్వమేథ వంటి ముఖ్య ప్రాంతాల్లో తీవ్రమైన రద్దీ నెలకొందని వివరించారు. ప్రాముఖ్యమున్న గంగా ఆరతి కార్యక్రమాన్ని నామమాత్రంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 27 నుంచి తిరిగి ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో చేపడతామని వివరించారు.

భారత రాజ్యాంగ మౌలిక స్వరూపం అంటే?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

రాజ్యాంగ అవలోకనం, ముఖ్య లక్షణాలు, ప్రవేశిక

మాదిరి ప్రశ్నలు

1. భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం కార్య నిర్వహణ అధికారం ఎవరికి ఉండేది?
ఎ) బ్రిటిష్ రాణి / రాజు
బి) ఇంగ్లండ్ పార్లమెంట్
సి) సమాఖ్య శాసనసభ
డి) కౌన్సిల్‌లోని గవర్నర్ జనరల్

2. బ్రిటిషర్లు బెంగాల్‌లో సుప్రీంకోర్టును ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
ఎ) 1776 బి) 1775 సి) 1777 డి) 1774

3. 1773 నుంచి 1857 వరకు చేసిన చట్టాలను ఎలా వ్యవహరిస్తారు?
ఎ) చార్టర్ చట్టాలు బి) కౌన్సిల్ చట్టాలు
సి) క్రౌన్ చట్టాలు డి) ఏవీకాదు

4. భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం ఎన్ని జాబితాలు ఉండేవి?
ఎ) 2 బి) 3 సి) 5 డి) 6

5. భారత్‌లో బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాది వేయడానికి కారకుడు?
ఎ) వాట్సన్ బి) రాబర్ట్ క్లైవ్
సి) డూప్లెక్స్ డి) వారెన్ హేస్టింగ్స్

6. భారత ప్రభుత్వ చట్టం 1919లోని ప్రధాన అంశం / అంశాలు?
ఎ) రాష్ట్రాల కార్య నిర్వాహక ప్రభుత్వంలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టడం
బి) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను నిర్వచించడం
సి) కేంద్ర, రాష్ట్రాలకు శాసన నిర్మాణ అధికారాన్ని సంక్రమింపజేయడం
డి) పైవన్నీ

7. మొదటిసారిగా ఏ బ్రిటిష్ చట్టం భారతీయులకు పాలనలో భాగస్వామ్యం కల్పించడానికి ఉద్దేశించింది?
ఎ) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1861
బి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1862
సి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1909
డి) గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టం, 1919

8. 'గట్టి బ్రేకులు ఉండి ఇంజన్ లేని యంత్రం' అని నెహ్రూ దేన్ని పేర్కొన్నారు?
ఎ) కేబినెట్ ప్లాన్
బి) మౌంట్‌బాటన్ ప్లాన్ సి) వేవెల్ ప్లాన్
డి) 1935 భారత ప్రభుత్వ చట్టం

9. మత ప్రాతిపదిక నియోజకవర్గాల పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?
ఎ) లార్డ్ మింటో బి) లార్డ్ బెంటింక్
సి) వారెన్ హేస్టింగ్స్ డి) రాబర్ట్ క్లైవ్

10. భారతదేశంలో ఏ చట్టం ద్వారా తొలి అధికారిక శాసనసభను ఏర్పాటు చేశారు?
ఎ) చార్టర్ చట్టం, 1833
బి) చార్టర్ చట్టం, 1853
సి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1861
డి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1892

11. మౌంట్ బాటన్ ప్రణాళిక లక్ష్యం?
ఎ) సమాఖ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం
బి) రాజ్యాంగ సభ ద్వారా భారత రాజ్యాంగ రూపకల్పనకు మార్గదర్శకాలు ఇవ్వడం
సి) బ్రిటిషర్ల నుంచి భారతీయులకు అధికారాన్ని బదిలీ చేసే పద్ధతి
డి) ఆ కాలంలో చెలరేగిన మతకల్లోలాలను నివారించడానికి ప్రణాళిక

12. ద్వంద్వ పరిపాలనను ఎప్పుడు ప్రవేశపెట్టారు?
ఎ) ఇండియన్ కౌన్సిల్ చట్టం - 1892
బి) భారత ప్రభుత్వ చట్టం - 1909
సి) భారత ప్రభుత్వ చట్టం - 1919
డి) గాంధీ-ఇర్విన్ ఒప్పందం

13. రాజ్యాంగ వాదాన్ని మొదటిసారి శాస్త్రీయంగా వివరించిన తత్వవేత్త?
ఎ) అరిస్టాటిల్ బి) రూసో
సి) చార్లెస్ డార్విన్ డి) ప్లేటో

14. కింది వాటిలో ఏ చట్టాన్ని మొదటి లిఖిత రాజ్యాంగంగా అభివర్ణిస్తారు?
ఎ) పిట్ ఇండియా చట్టం - 1784
బి) రెగ్యులేటింగ్ చట్టం - 1773
సి) చార్టర్ చట్టం - 1313
డి) చార్టర్ చట్టం - 1853

15. మొదటిసారిగా మత ప్రాతిపదికన ప్రత్యేక నియోజక గణాల ఏర్పాటుకు అవకాశం కల్పించిన చట్టం?
ఎ) 1909 బి) 1919
సి) 1935 డి) ఏవీకాదు

16. రాష్ట్రాల్లో ద్విసభా పద్ధతికి అవకాశం కల్పించిన చట్టం?
ఎ) 1935 బి) 1919
సి) 1909 డి) ఏదీకాదు

17. కింది వాటిలో భారత ప్రభుత్వ చట్టం - 1935లో సరికాని అంశం?
ఎ) ఫెడరల్ న్యాయస్థానం ఏర్పాటు
బి) సమాఖ్య వ్యవస్థ ప్రతిపాదన
సి) ఆర్.బి.ఐ. ఏర్పాటు
డి) సార్వజనీన ఓటుహక్కు

18. కింది వాటిలో ఏ చట్టం ద్వారా 'గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్' పదవిని 'గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా'గా మార్చారు?
ఎ) 1833 బి) 1813 సి) 1861 డి) 1858

19. సైమన్ కమిషన్ ముఖ్య ఉద్దేశం?
ఎ) 1919 చట్టం ద్వారా ప్రవేశపెట్టిన సంస్కరణలను సమీక్షించడం
బి) రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించడం
సి) డొమినియన్ ప్రతిపత్తిని సమీక్షించడం
డి) పైవన్నీ

20. కింది వాటిలో ఏ ప్రతిపాదనను భారత ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల మాగ్నా కార్టాగా పేర్కొంటారు?
ఎ) వేవెల్ ప్రతిపాదన
బి) క్రిప్స్ ప్రతిపాదన
సి) కేబినెట్ రాయబార ప్రతిపాదన
డి) విక్టోరియా రాణి ప్రకటన

21. మహాత్మా గాంధీ హాజరైన రౌండ్ టేబుల్ సమావేశం?
ఎ) మొదటి రౌండ్ టేబుల్ సమావేశం
బి) రెండో రౌండ్ టేబుల్ సమావేశం
సి) మూడో రౌండ్ టేబుల్ సమావేశం
డి) ఏదీకాదు

22. భారత ప్రభుత్వ చట్టం - 1935ను బానిసత్వానికి నూతన పత్రంగా పేర్కొన్నవారు?
ఎ) కె.టి. షా బి) జవహర్ లాల్ నెహ్రూ
సి) మహాత్మాగాంధీ డి) సర్దార్ పటేల్

23. కింది వాటిలో ఏ ప్రతిపాదనల మేరకు రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటయ్యింది?
ఎ) కేబినెట్ ప్రతిపాదనలు
బి) మౌంట్ బాటన్ ప్రతిపాదనలు
సి) క్రిప్స్ ప్రతిపాదనలు డి) ఏవీకాదు

24. భారతదేశంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రోజు?
ఎ) 1946 సెప్టెంబర్ 2
బి) 1946 అక్టోబర్ 2
సి) 1946 నవంబర్ 1
డి) 1947 నవంబర్ 1

25. భారత రాజ్యాంగ రచనలో అత్యంత ప్రభావం చూపిన అంశం?
ఎ) అమెరికా రాజ్యాంగం
బి) బ్రిటిష్ రాజ్యాంగం
సి) ఐరిష్ రాజ్యాంగం
డి) భారత ప్రభుత్వ చట్టం

26. జతపరచండి.
1. పోర్ట్ పోలియో పద్ధతి — ఎ. లార్డ్ మెకాలే
2. సివిల్ సర్వీస్ సులభతరం — బి. లార్డ్ కార్న్‌వాలిస్
3. మత నియోజక వర్గాలు — సి. లార్డ్ కానింగ్
4. భారత న్యాయ సంస్కరణలు — డి. లార్డ్ మింటో
ఎ) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ
బి) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
సి) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
డి) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి

27. కింది వాటిని ప్రవేశపెట్టిన కాలానుగుణంగా క్రమంలో రాయండి.
1. ప్రత్యేక నియోజకవర్గాలు
2. శాసన అధికారాల బదలాయింపు
3. ద్విసభా విధానం



4. డొమినియన్ ప్రతిపత్తి
ఎ) 1, 2, 3, 4 బి) 2, 1, 3, 4
సి) 3, 2, 1, 4 డి) 3, 4, 1, 2

28. రాజ్యాంగ వికాసానికి సంబంధించి సరైన క్రమాన్ని గుర్తించండి.
ఎ) మాగ్నాకార్టా, యు.ఎస్. రాజ్యాంగం, బిల్ ఆఫ్ రైట్స్, సెటిల్‌మెంట్ చట్టం
బి) మాగ్నాకార్టా, బిల్ ఆఫ్ రైట్స్, సెటిల్‌మెంట్ చట్టం, యు.ఎస్. రాజ్యాంగం
సి) బిల్ ఆఫ్ రైట్స్, మాగ్నాకార్టా, సెటిల్‌మెంట్ చట్టం, యు.ఎస్. రాజ్యాంగం
డి) పైవేవీ కాదు

29. ప్రభుత్వానికి ఉండే అధికారం కింది వాటిలో దేనికి ఉదాహరణ?
ఎ) సంప్రదాయ అధికారం
బి) సమ్మోహన అధికారం
సి) చట్టబద్ధ - హేతుబద్ధ అధికారం
డి) పైవన్నీ

30. కింది వాటిలో భారత రాజ్యాంగానికి ఏ లక్షణాన్ని ఆపాదించలేం?
ఎ) శాసన శాఖ ఆధిక్యత
బి) న్యాయ శాఖ ఆధిక్యత
సి) కార్య నిర్వాహక శాఖ ఆధిక్యత
డి) పైవన్నీ

31. భారత సమాఖ్య స్వభావం?
ఎ) సిద్ధాంత సమాఖ్య బి) అర్ధ సమాఖ్య
సి) విశిష్ట సమాఖ్య
డి) బేరసారాల సమాఖ్య

32. పార్లమెంటరీ వ్యవస్థకు మరో పేరు?
ఎ) కేబినెట్ ప్రభుత్వం
బి) ప్రధానమంత్రి ప్రభుత్వం
సి) పై రెండూ డి) ఏవీ కాదు

33. 'భారత రాజ్యాంగం సుదీర్ఘమైంది' కారణం?
ఎ) ఇతర రాజ్యాంగాల ప్రభావం
బి) భారతదేశ వైవిధ్యం
సి) రాష్ట్రాలకు ప్రత్యేక రాజ్యాంగాలు లేకపోవడం
డి) పైవన్నీ

34. కింది వారిలో ఎవరి జీతభత్యాలను రెండో షెడ్యూల్‌లో పేర్కొనలేదు?
ఎ) పార్లమెంట్ సభ్యులు
బి) స్పీకర్, డిప్యూటీ స్పీకర్
సి) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
డి) గవర్నర్

35. భారత రాజ్యాంగానికి, అమెరికా రాజ్యాంగానికి పోలిక?
ఎ) సమాఖ్య వ్యవస్థ బి) న్యాయ సమీక్ష
సి) ప్రాథమిక హక్కులు డి) పైవన్నీ

36. భారతదేశంలో రాజ్యాధికారానికి మూలం?
ఎ) రాజ్యాంగం బి) పార్లమెంట్
సి) ప్రజలు డి) రాష్ట్రపతి

37. భారత రాజ్యాంగ పీఠికలో ఉండే పదాల క్రమం?
ఎ) సార్వభౌమాధికార, ప్రజాస్వామిక, సామ్యవాద, గణతంత్రరాజ్యం
బి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, గణతంత్ర రాజ్యం
సి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక
డి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యం

38. భారత రాజ్యాంగ మౌలిక స్వరూపం అంటే?
ఎ) రాజ్యాంగ లక్షణాలు చాలా ముఖ్యమైనవి. వాటిని సవరించడానికి వీలులేదు
బి) ప్రాథమిక హక్కులను కుదించడం గానీ, తొలగించడం గానీ కుదరదు
సి) 368 ప్రకరణ ప్రకారం తప్ప రాజ్యాంగాన్ని సవరించడానికి వీలులేదు
డి) కొన్ని అంశాలను సవరించడానికి పార్లమెంట్‌కు అధికారం ఉండదు

39. ప్రవేశికను భారత రాజ్యాంగానికి ఆత్మ, హృదయం, ఒక ఆభరణంగా వర్ణించినవారు?
ఎ) మహాత్మాగాంధీ బి) అంబేద్కర్
సి) వల్లభ్‌భాయ్ పటేల్
డి) ఠాకూర్‌దాస్ భార్గవ

40. రాజ్యాంగ ప్రవేశిక?
ఎ) సూచనాత్మకమైంది
బి) విషయసూచిక లాంటిది
సి) పై రెండూ డి) పైవేవీ కాదు

41. ప్రవేశిక నుంచి ఏయే అంశాలు తెలుసుకోవచ్చు?
ఎ) రాజ్యాంగ ఆమోద తేది
బి) రాజ్యాంగ ఆధారాలు
సి) రాజ్యాంగ ఆశయాలు
డి) పైవన్నీ

42. 'సమగ్రత' (ఇంటిగ్రిటీ) అనే పదాన్ని 1976లో 42 రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికకు చేర్చారు. దీని ఉద్దేశం?
ఎ) వేర్పాటువాద శక్తులను అరికట్టడం
బి) భౌగోళిక సామీప్యతను సాధించడం
సి) మతకలహాలను నియంత్రించడం
డి) పైవన్నీ

43. భారత 'సామ్యవాదం' (సోషలిస్ట్) అనే భావజాలం ఎవరి భావాలను ప్రతిబింబిస్తుంది?
ఎ) మార్క్స్, మహాత్మాగాంధీ
బి) గాంధీ, నెహ్రూ సి) మార్క్స్, మావో
డి) మార్క్స్, వినోభా బావే

44. కింది వాటిలో ప్రవేశికకు సంబంధించి సరైంది?
ఎ) రాజ్యాంగంలోని ప్రకరణలతో సంబంధం ఉంటుంది
బి) ప్రత్యేకంగా ప్రవేశికకు ఉనికి ఉండదు
సి) సవరణకు అతీతం కాదు
డి) పైవన్నీ సరైనవే

45. కింది వాటిలో ఏయే అంశాలను వ్యాఖ్యానించడానికి ప్రవేశికను ఆధారంగా తీసుకోవచ్చు?
ఎ) ప్రాథమిక హక్కులు
బి) ఆదేశిక సూత్రాలు
సి) ప్రభుత్వ అధికారాలు డి) పైవన్నీ

46. ప్రవేశికలో పేర్కొన్న 'సమానత్వం' కింది వాటిలో దేనికి హామీ ఇస్తుంది?
ఎ) హోదా బి) అవకాశాలు
సి) ఉపాధి డి) ఎ, బి

47. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ప్రవేశిక అధికారానికి ఆధారం, పరిమితి కాదు
బి) ప్రవేశిక సవరణకు అతీతం కాదు
సి) ప్రవేశికను రాజ్యాంగ రచన తర్వాత చేర్చారు. ఆఖరున ఆమోదించారు
డి) పైవన్నీ సరైనవే

48. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) అత్యంత దృఢ రాజ్యాంగం - అమెరికా
బి) పరిమాణాత్మక రాజ్యాంగం - ఇంగ్లండ్
సి) చట్టీకృత రాజ్యాంగం - ఇండియా
డి) పైవన్నీ సరైనవే

49. రాజ్యాంగ వాదన అంటే?
ఎ) పరిమిత అధికారాలతో కూడిన పరిపాలన
బి) పరిమిత ప్రభుత్వ వ్యవస్థ
సి) రాజ్యాంగ వికాస దశ
డి) పైవేవీ కాదు


50. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత చేర్చిన అంశాలు?
ఎ) ప్రాథమిక విధులు బి) ట్రైబ్యునల్
సి) సహకార సంస్థలు డి) పైవన్నీ

సమాధానాలు

1) డి; 2) డి; 3) ఎ; 4) బి; 5) బి;
6) డి; 7) ఎ; 8) డి; 9) ఎ; 10) బి;
11) సి; 12) సి; 13) ఎ; 14) బి; 15) ఎ;
16) ఎ; 17) డి; 18) ఎ; 19) ఎ; 20) డి;
21) బి; 22) బి; 23) ఎ; 24) ఎ; 25) డి;
26) ఎ; 27) ఎ; 28) బి; 29) సి; 30) డి;
31) సి; 32) సి; 33) డి; 34) ఎ; 35) డి;
36) సి; 37) డి; 38) డి; 39) డి; 40) ఎ;
41) డి; 42) ఎ; 43) ఎ; 44) డి; 45) డి;
46) డి; 47) డి; 48) డి; 49) ఎ; 50) డి.

ఆమ్ల వర్షానికి కారణమయ్యే ప్రధానమైన ఆక్సైడ్‌లు?

చమురుశుద్ధి కర్మాగారాలు విడుదల చేసే సల్ఫర్, నైట్రోజన్‌ల డై ఆక్సైడ్‌లే తాజ్‌మహల్ పసుపు రంగులోకి మారడానికి ప్రధాన కారణం. తాజ్‌మహల్‌ను పరిరక్షించడానికి భారత ప్రభుత్వం 1995లో ఆగ్రా, ఫిరోజాబాద్, మధురా, భరత్‌పూర్ (వీటిని 'తాజ్ ట్రెపీజియం'గా వ్యవహరిస్తారు) పట్టణాల్లోని 200కు పైగా పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించింది. వారసత్వ కట్టడమైన తాజ్‌మహల్ పరిరక్షణలో ఇది ముఖ్యమైన ముందడుగు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

రసాయన శాస్త్రం

వాయు కాలుష్యం

క్లోరిన్ (Cl_2)

వాతావరణాన్ని కలుషితం చేస్తున్న వాయువుల్లో క్లోరిన్ ఒకటి. ఇది అతి తక్కువ పరిమాణంలో ప్లాస్టిక్ పరిశ్రమలు, నీటిని శుద్ధి చేసే ప్లాంట్ల నుంచి వాతావరణంలోకి విడుదలవుతోంది. కాగితం తయారీ పరిశ్రమల్లో కలప గుజ్జును విరంజనం చేయడంలో క్లోరిన్‌ను ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియ ద్వారా కూడా క్లోరిన్ వాయువు వాతావరణంలోకి చేరుతోంది. క్లోరిన్ విషపూరిత, హానికర వాయువు. ఇది వాతావరణంలోని నీటి బిందువులతో కలిసి హైడ్రోక్లోరికామ్లం, హైపోక్లోరస్ ఆమ్లంగా మారుతుంది.

ఫ్రియాన్‌లు

వివిధ క్లోరో ఫ్లోరో కార్బన్లను సాధారణంగా ఫ్రియాన్లు అంటారు. వీటి ఆవిష్కరణతో శీతలీకరణ (రిఫ్రిజిరేషన్) పరిశ్రమ కొత్త పుంతలు తొక్కింది. రంగులేని, విషపూరితం కాని, మండే స్వభావం లేని ఈ ఫ్రియాన్‌లను ఎయిర్ కండిషనింగ్‌లో శీతలీకరణులుగానే కాకుండా ఏరోసోల్ చోదకాలు (ప్రొఫెల్లెంట్స్), డ్రైక్లీనింగ్‌లో ద్రావణిలు (సాల్వెంట్స్), నురుగు ఏర్పరిచే కారకాలు (ఫోమింగ్ ఏజెంట్స్), మంటలనార్పే పదార్థాలు, ఫాస్ట్‌ఫుడ్ ప్యాకింగ్ పదార్థాలుగా వినియోగించారు. సర్జికల్ పరికరాలను క్రిమి రహితం (స్టెరిలైజేషన్) చేయడానికి ఉపయోగించడం వల్ల వీటిని పరిశ్రమలకు వరాలుగా భావించారు. కానీ ఇవి హరిత గృహ ప్రభావానికి, ఓజోన్ పొర క్షీణతకు కారణమవడం వల్ల వీటిని పర్యావరణానికి 'శాపం'గా పరిగణిస్తూ నిషేధించారు. ఇవి ఇతర కాలుష్యాల మాదిరిగా కాకుండా చాలా స్థిరమైనవి. ఇవి ట్రోపోవరణంలో దాదాపు ఒక శతాబ్దానికిపైగా స్థిరంగా ఉంటాయి.

కణ స్వభావ పదార్థాలు (Particulate matter)

సాధారణంగా 0.001 నుంచి 10 మి.మీ. పరిమాణం ఉన్న దుమ్ము, ధూళి కణాలు మాత్రమే గాలిలో తేలియాడుతూ కంటికి కనిపిస్తాయి. ఇంతకంటే తక్కువ పరిమాణం ఉన్నవి కంటికి కనిపించవు. ఇవి గాలిలో తెరలు తెరలుగా ఉంటాయి. వీటిలో ప్రధానమైనవి మసి (కార్బన్ కణాలు), లోహాలు, లోహ లవణాలు, సిమెంట్, ఫ్లై యాష్, ఖనిజాలు, హైడ్రోకార్బన్‌లు మొదలైనవి. లోహాల్లో ముఖ్యమైనవి లెడ్, మెర్క్యూరీ, క్రోమియం, ఆర్సెనిక్, జింక్, కాడ్మియం, నికెల్, ఐరన్. కణ స్వభావ పదార్థాలు శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, పక్షవాతానికి కారణమవుతున్నాయి.

వాహనాల ఇంధనం పెట్రోల్‌కు శబ్దం చేయకుండా సున్నితంగా మండటానికి 'టెట్రా ఇథైల్ లెడ్'(టీఈఎల్) అనే సీసం (లెడ్) సమ్మేళనాన్ని కలిపేవారు. ప్రస్తుతం దీన్ని నిషేధించారు. దీనివల్ల వాతావరణంలోకి లెడ్ విడుదలై అనేక మానసిక రుగ్మతలను కలిగిస్తుందని గుర్తించారు. పట్టణాల్లో కాలుష్యం ఎక్కువగా ఉండటం వల్ల ఇది ఎక్కువగా ఉండేది.

ఫ్లై యాష్

నేల బొగ్గును మండించినప్పుడు చివరగా మిగిలే బూడిదనే 'ఫ్లై యాష్' అంటారు. ఇది ప్రధానంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి విడుదలవుతోంది. కొంతవరకు దీన్ని ఇటుకల తయారీ, సిమెంట్ పరిశ్రమల్లో వాడుతున్నప్పటికీ.. మిగిలింది పర్యావరణానికి గుదిబండగా మారుతోంది. ఫ్లై యాష్‌లో ప్రధానంగా సిలికాన్ డై ఆక్సైడ్, అల్యూమినియం ఆక్సైడ్, కాల్షియం ఆక్సైడ్‌లు ఉంటాయి. వీటితో పాటు కొద్ది పరిమాణంలో ఆర్సెనిక్, బెరీలియం, బోరాన్, క్రోమియం, కాడ్మియం, మెర్క్యురీ, లెడ్, సెలీనియం లాంటి కొన్ని లోహాలుంటాయి. వీటిలో కొన్ని హానికరమైనవి.

పాలీ ఎరోమాటిక్ హైడ్రోకార్బన్‌లు

కోల్, పెట్రోలియం పదార్థాలను మండించడం (ఆక్సీకరించడం) వల్ల కర్బన రసాయన కణ స్వభావ పదార్థాలు వాతావరణంలోకి చేరుతున్నాయి. బెంజీన్, టోలీన్‌తోపాటు అధిక వలయ ఎరోమాటిక్ సమ్మేళనాలైన నాఫ్తలీన్, ఆంథ్రసీన్ లాంటివి గాలిలో చేరి 'కేన్సర్' లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతున్నాయి.

స్మాగ్ (Smog)

Smoke + Fog → Smog

ప్రాథమికంగా పొగ, దుమ్ము-ధూళితో కూడిన మంచునే 'స్మాగ్'గా వ్యవహరిస్తారు. స్మాగ్ రెండు రకాలు. అవి..

1. సాంప్రదాయిక స్మాగ్: దుమ్ము, సల్ఫర్ డై ఆక్సైడ్‌తో కూడిన మంచు.. పొగతో కలిసినప్పుడు సాంప్రదాయిక స్మాగ్ ఏర్పడుతుంది. నైట్రోజన్, సల్ఫర్ ఆక్సైడ్‌లు అధికంగా ఉన్న చల్లని తేమతో కూడిన పారిశ్రామిక ప్రాంతాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. దీన్నే 'రసాయన స్మాగ్', 'క్షయకరణ స్మాగ్'గా వ్యవహరిస్తారు. 1962లో మొట్టమొదట లండన్‌లో కనిపించిన ఈ స్మాగ్ దాదాపు ఐదు రోజులపాటు ఉండి అనేక మంది మరణానికి కారణమైంది.

2. కాంతి రసాయన స్మాగ్: ఈ రకమైన స్మాగ్ ప్రధానంగా వెచ్చని, పొడి వాతావరణంతోపాటు ధారాళంగా సూర్యరశ్మి ఉన్నప్పుడు ఏర్పడుతుంది. పొగ, దుమ్ము, ధూళితోపాటు, కాంతి రసాయన ఆక్సీకరణులు అధికంగా ఉన్న వాతావరణంలో ఇది ఏర్పడుతుంది.

ఈ కాంతి రసాయన స్మాగ్ ప్రధానంగా ఓజోన్, నైట్రిక్ ఆక్సైడ్ (NO), హైడ్రోకార్బన్లు, ఫార్మాల్డిహైడ్, ఎక్రైల్ ఆల్డిహైడ్ (ఎక్రోలిన్), పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్ (పీఏఎన్) లాంటి సూర్యరశ్మి లేదా అతినీలలోహిత (UV) కాంతి సమక్షంలో స్వేచ్ఛా ప్రాతిపదికలు (ఫ్రీ ర్యాడికల్స్) ఉత్పత్తి చేసే సమ్మేళనాల చుట్టూ కేంద్రీకృతమై ఉంటుంది.

కాంతి రసాయన స్మాగ్ దుష్ప్రభావాలు

- ఇందులో ఉండే 'ఓజోన్' శ్వాస సంబంధ వ్యాధులను కలిగిస్తుంది, రబ్బర్‌ను పెలుసుగా, త్వరగా పాడయ్యేట్లు చేస్తుంది. పంటలకు నష్టం కలుగజేస్తుంది. భూగోళ తాపానికి కారణమవుతుంది.
- ఆల్డిహైడ్లు, హైడ్రోకార్బన్లు కళ్లలో మంటను కలిగిస్తాయి.
- పీఏఎన్ ఊపిరితిత్తులతోపాటు గుండె, కళ్లకు హాని కలిగిస్తుంది. మొక్కల ఆకులు పాలిపోయేలా చేస్తుంది.
- స్మాగ్‌తో దారులు మసకగా ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతాయి.

ఆమ్ల వర్షం (యాసిడ్ రెయిన్)

నేలబొగ్గు, పెట్రోలియం లాంటి శిలాజ ఇంధనాల్లో కార్బన్‌తోపాటు సల్ఫర్, నైట్రోజన్ సమ్మేళనాలుంటాయి. వీటిని మండించినప్పుడు ప్రధానంగా కార్బన్ డై ఆక్సైడ్ (CO_2) విడుదలవుతుంది. ఇది నీటిలో కరిగి బలహీన ఆమ్లమైన కార్బోనికామ్లాన్ని ఇస్తుంది. అందుకే స్వచ్ఛమైన నీటి pH (ఆమ్లత్వాన్ని కొలిచే పద్ధతి) విలువ ఏడు అయినప్పటికీ వర్షపునీటి pH 5 నుంచి 6 మధ్య ఉంటుంది (బలహీన ఆమ్ల అవధి). వర్షం pH విలువ ఇంతకంటే తగ్గితే దాన్ని 'ఆమ్ల వర్షం'అంటారు. సాధారణంగా శిలాజ ఇంధనాలను మండించినప్పుడు వెలువడే సల్ఫర్ ఆక్సైడ్‌లు, నైట్రోజన్ ఆక్సైడ్‌లు సూర్యరశ్మి సమక్షంలో వివిధ చర్యలకు లోనై వర్షపు నీటితో కలిసి సల్ఫ్యూరికామ్లం(H_2SO_4),నైట్రిక్ ఆమ్లం (HNO_3)గా ఆమ్లవర్ష రూపంలో భూమిని చేరతాయి.

ఆమ్ల వర్షం దుష్ప్రభావాలు

- చలువరాయి (మార్బుల్), సున్నపురాయి, స్లేట్ లాంటి పదార్థాలతో నిర్మించిన కట్టడాలు దెబ్బతింటాయి. తాజ్‌మహల్ పసుపు రంగులోకి మారడానికి చమురుశుద్ధి కర్మాగారాలు విడుదల చేసే సల్ఫర్, నైట్రోజన్‌ల డై ఆక్సైడ్‌లే ప్రధాన కారణం.
- ఆమ్ల వర్షం సరస్సుల నీటిలోని జీవ జాలానికి నష్టం కలిగిస్తుంది.
- లోహ నిర్మాణాలు త్వరగా క్షయం కావడానికి కారణమవుతుంది.
- ఆమ్ల వర్షం నేలలు, శిలల్లోని సీసం(లెడ్), పాదరసం(మెర్క్యూరీ), రాగి (కాపర్), అల్యూమినియం లాంటి లోహ అయాన్‌లను జలాశయాల్లోకి చేర్చి వాటిని విషపూరితం చేస్తుంది.
- ఆమ్ల వర్షం వల్ల నేలల సారం తగ్గుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. ఫ్లై యాష్‌కు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
ఎ. ఇటుకల తయారీలో వాడతారు
బి. పోర్ట్‌లాండ్ సిమెంట్‌కు ప్రత్యామ్నాయంగా కొంతవరకు వాడవచ్చు
సి. ఫ్లై యాష్‌లో కాల్షియం ఆక్సైడ్, సిలికాన్ డై ఆక్సైడ్‌లు మాత్రమే ఉంటాయి. విషపూరిత మూలకాలుండవు
1) ఎ, బి మాత్రమే 2) బి మాత్రమే
3) ఎ, సి మాత్రమే 4) సి మాత్రమే

2. వాతావరణంలో మానవ కార్యకలాపాల వల్ల కార్బన్ డై ఆక్సైడ్ పరిమాణం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ కార్యకలాపాల్లో ముఖ్యమైన వాటిని గుర్తించండి.
ఎ. శిలాజ ఇంధనాల దహనం
బి. వ్యవసాయం సి. చెట్ల నరికివేత
డి. హరితహారం
1) ఎ, బి, డి మాత్రమే
2) ఎ, డి మాత్రమే
3) ఎ, బి, సి మాత్రమే
4) ఎ, సి మాత్రమే

3. వాహనాల నుంచి వెలువడే 2.5 మైక్రాన్ల పరిమాణంలో ఉండే కణ స్వభావ పదార్థాలు (Particulate matter) ఊపిరితిత్తుల్లోకి అత్యంత సునాయాసంగా ప్రవేశిస్తాయి. వీటి వల్ల కలిగే జబ్బులేవి?
1) శ్వాస సంబంధిత వ్యాధులు
2) గుండె జబ్బులు
3) పక్షవాతం 4) పైవన్నీ

4. కిందివాటిలో కేన్సర్ కారక పదార్థాలు ఏవి?
1) కార్బన్ డై ఆక్సైడ్‌లు
2) ఎరోమాటిక్ సమ్మేళనాలు
3) ఎలిఫాటిక్ హైడ్రోకార్బన్‌లు
4) జడవాయువులు

5. ఆమ్ల వర్షానికి కారణమయ్యే ప్రధానమైన ఆక్సైడ్‌లు ఏవి?
ఎ. కార్బన్ ఆక్సైడ్‌లు బి. సల్ఫర్ ఆక్సైడ్‌లు
సి. నైట్రోజన్ ఆక్సైడ్‌లు
1) బి, సి మాత్రమే 2) ఎ, బి మాత్రమే
3) ఎ, సి మాత్రమే 4) పైవన్నీ

6. వరి పొలాలు ఏ విధంగా భూగోళ తాపానికి కారణమవుతున్నాయి?
1) నైట్రోజన్ డై ఆక్సైడ్ విడుదల చేయడం ద్వారా
2) మీథేన్ వాయువు విడుదల చేయడం ద్వారా
3) సల్ఫర్ డై ఆక్సైడ్ విడుదల ద్వారా
4) పైవన్నీ

7. కాంతి కాలుష్యం అంటే?
1) రాత్రివేళలో పెద్ద పెద్ద నగరాలను ఆవహించి ఉండే కాంతి పుంజం
2) ఫ్రియాన్ల వల్ల కలుషితమైన కాంతి
3) అడవులు మండటం వల్ల వెలువడే కాంతి
4) వాహనాల లైట్ల వల్ల వెలువడే కాంతి

8. కాంతి రసాయన స్మాగ్‌కు కారణమైనవి?
1) హైడ్రోకార్బన్‌లు 2) ఆల్డిహైడ్‌లు
3) పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్
4) పైవన్నీ

9. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ పెరగడం వల్ల కలిగే దుష్ప్రభావం?
1) ఆమ్ల వర్షాలు కురుస్తాయి
2) హరిత గృహ ప్రభావం ఏర్పడుతుంది
3) జలచరాలు చనిపోతాయి
4) కిరణజన్య సంయోగ క్రియను నిరోధిస్తుంది

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 2;
5) 1; 6) 2; 7) 1; 8) 4;
9) 2.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
బుధవారం । 19-2-2025

ట్రికిల్ డౌన్ వ్యూహాన్ని ప్రతిపాదించింది?

గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్

1. బెంజిమన్ హిగ్గిన్స్ అల్పాభివృద్ధి దేశాలకు సంబంధించిన ఏ అంశం గురించి పేర్కొన్నారు?
ఎ) సామాజిక ద్వంద్వత్వం
బి) సాంకేతిక ద్వంద్వత్వం
సి) అల్పస్థాయి సమతౌల్య స్తంభన
డి) వస్తుమార్పిడి విధానం
2. ఆధునిక అభివృద్ధిలో సాంకేతిక ప్రగతి ప్రధాన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నవారు?
ఎ) కుజ్‌నట్స్ బి) హరాడ్ – డోమార్
సి) మాధుర్ డి) షుంపీటర్
3. రోస్టో వృద్ధి సిద్ధాంతం ప్రకారం స్వయం సమృద్ధి సాధించిన దశగా దేన్ని భావించవచ్చు?
ఎ) అధిక వినియోగ దశ బి) ప్లవన దశ
సి) ప్లవన దశకు ముందున్న పరిస్థితి
డి) పరిపక్వ దశకు గమనం
4. కార్ల్‌మార్క్స్ కింది వాటిలో దేనికి ప్రాముఖ్యం ఇచ్చారు?
ఎ) మూలధన ఉత్పత్తి నిష్పత్తి
బి) పొదుపు – మూలధన నిష్పత్తి
సి) ఆర్గానిక్ కాంపోజిషన్ ఆఫ్ కాపిటల్
డి) ఏదీకాదు
5. రోస్టో రచించిన "The stages of Economic Growth" గ్రంథాన్ని ఏ విధంగా వ్యవహరిస్తారు?
ఎ) కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో
బి) నాన్ కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో
సి) మూలధన సంచయనం
డి) పైవన్నీ
6. ప్రపంచంలో అధిక జనాభా వల్ల కలిగే దుష్పరిణామాలను మొదటగా వివరించింది?
ఎ) డాల్టన్ బి) థామస్ మాల్థస్
సి) రాబిన్‌సన్ డి) డ్యూసెన్‌బరి
7. 2013–14లో దేశంలో స్థూల దేశీయ పొదుపు రేటు ఎంత?
ఎ) జీడీపీలో 30.6 శాతం
బి) జీడీపీలో 32 శాతం
సి) జీడీపీలో 33 శాతం
డి) జీడీపీలో 34 శాతం
8. "The problems of Industrialization in Eastern & South Eastern European Nations" గ్రంథకర్త?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) రాగ్నర్‌నర్క్స్
సి) రొసెన్‌స్టిన్ రోడాన్ డి) థామస్ మన్రో
9. రాగ్నర్‌నర్క్స్ సిద్ధాంతం ప్రకారం డిమాండ్ కోణంలో విష వలయాన్ని ఛేదించడానికి పేద దేశాల్లో వేటికి డిమాండ్ పెరగాలి?
ఎ) పెట్టుబడి బి) పొదుపు
సి) ఆదాయం డి) వస్తువులు, సేవలు



10. 2016–17లో భారత ఆర్థికవ్యవస్థ వృద్ధిని ప్రపంచ బ్యాంకు ఎంత శాతంగా అంచనా వేసింది?
ఎ) 7.7 బి) 7.8 సి) 7.9 డి) 8.0
11. మూడో ప్రపంచ దేశాలు అనే పదాన్ని మొదటిసారిగా ఉపయోగించినవారు?
ఎ) ఆల్‌ఫ్రెడ్ సవి బి) మార్షల్
సి) ఫిషర్ డి) జాన్ రాబిన్‌సన్
12. స్థిర మూల ధనానికి, చర మూలధనానికి మధ్య నిష్పత్తిని తెలిపేది?
ఎ) మూలధన – ఉత్పత్తి నిష్పత్తి
బి) పొదుపు – మూలధన ఉత్పత్తి నిష్పత్తి
సి) ఆర్గానిక్ కాంపోజిషన్ ఆఫ్ కాపిటల్
డి) ఏదీకాదు
13. అభిలషణీయ జనాభా సిద్ధాంతాన్ని మొదటగా చెప్పిన శాస్త్రవేత్త?
ఎ) మాల్థస్ బి) ఎడ్వర్డ్ వెస్ట్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) షుంపీటర్
14. 'జనాభా పెరుగుదల సమాజంలో ఆదర్శవంతమైన మార్పునకు సహకరిస్తుంది' అని పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) డ్యూసెన్‌బరి
సి) గౌతమ్ మాధుర్ డి) మాల్థస్
15. బలహీన Spread effects గురించి వివరించినవారెవరు?
ఎ) హరాడ్ బి) ఫీల్డ్‌మన్
సి) గున్నార్ మిర్డాల్ డి) ఎడ్వర్డ్ వెస్ట్
16. వనరులతో పోలిస్తే తక్కువ పెట్టుబడులు ఉన్న దేశాలను అల్పాభివృద్ధి దేశాలుగా అభిప్రాయపడినవారు?
ఎ) ఫీల్డ్‌మన్ బి) హెబర్లర్
సి) మార్షల్ డి) రాగ్నర్‌నర్క్స్
17. కమ్యూనిజం, సోషలిజం ఆధారిత దేశాలను ఏ దేశాలుగా వర్ణించవచ్చు?
ఎ) మొదటి ప్రపంచ దేశాలు
బి) రెండో ప్రపంచ దేశాలు
సి) మూడో ప్రపంచ దేశాలు
డి) నాలుగో ప్రపంచ దేశాలు
18. అంతర్జాతీయ వాణిజ్యం అల్పాభివృద్ధి దేశాల పారిశ్రామికీకరణకు అవరోధమని భావించింది?
ఎ) గున్నార్ మిర్డాల్ బి) హర్షమన్
సి) డాల్టన్ డి) హెబర్లర్
19. విద్యా ప్రమాణాలు, శ్రామిక నైపుణ్యం పెరిగితే మూలధన – ఉత్పత్తి నిష్పత్తి?
ఎ) పెరుగుతుంది బి) స్థిరంగా ఉంటుంది
సి) తగ్గుతుంది
డి) పెరుగుదలలో పెరుగుదల రేటు ఎక్కువ
20. మార్కెట్ విస్తృతికి అవసరమైన ముఖ్య కారకం ఏది?
ఎ) శ్రమ బి) మూలధనం
సి) వ్యవస్థాపన డి) తక్కువ సాంకేతిక ప్రగతి
21. ద్వి అంతర నమూనాను ప్రతిపాదించింది?
ఎ) చినరీ బి) కార్ల్ మార్క్స్
సి) మహలనోబిస్ డి) ఫీల్డ్‌మన్
22. 'శ్రమ విభజన ప్రత్యేకీకరణను పెంపొందిస్తుంది' అని పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) ఆడమ్ స్మిత్
సి) మహలనోబిస్ డి) గౌతమ్ మాధుర్
23. 2013–14లో స్థూల దేశీయ పొదుపులో ప్రభుత్వ రంగం వాటా ఎంత?
ఎ) జీడీపీలో 1% బి) జీడీపీలో 1.3%
సి) జీడీపీలో 1.5% డి) జీడీపీలో 1.6%
24. అంతర్జాతీయ వాణిజ్యం వెనుకబడిన దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నది?
ఎ) మార్షల్ బి) హెబర్లర్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) గౌతమ్ మాధుర్
25. Incremental Capital - Output Ratio (ICOR)ను ఎలా రాబట్టవచ్చు?
ఎ) (పొదుపులో మార్పు) ÷ (పెట్టుబడిలోమార్పు)
బి) (మూలధనంలో మార్పు) ÷ (ఉత్పత్తిలోమార్పు)
సి) (పెట్టుబడిలో మార్పు) ÷ (శ్రమలో మార్పు)
డి) ఏదీకాదు

గ్రూప్స్,
ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

26. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలు వృద్ధి చెందడానికి ప్రధాన పాత్ర పోషించిన కారకం ఏది?
ఎ) మూలధన సంచయనం
బి) జనాభా పెరుగుదల
సి) సహజ వనరుల లభ్యత
డి) పైవన్నీ
27. మాల్థస్ జనాభా సిద్ధాంతం ప్రకారం జనాభా వృద్ధిరేటును తగ్గించేది?
ఎ) ప్రకృతి బి) తక్కువ ఉపాధి
సి) తక్కువ ఆదాయం డి) పైవన్నీ
28. "Towards A dynamic Economics" గ్రంథకర్త?
ఎ) డోమార్ బి) హరాడ్
సి) రాబిన్‌సన్ డి) ఫీల్డ్‌మన్
29. ట్రికిల్ డౌన్ వ్యూహాన్ని ప్రతిపాదించింది?
ఎ) ఫీల్డ్‌మన్ బి) రాబిన్‌సన్
సి) షుంపీటర్ డి) మహలనోబిస్
30. అల్పాభివృద్ధి దేశాలను ప్రపంచ మురికివాడలుగా పేర్కొన్నవారు?
ఎ) మార్షల్ బి) ఆడమ్‌స్మిత్
సి) రాబిన్‌సన్ డి) కైరన్‌క్రాస్
31. 'అదృశ్య హస్తం' అనే పదాన్ని తొలిసారిగా ఉపయోగించినవారు?
ఎ) మార్షల్ బి) రాగ్నర్‌నర్క్స్
సి) ఆడమ్ స్మిత్ డి) మీడ్
32. అల్ప స్థాయి సమతౌల్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు చాలాకాలం చిక్కుకొని ఉన్నాయని పేర్కొన్నవారు?
ఎ) నెల్సన్ బి) లూయిస్
సి) డాల్టన్ డి) జె.బి. సీ
33. అల్పాదాయం అనేది అల్పాభివృద్ధి దేశాల్లో విష వలయాలకు కారణమవుతోందని పేర్కొన్నవారు?
ఎ) డాల్టన్ బి) రాబిన్‌సన్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) హెబర్లర్
34. వెనుకబడ్డ దేశాల్లో అమల్లో ఉన్న సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు ఆయా దేశాల ఆర్థికాభివృద్ధికి నిరోధకాలుగా ఉంటాయి. వీటిని ఏమంటారు?
ఎ) సాంకేతిక పూర్వక నిరోధకాలు
బి) వ్యవస్థాపూర్వక నిరోధకాలు
సి) మార్కెట్ సంపూర్ణతలు
డి) పైవన్నీ
35. ఆసియా దేశాల్లో ఉద్యమత్వం లోపించడానికి మూలధన కొరత లేదా ముడి సరకుల కొరత కారణం కాదని పేర్కొన్నది ఎవరు?
ఎ) గున్నార్ మిర్డాల్ బి) ఆడమ్ స్మిత్
సి) జె.బి. సీ డి) హెబర్లర్
36. అధికస్థాయి తలసరి ఆదాయాన్ని నమోదు చేసిన జనాభా స్థాయిని అభిలషణీయ జనాభాగా పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్, జె.బి. సీ
బి) మార్షల్, ఆడమ్ స్మిత్
సి) డాల్టన్, ఎడ్విన్ కానన్
డి) ఏదీకాదు
37. 'పొదుపును ప్రోత్సహించడం ద్వారా లభించే మూలధనాన్ని గుర్తించిన రంగాల్లో పెట్టుబడులుగా మార్చాలి' అనేది ఏ రకమైన వృద్ధి వ్యూహం?
ఎ) ప్లవన దశ బి) సంతులిత
సి) అసంతులిత డి) పరిపక్వ దశకు గమనం
38. "Rate of Growth and Employment" గ్రంథకర్త?
ఎ) హరాడ్ బి) డోమార్
సి) రాబిన్‌సన్ డి) రాగ్నర్‌నర్క్స్
39. మహలనోబిస్ నాలుగు రంగాల నమూనా ఏ సిద్ధాంతంపై ఆధారపడి ఉంది?
ఎ) ట్రికిల్ డౌన్ వ్యూహం
బి) సోలో సిద్ధాంతం
సి) డోమార్ సిద్ధాంతం
డి) అధిక పెట్టుబడుల సిద్ధాంతం
40. ఆదాయం, డిమాండ్ పెరగడం వల్ల లాభోద్దేశంతో సమకూరే పెట్టుబడి?
ఎ) స్వయం ప్రేరిత పెట్టుబడి
బి) ప్రేరిత పెట్టుబడి
సి) స్థూల పెట్టుబడి డి) నికర పెట్టుబడి
41. ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణ పోటీ, స్వేచ్ఛా వ్యాపారం, వేతన సరళత ఉండాలని పేర్కొన్నవారు?
ఎ) కీన్స్ బి) పాల్‌క్రూగ్‌మన్
సి) ఫ్రీడ్‌మన్ డి) సాంప్రదాయ ఆర్థికవేత్తలు
42. 'అభివృద్ధి లక్ష్యం అభిలషణీయ స్వర్ణయుగాన్ని సాధించడం' అని పేర్కొన్నవారు?
ఎ) గౌతం మాధుర్ బి) ఆడమ్ స్మిత్
సి) రాబిన్‌సన్ డి) జె.బి. సీ
43. 'ఆర్థికాభివృద్ధి నిత్యం కొనసాగే అంతులేని ప్రక్రియ' అని పేర్కొన్నవారెవరు?
ఎ) మార్షల్ బి) పాల్‌క్రూగ్‌మన్
సి) హెగల్ డి) డాల్టన్
44. ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థ ఒక స్థాయి నుంచి పై స్థాయికి కదలడాన్ని ఆర్థికాభివృద్ధిగా అభివర్ణించినవారు?
ఎ) షుంపీటర్ బి) గున్నార్ మిర్డాల్
సి) కీన్స్ డి) డ్యూసెన్‌బరి
45. 'ఆర్థికాభివృద్ధి ప్రారంభంలో శ్రమ సాంద్రత పద్ధతులు, ఆర్థిక వ్యవస్థ పుంజుకున్న తర్వాత మూలధన సాంద్రత పద్ధతులు ఉపయోగించాలి' అని పేర్కొన్నవారు?
ఎ) ఐక్యరాజ్య సమితి నిపుణులు
బి) ప్రపంచ బ్యాంకు
సి) IMF డి) WTO
46. చిరకాలంలో వాస్తవిక తలసరి ఆదాయం పెరుగుదలను ఆర్థికాభివృద్ధిగా పేర్కొన్నది?
ఎ) డాల్టన్ బి) కానన్
సి) హెగల్ డి) ఆచార్య ఎల్లిస్
47. భారీ పరిశ్రమలు స్థాపించడం వల్ల దశల వారీగా వాటి ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులోకి వచ్చి ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని చెప్పినవారు?
ఎ) ఆడమ్‌స్మిత్ బి) ఫీల్డ్‌మన్
సి) డాల్టన్ డి) హెగల్
48. "Business cycles, Capitalism, Socialism and Democracy" గ్రంథకర్త?
ఎ) షుంపీటర్ బి) కానన్
సి) హెగల్ డి) ఎల్లిస్
49. పొదుపు, పెట్టుబడుల మధ్య అంతరాన్ని పూరించడానికి అల్పాభివృద్ధి దేశాలు సాధారణంగా ఏ సాధనాన్ని ఉపయోగిస్తాయి?
ఎ) పన్నుల రేటు పెంచడం
బి) లోటు బడ్జెట్ సి) విదేశీ సహాయం
డి) అంతర్గత రుణాలు
50. "An Operational Research Approach to Indian Planning of 4 sector model" పుస్తక రచయిత?
ఎ) ఆడమ్ స్మిత్ బి) కార్ల్‌మార్క్స్
సి) మహలనోబిస్ డి) మార్షల్

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) డి; 4) సి; 5) బి;
6) బి; 7) ఎ; 8) సి; 9) డి; 10) బి;
11) ఎ; 12) సి; 13) బి; 14) ఎ; 15) సి;
16) డి; 17) బి; 18) ఎ; 19) సి; 20) బి;
21) ఎ; 22) బి; 23) డి; 24) బి; 25) బి;
26) ఎ; 27) ఎ; 28) బి; 29) ఎ; 30) డి;
31) సి; 32) ఎ; 33) సి; 34) బి; 35) ఎ;
36) సి; 37) సి; 38) బి; 39) ఎ; 40) బి;
41) డి; 42) ఎ; 43) సి; 44) బి; 45) ఎ;
46) డి; 47) బి; 48) ఎ; 49) బి; 50) సి.

How is 'TRAIL' written in that code?

MODEL QUESTIONS

Directions (Q. No. 1-5): Read the following information carefully to answer the given questions.

In a global environment summit, eight representatives, viz P, Q, R, S, T, V, W and Z are representing different countries, viz Australia, Canada, France, Iran, China, Korea, Nepal and Britain, but not necessarily in the same order. All of them are sitting around a circular table facing the centre. V sits third to the left of T. R and Z and also their immediate neighbours do not represent France. Only one person sits between W and the representative of France. The representatives of Iran and Canada are immediate neighbours of each other. R represents neither China nor Iran. Only one person sits between P and the one who represents Korea. P does not represent either France or Canada. R sits third to the right of Z. Z represents Britain. T is not an immediate neighbour of either R or Z. The one who represents Australia is an immediate neighbour of T. Three people sit between Z and the representative of Nepal. Q is not representing either France or Australia. W is not representing Korea.

1. Who among the following represents Canada?
1) Q 2) R 3) T
4) V 5) Cannot be determined
2. Who among the following represent immediate neighbours of V?
1) P, Q 2) P, S 3) T, W 4) P, R
5) P and the representative of China
3. Which of the following is true regarding W?
1) W sits second to the right of P.
2) W represents Iran.
3) W sits between Q and the representative of Britain.
4) Only one person sits between W and the representative of Canada.
5) None is true
4. How many persons sit between S and the representative of Iran, when counted anticlockwise from S?
1) None 2) One 3) Two
4) Three 5) Four
5. Which of the following is true?
1) S represents France.
2) Only one person is sitting between the representatives of Iran and China.
3) The representative of Canada is an immediate neighbour of W.
4) One person sits between Z and the representative of France.
5) None is true

Directions (Q. No. 6 -10): Study the following information carefully and answer the questions given below:

Following are the conditions for selecting a Finance Manager in an organisation: The candidate must

(i) be a graduate in any discipline with at least 50% marks.
(ii) have completed Postgraduate Degree/Diploma in Management with specialisation in Finance with at least 65% marks.
(iii) have post- qualification work experience of at least 4 years in the finance department of an organisation.
(iv) be at least 26 years and not more than 36 years as on 1.12.2011.

In the case of a candidate who fulfils all the conditions **except**

(a) at (ii) above, but has secured at least 60% marks in postgraduate degree/diploma in management with specialisation in Finance and at least 70% marks in graduation, his/her case is to be referred to the DGM-Finance.
(b) (iii), but has post qualification work experience of at least two years as Assistant Finance Manager, his/her case is to be referred to the GM-Finance.

In each question below, details of one candidate are provided. You have to take one of the following courses of action based on the conditions and sub-conditions given above and the information provided in each question and mark the number of that course of action as your answer. You are not to assume anything other than the information provided in each question. All these cases are given to you as on 1.12.2011. ***Mark answer:***

1) If the candidate is to be selected.
2) If the data provided are inadequate to take a decision.
3) If the candidate is not to be selected.
4) If the case is to be referred to DGM - Finance.
5) If the case is to be referred to GM-Finance.

Now, read the information provided in each question and mark your answer accordingly.



BANK EXAMS
REASONING

6. Hemant Shah was born on 19 March 1981. He has been working in the finance department of an organisation for the past six years. He has scored 65% marks in B.Com and 75% marks in his postgraduate degree in management with finance as specialisation.
7. Subodh Sahay was born on 7 November 1982. He has been working for the past four years as Assistant Finance Manager in an organisation after completing his post-graduate degree in Finance management with 66% marks. He has scored 52% marks in BSc.
8. Neera Bhagat has been working in the finance department of an organisation for the past seven years after completing her post-graduate degree in management with specialisation in Finance with 62% marks. She has scored 75% marks in BSc. She was born on 12 January 1983.
9. Sudha Malhotra was born on 26 July 1984. She has been working as Assistant Finance Manager for the past three years in an organisation after completing her Postgraduate diploma in management with finance as specialisation with 68% marks. She has scored 55% marks in BA.
10. Atul Khemka has been working in Finance department of an organisation for the past five years after completing his post-graduate degree in management with finance as specialisation with 60% marks. He has scored 60% marks in BCom. He was born on 4 November 1985.
11. In a certain code, 'BEAMING' is written as 'BFCMHOJ' and 'CLEAR' is written as 'MDESB'. How is 'TRAIL' written in that code?
1) USAMJ 2) USAJM
3) SUAMJ 4) SUAJM
5) None of these
12. If it is possible to make only one meaningful English word with the third, fourth, sixth and seventh letters of the word COURTESY, using each letter only once in the word, which of the following will be the third letter of that word? If no such word can be formed, give "N" as your answer, If two words can be formed give "P" as your answer and if more than two such words can be formed, give "M" as your answer.
1) R 2) P 3) S 4) N 5) M
13. How many digits in the number 5279143 will be as far away from the beginning of the number as when the digits are rearranged in ascending order from left to right within the number?
1) None 2) One 3) Two
4) Three 5) More than three
14. How many such pairs of digits are there in the number '5391246' in both forward and backward directions, each of which has as many digits between them in the number as when the digits are arranged in ascending order within the number?
1) None 2) One 3) Two
4) Three 5) More than three
15. In a certain code, 'TASK' is written as 'BUJR' and 'BIND' is written as 'JCCM'. How is 'SUIT' written in that code?
1) VTSH 2) VSTH 3) TRUJ
4) TRJU 5) None of these


Directions (Q. No. 16-20): Study the following information carefully and answer the questions given below:

M, N, A, D, J, V and R are sitting around a circular table facing the centre but not necessarily in the same order. V is third to the right of J. N is fourth to the left of R. R is on the immediate right of J. A is fourth to the right of D. D is not an immediate neighbour of V.


16. Who is second to the left of N?
1) V 2) J 3) A
4) M 5) Data inadequate
17. What is M's position with respect to R?
1) Fourth to the right
2) Third to the left
3) Fifth to the right
4) Third to the right
5) None of these
18. Who is fourth to the right of R?
1) V 2) N 3) M
4) A 5) None of these
19. Who is second to the right of J?
1) N 2) A 3) V
4) D 5) None of these
20. Who is on the immediate right of D?
1) M 2) J 3) N
4) Data inadequate
5) None of these

Answers With Explanation

(1-5):




1. 4 2. 4 3. 5 4. 3;
Only two persons, i.e W and Z
5. 2
(6-10):
6. 1 7. 1 8. 4 9. 5
10. 3
11. 3; As,




And




Similarly,




12. 5; Third, fourth, sixth and seventh letters are U, R, E and S respectively. Words that can be formed with these letters are SURE, USER and RUSE.
13. 2;
Given number: 5 2 7 9 1 4 3
Ascending order: 1 2 3 4 5 7 9
There is only one such digit, i.e 2.
14. 5;
Given number: 5 3 9 1 2 4 6
Ascending order: 1 2 3 4 5 6 9
Such pairs: 1–2, 1–3, 4-9 & 5-9.
15. 1; As,



Similarly,



ie VTSH
(16-20):



16. 3 17. 3
18. 5;
D is fourth to the right of R.
19. 2 20. 1